


సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 239

సోమవారం 20-11-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




**విశ్వ సుందరి షెన్నిస్**

నికరాగ్వా యువతికి తొలిసారిగా మిస్ యూనివర్స్ కిరీటం -6లో



**ప్రణాళికతోనే కెరీర్ బంగారం**

పెరుగుతున్న విద్యా వ్యయాలు..పదేళ్లలో 100–200% అధికం -ప్రాఫిట్‌ప్లస్‌లో



ఆదివారం నాగర్‌కర్నూల్‌లో ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు హాజరైన ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్





## ఇందిరమ్మ రాజ్యమంటే..
# ఆకలి చావులే!

నాటి పాలనలో ప్రజలను రాచిరంపాన పెట్టారు, దోపిడీ చేశారు

అలంపూర్, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి సభల్లో సీఎం కేసీఆర్

**50 ఏళ్ల కాంగ్రెస్, 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనపై చర్చ జరగాలి**

- కాంగ్రెస్ వాళ్లది భూమాత స్కీం కాదు.. భూమేత స్కీం
- దానితో దళారులు వస్తరు.. రైతుల భూములను మింగుతరు
- 10 హెచ్‌పీ మోటార్లు పెట్టాలనడం ఆగం చేయడమే..
- ప్రజాస్వామ్యానికి కావాల్సింది ఫ్యాక్షనిస్టులు కాదు
- ప్రజలను ఆగం చేసేందుకే ఢిల్లీ గద్దలు వాలుతున్నాయి
- ఓటును ప్రజలు జాగ్రత్తగా వాడుకోవాలి.. బీఆర్ఎస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి

- వివరాలు 2లో





# ఛ్ఛే.. కప్ పోయింది!

ఫైనల్లో ఓడిన భారత్ | మళ్లీ ఆసీసే విజేత | 2003 ఫైనల్ ఫలితం పునరావృతం

అహ్మదాబాద్

భారత ప్రపంచకప్ ఆశ... చివరకు నిరాశగా ముగిసింది. 10 మ్యాచ్‌ల జైత్రయాత్రకు ఫైనల్లో చుక్కెదురైంది. శతకోటి అభిమానుల ఆనందాన్ని ఒక్క ఫైనల్ విజయంతో ఆస్ట్రేలియా లాక్కెళ్లింది. ఆసీస్‌తో ఆడిన రెండు వన్డే ప్రపంచకప్ ఫైనల్స్‌లోనూ భారత్‌కు పరాజయం తప్పలేదు. 2003లో గంగూలీ సేన, 2023లో రోహిత్ సేన రన్నరప్‌తోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఆదివారం నరేంద్రమోదీ స్టేడియంలో ఎన్నో హంగులు, మరెన్నో ఆర్భాటాల మధ్య మొదలైన అంతిమ సమరంలో భారత్ 6 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా చేతిలో పరాజయం చవిచూసింది. ఆసీస్‌కిది ఆరో వన్డే ప్రపంచకప్ టైటిల్! గతంలో 1987, 1999, 2003, 2007, 2015 మెగాఈవెంట్లలోనూ జగజ్జేతగా నిలిచింది. టాస్ నెగ్గిన ఆసీస్ ఫీల్డింగ్ ఎంచుకోగా... ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 240 పరుగుల వద్ద ఆలౌటైంది. రాహుల్ (107 బంతుల్లో 66; 1 ఫోర్), కోహ్లి (63 బంతుల్లో 54; 4 ఫోర్లు) అర్ధసెంచరీలు చేశారు. స్టార్క్ 3 వికెట్లు తీశాడు. తర్వాత ఆస్ట్రేలియా 43 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి 241 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ హెడ్ (120 బంతుల్లో 137; 15 ఫోర్లు, 4 సిక్సర్లు) శతక్కొట్టాడు. కోహ్లి (765 పరుగులు; 3 సెంచరీలు, 6 ఫిఫ్టీలు)కి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు లభించింది.

- వివరాలు 13లో

# తెలంగాణలో కన్నడ కాక!

- ఆ రాష్ట్రం చుట్టూ తిరుగుతున్న ప్రచారం
- మరో రాష్ట్రం కీలక ప్రచారాంశం కావటం ఇదే తొలిసారి
- తెలంగాణతో పెద్దగా సంబంధాలు లేకున్నా... ఇప్పుడు బీఆర్ఎస్–కాంగ్రెస్ మధ్య కాక రేపిన పొరుగు రాష్ట్రం
- కర్ణాటక తరహాలో 'గ్యారంటీ'లను అమలు చేస్తామంటూ జనంలోకి కాంగ్రెస్
- స్వయంగా వచ్చి విజయగాథలు వినిపిస్తున్న కర్ణాటక ప్రభుత్వ పెద్దలు
- అక్కడి హామీల అమలు తుస్సుమన్నదని ఎదురుదాడికి దిగిన బీఆర్ఎస్

3 లో





## ఐదేళ్లుగా పరస్పరం
# రనౌట్‌కు కుట్రలు

- రాజస్తాన్ కాంగ్రెస్ నేతల తీరుపై ప్రధాని నరేంద్ర మోదీ ఎద్దేవా
- అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలే కాంగ్రెస్ సంప్రదాయం.. రాజస్తాన్‌లోని చురు జిల్లాలో మోదీ ఎన్నికల ప్రచారం

కాంగ్రెస్, అభివృద్ధి అనేవి పరస్పరం శత్రువులు. ఆ శత్రుత్వం ఎప్పటికీ కొనసాగుతుంది. కాంగ్రెస్ పేపర్ లీక్ మాఫియా యువత భవిష్యత్తును లక్షలాది రూపాయలకు అమ్మేసింది. ఎరువుల కుంభకోణంతో రైతులను విచ్చలవిడిగా లూటీ చేసింది. రాజస్తాన్‌లో బీజేపీ అధికారంలోకి రాగానే పేపర్ లీక్ మాఫియాపై సమగ్ర దర్యాప్తు జరిపిస్తాం.

- ప్రధాని మోదీ

- వివరాలు 6లో

**ఇదండీ సంగతి**



స్పీడ్ పెంచండీ! ప్రచారంలో ఆయన మీకంటే ముందున్నాడు!

# విధేయతే నా బలం

## ప్రజాభిమానమే నా బలగం

**సాక్షి ఇంటర్వ్యూలో భట్టి విక్రమార్క**

- పార్టీకి సంస్థాగత వారసుడిని.. నాకు ప్రాధాన్యమివ్వడంలో తప్పేముంటుంది
- తెలంగాణకు కేసీఆరే ప్రధాన శత్రువు
- బీఆర్ఎస్‌కు ఇక్కడ ఓటేస్తే ఢిల్లీలో బీజేపీకి వేసినట్టే
- బీఆర్ఎస్ చెపుతున్నందుకే బీజేపీ తమ పార్టీ నాయకులపై ఐటీ దాడులు చేయిస్తోందని ఆరోపణ

7 లో



రాష్ట్ర సంపదను ప్రజలకు పంపిణీ చేయాలన్నదే కాంగ్రెస్ పార్టీ ఆలోచన. ఆ సంపదను ఎలా పంచుతామో కూడా ఇప్పటికే ప్రజలకు చెప్పాం. ఆత్మగౌరవం, సంపద పంపిణీనే ఈ ఎన్నికల్లో మాకు ప్రధాన ప్రచారాస్త్రాలుగా ఉపయోగపడుతున్నాయి. ఈసారి 80కిపైగా స్థానాల్లో విజయం సాధించి అధికారంలోకి వస్తాం.

- భట్టి విక్రమార్క

# ఐటీ గుబులు..!

**ఎన్నికల వేళ ఆదాయ పన్ను శాఖ సోదాలు**

- పార్టీలకతీతంగా రాష్ట్రంలో ముమ్మర తనిఖీలు
- నేతలకు 'సర్దుబాట్లు' చేసే బంధువులు, సన్నిహితులపైనా గురి
- అక్రమంగా డబ్బు తరలింపు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచన.. బెంబేలెత్తుతున్న రాజకీయ నాయకులు

- వివరాలు 5లో



సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
20-11-2023

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

| దేశీ సూచీలు | |
|---|---|
| సెన్సెక్స్ ▽ | నిఫ్టీ ▽ |
| 188 | 33 |
| 65,795 | 19,732 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

| విదేశీ సూచీలు | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 14,125 | △ | 12 |
| డోజోన్స్ | 34,947 | △ | 2 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,504 | △ | 93 |
| డాక్స్ | 15,919 | △ | 133 |
| షాంఘై | 3,054 | △ | 4 |
| నికాయ్ | 33,585 | △ | 155 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 82.47 | 84.14 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 101.67 | 105.12 |
| € | యూరో | ఎస్‌బీఐ | 88.89 | 91.99 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 54.49 | 56.18 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 52.77 | 55.12 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 60.83 | 62.81 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 21.22 | 22.75 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 21.59 | 23.42 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 10.31 | 12.39 |



# ప్రణాళికతోనే కెరీర్ బంగారం

భారీగా పెరుగుతున్న విద్యా వ్యయాలు • పదేళ్లలో 100–200 శాతం అధికం • విదేశీ విద్య కోసం మరింత మొత్తం ముందస్తు ప్రణాళికతోనే అధిగమించగలం • పిల్లలు ఏడాది వయసు నుంచే పెట్టుబడులు • స్కాలర్‌షిప్, విద్యా రుణాలతో గట్టెక్కే అవకాశం

మనీష్ అరోరా (46) ఢిల్లీకి చెందిన వ్యాపారవేత్త. ఆయనకు 18 ఏళ్ల కుమార్తె 'ఆద్య' ఉంది. ఆమెను ఉన్నత విద్య కోసం విదేశాలకు పంపించాలన్నది అరోరా కల. కుమార్తెకు ఎనిమిదేళ్ల వయసు ఉన్నప్పటి నుంచే ప్రణాళిక ప్రకారం ఇన్వెస్ట్ చేస్తూ వచ్చారు. దీంతో ఆద్య రెండు నెలల క్రితమే యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయిస్(చికాగో)లో సైకాలజీలో అండర్‌గ్రాడ్యుయేషన్ సీటు సంపాదించింది. అందుకు కావాల్సిన వ్యయాలను అరోరా ముందు చూపుతో సమకూర్చుకున్నారు. ఆద్య చదివే కోర్స్ వ్యయం భారీగా ఉన్న ప్పటికీ, ముందస్తు స్పష్టత అరోరాకు మార్గాన్ని చూపించింది. తమ పిల్లలకు వీలైనంతలో అత్యుత్తమ విద్యను అందించాలని అధిక శాతం మంది తల్లిదండ్రులు కోరుకుంటారు. కానీ, ఆచరణలో అంత సులభం కాదు. ప్రణాళికతోనే ఇది సాధ్యం. కెరీర్ ఆప్షన్లు, చేయాల్సిన కోర్సులు, అయ్యే వ్యయం, కాల వ్యవధి ఇలా పలు అంశాలపై స్పష్టత, ప్రణాళికతోనే విజయం సాధించగలరు. దీనిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించే కథనమే ఇది.

## బోలెడు ఆప్షన్లు

గతంతో పోలిస్తే ఉన్నత విద్యలో ప్రవేశాలు గణనీయంగా పెరిగాయి. ఇంజనీరింగ్, మెడికల్, మేనేజ్‌మెంట్ కోర్సులు చదవడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్నారు. కొందరు భిన్నమైన కోర్సులు ఎంపిక చేసుకుంటుంటే, విదేశీ విద్య కోసం వెళ్లే వారి సంఖ్య కూడా ఏటేటా పెరుగుతూ పోతోంది. ముఖ్యంగా నూతన తరం కోర్సులకు సంబంధించి కెరీర్ ఆప్షన్లు భారీగా అందుబాటులోకి వస్తున్నాయి. ఫైనాన్స్, డేటా అనలైటిక్స్, బిజినెస్ ఎకనామిక్స్, కాగ్నిటివ్ సైన్స్, మెరైన్, సైకాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లర్నింగ్ ఇవన్నీ ఆకర్షణీయమైన కెరీర్ ఆప్షన్లుగా మారుతున్నాయి. ''గేమ్ డిజైనింగ్, ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), వర్చువల్ రియాలిటీ (వీఆర్)కు ఆదరణ పెరుగుతోంది.



ఎక్కువ శాతం కెరీర్ ఆప్షన్లు సోషల్ మీడియా నుంచి ఉంటున్నాయి. వీడియో ఎడిటింగ్‌కు సైతం డిమాండ్ పెరుగుతోంది''అని మ్నెమోనిక్ ఎడ్యుకేషన్ అండ్ ఓవర్‌సీస్ అడ్మిషన్స్ సంస్థ అధినేత శిరీష్ గుప్తా తెలిపారు. ప్రాంప్ట్ ఇంజనీరింగ్, ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, బయోటెక్నాలజీ, డేటా సైన్స్, రెన్యువబుల్ ఎనర్జీ, కంటెంట్ తయారీ వంటివన్నీ బంగారం వంటి అవకాశాలను తెచ్చి పెడుతున్నాయి.

''వచ్చే పదేళ్ల కాలానికి సంబంధించి 85 శాతం ఉద్యోగాలు ఇంకా ఆవిష్కృతం కావాల్సి ఉంది. సంప్రదాయ ఉద్యోగాల నుంచి నిరంతరం మారాల్సిన అవసరాన్ని ఇది తెలియజేస్తోంది. టెక్నాలజీతో సంబంధం లేని ఉద్యోగం దాదాపు ఉండకపోవచ్చు. అది రిటైల్ అయినా లేక ఈ కామర్స్ అయినా కృత్రిమ మేథ (ఏఐ) కీలక పాత్ర పోషిస్తుంది''అని టీమ్‌లీజ్ ఎడ్యుటెక్ సహ వ్యవస్థాపకురాలు నీతి శర్మ తెలిపారు. అంటే సంప్రదాయ ఉద్యోగాలు కనుమరుగై పోతాయని అనుకోవద్దు. అస్థిరతలు వద్దనుకునే వారు ఇంజనీరింగ్, మెడిసిన్ వైపు వెళుతుండడాన్ని గమనించొచ్చు. ఇంజనీర్లు, డాక్టర్లు, పరిశోధకులు, చరిత్రకారుల అవసరం భవిష్యత్తులోనూ ఉంటుంది. కానీ, ఆటోమేషన్, ఏఐ కొన్ని రకాల ఉద్యోగాలకు ముప్పుగా మారడం ఖాయం. లోగో, గ్రాఫిక్ డిజైనింగ్ పనులు ఆటోమేషన్‌కు మారుతున్నాయి. ట్రాన్స్‌లేటర్లు, టెలీ మార్కెటర్ల ఉద్యోగాలను ఏఐ భర్తీ చేస్తోంది. యంత్రాలు అంత సులభంగా చేయలేని నైపుణ్యాలు, కోర్సులను చేసే దిశగా పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని గుప్తా సూచించారు. విద్య, ఉపాధిలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా సోషల్ మీడియాలో చురుగ్గా ఉండడం, తాజా సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవడం సాయంగా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. అవసరమైతే మెరుగైన విద్యా అవకాశాల కోసం విదేశాలకు పంపించడాన్ని కూడా పరిశీలించాలన్న అభిప్రాయం వినిపిస్తోంది.

## పెరిగిపోతున్న వ్యయాలు

అధిక ద్రవ్యోల్బణం, ప్రత్యేకమైన కోర్సులకు డిమాండ్, ఇందుకు మెరుగైన వసతుల కల్పన కారణంగా దేశ, విదేశాల్లో కోర్సుల వ్యయాలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఒకప్పుడు రూ.50వేలకే పూర్తయ్యే ఎంబీఏ కోర్స్ నేడు రూ.5 లక్షలకు చేరడం ఇందుకు ఓ నిదర్శనం. ఐఐఎంలలో ఫీజులు రూ.17 లక్షల నుంచి రూ.24 లక్షల మధ్య ఉన్నాయి. గతంలో ఇవి రూ.6 లక్షల స్థాయిలోనే ఉండేవి. ఐఐటీలోనూ కోర్సు ఫీజు రూ.6–10 లక్షలకు చేరింది. గతంతో పోలిస్తే ఇది మూడు రెట్లు అధికం. ప్రతిష్టాత్మక విద్యా సంస్థలైన ఐఐఎం, ఐఐటీల్లో ఫీజుల పెరుగుదల 100 శాతానికి పైనే ఉంటోంది. విదేశాల్లోనూ ఫీజుల పెరుగుదల ఇదే మాదిరిగా ఉంటోంది. మరీ ముఖ్యంగా డాలర్ మారకం రేటు అధికంగా ఉండడం ఈ భారాన్ని మరింత పెంచుతోంది. ''దశాబ్దం క్రితం విదేశాల్లో ఏడాది విద్యా వ్యయాలు రూ.25–30 లక్షల మధ్య ఉండేవి. ఇప్పుడు రూ.50 లక్షలకు చేరాయి''అని గుప్తా తెలిపారు. అమెరికాలో అండర్ గ్రాడ్యుయేట్ కోర్స్ ఫీజు దశాబ్దం క్రితం రూ.కోటి స్థాయిలో ఉంటే, ఇప్పుడు అది రెట్టింపైంది. కేవలం ట్యూషన్ ఫీజుల వల్లే కాకుండా, జీవన వ్యయాలు కూడా పెరిగిపోవడం ఈ భారాన్ని మరింత పెంచుతోంది.

కాకపోతే విదేశీ విద్యకు సంబంధించి నూరు శాతం స్కాలర్‌షిప్ పొందే అవకాశం కాస్త ఊరటనిస్తుందని చెప్పుకోవచ్చు. ఈ అవకాశం సొంతం చేసుకోవాలంటే విదేశీ విద్యా ప్రవేశానికి మూడేళ్ల ముందు నుంచే తమ ప్రొఫైల్‌పై పని చేయాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ''నూతనతరం కోర్సులు అయితే సాధారణంగా ఏటా రూ.5–10 లక్షల మధ్య ఫీజు ఉంటుంది. ఢిల్లీలోని పెర్ల్ అకాడమీలో బ్యాచిలర్ డిగ్రీ ఇన్ యూఐ/యూఎక్స్ (యూజర్ ఇంటర్‌ఫేజ్/యూజర్ ఎక్స్‌పీరియెన్స్)కు ఏటా రూ.7 లక్షల ఫీజు ఉంది''అని గుప్తా వెల్లడించారు. కోర్సుకు సంబంధించి ట్యూషన్ ఫీజు కేవలం ఒక భాగమే. పిల్లల వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాల పెంపు కోసం తల్లిదండ్రులు అదనంగా ఖర్చు చేయక తప్పదు. కాలం చెల్లిన కరిక్యులమ్ నేపథ్యంలో, పిల్లలకు సమాంతరంగా నైపుణ్యాభివృద్ధి, వ్యక్తిత్వ వికాస అభివృద్ధికి ఖర్చు చేయాల్సి ఉంటుందని గుప్తా అంటున్నారు. తల్లిదండ్రులు ఉంటున్న ప్రదేశానికి దూరంగా, ప్రముఖ విద్యా సంస్థల్లో ప్రవేశం లభిస్తే అప్పుడు వారి జీవనం కోసం మరింత వ్యయం చేయాల్సి వస్తుంది. ఇక విదేశాలకు పంపించే వారిపై ఈ భారం మరింత పెరుగుతుంది. వసతి, ఆహారం, లాండ్రీ, ఇంటర్నెట్, మొబైల్, వస్త్రాలు వీటిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. జీవనం, రవాణా వ్యయాలు, యుటిలిటీలు (విద్యుత్, టెలిఫోన్), ఆరోగ్య సంరక్షణ, ఇతర అవసరాల కోసం పెద్ద మొత్తంలోనే ఖర్చు చేయాల్సి వస్తుందని సెబీ నమోదిత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ అరిజిత్ సేన్ పేర్కొన్నారు.

### భయపెట్టే అంచనాలు



చారిత్రకంగా చూస్తే గడిచిన దశాబ్ద కాలంలో కోర్సుల ఫీజులు నూరు శాతానికి పైగా పెరిగాయి. భవిష్యత్తులోనూ ఇదే తరహా పెరుగుదల ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. ''కోర్సుల ఫీజుల పెరుగుదల వచ్చే దశాబ్దం పాటు ఇదే మాదిరిగా ఉంటుంది. జీడీపీ 6 శాతం చొప్పున వృద్ధి చెందుతూ వెళితే, దీనికి అనుగుణంగా సగటున పెరిగే కుటుంబాల ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని చూస్తే, విద్యా వ్యయం 10 శాతం చొప్పున పెరుగుతూ వెళ్లినా.. ఫీజులు, విద్యా రుణాలు భారంగా మారతాయి''అని నీతి శర్మ పేర్కొన్నారు. ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ వంటి ప్రత్యామ్నాయాల రూపంలో రవాణా, జీవన వ్యయాల వంటివి ఆదా చేసుకునే అవకాశం ఉందని శర్మ వివరించారు. ''ప్రతిష్టాత్మక కాలేజీ నుంచి ఇంజనీరింగ్ డిగ్రీ చేసేందుకు ఇప్పుడు ఏటా రూ.12–15 లక్షల వరకు ఖర్చవుతోంది. విద్యా ద్రవ్యోల్బణం 10–12 శాతం ఉంటుందన్న అంచనా ఆధారంగా వచ్చే పదేళ్లలో ఇది రూ.40 లక్షలకు చేరొచ్చు. ప్రైవేటు కాలేజీలో ఎంబీబీఎస్ డిగ్రీకి నేడు రూ.కోటి అవుతుంటే పదేళ్ల తర్వాత రూ.3 కోట్లు వ్యయం చేయాల్సి రావచ్చు''అని అరిజిత్ సేన్ తెలిపారు.

## అనుసరణీయ మార్గాలు..

ఖరీదుగా మారుతున్న ఉన్నత విద్య కోసం తల్లిదండ్రులు ముందు నుంచే ప్రణాళికాయుతంగా వ్యవహరించడం ఎంతో అవసరం. కాలేజీ ప్రవేశానికి రెండేళ్ల ముందు నుంచే పూర్తి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించాలి. విదేశాలకు పంపించేట్టు అయితే అక్కడి జీవన పరిస్థితులు, సంస్కృతి, దరఖాస్తు ప్రక్రియ, ఎదురయ్యే సవాళ్లపై అవగాహన తెచ్చుకోవాలి. కనుక ఈ విషయంలో నిపుణుల సాయం తప్పనిసరి. ఇప్పటి వరకు చెప్పుకున్నవన్నీ చదువులకు సంబంధించి ప్రస్తుత వ్యయాలు. తమ పిల్లల ఉన్నత విద్యకు ఇంకా ఎన్నేళ్ల కాల వ్యవధి మిగిలి ఉంది? ఎలాంటి విద్యా సంస్థల్లో ప్రవేశాలు తీసుకోవాలి, అక్కడి ప్రస్తుత ఫీజులు, తమ పిల్లలు కాలేజీ ప్రవేశం పొందే నాటికి ఎంత మేర పెరగొచ్చనే విషయాలపై స్పష్టత అవసరం. దీనికి సంబంధించి ఎన్నో సంస్థలు సేవలు అందిస్తున్నాయి. కోర్స్ వ్యయం, ట్యూషన్ ఫీజు, జీవన వ్యయాలు, రవాణా వ్యయాలు, స్కాలర్‌షిప్ ఉన్న అవకాశాలు, మెరుగైన విద్యా సంస్థలు ఎక్కడెక్కడ ఉన్నాయి అనే వివరాలను వారి నుంచి తెలుసుకోవచ్చు. మరీ ముఖ్యంగా పిల్లలు కాలేజీకి వచ్చే నాటికి వారి ఆసక్తులు ఎలా ఉంటాయన్నది ముందే గుర్తించడం అసాధ్యం. కనుక భవిష్యత్‌లో వారు ఏ కోర్స్ చేయడానికి ఆసక్తి చూపిస్తారన్నది ముందుగా తెలియదు. అందుకని ఖరీదైన కోర్స్‌కు సంబంధించి సన్నద్ధం కావడం మంచిది.

## మొదటి పుట్టిన రోజు నుంచే..

పిల్లల ఉన్నత విద్యకు కావాల్సినంత సమకూర్చుకునేందుకు ఉన్న సులభ మార్గం వారి మొదటి పుట్టిన రోజు నుంచి ఆరంభించడమే. దీనివల్ల పెట్టుబడులు వృద్ధి చెందడానికి తగినంత సమయం మిగిలి ఉంటుంది. నెలవారీ పరిమిత మొత్తంతో పెద్ద నిధిని సమకూర్చుకోగలరు. ఇందుకు గాను ఫైనాన్షియల్ అడ్వైజర్, ఎడ్యుకేషన్ కన్సల్టెంట్‌ను ముందే సంప్రదించి తమకు అనుకూలమైన (తగిన) ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. కేవలం ఉన్నత విద్య అనే కాకుండా వారి వివాహాలకు సంబంధించి కూడా విడిగా ప్రణాళిక అవసరం. భారీ ఖర్చులకు సంబంధించి ముందు నుంచే ఇన్వెస్ట్ చేయడం వల్ల నెలవారీ బడ్జెట్‌పై పెద్ద భారం పడదు. పెట్టుబడుల్లో అధిక శాతాన్ని ఈక్విటీలకు కేటాయించుకోవాలి. 10–15 ఏళ్ల కాలంలో ఈక్విటీలు మెరుగైన రాబడులను ఇవ్వగలవు. కొంత మొత్తాన్ని హైబ్రిడ్ ఫండ్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన (కుమార్తెలకు) వంటి సాధనాల్లోనూ ఇన్వెస్ట్ చేసుకోవాలి. పిల్లల ఉన్నత విద్యకు మిగిలి ఉన్న కాల వ్యవధి, ఎంత మొత్తం ఇన్వెస్ట్ చేయాలి, ఎంత రాబడులు అనే అంశాల ఆధారంగా నిపుణులు వివిధ సాధనాలను సూచిస్తుంటారు. తమకు ఏదైనా జరగరానిది జరిగితే పిల్లల విద్య ఆగిపోకూడదు. అందుకని మెరుగైన కవరేజీతో టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ తీసుకోవాలి. అలాగే, ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీలో పిల్లలను కూడా భాగం చేయడం, లేదంటే వారి పేరిట ఇండివిడ్యువల్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్ తీసుకోవడం ఎంతో అవసరం.

## స్కాలర్ షిప్/విద్యారుణం



దేశ, విదేశీ యూనివర్సిటీలు చాలా వరకు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఆఫర్ చేస్తున్నాయి. యూనివర్సిటీ వెబ్‌సైట్‌లను సందర్శించి ఇందుకు సంబంధించి వివరాలు తెలుసుకోవచ్చు. విదేశాల్లోనూ చాలా యూనివర్సిటీలు స్కాలర్‌షిప్‌లు, ఆర్థిక సాయాన్ని అందిస్తున్నాయి. పేరొందిన ట్రస్ట్‌లు కూడా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను ఆఫర్ చేస్తున్నాయి. ఒకవైపు తమ వంతు ఇన్వెస్ట్ చేస్తూనే, మరో వైపు స్కాలర్‌షిప్‌లకు సంబంధించి ఉన్న మార్గాలను తెలుసుకుని ఉండడం మంచిది. కొన్ని యూనివర్సిటీలు ప్రొఫెషనల్ డిగ్రీలకు అనుబంధంగా అప్రెంటిషిప్ అవకాశం కల్పిస్తున్నాయి. దీనివల్ల ప్రత్యక్ష అనుభవంతోపాటు కొంత ఆర్థిక మద్దతు లభించినట్టు అవుతుంది. తెలుగు రాష్ట్రాల్లోనూ పలు యూనివర్సిటీ కోర్సులకు అప్రెంటిషిప్ ప్రోగ్రామ్‌లు అనుబంధంగా ఉన్నాయి. ఉన్నత విద్యా కోర్సులకు సరిపడా సమకూర్చుకోలేని వారు విద్యా రుణాన్ని కూడా పరిశీలించొచ్చు. చిన్న మొత్తం అయితే ఎలాంటి ష్యూరిటీ అవసరం పడదు. పెద్ద మొత్తంలో రుణం తీసుకునేట్టు అయితే ఆస్తుల తనఖా, గ్యారంటీలను బ్యాంకులు కోరొచ్చు. ఇందుకు కూడా ముందుగానే సిద్ధమవ్వాలి. విద్యా రుణాలపై వడ్డీ రేటు 9–15 శాతం మధ్య ఉంది. పిల్లల విద్య పూర్తయి, ఉద్యోగంలో చేరిన తర్వాత చెల్లింపులు చేసే ఆప్షన్ ఎంపిక చేసుకోవచ్చు. చాలా బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు కోర్సు ఫీజులో 80–90 శాతం వరకు రుణంగా ఇస్తున్నాయి. పిల్లలు చదువుకుంటూనే పార్ట్‌టైమ్ అవకాశాలను వినియోగించుకోవడం మరొక మార్గం.

### ఎంత మొత్తం కావాలి..?

| కోర్స్ పేరు | 2023లో వ్యయం | 2038లో అంచనా వ్యయం (రూ.లలో) | నెలవారీ చేయాల్సిన పెట్టుబడి? |
|---|---|---|---|
| ఇంజనీరింగ్ | 5లక్షలు | 20.88 లక్షలు | 4,181 |
| ప్రముఖ కాలేజీల్లో ఇంజనీరింగ్ | 10 లక్షలు | 41.77లక్షలు | రూ.8,362 |
| వైద్యవిద్య (ప్రభుత్వ) | 4లక్షలు | 16.70లక్షలు | 3,345 |
| వైద్య విద్య (ప్రైవేటు) | 50లక్షలు | 2.08కోట్లు | 41,808 |
| మేనేజ్‌మెంట్ కోర్స్ | 20 లక్షలు | 83.54లక్షలు | 16,273 |
| మేనేజ్‌మెంట్ కోర్స్ (యూఎస్‌లో) | 2కోట్లు | 8.35కోట్లు | 1,67,230 |

నోట్: ఇవి అవగాహన కోసం ఇచ్చిన గణాంకాలు



### ఇవి గుర్తు పెట్టుకోవాలి

కాలేజీ ఎంపిక సమయంలో
- పిల్లల ఆసక్తులను తెలుసుకోవాలి
- కొత్తగా వస్తున్న టెక్నాలజీలకు అనుగుణంగా, మెరుగైన అవకాశాలున్న కోర్సులకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- యూనివర్సిటీలు, కోర్సులు, ఫైనాన్షియల్ స్కీముల గురించి లోతైన అధ్యయనం చేయాలి.
- అడ్మిషన్ల ప్రక్రియ, అక్కడి విద్యా కాలం గురించి తెలుసుకోవాలి

పొదుపు విషయంలో
- భవిష్యత్తులో కోర్సుల ఫీజులపై అంచనాకు రావాలి
- ముందు నుంచే ఇన్వెస్ట్ చేయడం మొదలుపెట్టాలి
- ఈక్విటీ ఫండ్స్ సహా పెట్టుబడులను వైవిధ్యం చేసుకోవాలి
- తగినంత కవరేజీతో లైఫ్ ఇన్సూరెన్స్ తీసుకోవాలి



## ఫండ్స్ కొత్త పథకాల జోరు

- సెప్టెంబర్ క్వార్టర్‌లో 48 కొత్త పథకాలు
- రూ.22,000 కోట్లు సమీకరణ





న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమలో నూతన పథకాలు (ఎన్‌ఎఫ్‌వో) సెప్టెంబర్ త్రైమాసికంలో పెద్ద మొత్తంలో నిధుల సమీకరించాయి. సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో మొత్తం 48 ఎన్‌ఎఫ్‌వోలు మార్కెట్లోకి వచ్చాయి. ఇవన్నీ కలసి ఇన్వెస్టర్ల నుంచి రూ.22,049 కోట్ల నిధులను సమీకరించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో కేవలం 25 కొత్త పథకాలు రాగా, అవి వసూలు చేసిన మొత్తం రూ.5,539 కోట్లుగానే ఉంది. దీంతో పోలిస్తే సెప్టెంబర్‌లో గణనీయమైన వృద్ధి కనిపిస్తోంది. సాధారణంగా మార్కెట్లు గరిష్టాల్లో ఉన్నప్పుడు, బుల్లిష్ సెంటిమెంట్‌ను అనుకూలంగా భావించి ఎన్‌ఎఫ్‌వోలు ఎక్కువగా వస్తుంటాయి.

### కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

| 20-11-2023 | |
|---|---|
| విశాఖ | 530-00 |
| చిత్తూరు | 603-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 530-00 |
| విజయవాడ | 530-00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| **19-11-2023 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 535-00 |
| వరంగల్ | 537-00 |
| రిటైల్ ధర | 5.95 |

# ఎస్‌జీబీ మెచ్యూరిటీ ఉపసంహరణ ఎలా?



Q & A

ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రిసెర్చ్

**నేను సావరీన్ గోల్డ్ బాండ్లలో (ఎస్‌జీబీలు) ఇన్వెస్ట్ చేశాను. కాల వ్యవధి ముగిసిన తర్వాత వీటిని విక్రయించాలా..? లేక ఆ మొత్తం నా ఖాతాలో జమ అవుతుందా?**

– వేదవ్యాస్ విశ్వరూప్

ఎస్‌జీబీల కాల వ్యవధి ఎనిమిదేళ్లు. గడువు ముగియడానికి నెలరోజుల ముందు బాండ్ల మెచ్యూరిటీ తేదీ గురించి ఇన్వెస్టర్లకు సమాచారం వస్తుంది. గడువు ముగిసిన తర్వాత ఆ మొత్తం బ్యాంక్ ఖాతాలో జమ అవుతుంది. ఇన్వెస్టర్ పెట్టుబడి పెట్టే రోజున ఇచ్చిన బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారు. గడువు ముగిసిన రోజు నాటి ముందు మూడు రోజుల బంగారం సగటు ధరను పరిగణనలోకి తీసుకుంటారు. ఇండియా బులియన్ అండ్ జ్యుయెలర్స్ అసోసియేషన్ ప్రకటించే 999 స్వచ్ఛత బంగారం ధరలను ఇందుకు ప్రామాణికంగా పరిగణిస్తారు. ఆ ప్రకారం ఇన్వెస్టర్‌కు చెల్లింపులు చేస్తారు. ఎస్‌జీబీ సర్టిఫికెట్‌లోనూ బ్యాంక్ ఖాతా వివరాలు నమోదై ఉంటాయి. ఒకవేళ సార్వభౌమ బంగారం బాండ్లను ట్రేడింగ్ ఖాతా ద్వారా సెకండరీ మార్కెట్ నుంచి కొనుగోలు చేస్తే అవి డీమ్యాట్ ఖాతాలో ఉంటాయి. కనుక మెచ్యూరిటీ ముగిసిన అనంతరం డీమ్యాట్ ఖాతాకు అనుసంధానమైన ఇన్వెస్టర్ బ్యాంక్ ఖాతాకు ఆ మొత్తం జమ అవుతుంది. స్టాక్ మార్కెట్లో ఎస్‌జీబీల ట్రేడింగ్ ధర హెచ్చు, తగ్గులుగా ఉండొచ్చు. అయినప్పటికీ గడువు తీరే నాటి ముందు మూడు పని దినాల సగటు ధర ప్రకారమే చెల్లింపులు చేస్తారు. బంగారంలో పెట్టుబడులకు ఎంతో సౌకర్యవంతమైన మార్గం ఎస్‌జీబీలు అని తప్పక చెప్పాలి. పెట్టుబడిపై ఏటా 2.5 శాతం వడ్డీ ఇందులో లభిస్తుంది. ఎనిమిదేళ్ల పాటు పెట్టుబడిని కొనసాగిస్తే వచ్చే లాభంపై ఎలాంటి పన్ను లేదు.

**పిల్లల ఉన్నత విద్య కోసం ఏకమొత్తంలో ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. ఇందుకు అనుకూల సాధనాలు ఏవి?**

– శరవణన్

పిల్లల భవిష్యత్తు కోసం ఇన్వెస్ట్ చేయాలని చాలా మంది తల్లిదండ్రులు భావిస్తారు. ఇందుకోసం పలు మార్గాలు ఉన్నాయి. సాధారణంగా ఈ మొత్తాన్ని పిల్లల ఉన్నత విద్య కోసం ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటే అందుకు, పదేళ్లకు పైగా కాల వ్యవధి ఉంటుంది. అటువంటప్పుడు ఈక్విటీలకు మించి మెరుగైన సాధనం లేదనే చెప్పాలి. అందులోనూ ఫ్లెక్సీక్యాప్ విభాగం అనుకూలంగా ఉంటుంది. ఎందుకంటే ఫ్లెక్సీక్యాప్ పథకాలు పెట్టుబడులను డైవర్సిఫై చేస్తాయి. అన్ని రంగాల పరిధిలో, భిన్న మార్కెట్ క్యాప్ కలిగిన (డైవర్సిఫైడ్) కంపెనీల్లో ఫండ్ మేనేజర్ పెట్టుబడులు పెడతారు. ఒకవేళ పన్ను ప్రయోజనం కోరుకుంటే ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్‌ఎస్‌ఎస్)ను ఎంపిక చేసుకోవచ్చు. ఇవి కూడా ఫ్లెక్సీక్యాప్ మాదిరే పనిచేస్తుంటాయి. అన్ని రంగాలకు చెందిన కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా రిస్క్ తగ్గించే విధంగా ఈఎల్‌ఎస్‌ఎస్ పథకాల పనితీరు ఉంటుంది. ఈ పథకాల్లో ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షలు ఇన్వెస్ట్ చేయడం ద్వారా సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనం పొందొచ్చు. ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ ఐదేళ్ల కాలంలో సగటున 12 శాతానికి పైనే వార్షిక రాబడులు ఇచ్చాయి. ఈ రాబడి రేటు ప్రకారం ఎవరైనా రూ.లక్షను పదేళ్ల కాలానికి ఇన్వెస్ట్ చేస్తే.. రూ.3.14 లక్షలు సమకూరుతుంది. ఈక్విటీలు సహజంగానే అస్థిరలతో ఉంటాయి. కనుక ఫ్లెక్సీక్యాప్ పథకాల్లోనూ ఇదే కనిపిస్తుంది. అందుకనే ఈక్విటీల్లో ఏక మొత్తంలో ఇన్వెస్ట్ చేయడం కాకుండా, తమ దగ్గరున్న పెట్టుబడులను కొన్ని విడతలుగా ఇన్వెస్ట్ చేసుకోవాలి. దీనివల్ల కొనుగోలు ధర సగటుగా మారి, మార్కెట్లు గరిష్టాల వద్ద ఉన్నప్పుడు రిస్క్‌ను తగ్గిస్తుంది. కనుక మీరు పెట్టుబడి మొత్తాన్ని ఒకే సారి కాకుండా.. డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసి.. అక్కడి నుంచి ప్రతి నెలా సిప్ రూపంలో మూడేళ్ల కాలంలో పెట్టుబడులు పెట్టుకోవడం అన్నది తగిన విధంగా ఉంటుంది. దీనివల్ల మార్కెట్ల ర్యాలీ, కరెక్షన్లలోనూ ఇన్వెస్ట్ చేసినట్టు అవుతుంది.



## సాక్షి స్టాక్స్

### టీసీఎస్ | బీఎన్‌పీ పరిబాస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 3,499 టార్గెట్: రూ. 4,080

**ఎందుకంటే:** సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం(జులై–సెప్టెంబర్)లో మరోసారి పెద్దగా వృద్ధిలేని ఫలితాలనే ప్రకటించింది. నిజానికి త్రైమాసికవారీగా నిలకడైన కరెన్సీ ప్రాతిపదికన ఆదాయం అంచనాలకంటే తక్కువగా నమోదైంది. ఇటీవల సాధించిన పటిష్ట డీల్స్ ఆదాయంలో వృద్ధికి పెద్దగా దోహదపడలేదు. పెట్టుబడులపై తక్కువ ప్రతిఫలాల(ఆర్‌వోఐ) నేపథ్యంలో కస్టమర్లు టెక్నాలజీపై వ్యయాలను పునఃసమీక్షించుకోవడం ప్రభావం చూపింది. దీనికితోడు ప్రాజెక్టుల పూర్తి పుంజుకోకపోవడంతో ద్వితీయార్థం(అక్టోబర్–మార్చి)లోనూ ఆదాయంలో వృద్ధికి దెబ్బ తగిలే వీలుంది. డిమాండ్ రికవరీ పరిస్థితుల్లో స్పష్టతలేకపోవడం దీనికి కారణంకాగా.. స్థూల వాతావరణం సర్దుకుంటే వృద్ధి రికవరీకి వీలుంటుంది. అయితే బీఎస్‌ఎన్‌ఎల్ నుంచి గెలుచుకున్న బిలియన్ డాలర్ల కాంట్రాక్టుసహా.. మొత్తం 11.2 బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాలు కుదుర్చుకోవడం కంపెనీకి బలాన్నిస్తోంది. టర్నోవర్‌లో వృద్ధి నెమ్మదించినప్పటికీ.. త్రైమాసికవారీగా నిర్వహణ లాభ(ఇబిట్) మార్జిన్లు మెరుగుపడటం గమనార్హం! వ్యయ నియంత్రణలు, సబ్‌కాంట్రాక్టులు తగ్గించుకోవడం, వినిమయం పెంచుకోవడం తదితరాల ద్వారా మార్జిన్లను మరింత బలపరచుకోనుంది. భారీ డీల్స్‌ను సంపాదించడం సానుకూలాంశం.




### ఏఐఏ ఇంజనీరింగ్ | జేఎం ఫైనాన్షియల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 3,502 టార్గెట్: రూ. 4,015

**ఎందుకంటే:** ప్రపంచ మైనింగ్ కన్జూమబుల్స్ రంగంలో పేరొందిన కంపెనీ ఏఐఏ ఇంజినీరింగ్. గ్లోబల్ గ్రైండింగ్ విభాగంలో 7 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉంది. బంగారం(గోల్డ్), రాగి(కాపర్), ముడిఇనుము(ఐరన్ ఓర్) గ్రైండింగ్ మీడియా విభాగంతోపాటు.. చైనామినహాయిస్తే సిమెంట్ గ్రైండింగ్‌లో 35 శాతం వాటాను ఆక్రమిస్తోంది. విభిన్న ప్రొడక్టులను అందించడం ద్వారా ఆర్థికంగా పటిష్ట ఫలితాల సాధనతోపాటు.. వృద్ధి, మార్జిన్లు, నగదు ఆర్జన(క్యాష్ ఫ్లో), ఆర్‌వోఐసీలలో మెరుగైన పనితీరు చూపుతోంది. కంపెనీకి కీలకమైన హైక్రోమ్ గ్రైండింగ్ మీడియా విభాగంలో ప్రొడక్టుల వినియోగం 20–25 శాతానికి మాత్రమే పరిమితం కావడంతో భవిష్యత్‌లో భారీ అవకాశాలకు తెరలేవనుంది. మరోవైపు మెటాలిక్ మిల్ లైనర్స్‌లోకి ప్రవేశించడం ఇందుకు జత కలవనుంది. వెరసి కీలక ప్రొడక్టుల ఆఫరింగ్ ద్వారా ఆదాయంలో భారీ వృద్ధిని సాధించే అవకాశముంది. ఫలితంగా గ్లోబల్ మినరల్ ప్రాసెసింగ్ పరిశ్రమ వృద్ధి అంచనాలు 6 శాతానికి మించి కంపెనీ టర్నోవర్‌లో పురోగతి నమోదయ్యే వీలుంది. ఈ నేపథ్యంలో రానున్న మూడేళ్ల(2023–26) కాలానికి షేరువారీ ఆర్జన(ఈపీఎస్)లో సుమారు 8 శాతం వృద్ధిని ఊహిస్తున్నాం. చివరి రెండేళ్లలో 10 శాతాన్ని మించవచ్చు. ఇక గత ఆర్థిక సంవత్సరంలో సాధించిన చరిత్రాత్మక 25.3 శాతం నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు స్వల్ప వెనకడుగుతో 23–24 శాతంగా నమోదుకావచ్చు.




'పేదలందరూ పక్కా ఇళ్లలో ఉండాలన్నదే నా అభిమతం'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 239

సోమవారం 20-11-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




## అమ్మ నుంచి చాలా నేర్చుకున్నా

- నా భార్యకు చాలా ఓపిక.. మా చెల్లెలు కవిత డైనమిక్
- చదువుకున్న మహిళలు రాజకీయాల్లోకి రావాలి
- మహిళా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక హెల్ప్ లైన్ తీసుకువస్తాం
- మహిళలతో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖాముఖి

- వివరాలు 2లో

ఆదివారం నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో జరిగిన కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సభకు హాజరైన ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రియాంకా గాంధీ



# కేసీఆర్, కేటీఆర్‌ల ఉద్యోగాలు ఊడగొట్టాలి

**అప్పుడే రాష్ట్ర యువతకు ఉద్యోగాలు వస్తాయి.. ఖానాపూర్, ఆసిఫాబాద్ విజయభేరి సభల్లో ప్రియాంకా గాంధీ**

- సీఎం కేసీఆర్ పదేళ్ల పాలనలో ప్రజలను దగా చేశారు
- మళ్లీ బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే రాష్ట్ర భవిష్యత్తు నాశనం
- ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే కాంగ్రెస్ సర్కారు రావాలి
- జాబ్ క్యాలెండర్ విడుదల చేసి.. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తాం
- రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ
- బీఆర్‌ఎస్, బీజేపీ రెండూ ఒక్కటేనని వ్యాఖ్య

నిర్మల్/సాక్షి, ఆసిఫాబాద్: ''రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులు ఉన్నారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. అదే కేసీఆర్ కుటుంబంలో మాత్రం అందరికీ ఉద్యోగాలు (పదవులు) ఉన్నాయి. యువతకు ఉద్యోగాలు రావాలంటే.. కేసీఆర్, కేటీఆర్‌ల ఉద్యోగాలు ఊడగొట్టాలి. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలి..''అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ పిలుపునిచ్చారు. ప్రజలు ఇప్పటికే రెండుసార్లు బీఆర్‌ఎస్‌కు ఓటేసి పదేళ్లు దగాపడ్డారని, మళ్లీ బీఆర్‌ఎస్‌కు వేస్తే రాష్ట్ర భవిష్యత్తు నాశనం అవుతుందని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే జాబ్ క్యాలెండర్ అమలు చేస్తామని, రెండులక్షల ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం రావాలన్నారు. ఆదివారం నిర్మల్ జిల్లా ఖానాపూర్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సభల్లో ఆమె ప్రసంగించారు. ఖానాపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్‌ను, ఆసిఫాబాద్‌లో అజ్మీరా శ్యాంనాయక్‌ను గెలిపించాలని కోరారు. రెండు సభల్లో ప్రియాంకాగాంధీ ప్రసంగం ఆమె మాటల్లోనే..

''ఇందిరాగాంధీ ఆదివాసీలు, గిరిజనుల గురించి ఆలోచించేవారు. వారి అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారు. ప్రత్యేక రక్షణ చట్టాలు తీసుకొచ్చారు. అందుకే ఆమె మరణించి 40 ఏళ్లు గడిచినా గిరిజనులు ఆరాధిస్తున్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు తెలిసే సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చారు. కానీ కేసీఆర్ పదేళ్ల పాలనలో ప్రజలను దగా చేశారు. ప్రజల ఆకాంక్షలు ఒక్కటీ నెరవేర్చలేదు. యువతకు ఉపాధి కల్పించలేదు.

**కేసీఆర్ కుటుంబానికే ఉద్యోగాలు**

రాష్ట్రంలో 40 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారు. వారికి ఉద్యోగాలు రాకపోయినా కేసీఆర్ కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు వచ్చాయి. పరీక్షలు

మిగతా 3వ పేజీలో ▶



## ఈ ఎన్నికలు జీవన్మరణ సమస్య.. ఇవి మామూలు ఎన్నికలు కావు

- వివరాలు 3లో


- మా మేనిఫెస్టోకు కేసీఆర్ రాజముద్ర వేశారు..
- బీసీ సీఎం నినాదం ఓట్లు చీల్చే కుట్ర.. బీఆర్‌ఎస్‌కు మేలు చేసేందుకే బీజేపీ ఎత్తుగడ
- పార్టీ ఫిరాయించిన 12 మంది ఎమ్మెల్యేలను ఈసారి అసెంబ్లీ గేటు కూడా తాకనీయం
- కేసీఆర్ అవినీతిపై న్యాయ విచారణ జరిపిస్తాం
- 45 శాతం ఓట్లతో... 82-85 స్థానాలు గెలుస్తాం. 'హంగ్' అవకాశం లేదు.
- మీట్ ది ప్రెస్‌లో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

# కుటుంబ పాలన అంతమే!

**ఎన్నో పోరాటాలతో వచ్చిన తెలంగాణ కేసీఆర్ కుటుంబం చేతిలో బందీ**

**నారాయణపేట, చేవెళ్ల సభల్లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా**

- బీఆర్‌ఎస్.. భ్రష్టాచార్ రాష్ట్ర సమితిగా మారింది
- రాక్షసుల్లా తెలంగాణ ప్రజలను దోపిడీ చేసింది
- కాళేశ్వరం, మిషన్ భగీరథ, ఇతర ప్రాజెక్టుల్లో భారీ అవినీతి
- మేం అధికారంలోకి వస్తే అవినీతిపై విచారణ చేయిస్తాం
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లవి వారంటీలేని గ్యారంటీలు
- అవినీతిలో, ప్రజలను మోసం చేయడంలో ఆ పార్టీలు దిట్టలని వ్యాఖ్య
- బీజేపీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి



5లో

ఆదివారం నారాయణపేట సభలో ప్రసంగిస్తున్న జేపీ నడ్డా

### అవినీతిపై విచారణ జరుపుతాం

కేసీఆర్ ధరణి పోర్టల్ పేరుతో నిరుపేదల భూములు లాక్కున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని అడ్డగోలుగా పెంచేసి అవినీతికి పాల్పడ్డారు. ప్రాజెక్టు పరిధిలోని బ్యారేజీ కుంగడంతో భారీగా ప్రజాధనం వృథా అయింది. మియాపూర్ భూముల విషయంలో రూ.4వేల కోట్ల అవినీతి జరిగింది. ఔటర్ రింగ్ రోడ్డు విషయంలోనూ అవినీతి చోటుచేసుకుంది. మా ప్రభుత్వం వస్తే ఈ అవినీతిపై విచారణ చేసి దోషులను జైలుకు పంపుతాం. దళితబంధులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు 30శాతం కమీషన్లు తీసుకున్నారు. స్వయంగా కేసీఆరే ఈ విషయం చెప్పారు. ఈ కమీషన్ల ప్రభుత్వాన్ని ఈనెల 30న సాగనంపుదాం.



## ఈ ప్రశ్నలకు బదులివ్వండి

- తెలంగాణ ప్రజలకు ఏం ఒరగబెట్టారో సమాధానం చెప్పండి.. 2018, 2014 మేనిఫెస్టోల్లోని ఎన్ని హామీలు నెరవేర్చారు?
- దీనిపై బీజేపీ ప్రతినిధులతో చర్చకు సిద్ధమా?
- సీఎం కేసీఆర్‌ను నిలదీసిన బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి బండి సంజయ్

5లో



## మెతుకు సీమలో.. నువ్వా నేనా!

**బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ**

**గజ్వేల్, సిద్దిపేటల్లో బీఆర్‌ఎస్ జోరు**

మిగిలిన ఏడు చోట్లలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్యే..

దుబ్బాకలో బీజేపీ నుంచి పోటీ

సర్వశక్తులూ ఒడ్డుతున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు.. ప్రభుత్వ వ్యతిరేక పవనాల పైనే కాంగ్రెస్ ఆశలు

- వివరాలు 7లో




ఆదివారం ఈజిప్టు సరిహద్దులోని రఫా నుంచి గాజాలోకి ప్రవేశిస్తున్న అంబులెన్సులు

## అల్–షిఫా నుంచి 31 మంది శిశువుల తరలింపు

- ఈజిప్టుకు తరలించి మెరుగైన చికిత్స అందిస్తాం: గాజా ఆరోగ్య శాఖ వెల్లడి
- బందీల విడుదలకు హమాస్‌తో ఖతార్ ప్రతినిధుల చర్చలు
- దీనిపై త్వరలోనే హమాస్‌తో ఒప్పందం కుదిరే అవకాశం ఉందన్న ఖతార్ ప్రధాని
- బందీలకు విముక్తి కల్పిస్తే గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఆగొచ్చన్న అమెరికా

-6లో



## ముస్లింలు ఎటువైపు?

అసెంబ్లీ ఎన్నికల్లో ముస్లిం మైనారిటీలు జై కొట్టేదెవరికి..? వరుసగా రెండు పర్యాయాలు బీఆర్‌ఎస్ వెంట నడిచినన ముస్లిం ఓటర్లు ఈసారి ఎటు వైపు మొగ్గుచూపుతారన్నది ఆసక్తికరంగా మారింది. ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా.. ముస్లిం ఓట్ల ప్రస్తావన కచ్చితంగా ఉంటుంది. తెలంగాణలో కూడా ముస్లిం ఓట్లు కీలకం. మెజారిటీ స్థానాల్లో గెలుపోటములపై ప్రభావితం కనబర్చే మైనారిటీ ఓటర్లపై ప్రధాన రాజకీయపక్షాలు దృష్టి సారించాయి.

- వివరాలు 8లో





అలంపూర్ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్. ● కల్వకుర్తి, కొల్లాపూర్‌లో ఆదివారం జరిగిన ప్రజా ఆశీర్వాద సభలకు హాజరైన ప్రజలు

## కేసీఆర్ పాలనలో రాజ్యాంగం విధ్వంసం

ప్రొఫెసర్ కోదండరాం



గోదావరిఖని: కేసీఆర్ పాలనలో రాజ్యాంగం విధ్వంసమైందని, రాష్ట్రంలో నిరంకుశ పాలన కొనసాగుతోందని టీజేఎస్ వ్యవస్థాప కుడు ప్రొఫెసర్ కోదండరాం ఆందోళన వ్యక్తంచేశారు. పెద్దపల్లి జిల్లా రామగుండం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజ్‌ఠాకూర్‌తో కోదండరాం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిరంకుశ పాలన, దోపిడీ అంతానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాజ్‌ఠాకూర్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. తొమ్మిదిన్నర ఏళ్లుగా రాష్ట్రంలో కొనసాగుతున్న పాలన లోపాలను ఎత్తిచూపుతూ ప్రజాస్వామిక తెలంగాణ కోసం పోరాటం చేస్తున్నామన్నారు. తెలంగాణ బాగుపడి అభివృద్ధి ఫలాలు అందరికీ దక్కాలంటే ప్రస్తుత ప్రభుత్వాన్ని గద్దె దించాలని కోరారు. ఓపెన్‌కాస్టులను బంద్‌చేసి భూగర్భగనులను ఏర్పాటు చేయాలన్న తమ సూచనకు ముఖ్యమంత్రి కేసీఆర్ తలఊపి వనరులు కొల్లగొట్టారని ఆరోపించారు. ఏటా రూ.150 కోట్లు సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్‌కు సీఎస్ఆర్ నిధులు తరలించారన్నారు. ఆరు సూత్రాల తమ అభివృద్ధి ఎజెండాకు కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ అంగీకరించారని కోదండరాం చెప్పారు. సమావేశంలో సీపీఐ నాయకులు స్వామి, తిరుపతి, బాలరాజు, సాంబమూర్తి, శ్రీనివాస్, పెండ్యాల మహేశ్, భాస్కర్‌రెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాబును కలిసేందుకు కేసీఆర్, కేటీఆర్ యత్నం

ఓట్ల కోసం గడ్డి కరుస్తున్నారని సీపీఐ నేత నారాయణ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ఉన్న ఏపీ వాసుల ఓట్ల కోసం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడును కలిసేందుకు ప్రయత్నిస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఇటీవల చంద్రబాబు అరెస్ట్‌ను కేసీఆర్, కేటీఆర్ ఖండించకపోగా, హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగులు ఆందోళన చేయకుండా ఆంక్షలు పెట్టారని గుర్తు చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన చంద్రరాజేశ్వర్‌రావు పేరుతో ఆస్పత్రిని నిర్మించేందుకు రెండు ఎకరాల భూమి ఇవ్వాలని తాను, చాడ వెంకట్‌రెడ్డి గతంలో కేసీఆర్‌ను కలిస్తే ముందుగా సానుకూలంగా స్పందించారని, ఆ తర్వాత చంద్ర రాజేశ్వర్‌రావు ఆంధ్ర వ్యక్తి అంటూ కేసీఆర్ మాటమార్చారని గుర్తు చేశారు. ఓట్ల కోసం కేసీఆర్ నానా గడ్డి కరుస్తున్నారని దుయ్యబట్టారు. బీజేపీ గోషామహల్ అభ్యర్థి రాజాసింగ్ పై ఎంఐఎం అభ్యర్థిని పోటీకి పెట్టకుండా, జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు చెందిన మైనార్టీ అభ్యర్థిపైన ఎంఐఎం బరిలో నిలవడం బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీల మధ్య ఉన్న లోపాయికారి ఒప్పందానికి నిదర్శనమని విమర్శించారు. బీజేపీ ఒక పక్క బీసీ వర్గానికి చెందిన బండి సంజయ్‌ను రాష్ట్ర అధ్యక్ష పదవి నుండి తప్పించి, మరో పక్క బీసీ ముఖ్యమంత్రి గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు.

## నేటి భవితలో..

- గవర్నమెంట్ జాబ్స్:
**పోస్టల్ శాఖలో.. కొలువుల పిలుపు**
పలు క్రీడల పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచి వారికి భారత తపాల శాఖ స్వాగతం పలుకుతోంది. దేశ వ్యాప్తంగా ఉన్న 24 పోస్టల్ సర్కిల్స్‌లో స్పోర్ట్స్ కోటాలో 1,899 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది! అభ్యర్థులు విజేతలుగా నిలిచిన క్రీడల స్థాయిని పరిగణనలోకి తీసుకుని నియామకాలు ఖరారు చేయనుంది. ఈ నేపథ్యంలో.. పోస్టల్ శాఖ స్పోర్ట్స్ కోటా విధానంలో చేపట్టనున్న నియామకాలు, పోస్టులు, అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాలు..
- గ్రూప్1, గ్రూప్ 2 ప్రత్యేకం– కరెంట్ అఫైర్స్: సివిల్స్, గ్రూప్స్ తదితర పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉపయోగపడేలా అంతర్జాతీయం, జాతీయం, ప్రాంతీయం, వార్తల్లో వ్యక్తులు, అవార్డులు, స్పోర్ట్స్ తదితర తాజా పరిణామాలతో వీక్లీ కరెంట్ అఫైర్స్ రౌండ్ అప్..
- విద్య, ఉద్యోగ సమాచారం

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

# ఇందిరమ్మ రాజ్యమంటే.. ఆకలి చావులే!

**నాటి పాలనలో ప్రజలను రాచిరంపాన పెట్టారు, దోపిడీ చేశారు**

**అలంపూర్, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి సభల్లో సీఎం కేసీఆర్**

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/సాక్షి, నాగర్‌కర్నూల్: కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ రాజ్యం తెస్తామంటున్నారని.. ఇందిరమ్మ పాలన అంటే ఆకలి చావులు, ప్రజలను కాల్చి చంపుడేనని బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వ్యాఖ్యానించారు. నాడు జరిగింది నక్సలైట్ల ఉద్యమాలు, ప్రజలను కాల్చిచంపుడు, ఎన్‌కౌంటర్లేనని.. ప్రజలను రాచిరంపాన పెట్టారని మండిపడ్డారు. ఇందిరమ్మ రాజ్యమంత దరిద్రపు రాజ్యం ఇంకోటి లేదని పేర్కొన్నారు. అలాంటి రాజ్యం మళ్లీ తెస్తామంటున్న కాంగ్రెస్ పాలన కావాలా? అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ పార్టీ తెలంగాణ కోసమే పుట్టిందని చెప్పారు. ప్రజలు అన్నీ ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఆదివారం ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అలంపూర్, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''ఇందిరమ్మ రాజ్యం పొడుగునా ఏం జరిగింది. ప్రజలను రాచిరంపాన పెట్టారు. దోపిడీ చేశారు. ఇందిరమ్మ రాజ్యం బాగుంటే ఎన్టీ రామారావు పార్టీ పెట్టే వారు కాదు. ఆ రాజ్యంలో సుభిక్షంగా ఉంటే రూ.2కే కిలో బియ్యం ఎందుకు అవసరమొచ్చింది? ఇందిరమ్మ రాజ్యమంత దరిద్రపు రాజ్యం ఇంకోటి లేకుండె. ఇది అందరికీ తెలుసు. ప్రజలను ఆగం చేసేందుకు ఢిల్లీ గద్దలు వాలుతున్నాయి. మనకు రావాల్సిన 24వేల కోట్లు ఆపిన బీజేపీ ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతోంది?

**పదవులొస్తే స్వార్థానికి వాడుకున్నారు**

ఉమ్మడి ఏపీలో తెలంగాణ మీద జరిగిన దాడులు, దోపిడీ వల్ల రైతాంగం ఎన్ని అవస్థలకు గురైందో అందరికీ తెలుసు. కృష్ణా, తుంగభద్ర మధ్యనున్న నడిగడ్డకు జరిగిన అన్యాయంపై బాధపడ్డాం. వలసలతో ఘోరమైన పరిస్థితిని చూశాం. ఇక్కడి కాంగ్రెస్ నాయకులు చేసిన పొరపాటు వల్ల తెలంగాణను ఆంధ్రలో కలిపితే 55 ఏళ్లు గోసపడ్డాం. భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడులకు పెండింగ్ ప్రాజెక్టులుగా పేరుపెట్టి చేతులు ముడుచుకుని కూర్చున్నారే తప్ప ఏమీ చేయలేదు. కాంగ్రెస్ నాయకులు పదవులు వస్తే వారి స్వార్థానికే వాడుకున్నారు.

**కాంగ్రెస్ వాళ్లది భూమాత స్కీం కాదు.. భూమేత..**

కాంగ్రెస్‌కు ఓటేస్తే ధరణి తీసేస్తామంటున్నారు. ఒకరి భూమి ఇంకొకరికి రాసి కోర్టుల చుట్టూ తిప్పే ప్రక్రియతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసేందుకు కుట్రలు చేస్తున్నారు. కాంగ్రెస్ వాళ్లు ధరణి తీసేసి భూమాత స్కీం తెస్తామంటున్నారు. అది భూమాత కాదు భూమేత. ఆ స్కీంతో రైతుల భూములను మింగుతారు. దళారీ రాజ్యం వస్తుంది. ప్రతి దానికి వేల రూపాయలు లంచం అడుగుతారు.

**ఆర్డీఎస్ కోసం పోరాటం చేపట్టాం**

ఆర్డీఎస్ ద్వారా 85వేల ఎకరాలకు నీరు పారాల్సి ఉంటే.. పది వేల ఎకరాలైనా పారకపోయేది. అలంపూర్‌కు జరుగుతున్న అన్యాయాన్ని చూసి 2002లో పాదయాత్ర ద్వారా పోరాటం మొదలుపెట్టాం. కేసీఆర్ ఒత్తిడికి తలొగ్గి ఆర్డీఎస్ తూములు మూసేస్తే బాంబులు పెట్టి లేపేస్తామని రాయలసీమ నాయకులు మాట్లాడారు. అలా చేస్తే మీ సుంకేశుల బ్యారేజీని వంద బాంబులు పెట్టి దుమ్ములో కలిపేస్తామని చెప్పా. మాకూ బాంబులేసే మొగోడు పుట్టాడు, మాకూ నీళ్లొస్తాయని ప్రజలు సంతోషపడ్డారు. ఇలా తూములను బద్దలు కొట్టి నీళ్లు తీసుకెళుతున్నా, పెండింగ్ ప్రాజెక్టులపైనా ఎవరూ మాట్లాడలేదు. కాంగ్రెస్ నాయకులు ఎవరి స్వార్థానికి వారు పదవులను వాడుకున్నారే తప్ప ప్రజల గురించి ఆలోచించలేదు. ఇప్పుడు మేం ఆర్డీఎస్ మీద తుమ్మిళ్ల ఎత్తిపోతల కడుతున్నాం. మల్లమ్మకుంట రిజర్వాయర్ పూర్తి చేస్తాం. వాల్మీకి బోయలను బీసీల్లో కలిపింది కాంగ్రెస్ పార్టీయే. వారిని ఎస్టీల్లో కలపాలని బీఆర్‌ఎస్ సర్కారు తీర్మానం చేసి పంపితే మోదీ ప్రభుత్వం పక్కన పడేసి కూర్చుంది. కేంద్రం మెడలు వంచైనా వాల్మీకి బోయలను ఎస్టీల్లో చేర్చేలా చూస్తాం.

**మూడు గంటల కరెంటు చాలా?**

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.200 ముఖాన కొట్టి ఇదే పెన్షనని చెప్పారు. ఈ రోజు మేం రూ.2 వేలు ఇస్తున్నాం. మళ్లీ గెలిస్తే రూ.5వేలు చేస్తాం. రైతుబంధు వృథా అని పీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతున్నారు. అది వృథానా? రైతుబంధు ఉండాలంటే బీఆర్‌ఎస్ గెలవాలి. తెలంగాణలో 30లక్షల పంపు సెట్లు ఉన్నాయి. వ్యవసాయానికి మూడు గంటల కరెంటు సరిపోతుందని, 10 హెచ్‌పీ మోటార్లు పెట్టుకోవాలని పీసీసీ అధ్యక్షుడు చెప్తున్నారు. ఇది రైతులను, తెలంగాణను ఆగం పట్టించే కుట్ర. మూడే గంటలు కరెంటు చాలా, 24 గంటలు ఇచ్చే బీఆర్‌ఎస్ కావాలా? ప్రజలు ఆలోచించాలి. ప్రజాస్వామ్యానికి కావాల్సింది ఫ్యాక్షనిస్టులు, గూండాగిరీ, దాదాగిరీ చేసే వాళ్లు కాదు. మంచి పాలన కొనసాగిస్తే మేలు జరుగుతుంది.

**పాలమూరు ఎత్తిపోతలతో సస్యశామలం**

ఇందిరమ్మ రాజ్యం పొడవునా కాంగ్రెస్ వాళ్లు మనకు పెట్టినపేరు వెనుకబడ్డ గరీబ్ ప్రాంతమని. జొన్నలే పండించుకోవాలని, వడ్లు వద్దని అన్నారు. అలాంటిది ఇప్పుడు మూడు కోట్ల టన్నుల వడ్లు పండుతున్నాయి. నాడు కృష్ణా, తుంగభద్ర పక్కనే ఉన్నా నీళ్లు ఇవ్వకుండా నడిగడ్డ ప్రజలను ఇబ్బందులు పెట్టారు. పాలమూరు ఎత్తిపోతలతో ఇక్కడి ప్రాంతం సస్యశామలం కానుంది. ఎన్నికలు రాగానే ఆగం కావొద్దు. అంతా ఆలోచించి ఓటు వేయాలి..''అని కేసీఆర్ పేర్కొన్నారు. ఈ సభల్లో మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎంపీ రాములు, ఎమ్మెల్సీ వెంకట్రామ్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థులు బీరం హర్షవర్ధన్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, విజయుడు, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అధికారం కోసం కాంగ్రెస్ వంద అబద్ధాలు

**హాస్యాస్పదంగా హస్తం మేనిఫెస్టో: మంత్రి హరీశ్‌రావు**



బాబు మోహన్ తనయుడికి కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: పక్కనున్న కర్ణాటకలో ఐదు గ్యారంటీలను ప్రకటించిన రాహుల్, ప్రియాంకాగాంధీ పత్తా లేకుండాపోయారని, అక్కడ పరిస్థితి గందరగోళంగా మారిందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లాకేంద్రంలో జరిగిన పలు సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో పలు పార్టీల ప్రతినిధులు, నాయకులు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. హరీశ్‌రావు మాట్లాడుతూ వంద అబద్ధాలు ఆడైనా సరే అధికారంలోకి రావాలని కాంగ్రెస్ తాపత్రయపడుతోందని అన్నారు. మనకు బూతు మాటలు మాట్లాడే నేతలు కాదని, భవిష్యత్తు అందించే నాయకులు కావాలన్నారు. బట్టేబాజ్ మాటలు చెప్పే కాంగ్రెస్ పార్టీ నిజస్వరూపాన్ని ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో మోకాలిచిప్పకు ఉచితంగా ఆపరేషన్లు అని పెట్టారని, కానీ తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇప్పటికే ఉచితంగా మోకాలి చిప్ప ఆపరేషన్లు చేస్తోందని, కాంగ్రెస్ వాళ్లకు అది కూడా తెలవదని ఎద్దేవా చేశారు. భవిష్యత్తులో 112 నియోజకవర్గాల్లో అగ్రవర్ణ కులాల పిల్లలకు కూడా గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయబోతున్నట్టు తెలిపారు. తొమ్మిదేళ్లు వర్గీకరణ అంశంపై జాప్యం చేసి ఇప్పుడు ఎన్నికల ముందు కేంద్రం కమిటీ అని కొత్త నాటకానికి తెర తీసిందని హరీశ్ విమర్శించారు. టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ నాయకులు మంత్రి హరీశ్‌ను కలిసి బీఆర్‌ఎస్‌కు మద్దతు ప్రకటించారు. వర్గీకరణకు బీఆర్‌ఎస్ కట్టుబడి ఉందని, తెలంగాణ ఏర్పడిన తొలి నాళ్లలోనే అసెంబ్లీలో తీర్మానం చేసి బిల్లును కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం పంపిందన్నారు. మనకు కావాల్సింది కమిటీ కాదనీ, బిల్లు రావాలని, వెంటనే పార్లమెంటులో బిల్లు పెట్టాలని స్పష్టం చేశారు.

**బీఆర్‌ఎస్‌లో చేరిన బాబుమోహన్ తనయుడు**

సంగారెడ్డి జిల్లా బీజేపీ అందోల్ నియోజకవర్గ అభ్యర్థి బాబుమోహన్ కుమారుడు ఉదయ్‌భాస్కర్ ఆదివారం సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

# సింగరేణి మనుగడ కేసీఆర్‌తోనే..

**సంస్థను ఖతం చేసే పనిలో ప్రధాని మోదీ**
- కార్మికుల కష్టాలను పట్టించుకోని కాంగ్రెస్
- గిరిజనేతరులకూ పోడు పట్టాలు ఇస్తాం
- భద్రాద్రి జిల్లా పర్యటనలో కేటీఆర్



భద్రాచలంలో ఆదివారం నిర్వహించిన రోడ్‌షోకు హాజరైన ప్రజలు. ఇన్‌సెట్‌లో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి సంస్థ మనుగడ సాగించాలంటే సీఎం కేసీఆర్ ఉండాలి..కేసీఆర్ ఉండాలంటే రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలి అని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, అశ్వారావుపేటలో ఆదివారం ఆయన రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ...ప్రధాని నరేంద్రమోదీ సింగరేణి ప్రైవేటీకరణకు అన్ని విధాలా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పంటికి అందకుండా సింగరేణిని మింగేందుకు మోదీ చేస్తున్న ప్రయత్నాలను బీఆర్‌ఎస్ ఎంపీలు అడుగడుగునా అడ్డుకుంటున్నారని తెలిపారు. ఈ విషయంలో ఒక్క కాంగ్రెస్ ఎంపీ కూడా పార్లమెంట్‌లో నోరుమెదపలేదని విమర్శించారు.

**త్వరలోనే 'సీతారామ'పూర్తి చేస్తాం**

సీతారామ ఎత్తిపోతల పథకాన్ని త్వరలోనే పూర్తి చేస్తామని కేటీఆర్ భరోసా ఇచ్చారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు బీఆర్‌ఎస్‌కు సరైన ఆదరణ లేదని, కానీ ఈసారి రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా కీలకం కావాలని పిలుపునిచ్చారు. పార్టీలో నేతల మధ్య చిన్న చిన్న విభేదాలు, అలకలు ఉంటే అన్నీ పక్కన పెట్టి పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. గిరిజనేతరులకు పోడు పట్టాల పంపిణీ తదితర సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వ స్థాయిలో ప్రయత్నం చేస్తామన్నారు.

**దరిద్రానికి నేస్తం 'హస్తం'**

కాంగ్రెస్ వారు ఒక్క అవకాశం ఇవ్వండని అడుగుతున్నారని, ప్రజలు ఇప్పటికే 11 సార్లు అవకాశం ఇచ్చారని, ఇంకెన్నిసార్లు ఇవ్వాలని కేటీఆర్ ఎద్దేశా చేశారు. రేవంత్‌రెడ్డి సిగ్గులేకుండా మాట్లాడుతున్నాడని, రాష్ట్రంలో ఎంత మంది రైతులకు 10 హెచ్‌పీ మోటార్లు ఉన్నాయని ప్రశ్నించారు. దరిద్రానికి నేస్తంగా హస్తం మారిందని ఆయన ఆరోపించారు.

**నా పేరే తారక రామారావు:** మూడోసారి అధికారం చేపట్టగానే యాదాద్రి కంటే మిన్నగా భద్రాచలం పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కేటీఆర్ మధ్యాహ్నం భద్రాచలం చేరుకునేసరికి అప్పటికే ఆలయం తలుపులు మూసేయగా దర్శనం సాధ్యం కాలేదు. దీనిపై కేటీఆర్ వివరణ ఇస్తూ 'నా పేరే తారక రామారావు'నాకు రాముడిపై భక్తి లేకుండా ఎలా ఉంటుంది'అని కేటీఆర్ అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తాతా మధు, ఇల్లెందు, కొత్తగూడెం, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట బీఆర్‌ఎస్ అభ్యర్థులు బానోత్ హరిప్రియ, వనమా వెంకటేశ్వరరావు, రేగా కాంతారావు, తెల్లం వెంకట్రావు, మెచ్చా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# అమ్మ నుంచి చాలా నేర్చుకున్నా



'విమెన్ ఆస్క్ కేటీఆర్' ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

**నా భార్యకు చాలా ఓపిక.. మా చెల్లెలు కవిత డైనమిక్**
- చదువుకున్న మహిళలు రాజకీయాల్లోకి రావాలి
- మహిళా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక హెల్ప్‌లైన్ తీసుకువస్తాం
- మహిళలతో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖాముఖి

సాక్షి, హైదరాబాద్: అమ్మ నుంచి ఎంతో నేర్చుకున్నానని రాష్ట్ర మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు వెల్లడించారు. ఆదివారం బేగంపేట్‌లోని గ్రాండ్ కాకతీయ హోటల్‌లో ఫ్యూచర్ ఫార్వార్డ్ తెలంగాణలో భాగంగా 'విమెన్ ఆస్క్ కేటీఆర్' ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజా జీవితంలో ఉండటంతో తన తండ్రితో తక్కువ సమయం గడిపానన్నారు. 'మా అమ్మని చూసి చాలా నేర్చుకున్నా. నా భార్య కూడా చాలా ఓపికగా ఉంటుంది. నా చెల్లి కవిత చాలా డైనమిక్. మా కుటుంబంలోనే తనంత ధైర్యవంతులు లేరు. నా కూతురు ఇంత చిన్న వయసులోనే చాలా బాగా ఆలోచిస్తుంది. కూతురు పుట్టాక నా జీవితం చాలా మారింది'అని వివరించారు.

**మహిళలు మానసికంగా చాలా బలవంతులు..**

హైదరాబాద్ నుంచి వచ్చిన క్రీడాకారుల్లో ఎక్కువ మంది మహిళలే ఉండటం గర్వకారణమన్నారు. కోవిడ్ సమయంలో సుచిత్రా ఎల్లా, మహిమా దాట్ల వంటివారు ఆదర్శంగా నిలిచారని చెప్పారు. మహిళలు మానసికంగా చాలా బలంగా వుంటారని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రతీ ఇంటికి మంచినీళ్లు అందించామని, మైనారిటీ పిల్లల కోసం ప్రత్యేక పాఠశాలలు ప్రారంభించామని చెప్పారు. ప్రతి చిన్నారిపై రూ.10 వేలకు పైగా ఖర్చు చేస్తున్నామని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు 61 శాతానికి పెరిగాయని తెలిపారు. స్త్రీనిధి కింద స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామన్నారు. తెలంగాణ, ఏపీలో మహిళలు స్త్రీనిధి రుణాలను 99 శాతం తిరిగి చెల్లిస్తున్నారని చెప్పారు. తాము మేనిఫెస్టోలో మహిళల కోసం ప్రత్యేకంగా పెట్టిన పథకాల్లో కొన్నింటిని పూర్తి చేశామని, ఇంకా చేయాల్సినవి చాలా ఉన్నాయని తెలిపారు. మహిళా యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, కల్యాణ లక్ష్మి, అమ్మఒడి వంటి సేవలను తెచ్చామని వివరించారు. నెగెటివ్ బ్లడ్ గ్రూప్ ఉన్న మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేకంగా వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు కేటీఆర్ చెప్పారు. మళ్లీ అధికారంలోకి వస్తే మహిళలకు చాలా తక్కువ వడ్డీతో రుణాలిస్తామన్నారు.

**డీప్ ఫేక్‌తో రాజకీయ నేతలకూ ప్రమాదమే..**

కాగా, డీప్ ఫేక్.. మహిళలకు మాత్రమే కాదు.. రాజకీయ నేతలకు సైతం ప్రమాదమేనని చెప్పారు. తమ ప్రత్యర్థులు డీప్ ఫేక్ వాడి దుష్ప్రచారం చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ఒక్కోసారి టాక్సిక్‌గా తయారవుతోందని, ప్రతిపక్షాలు సోషల్ మీడియాని వాడుకుని తమపై దుష్ప్రచారం చేస్తున్నాయని అన్నారు. మాట్లాడే హక్కుని ఎదుటివారిని దూషించడానికి వాడకూడదని స్పష్టంచేశారు. మహిళకు సంబంధించిన సమస్యల కోసం ప్రత్యేకంగా ఒక హెల్ప్ లైన్‌ను ఏర్పాటు చేస్తే బాగుంటుందని అనుకుంటున్నామని చెప్పారు. ప్రతి పక్షాలకు కూడా బీఆర్‌ఎస్ పార్టీయే గెలుస్తుందని తెలుసని, కానీ వాళ్లు నటిస్తున్నారని అన్నారు. విద్యావంతులైన మహిళలు రాజకీయంగా కూడా అడుగులు వేయాలని కేటీఆర్ సూచించారు.

# కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దు

**ఎమ్మెల్సీ కవిత**
- ధర్మపురి, పెగడపల్లి, కాటారంలో బీఆర్‌ఎస్ తరఫున ప్రచారం



పెగడపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

ధర్మపురి/పెగడపల్లి/కాటారం: కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దని, బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ఎమ్మెల్సీ కవిత ప్రజలను కోరారు. 'తెలంగాణ రాకముందు రాష్ట్రం ఎట్లుండే.. ఇప్పుడెట్ల ఉన్నదో'గమనించాలని సూచించారు. ధర్మపురి బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా ఆదివారం ఆమె ధర్మపురి, పెగడపల్లి మండలాల్లో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మూడు గంటల కరెంటు చాలని, ధరణిని తీసేస్తామని కాంగ్రెస్ నాయకులు అంటున్నారని, అదే జరిగితే రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. తాము మరోసారి అధికారంలోకొస్తే అన్నపూర్ణ పథకం కింద సన్నబియ్యం ఇస్తామన్నారు. ప్రస్తుత పథకాలు కొనసాగాలన్నా.. మరిన్ని పథకాలు రావాలన్నా సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమన్నారు. అనంతరం ఆమె ధర్మపురి శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత స్థానిక బ్రాహ్మణ సంఘం భవనంలో మహిళలతో మాట్లాడారు. యాభై ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఆ పార్టీ చేసిందేమీ లేదని పేర్కొన్నారు.

**దేశంలోనే తెలంగాణ నంబర్‌వన్**

ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపాయని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధుకు మద్దతుగా ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో కవిత మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలో లేదని సాకులు చెబుతూ ఏ పనీ చేయని మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుకు ఓటు వేయడం వృథా అన్నారు. మంథని అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు ఇస్తానని ఇటీవల సీఎం ప్రకటించారని, మంథనిని కేసీఆర్ దత్తత తీసుకుంటారేమో అనిపిస్తోందన్నారు.

## ధన బలం-ప్రజాబలం మధ్యే పోటీ

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



అనంతగిరి: ఈ ఎన్నికల్లో ధనబలం–ప్రజాబలం మధ్యే పోటీ అని, కొండ చిలువలకు, చలి చీమలకు జరుగుతున్న ఎన్నికలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అభివర్ణించారు. ఆదివారం వికారాబాద్ అభ్యర్థి గొర్లకాడి క్రాంతికుమార్ తరఫున పట్టణంలోని బీజేఆర్ చౌరస్తాలో రోడ్‌షో నిర్వహించారు. పార్టీ నాయకులతో కలసి అమరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో సీఎం కేసీఆర్ రూ.40 వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. క్రాంతికుమార్‌పై మూడు అక్రమ కేసులు, తనపై కూడా కేసులు నమోదు చేశారని తెలిపారు. బీఎస్పీ అధికారంలోకి వచ్చిన వెంటనే 12 వేల కోచింగ్ సెంటర్లు పెట్టి, 10 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో కొడంగల్ అభ్యర్థి నర్మద కిష్టప్ప, పరిగి అభ్యర్థి ఆనందం, చేవెళ్ల అభ్యర్థి రాజమహేంద్రవర్మ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌ఆర్యా తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు ద్రోహం చేసే పార్టీలను తరిమికొట్టాలి

పిలుపునిచ్చిన ఆర్.కృష్ణయ్య



హిమాయత్‌నగర్ (హైదరాబాద్): రాష్ట్రంలో బీసీ జాబితా నుంచి తొలగించిన 26 బీసీ కులాలను తిరిగి చేర్చాలని, బీసీలకు ద్రోహం చేసిన రాజకీయ పార్టీలను ఈ అసెంబ్లీ ఎన్నికల్లో తరిమికొట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో తొలగించిన 26 బీసీ కులాల పోరాట సమితి అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తల్లిదండ్రులు బీసీలుగా ఉంటే పిల్లలు ఓసీలు ఎలా అవుతారని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకి మద్దతివ్వాలనే విషయం నాలుగు రోజుల్లో ప్రకటిస్తామన్నారు. డిసెంబర్ 13, 14న జరగనున్న పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ 5 వేల మందితో ఢిల్లీలో ధర్నా చేపట్టనున్నట్లు కృష్ణయ్య వెల్లడించారు. ఆళ్ల రామకృష్ణ మాట్లాడుతూ సీఎంను ఓడించేందుకు 'ఒక కేసీఆర్ 100 అబద్ధాలు' కరపత్రాలను పంపిణీ చేస్తామన్నారు.

## క్లుప్తంగా...

### స్టార్ క్యాంపెయినర్ల సమన్వయానికి కమిటీ ఏర్పాటు

- ఉత్తర్వులు జారీ చేసిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్ల ఎన్నికల ప్రచారాన్ని సమన్వయం చేసేందుకు ఒక సమన్వయకమిటీని ఏఐసీసీ ఏర్పాటు చేసింది. కన్వీనర్‌గా ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీ చంద్‌రెడ్డి, కో–కన్వీనర్‌గా మహేష్ కుమార్ గౌడ్ వ్యవహరించనున్నారు. కమిటీ సభ్యులుగా సయ్యద్ అజ్మతుల్లా హుస్సేని, నూతి శ్రీకాంత్, ఎన్.ప్రీతంలకు అవకాశం ఇచ్చారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదివారంరాత్రి ఉత్తర్వులు జారీచేశారు.

### 22న అలంపూర్, నల్లగొండల్లో ఖర్గే ప్రచారం

- టీపీసీసీ ప్రచార, ప్రణాళిక కమిటీ చీఫ్ కో–ఆర్డినేటర్ విజయశాంతి



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 22న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అలంపూర్, నల్లగొండల్లో ప్రచారం చేస్తారని టీపీసీసీ ప్రచార కమిటీ తెలిపింది. ఆదివారం గాంధీభవన్‌లో టీపీసీసీ ప్రచార, ప్రణాళిక కమిటీ చీఫ్ కో– ఆర్డినేటర్ విజయశాంతి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా క్యాంపెయిన్‌కు చెందిన అంశాలు, ఈ నెల 28 వరకు చేసే ప్రచారాలు, వ్యూహంపై చర్చించారు. అనంతర వారు మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 28 వరకు ఏఐసీసీ, పీసీసీ నేతలు ప్రచారం చేస్తారన్నారు. ఈ నెల 28 వరకు చేయాల్సిన ప్రచారానికి సంబంధించిన బాధ్యతలు కమిటీ సభ్యులకు ఇచ్చామన్నారు. ఖమ్మం, మహబూబ్‌నగర్, హైదరాబాద్ నగర చుట్టుపక్కల నియోజకవర్గాల్లో విజయశాంతి ప్రచారం చేస్తారన్నారు.

### నిజామాబాద్ అర్బన్‌లో అభ్యర్థి ఆత్మహత్య



ఖలీల్‌వాడి(నిజామాబాద్ అర్బన్): నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో అలయెన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్ పార్టీ తరపున పోటీచేస్తున్న కన్నయ్యకుమార్‌గౌడ్ అనే అభ్యర్థి శనివారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ గాయత్రీనగర్‌లోని సాయినగర్ కాలనీలో నివసించే కన్నయ్యకుమార్ గౌడ్ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో ఇరుక్కున్నాడు. సైబర్ నేరగాళ్లు ఆయనను హనీట్రాప్ చేసి వేధింపులకు పాల్పడుతున్నారు. వేధింపులకు తాళలేక ఆయన రెండురోజులుగా ఇంటిలోంచి బయటికి వెళ్లడం లేదు. ఈ నేపథ్యంలో కుంగిపోయిన కన్నయ్యకుమార్ గౌడ్ శనివారంరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబసభ్యులు గమనించి అతడిని వెంటనే జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు.

### భారత్ ఓటమిని జీర్ణించుకోలేక క్రికెట్ అభిమాని మృతి



తిరుపతి రూరల్: ప్రపంచకప్ క్రికెట్ ఫైనల్స్‌లో ఇండియా ఓటమిని జీర్ణించుకోలేక తిరుపతిలో క్రికెట్ అభిమాని జ్యోతికుమార్ యాదవ్ (35) గుండెపోటుతో మృతి చెందాడు. తిరుపతి మండలం దుర్గసముద్రానికి చెందిన జ్యోతి కుమార్ యాదవ్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. టీమిండియా ఓటమి చెందటంతో క్రికెటర్ రోహిత్ శర్మ కన్నీటితో గ్రౌండ్ నుంచి వస్తున్న దృశ్యాలను చూస్తూ చలించిపోయాడు. ఆకస్మాత్తుగా గుండెనొప్పితో కుప్పకూలిపోయాడు. స్నేహితులు అతన్ని తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు.

# తెలంగాణలో కన్నడ కాక!

- ఆ రాష్ట్రం చుట్టూ తిరుగుతున్న ప్రచారం
- మరో రాష్ట్రం కీలక ప్రచారాంశం కావటం ఇదే తొలిసారి
- తెలంగాణతో పెద్దగా కాంటాక్ట్స్ లేకున్నా... ఇప్పుడు బీఆర్ఎస్– కాంగ్రెస్ మధ్య కాక రేపిన పొరుగు రాష్ట్రం
- కర్ణాటక తరహాలో 'గ్యారంటీ'లను అమలు చేస్తామంటూ జనంలోకి కాంగ్రెస్
- స్వయంగా వచ్చి విజయగాథలు వినిపిస్తున్న కర్ణాటక ప్రభుత్వ పెద్దలు
- అక్కడి హామీల అమలు తుస్సుమన్నదని ఎదురుదాడికి దిగిన బీఆర్ఎస్




సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో కన్నడ రాజకీయాలు కాకరేపుతున్నాయి. ఎన్నికల ప్రచారం కర్ణాటక ప్రధాన అంశంగా సాగుతుండటం ఆసక్తి రేపుతోంది. రెండు ప్రధాన పార్టీలు బీఆర్ఎస్–కాంగ్రెస్‌లు పొరుగు రాష్ట్రం పాలనను ప్రచారంలోకి తెచ్చి హోరెత్తిస్తున్నాయి. ఇది గతంలో ఎన్నడూ కనిపించని వ్యవహారం. తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లో పార్టీల మధ్య వేరే రాష్ట్రం అంశం కేంద్రబిందువుగా నిలవలేదు. మరో తెలుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అంశం ప్రస్తావనకు వచ్చినా, అది రాష్ట్ర విభజన అంశాలకే పరిమితమైంది. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఈ స్థాయిలో మరో రాష్ట్రం ప్రచారాంశంగా నిలవలేదనే చెప్పాలి. కానీ తొలిసారి పొరుగు రాష్ట్రం ఇక్కడి రాజకీయ పరిస్థితిని హీటెక్కించింది.

**అక్కడ గెలుపు.. ఇక్కడ ఊపు**

గతేడాది కర్ణాటకలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయదుందుభి మోగించిన దరిమిలా తెలంగాణ కాంగ్రెస్‌లో ఊపొచ్చింది. అప్పటి వరకు బీఆర్ఎస్‌ను ఢీకొట్టేది బీజేపీనే అన్న భావన ఉండగా, కర్ణాటక ఫలితాలు ఒక్కసారిగా పరిస్థితిని మార్చేశాయి. దీనికి తోడు బీజేపీలో అంతర్గతంగా నెలకొన్న కొన్ని పరిస్థితులు కూడా కాంగ్రెస్‌లో ఊపు పెరిగేందుకు కారణమయ్యాయి. ఈ పరిణామాలు బీఆర్ఎస్ ప్రచార తీరును కూడా మార్చేశాయి. అప్పటి వరకు కేంద్రప్రభుత్వ విధానాలు, ప్రధాని మోదీ తీరును టార్గెట్ చేస్తూ ఆ పార్టీ నేతలు మాట్లాడుతూ రాగా.. ఆ తర్వాత నుంచి వారి దాడి కాంగ్రెస్ వైపు మళ్లింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో అరాచక పరిస్థితులు నెలకొంటాయని పేర్కొంటూ, స్థానిక నేతల తీరును ఎండగడుతూ వస్తున్నారు. ఎన్నికల ప్రచారం మొదలైన తర్వాత ఒక్కసారి బీఆర్ఎస్ దాడి మరింత తీవ్రమైంది. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీ కర్ణాటక ప్రభుత్వ పాలన తీరును వివరిస్తూ ప్రజల్లోకి వెళ్లటం ప్రారంభించింది.

**ప్రజల ముందుకు కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు**

కాంగ్రెస్ పార్టీ తన ప్రధాన హామీలైన 'ఆరు గ్యారంటీ'లను మిగతా పార్టీల కంటే చాలా ముందుగానే ప్రజల ముందుంచింది. రూ.500 కే గ్యాస్ సిలిండర్ అందించే 'మహాలక్ష్మి' పథకం, రైతులకు ఎకరానికి రూ.15 వేలు అందించే రైతు భరోసా, ప్రతి ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటును అందించే గృహజ్యోతి, పేదలకు గృహవసతి కల్పించే ఇందిరమ్మ ఇంటి పథకం, విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు ఇచ్చే యువ వికాసం, రూ.4 వేల నెలవారీ పింఛన్‌తో కూడిన చేయూత.. ఇలా ఆరు గ్యారంటీలను ప్రకటించింది. కర్ణాటక ఎన్నికల సమయంలో అక్కడి నేతలు ఐదు గ్యారంటీలను ప్రకటించి ప్రభుత్వం ఏర్పాటయ్యాక అమలు చేయడం ప్రారంభించారు. ఆ రాష్ట్రంలో గ్యారంటీల అమలు అద్భుతంగా ఉందని తెలంగాణ కాంగ్రెస్ నేతలు ప్రజలకు వివరించటం ద్వారా, తాము అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని నమ్మకం కలిగించే ప్రయత్నం ప్రారంభించారు.

**అక్కడి నేతలతో కాంగ్రెస్‌కు ప్రచార బలం**

హామీలపై మరింత భరోసా కలిగించేందుకు ఏకంగా కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లను తీసుకొచ్చి ప్రచారంలో పాల్గొనేలా చేశారు. ఈ తీరు కాంగ్రెస్ ప్రచారానికి పెద్ద బలం చేకూర్చింది. దీనిని గుర్తించిన బీఆర్ఎస్ నేతలు వెంటనే ప్రతిస్పందించారు. కర్ణాటక అంశాన్ని తిప్పికొట్టడం ప్రారంభించారు. కర్ణాటకలో గెలుపే లక్ష్యంగా అక్కడి కాంగ్రెస్ నేతలు అలవిగాని హామీలు ఇచ్చి, ప్రభుత్వం ఏర్పడ్డాక అమలు చేయలేక చతికిలబడుతున్నారంటూ కాంగ్రెస్ నేతలపై ఎదురుదాడి ప్రారంభించారు. ఇందుకు కొన్ని ఉదాహరణలు చూపుతూ, హామీలను నిలబెట్టుకునే తత్వం కాంగ్రెస్ రక్తంలోనే లేదని, తెలంగాణలో కూడా కాంగ్రెస్ గెలిస్తే అదే పరిస్థితి ఏర్పడుతుందని కేసీఆర్, కేటీఆర్ సహా ఆ పార్టీ నేతలంతా ప్రచారంలో హోరెత్తిస్తున్నారు. కాంగ్రెస్ నేతల మాటలను నమ్మితే నట్టేట మునిగినట్టేనని పేర్కొంటూ వస్తున్నారు.

**అక్కడ అంత లేదంటూ బీఆర్ఎస్ ఎదురుదాడి**

సరిహద్దులోని కర్ణాటక వాసులు తెలంగాణకు వచ్చి, కర్ణాటకలో కాంగ్రెస్ హామీలు సరిగా అమలు కావటం లేదంటూ ఆరోపించిన తీరును బీఆర్ఎస్ నేతలు ప్రస్తావిస్తున్నారు. ఈ తరుణంలో ఏ అవకాశాన్ని వదులుకోవటం లేదు. బహుళజాతి సంస్థ ఫాక్స్‌కాన్ హైదరాబాద్ శివారులో పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు రాగా, దాన్ని బెంగళూరుకు తరలించేందుకు కర్ణాటక ప్రభుత్వం కుట్రచేసిందని, హైదరాబాద్ బదులు బెంగళూరులో కంపెనీ ఏర్పాటు చేయాల్సిందిగా కోరుతూ ఆ సంస్థ చీఫ్‌కు కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ లేఖ రాశారంటూ బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఈ సందర్భంగా లేఖ ప్రతిని కూడా విడుదల చేశారు. అయితే, అది తాను రాసింది కాదని, అది ఫేక్ లెటర్ అంటూ డీకే శివకుమార్ ప్రకటించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. ఆ తర్వాత ఆ అంశం మరుగున పడింది. కాంగ్రెస్ ప్రభుత్వాలకు ఢిల్లీ హైకమాండ్ పవర్ సెంటర్‌గా ఉంటుందని, ఇప్పుడు ఢిల్లీతోపాటు బెంగళూరు కూడా పవర్ సెంటర్‌గా మారి హైదరాబాద్ జీరో అవుతుందని బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేస్తున్నారు. ఇలా నిత్యం ఈ రెండు ప్రధాన పార్టీల మధ్య కర్ణాటక కాకరేపుతూనే ఉంది.

## డైకిన్.. మేడిన్ ఆంధ్రా ఏసీలు

- 23 నుంచి ఏసీ వాణిజ్య ఉత్పత్తుల ప్రారంభం
- రూ.1,000 కోట్ల పెట్టుబడితో శ్రీసిటీలో యూనిట్

సాక్షి, అమరావతి: ప్రపంచంలోనే అతిపెద్ద ఏసీ తయారీ సంస్థ.. జపాన్‌కు చెందిన డైకిన్ ఇక నుంచి మేడిన్ ఆంధ్రా ఏసీలను విక్రయించనుంది. ఈ మేరకు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా శ్రీసిటీలో జపాన్‌కు చెందిన కంపెనీ ప్రతినిధులు, రాయబారుల సమక్షంలో నవంబర్ 23న లాంఛనంగా వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించనుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ అధికారులు వెల్లడించారు. రూ.1,000 కోట్ల పెట్టుబడితో 75.5 ఎకరాల విస్తీర్ణంలో డైకిన్ ఈ యూనిట్‌ను స్థాపించింది. గతేడాది ఏప్రిల్‌లో నిర్మాణ పనులు ప్రారంభించిన డైకిన్ రికార్డు స్థాయిలో కేవలం 18 నెలల్లోనే యూనిట్‌ను సిద్ధం చేసింది. తొలి దశలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌కు ఏటా 10 లక్షల ఏసీలను తయారు చేసే సామర్థ్యం ఉంది. ఈ యూనిట్ ద్వారా సుమారు 3,000 మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పించింది. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన యూనిట్లలో 75 శాతం నియామకాలు స్థానికులకే ఉండాలన్న ప్రభుత్వ నిబంధనకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన మానవ వనరుల కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ)తో డైకిన్ ఒప్పందం కుదుర్చుకుంది. 2020–21లో డిప్లొమా పూర్తి చేసుకున్న విద్యార్థులకు తమ సంస్థలో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించామని డైకిన్ వెల్లడించింది. ఎంపికైన ఉద్యోగులకు రూ.1.99 లక్షల వార్షిక వేతనాన్ని అందిస్తున్నట్లు తెలిపింది.




## విశాక ఇండస్ట్రీస్‌కు చెందిన రూ. 8 కోట్లు ఫ్రీజ్!



- ఆ సంస్థకు చెందిన ఖాతా నుంచి విజిలెన్స్ సెక్యూరిటీస్ ఖాతాలోకి బదిలీ
- సీఈఓ ఆదేశాలతో పోలీసుల చర్యలు

సాక్షి, హైదరాబాద్: చెన్నూరు నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక్‌కు సంబంధించిన విశాక ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఖాతా నుంచి విజిలెన్స్ సెక్యూరిటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఖాతాలోకి బదిలీ అయిన రూ.8 కోట్లు సైఫాబాద్ పోలీసులు ఫ్రీజ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) ఆదేశాల మేరకు నగర పోలీసు ఉన్నతాధికారుల సూచనలతో ఈ చర్య తీసుకున్నట్లు మధ్య మండల డీసీపీ వెంకటేశ్వర్లు ఆదివారం వెల్లడించారు. గత సోమవారం జరిగిన ఈ వ్యవహారంపై ఆ నియోజకవర్గ సిట్టింగ్ ఎమ్మెల్యే బాల్క సుమన్ బుధవారం సీఈఓకు ఫిర్యాదు చేశారు. ఈ విజిలెన్స్ కంపెనీ రామగుండంలోని వివేక్ ఇంటి చిరునామాతో ఉందని, ఆయన సంస్థ ఉద్యోగులే ఈ సంస్థ డైరెక్టర్లుగా ఉన్నారని అందులో పేర్కొన్నారు. ఈ లావాదేవీపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలని, ఎన్నికల్లో విచ్చలవిడిగా ఖర్చు పెట్టడానికే వివేక్ ఈ షెల్ కంపెనీ ఖాతా వినియోగిస్తున్నట్లు సీఈఓకు ఇచ్చిన ఫిర్యాదుతో పేర్కొన్నారు. దీంతో ఈ విషయాన్ని సీఈఓ నగర పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలోనే రంగంలోకి దిగిన సైఫాబాద్ పోలీసులు లోతుగా దర్యాప్తు చేశారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బేగంపేట బ్రాంచ్‌లో ఉన్న విశాక ఇండస్ట్రీస్‌కు చెందిన ఓ గుర్తుతెలియని ఖాతా నుంచి విజిలెన్స్ సెక్యూరిటీస్ సంస్థకు ఐడీబీఐ బ్యాంక్ బషీర్‌బాగ్ బ్రాంచ్‌లోకి బదిలీ అయినట్లు గుర్తించారు. సోమవారం ఉదయం 10.57 గంటలకు జరిగిన ఈ లావాదేవీ అనుమానాస్పదంగా ఉండటంతో సైఫాబాద్ పోలీసులు ఈ మొత్తాన్ని ఫ్రీజ్ చేయించారు. దీనిపై ఎన్నికల అధికారులతోపాటు ఆదాయపు పన్ను శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తదితర విభాగాలకు సమాచారం ఇచ్చారు. దీనిపై దర్యాప్తు చేపట్టామని, వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని డీసీపీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

## కేసీఆర్, కేటీఆర్‌ల ఉద్యోగాలు ఊడగొట్టాలి

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వహించినా పేపర్ లీక్‌లు జరిగాయి. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జాబ్ క్యాలెండర్ ప్రకారం పరీక్షలు నిర్వహించి 2 లక్షల మందికి ఉద్యోగాలిస్తాం. ప్రత్యేక రాష్ట్రంలో తమ జీవితాలు మారుతాయని ఉద్యమకారులు కలలు కన్నారు. కానీ అలా జరగలేదు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉద్యమకారుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగమిస్తాం. ఈ ఎన్నికల్లో కేసీఆర్, కేటీఆర్‌లకు ఉద్యోగాలు ఇవ్వొద్దు.

**లక్షల కోట్ల దోపిడీ..**

రాష్ట్రంలో కాళేశ్వరం, మిషన్ భగీరథ పేరిట రూ.లక్షల కోట్ల దోపిడీ జరిగింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడా వ్యాపారవేత్తలకు రుణమాఫీ చేసింది. రైతులకు మాత్రం రుణమాఫీ చేయడం లేదు. ప్రధాని మోదీ బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అవినీతిపై చర్యలు చేపట్టరు. కానీ కాంగ్రెస్ నేతలపై మాత్రం సీబీఐ, ఈడీలను ఉసిగొల్పుతారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే కాబట్టి అలా చేస్తున్నారు. వారికి ఒక తమ్ముడు ఎంఐఎం అధినేత. కేంద్రంలో బీజేపీకి, రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు ఆయన సహకరిస్తున్నారు. కాంగ్రెస్‌ను దెబ్బతీసేందుకు ఇతర రాష్ట్రాల్లో 40, 50 స్థానాల్లో పోటీ చేస్తారు. తెలంగాణలో మాత్రం 9 స్థానాల్లోనే పోటీ చేస్తున్నారు. కేసీఆర్ కర్ణాటక సర్కారుపై విమర్శలు చేస్తున్నారేగానీ.. ఇక్కడ బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్నదేమిటనేది ప్రజలకు చెప్పరు. తెలంగాణను ఎలా అభివృద్ధి చేయాలనే దానిపై కాంగ్రెస్‌కు ఒక విజన్ ఉంది. ఈసారి కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వాలి.



ఆసిఫాబాద్ బహిరంగ సభకు హాజరైన ప్రజలు

**ఆరు గ్యారంటీలు కచ్చితంగా అమలు చేస్తాం**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తాం. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఖాతాలో వేస్తాం. బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తాం. రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తాం. రైతు భరోసా కింద రైతులు, కౌలు రైతులకు ఏటా రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఇస్తాం. వరి పంటకు బోనస్‌గా రూ.500 అందజేస్తాం. గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లు లేని వారికి ఇంటి స్థలంతోపాటు రూ.5 లక్షల ఆర్థిక సాయం చేస్తాం..'' అని ప్రియాంకాగాంధీ ప్రకటించారు.

**జీతేగా ఇండియా.. అంటూ..**

క్రికెట్ ప్రపంచకప్ ఫైనల్లో ఇండియా టీమ్ గెలవా లని కోరుకుందామని, జీతేగా ఇండియా అంటూ ఖానాపూర్ సభలో ప్రియాంకాగాంధీ ప్రసంగాన్ని ప్రారంభించారు. సభికులతోనూ నినాదాలు చేయించారు. ఈ సభల కోసం ఢిల్లీ నుంచి విమానంలో మహారాష్ట్రలోని నాందేడ్‌కు వచ్చిన ప్రియాంక.. అక్కడి నుంచి మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్‌రావు చవాన్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఠాక్రేలతో కలసి హెలికాప్టర్‌లో ఖానాపూర్‌కు వచ్చారు. తర్వాత హెలికాప్టర్‌లోనే ఆసిఫాబాద్‌కు చేరుకున్నారు.

## కాళేశ్వరంపై కేసీఆర్ మౌనమేల?

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

బోనకల్: కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచ అద్భుతమని గొప్పలు చెప్పిన కేసీఆర్.. ఇప్పుడు ఆ ప్రాజెక్టులోని లోపాలపై ఎందుకు నోరు విప్పడం లేదని సీఎల్పీ నేత, మధిర కాంగ్రెస్ అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్క ప్రశ్నించారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం జానకిపురం గ్రామంలో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా మాట్లాడారు. కాళేశ్వరం నిర్మాణం పేరిట జరిగిన రూ.లక్ష కోట్ల దోపిడీని.. తాము అధికారంలోకి రాగానే కక్కిస్తామని స్పష్టం చేశారు. మేడిగడ్డ మాదిరిగానే అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కుంగిపోతాయని, నీళ్లు నింపడానికి అవి పనికిరావని జాతీయ స్థాయి అధికారులు చెప్పిన అంశంపై విచారణకు కేసీఆర్ సిద్ధమేనా? అని ప్రశ్నించారు. మిషన్ భగీరథ పేరిట బీఆర్ఎస్ పాలకులు అవినీతికి పాల్పడ్డారని, ఈ పథకం కోసం వెచ్చించిన రూ.50 వేల కోట్లు పాలకుల జేబుల్లోకి వెళ్లాయని ఆరోపించారు. కాంగ్రెస్‌ను నిలువరించేందుకు బీఆర్ఎస్, ఎంఐఎం, బీజేపీ కుమ్మక్కయ్యాయని భట్టి విమర్శించారు. కాగా, మద్యం కుంభకోణం కేసులో కవితను ఎందుకు అరెస్ట్ చేయలేదో బీజేపీ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు.



ప్రచారంలో చిన్నారిని లాలిస్తున్న భట్టి విక్రమార్క

# ఈ ఎన్నికలు జీవన్మరణ సమస్య

- మా మేనిఫెస్టోకు కేసీఆర్ రాజముద్ర వేశారు..
- మేం ప్రకటించిన గ్యారంటీలనే బీఆర్ఎస్ మేనిఫెస్టోలో పెట్టారు
- బీసీ సీఎం నినాదం ఓట్లు చీల్చే కుట్ర
- బీఆర్ఎస్‌కు మేలు చేసేందుకే బీజేపీ ఎత్తుగడ
- పార్టీ ఫిరాయించిన 12 మంది ఎమ్మెల్యేలను ఈసారి అసెంబ్లీ గేటు కూడా తాకనీయం
- కేసీఆర్ అవినీతి, అక్రమాలపై న్యాయ విచారణ జరిపిస్తాం
- 82–85 స్థానాలు గెలుస్తాం
- మీట్ ది ప్రెస్‌లో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నవంబర్ 30 తరువాత మరో ఉద్యమం రాకుండా ఉండాలంటే, తెలంగాణ నిటారుగా తలెత్తుకుని నిలబడాలంటే.. కల్వకుంట్ల కుటుంబాన్ని బంగాళాఖాతంలో విసిరేయాలని, అందుకు అన్ని వర్గాలు కలిసి రావాలని టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ ఎన్నికలను సాధారణంగా తీసుకోకుండా జీవన్మరణ సమస్యగా భావించాలని కోరారు. నిజాం నిరంకుశత్వం, సమైక్యపాలన వాసనలతో పాలించిన కల్వకుంట్ల కుటుంబంపై దళిత, బలహీన, ఉద్యోగ, నిరుద్యోగ, యువత.. ఇలా అన్ని వర్గాలు తీవ్ర అసంతృప్తితో రగులుతున్నాయని చెప్పారు. నవంబర్ 30వ తేదీతో వారి అసంతృప్తి చల్లారుతుందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో 45 శాతం ఓట్లతో 82 నుంచి 85 స్థానాల్లో విజయం సాధిస్తుందని రేవంత్ ధీమా వ్యక్తం చేశారు. హంగ్ ఏర్పడే అవకాశమే లేదన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో .. తమకు భగవద్గీత, ఖురాన్, బైబిల్‌తో సమానమన్నారు. 'అభయహస్తం'తో డాక్యుమెంట్‌ను ప్రజల ముందు ఉంచామని, సీఎం అభ్యర్థిని కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ, సీడబ్ల్యూసీ నిర్ణయిస్తుందని రేవంత్‌రెడ్డి తెలిపారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గుర్తుపై గెలిచి ఫిరాయించిన 12 మంది ఎమ్మెల్యేలను ఈసారి అసెంబ్లీ గేటు తాకనివ్వబోమన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. ప్రజలకు తమ ద్వారాలు తెరిచే ఉంటాయని, ప్రజాదర్బార్‌లు కొనసాగుతాయని పేర్కొన్నారు. తెలంగాణ జర్నలిస్టుల అధ్యయన వేదిక అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి సాధిక్ ఆధ్వర్యంలో ఆదివారంనాడిక్కడ నిర్వహించిన 'మీట్ ది ప్రెస్'లో పలు అంశాలపై వెల్లడించిన అభిప్రాయాలను ఆయన మాటల్లోనే...

**మా మేనిఫెస్టోకు రాజముద్ర..**

మేము ప్రకటించిన ఆరు గ్యారంటీలకు సీఎం కేసీఆర్ రాజముద్ర వేశారు. మేము ఆరు గ్యారంటీలు ప్రకటించాక అవి సాధ్యం కాదని రెండు నెలల కితం బీఆర్ఎస్ ప్రచారం చేసింది. ఆ తరువాత మేము ప్రకటించిన గ్యారంటీల కంటే ఎక్కువే బీఆర్ఎస్ మేనిఫెస్టోలో పెట్టింది. అంటే మా పథకాలన్నీ అమలు సాధ్యమని అక్కడే తేలింది. కేసీఆర్ అవినీతిని అరికడితే.. మేము ప్రకటించిన పథకాల కంటే ఎక్కువ పథకాలు అమలు చేయొచ్చు.

**అవినీతి, అక్రమాలపై న్యాయ విచారణ..**

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత బీఆర్ఎస్ హయంలో జరిగిన అవినీతి, అక్రమాలపై న్యాయ విచారణ జరిపిస్తాం. ప్రాజెక్టులను ఏమి చేయాలన్నది నిపుణులు నిర్ణయిస్తారు. ధరణి పేరుతో ఎన్నో అక్రమాలు చేశారు. అందులోని భాగస్వాములను జైలుకు పంపిస్తాం. ధరణిని రద్దు చేస్తాం. సీఎం హోదాలో కేసీఆర్ అబద్ధాలు చెబుతున్నారు. ప్రజాకోర్టులో శిక్ష తప్పదు. హైదరాబాద్ పరిసరాల్లోనే కల్వకుంట్ల కుటుంబం 10 వేల ఎకరాలను అక్రమంగా ఆర్జించింది.

**బీసీ, ఎస్సీల ఓట్లు చీల్చేందుకే..**


బీసీని సీఎం చేస్తామని బీజేపీ ప్రకటించడం వెనుక బలహీనవర్గాల ఓట్లను చీల్చి, కేసీఆర్‌ను సీఎం చేయడమే. ఈసారి 110 సీట్లలో డిపాజిట్లు కోల్పోయే పార్టీ సీఎంని చేస్తామనడం బీసీలను అవమానించడమే. దళితులు, బలహీనవర్గాలు సీఎం కేసీఆర్‌ను ఓడించాలని కసితో ఉన్నారు. ఆ ఓట్లు చీల్చడానికే ఈ బీసీ సీఎం, ఎస్సీ వర్గీకరణ నినాదాలు. ఎస్సీ వర్గీకరణపై చిత్తశుద్ధి ఉంటే ఆర్డినెన్స్ ఇచ్చి..వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు ఆమోదించాలి. అందుకు మందకృష్ణ ఆధ్వర్యంలోనే అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లడానికి సిద్ధం.

**అవసరమైతే ఆస్తులమ్మి అభివృద్ధి.. ప్రభుత్వ ఆదాయంతో సంక్షేమం..**

అవసరమైనప్పుడు భూములమ్మి కొత్త ఆస్తులు సృష్టిస్తాం. ప్రభుత్వ ఆదాయంతో సంక్షేమ పథకాలు అమలు చేస్తాం. బీఆర్ఎస్ ఆస్తులు అమ్మి స్నోలు, పౌడర్లకు ఖర్చు చేసింది. అనవసర నిర్మాణాలు చేపట్టం. అలాంటి వాటికి స్వస్తి పలుకుతాం. ప్రాజెక్టుల పై అంచనాలు పెంచి దోచుకున్నారు. రూ.3 యూనిట్ విద్యుత్‌ను ఇప్పుడు రూ.14కి కొంటున్నారు.

**ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా..**

ఆయా రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా పథకాలు ఉంటాయి. కేసీఆర్ అతి తెలివితో ఇతర రాష్ట్రాల్లో రూ.2 వేల పెన్షన్ ఉందా అని ప్రశ్నిస్తున్నారు. కర్ణాటకలో మహాలక్ష్మి పథకం కింద రూ. 2 వేలు, పెన్షన్ ఇస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాల్లో మెరుగ్గా ఉన్న పథకాలపై కూడా చర్చకు కేసీఆర్ సిద్ధమైతే మేము సిద్ధం. ఉచిత విద్యుత్‌పై పేటెంట్ కాంగ్రెస్‌దే. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి తొలి సంతకం ఉచిత విద్యుత్‌పైనే. రూ.1,200 కోట్లు మాఫీ చేశారు. ఇప్పుడు మేము 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తాం. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 8 నుంచి 10 గంటలు మాత్రమే ఇస్తున్నారు.



మీట్ ది ప్రెస్‌లో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

**అమరవీరుల కోసం కమిషన్..**

తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడం కోసం ఓ కమిషన్‌ను నియమిస్తాం. దీనిని కోదండరామ్ పర్యవేక్షిస్తారు. వెబ్‌సైట్ ఏర్పాటు చేస్తాం. అందులో పేర్లు నమోదు చేసుకుంటే పరిశీలించి వారందరికీ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. టీఎస్‌పీఎస్సీని రద్దు చేస్తాం, మెగా డీఎస్సీ వేస్తాం. ఉద్యోగాలన్నీ భర్తీ చేస్తాం.



ప్రేమ లేకపోవడం కాదు, స్నేహం లేకపోవడం సంతోషం లేని పెళ్లిళ్లకు కారణం.

– ఫ్రెడరిక్ నీషే



సాక్షి

సోమవారం, 20 నవంబర్ 2023

# పుస్తకం కర్ణభూషణం

పుస్తకం హస్తభూషణమన్నారు; అది చదివే పుస్తకాల గురించి! ఇప్పుడు వినే పుస్తకాలు ప్రాచుర్యాన్ని తెచ్చుకుంటూ కర్ణభూషణంగా మారుతున్నాయి. కాలం చేసే తమాషాలలో ఇదొకటి. మన జీవితమూ, ఊహలూ, ప్రణాళికలూ కాలం వెంబడి సరళరేఖలా సాగుతాయనుకుంటాం. కానీ, దృష్టి వైశాల్యాన్ని పెంచుకుని చూస్తే కాలం మళ్ళీ మళ్ళీ బయలుదేరిన చోటికే వచ్చే చక్రంలా కూడా కనిపిస్తుంది. 'కాలచక్ర'మనే మాట సర్వత్రా ప్రసిద్ధమే. పుస్తక ప్రపంచంలోకే కనుక ఒకసారి తొంగి చూస్తే, 'చదువు' అనే మాట పుస్తకంతో ముడిపడే ప్రచారంలోకి వచ్చింది. పుస్తకాలు లేని కాలంలో; లేదా, అవి జనసామాన్యానికి విరివిగా అందుబాటులోకి రాని రోజుల్లో కథలూ, కవిత్వాలూ, ఇతరేతర జ్ఞానాలూ అన్నీ వినుకలి ద్వారానే అందేవి. దీర్ఘకాలంపాటు ప్రపంచవ్యాప్తంగా సమస్త వాఙ్మయమూ చక్షురక్షరాల మధ్య కాకుండా; వక్తకీ, శ్రోతకీ మధ్య ప్రవహిస్తూ మౌఖిక వాఙ్మయమనే ముద్ర వేసుకుంది. పుస్తక వ్యాప్తితోనే లిఖిత సాహిత్యమన్న మాట వాడుకలోకి వచ్చింది.

కాలచక్రం మళ్ళీ మొదటికొచ్చి, పుస్తకమనే 'పఠన' మాధ్యమం స్థానాన్ని, ఇయర్ ఫోన్ రూపంలో తిరిగి వెనకటి 'శ్రవణ' మాధ్యమం ఆక్రమించుకుంటున్నట్టు తోస్తోంది. నేటి యువత పుస్తకాన్ని చదవడం కన్నా, వినడాన్ని ఎక్కువ ఇష్టపడుతున్నట్టు కనిపిస్తోంది. ఆ విధంగా, 'పుస్తకాలు లేని గది ఆత్మలేని దేహ'మన్న సిసిరో సూక్తిని కొంత సవరించుకోవలసిన అవసరమూ కలుగుతోంది. కనుకలి నుంచి వినుకలికి మారినప్పుడు పుస్తకం కలిగించే అనుభూతి గాఢతలోనూ మార్పు వస్తుందా అన్నది అనుభవంతో మాత్రమే చెప్పగలం. ఏదైనాసరే అంతిమంగా అలవాటు పడడంలోనే ఉంటుంది. మాధ్యమం ఎలాంటిదైనా పుస్తకానికీ మస్తకానికీ పడిన పీటముడి స్థిరమూ, శాశ్వతమనీ మాత్రం నిస్సంశయంగా చెప్పవచ్చు. రాబోయే కాలం అనూహ్యంగా మన అంచనాలను తలకిందులు చేస్తే తప్ప పుస్తకాలతో మన సహజీవనం మరికొన్ని తరాలపాటు నిరాఘాటంగా కొనసాగుతుందనే అనుకోవచ్చు.

కాపురంలోలానే పుస్తకాలతో కాపురంలోనూ చేదూ, తీపీ కలగలిసే ఉంటాయి. పుస్తక ప్రియులు వియ్యమందితే ఒక్కోసారి సొంతింటి పుస్తక వారసత్వానికీ, సొంత సేకరణకూ అదనంగా అత్తింటి పుస్తక వారసత్వమూ అంది, పుస్తకాలు ఇబ్బడి ముబ్బడై అల్మైరాలను దాటిపోయి నేల మీద పరచుకుంటూ ఉంటాయి. పుస్తెతోపాటు సంక్రమించిన పుస్తక సంపదా ఇల్లాలికి దినదిన సమస్య అవుతూ ఉంటుంది. పుస్తకాలతో జీవించడం కూడా ఒక పుస్తకానికి సరిపోయే ఇతివృత్తమవుతుంది. బాల్యం నుంచి, వార్ధక్యం వరకూ మనతో ఉండే పుస్తకాలు, ఒక్క పుట కూడా తెరవకుండానే, ఆయా వయోదశల మీదుగా మన అభిరుచులలో వచ్చే తేడాలను బోధిస్తాయి. మనకు పనికిరానివని పక్కన పెట్టిన పుస్తకాలే క్రమంగా మన చదువుల బల్లకెక్కి వెక్కిరిస్తాయి. మన హస్తస్పర్శ కోసం ఏళ్ల తరబడి మౌన తపస్సు చేసే పుస్తకాలే, ఒక్కసారి తెరవగానే అద్భుత ప్రపంచంలోకి మనల్ని లాక్కుపోతాయి. మన ప్రయాణం ఆగినా పుస్తక ప్రయాణం కొనసాగుతూనే ఉంటుంది.

కవిత్వానికి ఏదీ అనర్హం కాదని మహాకవి ఉగ్గడించినట్టుగా, చరిత్ర శోధనకూ ఏదీ అనర్హం కాదు. పుస్తక చరిత్రనే తవ్వితే అది కూడా ఎన్నో అవతారాలు ఎత్తుతూ నేటి దశకు వచ్చిన సంగతి అర్థమై రేపటి అవతారం గురించిన దిగులు, గుబుళ్లను తగ్గిస్తుంది. పుస్తకం గురించిన ఊహ క్రీస్తుపూర్వం నాలుగవ సహస్రాబ్ది నాటికే ఉండేది. ప్రాచీన ఈజిప్టు వాసులు మధ్య ఆఫ్రికా, నైలునదీ లోయల్లో పెరిగే 'పెపారస్' అనే నీటిమొక్క నుంచి తీసిన మెత్తని బెరడును రాతకు, చిత్రలేఖనానికి ఉపయోగించేవారు. ఈ 'పెపారస్' పేరే 'పేపర్'గా మారి ఇప్పటికీ వ్యవహారంలో ఉంది. ఆంగ్లంలో 'బుక్' అనే మాట పుట్టుకా ఇంతే ఆసక్తికరం. యూరప్, ఆసియా అడవుల్లో పెరిగే 'బచ్' అనే చెట్టు తాలూకు తెల్లని బెరడును రాతకు ఉపయోగించేవారు. నేటి ఇండో–యూరోపియన్ భాషలకు మాతృక అయిన ప్రోటో–ఇండో–యూరోపియన్ లోని 'భెరెగ్', 'భగో' అనే మాటలే వివిధ పుత్రికాభాషల్లో 'బచ్' గానూ, 'బీచ్' గానే కాక; ఇంకా అనేక రూపాంతరాలు చెందుతూ చివరికి 'బుక్'గా మారాయి. ప్రాచీన భారతదేశంలో రాతకు ఉపయోగించిన 'భూర్జపత్ర'మనే సంస్కృత శబ్ద మూలాలు కూడా 'భెరెగ్' అనే ప్రోటో–ఇండో–యూరోపియన్ పదంలోనే ఉన్నాయి. క్రీస్తుశకం తొలి శతాబ్దంలో రోమన్లు శిక్షాస్మృతుల రాతకు గొర్రె, మేక చర్మాన్ని వినియోగించేవారు. క్రమంగా తాటియాకులు, రాగిరేకులు రాతకు ఆలంబనమయ్యాయి. క్రీస్తుశకం 2–5 శతాబ్దుల మధ్యలో వచ్చినట్టు చెబుతున్న 'డైమెండ్ సూత్ర' తొలి ముద్రితగ్రంథమంటారు. ఇక 15వ శతాబ్దిలో జోహానెస్ గూటెన్‌బర్గ్ కనిపెట్టిన ముద్రణ యంత్రం పుస్తక ప్రచురణను విప్లవీకరించడం, 16వ శతాబ్దిలో రిచర్డ్ ముల్‌కాస్టర్ అనే పండితుడు ఎనిమిదివేల మాటలతో తొలి నిఘంటువును ప్రచురించడం వగైరాలు ఇటీవలి చరిత్ర. ఎప్పటికప్పుడు పరిమిత సంఖ్యలో పుస్తకాలను ప్రచురించుకునే నేటి అవకాశాన్ని (ప్రింట్–ఆన్ –ఆర్డర్) ఫ్రెడరిక్ ఫో అనే సైన్సు ఫిక్షన్ రచయిత 1966లోనే ఊహించాడు.

ఇంతకీ ఈ పుస్తక స్మరణ దేనికంటే, రెండు తెలుగు రాష్ట్రాలలోనూ పుస్తకాల పండుగ సమీపిస్తోంది. కొన్ని రోజులపాటు జరిగే ఈ పండుగకు ముద్రాపకులు, విక్రేతలు, రచయితలు సమధికోత్సాహంతో సిద్ధమవుతున్నారు. ముద్రిత గ్రంథాల భవిష్యత్తు పట్ల ప్రస్తుతానికి అదే కొండంత భరోసా.

# కాలశకలమై మిగిలిన జ్ఞాపకం

కామెంట్



కరణ్ థాపర్

**సీజర్ విషయంలో జరిగినట్లే ఇందిరా గాంధీకీ జరిగింది! ఆమె మంచి అంతా ఆమె చితాభస్మంతో పాటుగా నీటిలో కలిసిపోయింది. మనం గుర్తుపెట్టుకున్నది చెత్తను మాత్రమే! ఇండో–పాక్ యుద్ధంలో పాకిస్తాన్‌ను భారత్ ఓడించిందనీ, బంగ్లాదేశ్ ఆవిర్భవించిందనీ శ్రీమతి గాంధీ ప్రకటించిన రోజు ఈనాటికీ ఎంతో ఉత్తేజభరితమైనది. ఆ తర్వాతి రోజో, లేక ఆ మర్నాడో ఆమె పీఎల్–480 ఆహార సహాయ ఒప్పందాన్ని నిష్కర్షగా తిరస్కరిస్తూ ప్రెసిడెంట్ నిక్సన్‌కు లేఖ రాయడం అమెరికా పక్షపాత వైఖరికి దీటైన సమాధానం. అయినప్పటికీ నాటి ఇండో–పాక్ యుద్ధంలో భారత్ ఘన విజయానికి కారకుడిగా ఈరోజున మనం శామ్ మానెక్‌షాను సరిగ్గానే కీర్తిస్తున్నాం కానీ, అందులో శ్రీమతి గాంధీ పాత్రను మాత్రం అన్యాయంగా తిరస్కరిస్తున్నాం.**

ఒకవేళ నేటికీ ఆమె సజీవంగా ఉండి ఉంటే, తన 106 ఏళ్ల వయసులో ఉండేవారు (నవంబర్ 19న జయంతి). ఆమె హత్యకు గురయ్యారన్న నాలుగు దశాబ్దాల నాటి వాస్తవం నేడొక వెలిసిపోయిన జ్ఞాపకంగా మాత్రమే మిగిలినప్పుడు ఇందిరాగాంధీని నేనిలా గుర్తు చేసుకోవడం చిత్రమైన సంగతే. అయితే సఫ్దర్‌జంగ్ రోడ్డులోని ఆమె స్మారక చిహ్నాన్ని సందర్శించే అసంఖ్యాక జనసమూహానికి అదొక పర్యాటక ఆకర్షణ. తక్కిన మనందరికీ గతించిపోయిన కాల శకలం. ఎమర్జెన్సీ (అత్యవసర పరిస్థితి) తప్ప, మరేదీ మన మదిలో లేనిది.

తొలిసారి నేనామెను నిబిడాశ్చర్యంతో చూశాను. అది 1975. ఎమర్జెన్సీ పరిస్థితులు పరాకాష్ఠకు చేరుకుని ఉన్న సమయం. నిజానికి నేనొక పురుషాధిపత్య స్వభావం కలిగిన ఒక మహిళను చూడబోతున్నాననే అనుకున్నాను. కానీ ఆమె సొగసుగా, స్నిగ్ధంగా ఉన్నారు. ఆమెలో నాకు అత్యంత స్పష్టంగా గుర్తున్నవి ఆమె చేతులు. అవి సన్నగా, కోమలమైన ఆకృతిని కలిగి ఉన్నాయి. ఒక నియంతలో అవి నేను ఊహించనివి. అప్పటికి నాలుగేళ్ల క్రితం 'ది ఎకనమిస్ట్' ఆమెను భారత సామ్రాజ్ఞి అని అభివర్ణించింది. ఆమె మణికట్టుకు మగవారి చేతివాచీ ఉన్నప్పటికీ ఒక రాకుమారిలోని సౌకుమార్యం ఆమెలో ఉట్టిపడుతూ ఉంది.

అయినప్పటికీ ఆమె అతి సామాన్యంగా ఉండేవారు. ఎమర్జెన్సీ సమయంలో ఒక ఆదివారం నేను, మా అక్కచెల్లెళ్లు... గాంధీలతో కలిసి రాష్ట్రపతి భవన్‌లో 'ద పింక్ పాంథర్'ను చూసేందుకు వెళ్లడానికి ముందు అంతా కూర్చొని అల్పాహారం తీసుకుంటూ, పూర్తిగా మాటల్లో మునిగిపోయాం. శ్రీమతి గాంధీ ఒక్క ఉదుటన ''పదండి, పదండి...'' అనేంత వరకు కూడా సమయం మించిపోతున్నట్లు మేము గమనించనే లేదు. ''ఇప్పటికే మనం లేట్ అయ్యాం. ఎవరైనా ఒకటికి వెళ్లాలనుకుంటే ఇప్పుడే వెళ్లిరండి'' అని కూడా ఆమె అన్నారు.

అప్పుడు మా ప్రమీలక్క, ''ప్రచారంలో ఉండగా ఒకటికి వెళ్లవలసి వచ్చినప్పుడు మీరేం చేశారు?'' అని శ్రీమతి గాంధీని అడిగారు. మా మాటకు ఆమె... ''రాత్రి పడుకునే ముందు చివరిగా నేను చేసే పని కడుపునిండా నీళ్లు తాగడం. దాంతో ఉదయానికంతా నా సిస్టమ్ ఖాళీ అయిపోతుంది. తర్వాత ఒకటికి వెళ్లే అవసరమే ఉండదు'' అని చెబుతూ, ''మగవాళ్లలా నేను చెట్టు వెనక్కు వెళ్లలేను కదా'' అని నవ్వారు.

ఏమైనా సీజర్ విషయంలో జరిగినట్లే, ఆమె మంచి అంతా ఆమె చితాభస్మంతో పాటుగా నీటిలో కలిసిపోయింది. మనం గుర్తుపెట్టుకున్నది చెత్తను మాత్రమే! నా జ్ఞాపకాలలో 1971 డిసెంబర్ 16 నాటి ఉత్తేజం నేటికింకా స్పష్టంగా ఉంది. ఇండో–పాక్ యుద్ధంలో పాకిస్తాన్‌ను భారత్ ఓడించిందనీ, బంగ్లాదేశ్ ఆవిర్భవించిందనీ శ్రీమతి గాంధీ ప్రకటించిన రోజు అది. ఆ తర్వాతి రోజో, లేక ఆ మర్నాడో ఆమె పీఎల్–480 ఆహార సహాయ ఒప్పందాన్ని నిష్కర్షగా తిరస్కరిస్తూ ప్రెసిడెంట్ నిక్సన్‌కు లేఖ రాసినప్పుడు అమెరికా పక్షపాత వైఖరికి దీటైన సమాధానం ఇచ్చారని నా పదహారేళ్ల వివేచనకు అనిపించింది. నాటి ఇండో–పాక్ యుద్ధంలో భారత్ ఘన విజయానికి కారకుడిగా ఈరోజున మనం శామ్ మానెక్‌షాను సరిగ్గానే కీర్తిస్తున్నాం కానీ, అందులో శ్రీమతి గాంధీ పాత్రను మాత్రం అన్యాయంగా తిరస్కరిస్తున్నాం.

విదేశాలలో ఇందిరా గాంధీ నెలకొల్పిన భారతదేశ ప్రతిష్ఠను చూసి గర్వించిన తరం నాది. 1960ల మధ్యలో లిండన్ జాన్సన్ పక్కన చక్కటి దుస్తులలో, తీరుగా కత్తిరించిన ఒత్తయిన జుత్తుతో ఇందిరా గాంధీ నిలబడి ఉండగా ఫొటో తియ్యడం ఆ ఫొటోగ్రాఫర్ జన్మకు ధన్యత అనే చెప్పాలి. శ్వేతసౌధం పచ్చిక బయళ్లలో తీసిన ఆ ఫొటోల కంటే మెరుగ్గా మళ్లీ ఎవరైనా తియ్యడం అసాధ్యం అనుకున్నాను.

అయితే అది 1982లో లండన్‌లో జరిగిన ఫెస్టివల్ ఆఫ్ ఇండియా ప్రారంభోత్సవంలో నేను ఆమెను చూసేంత వరకే! ఆ కార్యక్రమంలో మార్గరెట్ థాచర్‌తో కలిసి నడుస్తున్నప్పుడు ఇందిరా గాంధీ ఆహార్యాన్ని చూసి ప్రేక్షకులు హర్షాతిరేకాలను వ్యక్తం చేశారు. జామావర్ షాల్‌తో తయారైన అద్భుతమైన కోటును ధరించి ఉన్నారామె. ఆమెను అలా చూసి నా మనసు పాతకాల రోజులలో నేను చదువుకున్న ఎనోబార్బస్ వర్ణనను గుర్తు చేసింది. ''వయసు ఆమెను వడలిపోనివ్వదు. సంప్రదాయం ఆమె అనంతమైన వైవిధ్యాన్ని నశించనివ్వదు'' అంటాడు ఎనోబార్బస్, క్లియోపాత్ర గురించి!



లండన్‌లో మార్గరెట్ థాచర్‌తో ఇందిరా గాంధీ



ఇందిరతో సేనాపతి శామ్ మానెక్‌షా

1977లో ఇందిరా గాంధీ సార్వత్రిక ఎన్నికలను నిర్వహించడానికి కారణం ఏమిటి? బహుశా అది ఆమె గురించి ఎప్పటికీ విడివడని ముడి కావచ్చు. ఆ ఎన్నికలకు ఇంకో ఏడాది సమయం ఏమీ లేకపోవచ్చు. కానీ వాటిని వాయిదా వేయగల సామర్థ్యం ఆమెకు లేకపోతే కదా! ఎన్నికలకు ఆమెను బలవంతం చేసే బయటి శక్తులు కూడా ఏమీ లేవు. కాబట్టి ఆమె తన మనస్సాక్షి ప్రకారం ముందుకు వెళ్లారని అనుకోవాలా? లేక ఎమర్జెన్సీ విధించినందుకు ఆమెలో పశ్చాత్తాపం కలిగిందా? లేదంటే, ఎమర్జెన్సీ చాలా కాలం సాగిందన్న విషయాన్ని ఆమె అంగీకరించి ఉంటారా? వేర్వేరు వ్యక్తులు ఈ ప్రశ్నలకు భిన్నమైన సమాధానాలు ఇచ్చారు. వాటిల్లో ఒక్కటి కూడా సబబైన జవాబుగా అనిపించదు.

నిజానికి ఇంకా లోతైన ప్రశ్న ఉంది. ఆ ఎన్నికలలో తను విజయం సాధించగలనని ఆమె భావించి ఉంటారా, లేదా తనొక ఘోర పరాజయం వైపు వెళుతున్నానన్న అవగాహనను ముందే కలిగే ఉన్నారా? జరగబోయేదేమిటో తెలిసి కూడా విధిని ఆమె స్వాగతించారా? అది తనకు తను విధించుకున్న శిక్షా? ఎమర్జెన్సీ అనే పాపానికి చేసుకున్న పరిహారమా?

ఇందిరా గాంధీ తర్వాత కూడా మనకు బలమైన పాలకులు వచ్చారు. చక్కటి వస్త్రధారణతో మనల్ని ముగ్ధుల్ని చేసిన అనేకమంది ప్రధానులూ ఉన్నారు. అందరిలోకి ఇందిరా గాంధీ ఒక్కరే ప్రత్యేకమైన వారిగా ఎందుకు నిలిచారు? బహుశా అలా అనిపించడం యవ్వనంలోని జ్ఞాపకాలు జమ చేసుకుని ఉంచుకున్న అవ్యక్త గతానుభూతులు ప్రతిధ్వనించడం వల్లనా? మనోవైజ్ఞానిక నిపుణులు, తత్త్వవేత్తలు దీనికి మెరుగైన వివరణ ఇవ్వగలరనుకుంటాను. నేను చెప్పగలిగింది మాత్రం ఒక్కటే – అలాగని ఏదో చెప్పాలని చెప్పడం కాదు – నేను ఏమనుకుంటానంటే ఆమెలో ఏదో లేకుండానైతే లేదని!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

### పట్టించుకోవద్దా?



కొన్నేళ్ల క్రితం, ప్రిన్స్ అనే చిన్న బ్బాయి లోతైన బోరు బావిలో చిక్కుకున్నప్పుడు, వెలికితీత గురించి భారత మీడియా నాన్‌స్టాప్‌గా నివేదించింది. ఇప్పుడు 40 మంది కార్మికులు చార్‌ధామ్ ప్రాజెక్టు(ఉత్తరాఖండ్)లోని సొరంగంలో వారం రోజులుగా చిక్కుకుని ఉన్నారు. అయినా ఎక్కువ శాతం మీడియా మౌనంగా ఉంది. భద్రతా నియమాలను ఉల్లంఘించి, సొరంగం పనులు చేశారు. నిజంగా ఇండియా మారిపోయింది.

– సందీప్ మనుధానె, విద్యావేత్త

### కారణమేంటి?



ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ (జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే)–5 (నాది కాదు) ప్రకారం, 'మహిళల కన్నా పురుషులు చికెన్, మాంసం, చేపలు తినకుండా ఉండటం తక్కువ'. మొత్తంగా 29 శాతం మహిళలు, 17 శాతం పురుషులు తమను తాము 'శాకాహారులు'గా గుర్తించుకుంటున్నారు. అంటే మహిళలు ఎక్కువ 'పవిత్రులా'? లేదా ఇది వివక్షకు సంబంధించినదా? పరిశోధకులు దీన్ని ఎందుకు అధ్యయనం చేయరు?

– సిల్వియా కర్పగం, వైద్యురాలు

### స్వీయ విమర్శ మేలు



ఆధ్యాత్మికత అసలు ఉద్దేశం స్వీయ క్రమశిక్షణ. ఇతరులను విమర్శించే బదులు మనల్ని మనం తరచి చూసుకోవాలి. నా కోపం, నా అనురక్తి, నా గర్వం, నా అసూయ గురించి నేను ఏం చేస్తున్నాను అని ప్రశ్నించుకోవాలి. రోజువారీ జీవితంలో మనం పరిశీలించుకోవాల్సిన విషయాలు ఇవి.

– దలై లామా, బౌద్ధగురువు

### అనారోగ్య ప్రపంచం



మనకు అవసరమైన విటమిన్లు, ఖనిజ లవణాలను ఇచ్చే ఆహార వ్యవస్థను క్రిమిసంహారకాలపై ఆధారపడే విషపూరిత ఆహార వ్యవస్థగా మార్చారు. అయినా ఎవరూ దీని గురించి చింతించడం లేదు. ఎందుకు?

– విజయ్ పటేల్, వ్యాఖ్యాత

### మిగులుతాయా?



ఇండిగో విమానంలో ప్రయాణించినప్పుడల్లా, సీట్లలోంచి కొంచెం మెత్తను ఎవరో తీసేస్తున్నట్టూ, మునుపటి కంటే సీట్లు చదును అవుతున్నట్టూ అనిపిస్తుంటుంది. బడుల్లోని గట్టి కలప బెంచీల్లా ఎప్పుడు అవుతాయా అని ఎదురు చూస్తున్నా.

– మేఘనాథ్, రచయిత

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

# మానవ శ్రేయోభిలాషి

స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని పేరు ప్రఖ్యాతులు గడించిన తెలుగువారు ఎందరో ఉన్నారు. వారిలో డాక్టర్ గరిమెళ్ల నారాయణ ఒకరు. 1933 నవంబర్ 18న ప్రస్తుతం కాకినాడ జిల్లాలోని పెదపూడి మండలం గండ్రేడు గ్రామంలో జన్మించారు. స్వాతంత్ర్య సమర యోధులైన తండ్రి సత్యవీరభద్రరావు జంధ్యం తీసేసిన సామాజిక వాది. 1930 ఉప్పు సత్యాగ్రహ ఉద్యమ సమయంలో బ్రిటిష్ పోలీసుల చేత చిక్కినప్పుడు, ఆయన గుప్పెట్లో ఉప్పు ఉంది. ఆ ఉప్పును పడవేయమని పోలీసులు చితకబాదినా ఆ పని చెయ్యలేదు. అటువంటి కుటుంబం నుంచి వచ్చారు నారాయణ.



డా॥ గరిమెళ్ల నారాయణ

ఆయనకు ఫ్రెంచ్ విప్లవం అంటే మక్కువ. భగత్‌సింగ్ అంటే ఎంతో ప్రేమ. సేవాగ్రామ్‌లో గాంధేయ సంస్థలలో ఖాదీ గ్రామీణ పరిశ్రమల మేనేజ్‌మెంట్ కోర్సు చేసి హైదరాబాద్‌లో 'ఖాదీ గ్రామోద్యోగ్'లో చేరారు. ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీని వ్యతిరేకించారు. లోకనాయక్ జయప్రకాష్ నారాయణ్ ప్రతిపాదించిన 'సంపూర్ణ క్రాంతి విప్లవం' చాలా అవసరమని భావించారు.

నారాయణ కుల నిర్మూలన, భాషల మధ్య సుహృద్భావం; లింగ వివక్ష, అవినీతి వ్యతిరేక, మద్యపాన నిషేధ, అశ్లీల వ్యతిరేక, హరిజన గిరిజన, వికలాంగుల సంక్షేమానికి సంబంధించిన అనేక ఉద్యమాలలో పాల్గొన్నారు. పంచాయతీ రాజ్, ప్రజాస్వామ్యం, మానవ హక్కులు చాలా అవసరమనే వీరు అరుణా రాయ్‌తో సమాచార హక్కు ఉద్యమంలో పాల్గొన్నారు. వీరు 'జై మానవ్' ఉద్యమంలో పాల్గొని సమాజం సమూలంగా మారాలి, మరింత ఉన్నతంగా మనిషి ఎదగాలి; ఆ దిశలో మనం యువతను తీర్చిదిద్దాలి అని తపించేవారు! దాదాపు 90 సంవత్సరాలు నిండు జీవితాన్ని గడిపిన గరిమెళ్ళ నారాయణ తన 90వ జన్మదినానికి కాస్త ముందుగా ఇటీవల 2023 అక్టోబర్ 6న ముంబైలో కన్నుమూశారు. నాకు మాత్రం ఆయన ఎన్నో సార్లు చెప్పిన ఓ సంగతి పదే పదే గుర్తుకు వస్తుంది. గాంధీజీ ఎంపిక చేసిన, దండి సత్యాగ్రహంలో పాల్గొన్న 78 మంది బృందం ఫోటోలు ముంబైలోని ఐఐటీలో ఉన్నాయి కానీ, ఒకే ఒక తెలుగు వ్యక్తి ఎర్నేని సుబ్రహ్మణ్యం చిత్రం మాత్రం అందులో లేదట!

– డా॥ నాగసూరి వేణుగోపాల్, ఆకాశవాణి విశ్రాంత ఉన్నతాధికారి

# యుద్ధజ్వాలల్లో బుగ్గి అవుతున్న బాల్యం

అభిప్రాయం



డా॥ మహ్మద్ హసన్

ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలు బాలలకు ప్రాణ సంకటం అయ్యాయి. రష్యా – ఉక్రెయిన్, హమాస్ – ఇజ్రాయెల్ యుద్ధాలు ఇందుకు తాజా ఉదాహరణలు. పాలస్తీనాలోని 'గాజా' కేంద్రంగా పరిపాలిస్తున్న 'హమాస్' అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై అకస్మాత్తుగా సుమారు ఆరు వేల మోర్టార్ షెల్స్‌ను, రాకెట్లను ప్రయోగించటం వల్ల ఇజ్రాయిల్ సైన్యం పాలస్తీనాపై యుద్ధం ప్రకటించింది. ఈ నెలన్నర రోజుల యుద్ధంలో చిన్నపిల్లలే అధికంగా చనిపోయారు. ఇప్పటి వరకు అధికారికంగా పాలస్తీనా నుండి పది వేల మందికి పైగా మరణించారని పాలస్తీనా ఆరోగ్య శాఖ తెలియజేసింది. అందులో చిన్న పిల్లల మరణాలు సుమారు ఐదు వేలు దాటినట్లు నివేదికలు తెలియజేస్తున్నాయి.

ప్రస్తుతం గాజాలో డెబ్బై ఐదు శాతం భవనాలు పూర్తిగా ధ్వంసం కాగా, యాభై శాతం పైగా పాఠశాల భవనాలు ధ్వంసం అయినట్లు అధికారుల అంచనా. శిబిరాలలోని బాధితులకు తాగునీరు, ఆహారం దొరకక ఆహార నిల్వల కేంద్రాలను లూటీ చేస్తున్నారంటే పరిస్థితి ఎంత హృదయ విదారకంగా ఉందో గమనించవచ్చు. ప్రస్తుతం పాలస్తీనాలోని ఆస్పత్రులు, అంబులెన్సులు, శరణార్థి శిబిరాలు, పాఠశాలలపై బాంబుల వర్షం కురిపించిన ఇజ్రాయెల్ సైన్యం అంతర్జాతీయంగా ఒత్తిడి ఎదుర్కొంటోంది. పత్రికా విలేకరులనూ, ఐక్యరాజ్య సమితి నిర్వహించే శరణార్థి శిబిరాలలో సహాయం చేస్తున్న ఉద్యోగులనూ, స్వచ్ఛంద సంస్థల వాలంటీర్లను కూడా వదలకుండా బాంబుల వర్షం కురిపిస్తోందంటే ఇజ్రాయెల్ సైన్యం ఎంతటి మానవ విధ్వంసానికి పాల్పడుతోందో అర్థం చేసుకోవచ్చు.



ఈ యుద్ధంలో బాంబుల దాడిలో వికలాంగులుగా మారిన పిల్లల, తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లల మానసిక స్థితి దారుణంగా మారుతోందని ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేస్తోంది. యుద్ధం కారణంగా కూలిపోయిన తమ ఇండ్లనూ, అక్కడే వదిలిన పుస్తకాలనూ, వారు ఆడుకున్న ఆట వస్తువులనూ, చనిపోయిన తల్లితండ్రులనూ బడులలోని జ్ఞాపకాలనూ తలచుకుంటూ చాలామంది నిద్రకు దూరమవుతున్నారనీ, చికిత్స పొందేటప్పుడు కూడా అక్కడి హాహాకారాలతో కూడిన దృశ్యాలు చూసి శాశ్వత నిద్రలోకి జారుకొంటున్నారనీ చెబుతున్నారు. బ్రతికున్న పిల్లలు ప్రస్తుతం ప్రత్యక్ష నరకం చూస్తున్నారని యునిసెఫ్ ప్రతినిధి జేమ్స్ ఎల్డర్ అంటున్నారు.

పాలస్తీనా కోలుకోవడానికి కొన్ని దశాబ్దాలు పట్టవచ్చు. చనిపోయిన చిన్నారుల ప్రాణాలను మాత్రం ఎవరూ తిరిగి తీసుకొని రాలేరు. ఆ పిల్లలు ఆ ప్రాంతంలో పుట్టడమే నేరమా? తరగతి గదిలోనో, అమ్మ ఒడిలోనో ప్రశాంతంగా ఆడుకునే పసికూనలు వారు. ప్రస్తుతం గాజాలో 16 ఏళ్లలోపు చిన్నారులు 8 లక్షల దాకా ఉండొచ్చని అంచనా. వారంతా యుద్ధాన్ని ప్రత్యక్షంగా చూస్తున్న వారే! అంటే భవిష్యత్తులో వారి మానసిక స్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇక యుద్ధంలో మరణించిన తల్లితండ్రులను మర్చిపోవటం వారికి అంత సులువైన విషయం కూడా కాదు. భవిష్యత్తులో వారి రక్షణ, పోషణ ఎవరు చూసుకుంటారనేది ప్రశ్నార్థకంగా మారింది. అలానే పిల్లల్ని కోల్పోయిన తల్లితండ్రులు కూడా మానసికంగా కుంగుబాటుకు లోనయ్యే ప్రమాదం ఉంది.

గాజాలో ఈ నెల రోజుల్లోనే సుమారు 5,500 మంది చిన్నారులు జన్మించినట్లు, ప్రస్తుతం ఆసుపత్రుల్లో 50 వేల మంది గర్భిణులు ఉన్నట్లు 'యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్' వెల్లడించింది. బాలింతలకు పౌష్టికాహారం మాట అటుంచితే రెండు పూటలా తిండి దొరకడం కష్టంగా ఉందనీ, ఈ పరిస్థితుల్లో పుట్టిన శిశువులు భవిష్యత్తులో పౌష్టిక ఆహార లోపాన్నీ, ఇతర రుగ్మతలనూ ఎదుర్కోవాల్సి వస్తుందనీ, అలాగే యుద్ధం ద్వారా వెలువడిన వివిధ రకాల రసాయనాలు కూడా పిల్లలపై చెడు ప్రభావం చూపే అవకాశం ఉందనీ డాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


సర్వం కోల్పోయిన ఈ పిల్లలు భవిష్యత్తులో మళ్ళీ హింసాత్మక మార్గం వైపు మళ్ళే అవకాశం కూడా లేకపోలేదని మానసిక విశ్లేషకుల అంచనా. ప్రస్తుతం అంతర్జాతీయ సమాజం ఏం చేయాలనేది ప్రశ్న. ఇజ్రాయెల్, పాలస్తీనాల మధ్య జరుగుతున్న యుద్ధాన్ని తాత్కాలికంగా విరమింపజేసేలా ప్రపంచ దేశాలు ఇద్దరిపై ఒత్తిడి చేయాలి. వినని పక్షంలో ఆంక్షలు విధించే ఏర్పాటు చేయాలి. అంతర్జాతీయ చట్టాలకు లోబడి పాలస్తీనా వారు, ఇజ్రాయెల్ ప్రభుత్వం కట్టుబడి ఉండేలా ఐక్య రాజ్యసమితి చొరవ తీసుకొని శాంతి స్థాపనకు కృషి చేయాలి. 1947లో ఐక్యరాజ్య సమితి ప్రతిపాదించిన 181వ తీర్మానం ప్రకారం ఇజ్రాయెల్ ఆక్రమించిన పాలస్తీనా భూభాగాలను అప్పగించి యథాతథ స్థితిని అమలు చేసి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా చర్యలు చేపట్టాలి. ఒక వైపు ఇజ్రాయెల్‌కు మద్దతుగా అమెరికా తన యుద్ధనౌకలను పంపి మరొక వైపు శాంతి చర్చల పేరిట హడావిడి చేయడం దాని ద్వంద్వ నీతికి తార్కాణం.

వ్యాసకర్త రాజనీతి శాస్త్ర అధ్యాపకులు । 99080 59234

# పరోపకారం

ఓ ఆశ్రమంలో గురువుగారు శిష్యులకు ఈ భూమిపై జన్మించినందుకు ఎంతో కొంత ఇతరులకు ఉపయోపడాలని బోధిస్తూ 'పరోపకారార్థం ఇదం శరీరం' అన్న మన ప్రాచీన సూక్తిని ఉద్ఘాటించారు.

''నాయనలారా! ప్రకృతిలో ప్రతి జీవీ తాను బతుకుతూ తనకు తెలియకుండానే ఇతర జీవులకు సాయం చేస్తోంది. చెట్లు ఇతర జీవులకు ఆహారాన్ని ఇవ్వడమే కాక నీడనూ ఇస్తున్నాయి. ఆ విధంగా ప్రతి జీవీ సృష్టి మనుగడలో తన వంతు పాత్రను పోషిస్తున్నాయి. కానీ ఆలోచించగలిగిన మనిషి మాత్రం పరోపకారం పట్ల అశ్రద్ధగా ఉంటున్నాడు. ఈ శరీరం పరోపకారార్థానికే అనే నిజాన్ని తెలుసుకుని చేతనైన రీతిలో సాయం చేస్తూ గడిపితేనే జీవితానికో అర్థం, పరమార్థం ఉంటాయి. ఈ విషయంలో మనందరం మయూరధ్వజుని ఆదర్శంగా తీసుకోవాలి.





ధర్మరాజు అశ్వమేధయాగం చేస్తూ వదిలిన యాగాశ్వాన్ని మయూరధ్వజుడనే రాజు బంధించాడు. అతడు కృష్ణ భక్తుడు. అలాగే గొప్ప పరోపకారి కూడా! అందువల్లనే అతడిని యుద్ధంలో శ్రీకృష్ణార్జునులు ఇరువురూ జయించలేకపోయారు. అతడిని ఎందుకు జయించలేకపోతున్నామని అర్జునుడు కృష్ణుణ్ణి అడిగాడు.

సమాధానంగా మరుసటి రోజు పేద బ్రాహ్మణుని రూపంలోకి మారిన కృష్ణుడు అర్జునుణ్ణి కూడా మారువేషంలో మయూరధ్వజుని దగ్గరకు తీసుకువెళ్లాడు. తన ఆతిథ్యాన్ని స్వీకరించమని మయూరధ్వజుడు వారిని కోరాడు. అప్పుడు అడవిలో ప్రయాణిస్తున్న తన కుమారునిపై దాడి చేసిన పులి సగం శరీరాన్ని తినేసిన తర్వాత అశరీరవాణి వినిపించిందనీ, సగం శరీరం ఎవరిదైనా తీసుకొచ్చి ఆ పులికి పెడితే తన కుమారుడు బతుకుతాడని చెప్పిందనీ కృష్ణుడు అంటాడు. 'ఈ నాటికి కదా ఈ దేహానికి సార్థకత ఏర్పడింది' అని సంతసించి వెంటనే తన భార్యాబిడ్డలను తన శరీరాన్ని రెండు సమాన భాగాలుగా ఖండించమని చెబుతాడు మయూరధ్వజుడు. వారు అలా చేస్తున్న సందర్భంలో ఆ రాజు ఎడమ కన్ను నుంచి నీరు కారడం చూసిన కృష్ణుడు 'బాధపడుతూ దానం చేయడం వల్ల ఫలితం ఉండద'ంటాడు. అందుకు 'నా కుడి భాగం మాత్రమే ఆ పసి బాలుని ప్రాణాలు రక్షించడం కోసం ఉపయోగపడుతోంది. తాను ఉపయోగపడనందుకు ఎడమ భాగం బాధపడుతోంద'ని చెప్పాడు మయూరధ్వజుడు. అర్జునునికి అతడి గొప్పదనం అర్థమయ్యింది. కృష్ణార్జునులు ఇరువురూ నిజరూపం ధరించారు. మయూర ధ్వజుణ్ణి కృష్ణుడు బతికించాడు. అతడు వారికి నమస్కరించి యాగాశ్వాన్ని విడిచిపెట్టాడు''.

– యామిజాల జగదీశ్

## గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** శు.అష్టమి రా.3.18 వరకు తదుపరి నవమి, **నక్షత్రం:** ధనిష్ఠ రా.10.16 వరకు, తదుపరి శతభిషం, **వర్జ్యం:** తె.4.56 నుండి 6.25 వరకు (తెల్లవారితే మంగళవారం), **దుర్ముహూర్తం:** ప.12.09 నుండి 12.57 వరకు, తదుపరి ప.2.24 నుండి 3.12 వరకు, **అమృతఘడియలు:** ప.12.31 నుండి 2.01 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.09, **సూర్యాస్తమయం:** 5.21.

## క్లుప్తంగా...

### బీజేపీ ఓటమే ధ్యేయం: విజయరాఘవన్



ఖమ్మం మయూరిసెంటర్: ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ ఓటమే ధ్యేయంగా తమ పార్టీ ముందుకెళ్తోందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు విజయ రాఘవన్ తెలిపారు. ఖమ్మంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో బీజేపీని ఓడించే సత్తా ఉన్న ప్రజాస్వామ్య శక్తులకు మద్దతిస్తున్నామని తెలిపారు. అలాగే, తాము బలంగా ఉన్న 19 స్థానాల్లో పోటీ చేస్తున్నామని రాఘవన్ చెప్పారు. బీజేపీ పాలనలో దళితులు, కార్మికులు, కర్షకులపై భారాలు మోపగా, ప్రతీవర్గం సంకటస్థితిని ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తంచేశారు. చాలాచోట్ల విద్య, వైద్యరంగాలను ప్రైవేట్‌కు ధారాదత్తం చేసినా.. కేరళలో మాత్రం ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఉన్నాయని తెలిపారు. సమావేశంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్, ఎం.సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

### నేడు మళ్లీ రాష్ట్రానికి అమిత్ షా

- జనగామ, జగిత్యాలల్లో సభలు, సాయంత్రం ఉప్పల్‌లో రోడ్ షో

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేయడంలో భాగంగా సకలజనుల విజయ సంకల్పసభల్లో పాల్గొనేందుకు బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మరోసారి రాష్ట్రానికి రానున్నారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి సోమవారం మధ్యాహ్నం 12.35 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మ. ధ్యాహ్నం ఒంటిగంటకు జనగామకు చేరుకుని అక్కడి సభలో పాల్గొంటారు. ఆ తర్వాత మ. ధ్యాహ్నం 2.45 గంటలకు కోరుట్లకు చేరుకుంటారు. అక్కడ మధ్యాహ్నం 3 నుంచి 3.40 వరకు జరగనున్న ఎన్నికల ప్రచారసభలో పాల్గొంటారు. హెలికాప్టర్‌లో కోరుట్ల నుంచి బయలుదేరి సాయంత్రం 4.45 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డుమార్గంలో ఉప్పల్‌కు చేరుకుంటారు. ఉప్పల్ నియోజకవర్గం పరిధిలో సాయంత్రం 5.30 నుంచి 7 గంటల వరకు రోడ్ షోలో పాల్గొంటారు.

### బీజేపీది తప్పుడు మేనిఫెస్టో



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అమిత్‌షా ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోలో పలు అంశాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు కావడం లేదని, అలాంటప్పుడు ఇక్కడ అమలు చేస్తామని ప్రకటించడం ప్రజలను మోసగించడమేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఇది ప్రజల్లో చీలిక తేవడంతో పాటు, సంక్షేమ పథకాలకు కోతకోసే మేనిఫెస్టోగా పేర్కొన్నారు. తెలంగాణలో వ్యవసాయానికి ఎరువులు, సబ్సిడీలు, ధాన్యానికి మద్దతు ధరలు అమలు చేస్తామని ప్రకటించడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. ఎఫ్‌సీఐ ద్వారా ధాన్యం సేకరించకుండా తెలంగాణ రైతాంగాన్ని ముంచి, ఇప్పుడు రాష్ట్రంలో క్వింటాకు రూ.3100 ఇస్తామని బీజేపీ చెబుతోందని ఎద్దేవా చేశారు.

### బీజేపీని బొంద పెడతాం

- మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య



సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణ చేస్తామంటూ దళితుల మధ్య చిచ్చు పెడుతున్న బీజేపీని రాజకీయంగా బొంద పెడతామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి. చెన్నయ్య ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. బీజేపీ మేనిఫెస్టోలో ఎస్సీలను వర్గీ కరిస్తామని పేర్కొనలేదని, ఈ అంశంపై కేవలం ప్రచారం తప్ప బీజేపీకి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. దళితుల్లో ఓ వర్గం ఓట్ల కోసం మందకృష్ణను బీజేపీ పావుగా వాడుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్గీకరణపై బీజేపీకి చిత్త శుద్ధి ఉంటే పార్ల మెంటులో బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు.

### బాగోగులు చూసుకునేవారు లేరని..

- మనస్తాపంతో వృద్ధురాలి ఆత్మహత్య



సుగుణమ్మ

ముత్తారం(మంథని): ఆమెకు నలుగురు సంతానం.. అందులో ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్లు చనిపోయారు. ఉన్న ఒక్కగానొక్క కూతురు ఎప్పుడో ఓసారి చుట్టపు చూపుగా వచ్చి పోతుండటంతో తీవ్ర మనస్తాపం చెందిన ఓ వృద్ధు రాలు ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. కాసర్లగడ్డకు చెందిన మారం సుగుణమ్మ (70) ఆదివారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె భర్త వీరారెడ్డి పొలం నుంచి ఇంటి వచ్చేసరికి విగతజీవిగా కనిపించింది. 'నన్ను విడిచిపెట్టి.. ఒంటరివాన్ని చేసి వెళ్లిపోయావా?' అని భర్త కన్నీరుమున్నీరయ్యాడు. వృద్ధాప్యంలో మంచి, చెడూ చూసుకునే వారు ఇంట్లో లేరని తనతో చెబుతూ బాధపడేదని తెలిపారు. వీరారెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుసూదన్‌రావు వెల్లడించారు.

# కుటుంబ పాలన అంతమే!

**ఎన్నో పోరాటాలతో వచ్చిన తెలంగాణ కేసీఆర్ కుటుంబం చేతిలో బందీ - నారాయణపేట, చేవెళ్ల సభల్లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా**



నారాయణపేట సకల జనుల సంకల్పసభకు హాజరైన ప్రజలు (ఇన్‌సెట్‌లో) గౌతమ్ నగర్ డివిజన్ రోడ్‌షోలో జేపీ నడ్డా

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ చేవెళ్ల/గౌతంనగర్ (హైదరాబాద్): ఎందరో అమరుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ కుటుంబ పాలనలో చిక్కుకుందని.. ఈ పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం వచ్చిందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పేర్కొన్నారు. ఉద్యమంలో ప్రజలంతా భాగస్వాములు అయ్యారని, వేల మంది ప్రాణత్యాగం చేశారని.. కానీ సీఎం కుర్చీలో కూర్చున్న కేసీఆర్ తెలంగాణ ప్రగతిని పక్కనపెట్టి కుటుంబ సంపదను పెంచుకున్నారని ఆరోపించారు. కుటుంబ పాలన చేసే రాష్ట్రాల్లో బీజేపీ రాజకీయ యుద్ధం చేస్తోందని, తెలంగాణలోనూ కుటుంబ పాలనను అంతం చేస్తామని చెప్పారు. ఆదివారం నారాయణపేట, చేవెళ్లలో నిర్వహించిన సకల జనుల విజయ సంకల్ప సభల్లో, మల్కాజిగిరి నియోజకవర్గంలో నిర్వహించిన రోడ్‌షోలో జేపీ నడ్డా ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధి కోసం నిధులు పంపిస్తే.. కేసీఆర్ కుటుంబం ఆ నిధులను అభివృద్ధికి ఖర్చు చేయకుండా దుర్వినియోగం చేసింది. ఓట్ల కోసం ఒక వర్గాన్ని సంతోషపర్చడానికి రిజర్వేషన్లను పెంచుతామని చెప్పడం, రాష్ట్రంలో హిందూ ఆలయాల భూములను ఇతర పనులకు వాడుకోవడం ఆయనకే చెల్లింది. బీఆర్‌ఎస్ అవినీతి పార్టీ. రాక్షసుల్లా తెలంగాణను దోపిడీ చేస్తున్నారు. రైతులకు ప్రయోజనకరమైన ఫసల్ బీమా యోజనను తెలంగాణలో అమలు చేయడం లేదు. పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన నిధులను దారిమళ్లించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వ్యాట్‌ను తగ్గించి పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గేలా చూస్తే.. తెలంగాణలో కేసీఆర్ తగ్గించకుండా ప్రజల సంక్షేమాన్ని విస్మరించారు. దేశంలోనే అధికంగా తెలంగాణలో 8.5 శాతం ద్రవ్యోల్బణం ఉంది. దేశంలో ఎక్కువగా డీజిల్, పెట్రోల్ ధరలు ఉన్న రాష్ట్రం తెలంగాణే. దళితబంధులో కూడా బీఆర్‌ఎస్ నేతలు కమీషన్లు తీసుకున్నారు. ఎక్కడా ఇంత దౌర్భాగ్యం లేదు.

**మోసం చేయడంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ దిట్ట**

మోదీ సర్కారు దేశంలో మౌలిక సదుపాయాల కోసం ఏడాదికి రూ.10 లక్షల కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయిస్తే.. ఒక్క తెలంగాణలో 5.21 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నాం. రూ.లక్ష కోట్లతో 2,500 కిలోమీటర్ల జాతీయ రహదారులు నిర్మించాం. రూ.6,038 కోట్లతో రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని పునరుద్ధరించాం. మోదీ ప్రభుత్వం చెప్పింది కచ్చితంగా చేసి చూపిస్తుంది. కాంగ్రెస్ చెప్పింది చేయదు. ప్రజలను మోసం చేయడమే ఆ పార్టీ తీరు. కర్నాటకలో 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందజేస్తామన్నారు. ఏమైంది? నాలుగు గంటలు కూడా కరెంటు ఇవ్వడం లేదు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఒక్కటే. అవినీతి, ప్రజలను మోసం చేయడంలో దిట్టలు.

**బీజేపీ గెలిస్తే బీసీ సీఎం**

తెలంగాణలో బీజేపీని గెలిపిస్తే బీసీని సీఎం చేస్తాం. ఏడాదికి నాలుగు సిలిండర్లను ఉచితంగా అందజేస్తాం. ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తాం. ఎరువులపై రూ.18వేల సబ్సిడీ అందజేస్తాం. చిన్న, సన్నకారు రైతులకు ఏడాదికి రూ.2,500 ఇన్సెంటివ్ ఇస్తాం. పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గిస్తాం. విద్యార్థినులకు ఉచితంగా ల్యాప్‌ట్యాప్‌లు అందజేస్తాం. ఐదేళ్లలో 2.5 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తాం. వృద్ధులకు ఉచితంగా తీర్థయాత్రలు, నిరుపేదలకు రూ.10 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పిస్తాం. సెప్టెంబర్ 17న అధికారికంగా విమోచన దినోత్సవం నిర్వహిస్తాం. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ గ్యారంటీలకు వారంటీలు లేవు. అదే బీజేపీ ప్రభుత్వమిచ్చే గ్యారంటీలతో వికాసం ఉంటుంది.

**ప్రపంచంలో 3వ పెద్ద ఆర్థికశక్తిగా ఎదుగుతాం**

బీజేపీ ప్రభుత్వం ఎక్కడున్నా మహిళలకు రక్షణ ఉంటుంది. అవినీతి నిర్మూలన, యువతకు ఉద్యోగాలు లభిస్తాయి. రైతులకు అన్నివిధాలుగా అండగా ఉంటుంది. మోదీ హయాంలో ప్రపంచంలో ఐదో ఆర్థికశక్తిగా భారత్ ఎదిగింది. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో మోదీని గెలిపిస్తే 2028 నాటికి మూడో స్థానానికి చేరుకుంటుంది..''అని నడ్డా పేర్కొన్నారు. ఈ సభల్లో ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కె.లక్ష్మణ్, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పార్టీ అభ్యర్థులు, ఇతర నేతలు పాల్గొన్నారు.

**'5జీ' కేసీఆర్‌ను ఇంటికి పంపాలి**

బీఆర్‌ఎస్ అంటే భ్రష్టాచార్ రాష్ట్ర సర్కార్. ఇది తెలంగాణ ప్రజలను లూటీ చేస్తుంది. ఫోన్లలో 5జీ నెట్‌వర్క్ లాంటివారు ప్రధాని నరేంద్ర మోదీ. అదే కేసీఆర్ 5జీ ఏంటంటే.. పేదరికం (గరీబీ), కుంభకోణం (గొటాలా), అహంకారం (గుస్సేడి), మోసకారి (గప్లేబాజ్), గూండాయిజం (గూండారాజ్). ఇలాంటి కేసీఆర్‌ను ఈ ఎన్నికల్లో ఇంటికి పంపాలి. ఆ సమయం వచ్చింది.

# ఈ ప్రశ్నలకు బదులివ్వండి

- తెలంగాణ ప్రజలకు ఏమి ఒరగబెట్టారో చెప్పండి
- 2018, 2014 మేనిఫెస్టోల్లో ఎన్ని హామీలు నెరవేర్చారు?
- దీనిపై బీజేపీ ప్రతినిధులతో చర్చకు సిద్ధమా?
- సీఎం కేసీఆర్‌ను నిలదీసిన బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి బండి సంజయ్

సాక్షి, హైదరాబాద్: తమ పాలనలో రాష్ట్ర ప్రజలకు సీఎం కేసీఆర్ ఏమి ఒరగబెట్టారో సమాధానం చెప్పాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో వైఫల్యాలు, అవినీతి, నియంతృత్వ పోకడలు, ప్రజాస్వామ్య హననం, కుటుంబ పాలన, కేసీఆర్ అసమర్థతపై వెయ్యి ప్రశ్నలు అడిగినా సరిపోదన్నారు. అందువల్ల తాను వేస్తున్న కేవలం 31 ప్రశ్నలకు కేసీఆర్ జవాబు చెప్పాకే ప్రజల నుంచి ఓట్లు అడగాలని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా దాటవేస్తే తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చలేని అసమర్థ ప్రభుత్వంగా, పార్టీగా కేసీఆర్ ఒప్పుకుని బహిరంగ క్షమాపణలు చెప్పాలన్నారు.

**సంజయ్ సంధించిన ప్రశ్నల్లో కొన్ని..**

- మీకు నిజం చెప్పకూడదు.. అన్న శాపం ఏమైనా ఉందా? ఏనాడూ మీరు నిజాలు చెప్పరు? అందుకే అబద్ధాలతో ప్రజలను మోసం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారా?
- 2023లో 13 పేజీలు, 2018లో 16 పేజీలు, 2014లో 32 పేజీలతో ప్రకటించిన మేనిఫెస్టోల్లోని హామీల్లో ఎన్ని అమలు చేశారు? దీనిపై బీజేపీ ప్రతినిధులతో చర్చించడానికి మీరు సిద్ధమా?
- కాంగ్రెస్ ఎంఐఎంతో మీరు లోపాయికారి ఒప్పందం, మ్యాచ్‌ఫిక్సింగ్ చేసుకున్న విషయం వాస్తవం కాదా? మీ పార్టీ గుర్తు స్టీరింగ్ మజ్లిస్ చేతుల్లో ఉందా లేదా?
- హస్తంతో లోపాయికారి దోస్తీ, బయటకు మాత్రం కుస్తీ. దీనికి మీ జవాబు ఏమిటి?
- ఇంటికో ఉద్యోగం ఇస్తామని వాగ్దానం చేసిన మీరు.. మీ కుటుంబంలో మాత్రం ఐదుగురికి ఉద్యోగాలు ఇచ్చుకున్నారు. దీనికి మీ సమాధానమేమిటి?
- ప్రభుత్వ ఉద్యోగులకు, టీచర్లకు 1వ తేదీన మీ పాలనలో జీతాలు అందుతున్నాయా?
- 2014లో అధికారంలోకి వచ్చిననాటి నుంచి ఇప్పటిదాకా ఎన్ని ఉద్యోగ ఖాళీలు భర్తీ చేశారు? ఎన్నిసార్లు పేపర్ల లీకేజీ కారణంగా పరీక్షలు రద్దు చేశారు?
- ఇప్పటి వరకు ఎంత మందికి నిరుద్యోగ భృతి ఇచ్చారు?
- 2014లో మీరు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు సెక్రటేరియట్‌కు ఎన్నిసార్లు, ఎన్నిరోజులు వెళ్లారు? మీ ఫామ్‌హౌస్‌లో ఎన్నిరోజులు ఉన్నారు?
- ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో లక్ష ఎకరాలకు సాగునీరు ఇస్తామన్నారు. 9 ఏళ్లలో ఏ అసెంబ్లీ స్థానంలో లక్ష ఎకరాలకు సాగునీరు ఇచ్చారో వివరాలు ఇవ్వగలరా?
- రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేస్తామని 2014, 2018 ఎన్నికల్లో మీరిచ్చిన హామీ ఎంతమేరకు నెరవేర్చారు?
- దేశంలోనే అత్యంత అవినీతిపరుడు, ధనవంతుడు కేసీఆర్ అని పేరుంది. దీనికి స్పందించి మీ నిజాయితీని నిరూపించుకుంటారా?
- మీ కుటుంబ సభ్యులు, బంధువులు, మీ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు చేస్తున్న ఇసుక, లిక్కర్, డ్రగ్స్ దందాలు, భూ కబ్జాలపై సీబీఐ లేదా సుప్రీంకోర్టు న్యాయమూర్తి చేత దర్యాప్తునకు సిద్ధమా?
- 2014లో మీరు ముఖ్యమంత్రి పదవిచేపట్టే నాటికి మీ ఆస్తులు, మీ కుటుంబ సభ్యులు, బంధువుల ఆస్తులు ఎంత? ఇప్పుడు ఎంత?
- తొమ్మిదేళ్లలో ఎన్ని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించారు? ఎంత మంది పేదలకు ఇచ్చారు?
- గల్ఫ్ కార్మికులను ఆదుకునేందుకు మీ ప్రభుత్వం గత 9 ఏళ్లలో తీసుకున్న చర్యలు ఏమిటి?

### కేసీఆర్ పాలనలో రాష్ట్రం దివాలా

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్



నారాయణఖేడ్ రోడ్‌షోలో మాట్లాడుతున్న బండి సంజయ్. పక్కన బీజేపీ అభ్యర్థి జన్‌వాడే సంగప్ప

నారాయణఖేడ్ (సంగారెడ్డి): రెండుసార్లు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు కుటుంబ పాలనతో రూ.6 లక్షల కోట్ల అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని దివాలా తీయించారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ విమర్శించారు. పుట్టే ప్రతి బిడ్డపైనా లక్షా 50 వేల అప్పు భారం మోపారని ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో ఆదివారం పార్టీ అభ్యర్థి జన్‌వాడే సంగప్ప ఏర్పాటు చేసిన రోడ్‌షోలో పాల్గొని, బసవేశ్వరచౌక్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఫాంహౌజ్‌లో పడుకున్న కేసీఆర్‌ను ధర్నా చౌక్ వద్దకు తీసుకొచ్చింది బీజేపీయేనని తెలిపారు. తెలంగాణ కోసం పేదలు ఆత్మబలిదానాలు చేసుకుంటే కేసీఆర్ దొంగదీక్ష చేశారని దుయ్యబట్టారు. 1,400 మందిని కాంగ్రెస్ బలిదానం తీసుకోగా సుష్మాస్వరాజ్ పార్లమెంట్‌లో వారి తరఫున పోరాడారని, దీంతో బీజేపీ సహకారంతో తెలంగాణ కల సాకారమైందన్నారు. కాంగ్రెస్‌వి ఆరు గ్యారంటీలు కాదు, అరడజను ముఖ్యమంత్రులని విమర్శించారు. రేవంత్‌రెడ్డిని సీఎం చేస్తే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పదిమంది చొప్పున ఎమ్మెల్యేలను తీసుకొని బయటకు వెళతారని జోస్యం చెప్పారు. బీజేపీతోనే సుస్థిర ప్రభుత్వం సాధ్యమని వివరించారు.

# ఐటీ గుబులు!

- ఎన్నికల వేళ ఆదాయ పన్ను శాఖ సోదాలు
- బెంబేలెత్తుతున్న రాజకీయ నాయకులు
- పార్టీలకతీతంగా ఐటీ ముమ్మర తనిఖీలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గత నెల రోజులుగా ఆదాయపన్నుశాఖ అధికారుల వరుస సోదాలు రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం సృష్టిస్తున్నాయి. ఎన్నికల పోటీలో హోరాహోరీగా పోరాడుతున్న ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతల్లో ఐటీ గుబులు ఎక్కువగా కనిపిస్తోంది. ఎన్నికల్లో తమకు ఆర్థిక 'సర్దుబాట్లు' చేసే బంధువులు, సన్నిహితులపైనా ఆదాయపన్నుశాఖలోని ఐటీ ఇంటెలిజెన్స్ ఫోకస్ పెట్టడం నాయకులను కలవరపెడుతోంది. అధికారులు పక్కా సమాచారంతో క్షేత్ర స్థాయిలో సోదాలు చేస్తున్నారు. రానున్న రోజుల్లో ఎప్పుడు..ఎవరిపైన సోదాలు జరుగుతాయోనన్న చర్చ రాజకీయవర్గాల్లో నడుస్తోంది.

**ఇటీవల ఐటీ చేపట్టిన ప్రధాన తనిఖీలు ఇలా...**

- అక్టోబర్ 5న ఫైనాన్స్, చిట్‌ఫండ్, ఈకామర్స్ వ్యాపారుల ఆర్థికలావాదేవీలలో అవకతవకలపై ఆదాయపన్నుశాఖ వంద బృందాలతో ఏక కాలంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలోని సుమారు 24 ప్రాంతాల్లో ఆకస్మిక సోదాలు చేపట్టింది. హైదరాబాద్‌తోపాటు కర్ణాటక, ఒడిశా, తమిళనాడులకు చెందిన ఐటీ అధికారులు సైతం ఈ సోదాల్లో పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సోదరుడి ఇల్లు, ఆఫీసులు, కూకట్‌పల్లి హిందు ఫార్చ్యూన్ విల్లాలోని అరికపూడి కోటేశ్వరరావు, రైల్వే కాంట్రాక్టర్ వరప్రసాద్ ఇళ్లు, వీరి బంధువుల ఇళ్లలో సోదాలు జరిగాయి. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ బంధువులు, స్నేహితుల వ్యాపారాల లక్ష్యంగానే నాటి సోదాలు జరిగినట్టు మీడియాలో ప్రచారం జరిగింది.
- నవంబర్ 2న రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్), బడంగ్ పేట్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, వీరి బంధువులు, అనుచరుల ఇళ్లలో ఐటీ సోదాలు జరిగాయి. మహేశ్వరం టికెట్ కోసం భారీ ఎత్తున లాబీయింగ్ జరగడంతో కేఎల్ఆర్, పారిజాత నర్సింహారెడ్డి ఆర్థికలావాదేవీలపై ఐటీ నిఘా పెట్టింది. ఇద్దరికీ చెందిన కంపెనీలు, సంస్థలకు చెందిన వివరాలు సేకరించింది. ఈ ఎన్నికల కోసం పెద్ద ఎత్తున డబ్బు సమీకరించారనే సమాచారంతో ఏకకాలంలో సోదాలు చేపట్టినట్టు ప్రచారం జరిగింది. అదే రోజు బాలాపూర్ లడ్డును వేలంలో కొనుగోలు చేసిన వంగేటి లక్ష్మారెడ్డి ఇంట్లో కూడా ఐటీ అధికారులు తనిఖీలు చేశారు.
- నవంబర్ 2న కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి తోడల్లుడు గిరిధర్ రెడ్డి ఇంట్లోనూ ఐటీ సోదాలు కొనసాగాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారిగా ఉన్న గిరిధర్ రెడ్డికి చెందిన కోకాపేట హిడెన్ గార్డెన్ లోని నివాసంలో సోదాలు చేపట్టిన విషయం తెలిసిందే.
- ఈనెల 9, 10 తేదీల్లో పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇళ్లు, కార్యాలయాల్లో ఆఫీసుల్లో ఐటీ అధికారులు సోదాలు చేశారు. జూబ్లీహిల్స్‌లోని పొంగులేటి నివాసంతో పాటు నందగిరిహిల్స్ వంశీరామ్‌జ్యోతి హిల్ రిడ్జ్‌లోని ఫ్లాట్, బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10లోని రాఘవ ప్రైడ్, బేగంపేటలోని ఆఫీసుల్లో దాడులు చేశారు. అదే సమయంలో ఖమ్మంలోని ఆయన నివాసంలోనూ సోదాలు కొనసాగాయి. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నామినేషన్ వేసేందుకు వెళ్లిన రోజే ఐటీ సోదాలు జరగడం కొంత కలకలం సృష్టించింది.
- ఈనెల 13న నుంచి వరుసగా రెండు రోజులపాటు నగరంలోని ఫార్మా కంపెనీకి చెందిన ప్రతినిధులు ప్రదీప్‌రెడ్డి, కె నరేంద్రరెడ్డి ఇళ్లల్లో ఐటీ సోదాలు చేపట్టిన విషయం తెలిసిందే. హైదరాబాద్, సంగారెడ్డి,మేడ్చల్ జిల్లాల్లోని మొత్తం13 ప్రాంతాల్లో ఐటీ అధికారులు నిర్వహించిన ఈ సోదాల్లో ఎలాంటి లెక్కల్లో లేని రూ.7.50 కోట్లు సీజ్ చేసినట్లు సమాచారం. ఐటీ సోదాలు జరిగిన ఫార్మా వ్యాపారులు మంత్రి సబితా ఇంద్రారెడ్డి కుటుంబానికి అత్యంత సన్నిహితులని ప్రచారం జరిగింది. ఆ కోణంలోనే ఐటీ దాడులు జరిగినట్టు వార్తలు వచ్చాయి.
- తాజాగా శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు అజీజ్ నగర్‌లోని శ్రీనిధి విద్యా సంస్థ చైర్మన్ కేటీ మహి ఇంట్లో ఐటీ అధికారుల సోదాలు కొనసాగాయి. ఆయనకి సంబంధించిన ఫుట్ బాల్ అకాడమీ, క్రికెట్ అకాడమీ కార్యాలయాల్లో సైతం ఐటీ అధికారుల తనిఖీలు కొనసాగాయి. ఓఆర్ఆర్ అప్పా కూడలి వద్ద శనివారం సాయంత్రం పోలీసులు తనిఖీల్లో ఆరు కారులలో తరలిస్తున్న సరైన పత్రాలు లేని రూ.7.50 కోట్ల నగదును పోలీసులకు పట్టుబడడం, ఈ సొమ్మును ఖమ్మం జిల్లాకు చెందిన ఓ రాజకీయ నాయకుడి కోసం తరలిస్తున్నట్టు వార్తలు గుప్పుమన్నాయి. ఈ నేపథ్యంలోనే శ్రీనిధి విద్యా సంస్థ చైర్మన్ కే టీ మహి ఇంట్లోనూ ఐటీ సోదాలు జరిగినట్టు వార్తలు వచ్చాయి. ఆదివారం తెల్లవారు జాము వరకు సోదాలు చేసిన అధికారులకు రూ.12 లక్షల నగదు, విలువైన పత్రాలు లభించాయి.

**నోటీసులు జారీ**

శ్రీనిధి గ్రూప్ చైర్మన్ ఇంట్లో నుంచి నగదు పట్టుబడిన కేసులో పోలీసులు 10 మందికి 41ఏ నోటీసులు జారీ చేశారు. ఇందులో ఖమ్మం జిల్లాకు చెందిన ఓ రాజకీయ పార్టీ నేత సమీప బంధువులు ఉన్నట్లు తెలుస్తోంది. ఖమ్మం జిల్లాకు చెందిన ఓ ప్రధాన పార్టీ నేత కోసమే ఈ నగదును తీసుకెళ్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సీజ్ చేసిన నగదును పోలీసులు సోమవారం కోర్టులో డిపాజిట్ చేయనున్నారు.

అక్రమంగా డబ్బు తరలిస్తున్నట్లు సమాచారం ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 1800/04023426201/23426202 నంబర్స్‌కి కాల్‌చేసి సమాచారం ఇవ్వాలని గత నెల నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఐటీ డీజీ సంజయ్ కోరారు.

### సింగరేణిని నిర్వీర్యం చేసింది కేసీఆరే!

- బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్



సీసీసీ కార్నర్ వద్ద సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

నస్పూర్/గోదావరిఖని/కమలాపూర్: సింగరేణి సొమ్మును ఇతర అవసరాలకు మళ్లించి సంస్థను ఆర్థికంగా నిర్వీర్యం చేసింది సీఎం కేసీఆరే అని బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంచిర్యాల జిల్లా నస్పూర్ మున్సిపాలిటీలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రఘునాథ్ తరఫున ప్రచారం చేశారు. హెలికాప్టర్‌లో వచ్చిన ఈటల కలెక్టరేట్‌లోని హెలిప్యాడ్‌లో దిగారు. రాజేందర్‌కు మద్దతుగా ముదిరాజ్ కులస్తులు కలెక్టరేట్ వద్దకు భారీగా చేరుకుని 'సీఎం, సీఎం'అంటూ నినాదాలు చేశారు. తర్వాత శ్రీరాంపూర్ కాలనీ వద్ద సింగేణి కార్మికుడి విగ్రహానికి ఈటల పూలమాల వేసి నివాళులర్పించారు. సీసీసీ కార్నర్ వద్ద నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ ఉద్యమవేళ సింగరేణిలో కాంట్రాక్ట్ అనే పదం వినపడకూడదన్న కేసీఆర్ అధికారంలోకి వచ్చాక దానిని ప్రైవేటుపరం చేస్తున్నారని ఆరోపించారు. 60 ఏళ్ల పాలనలో ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోని కాంగ్రెస్ నేడు అమలు సాధ్యం కాని హామీలతో ఓట్లు కొల్లగొట్టాలని చూస్తోందని విమర్శించారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన ప్రజాసంకల్పసభలో ఆయన మాట్లాడారు. ఆడబిడ్డల ఆశీర్వాదంతోనే బీజేపీ రామగుండం ఎమ్మెల్యేగా సంధ్యారాణి గెలుస్తారన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే సింగరేణి కార్మికులకు ఐటీ మినహాయిస్తామని హామీ ఇచ్చారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికులు, ఇతర విభాగాల కార్మికులకు పవర్ కమిటీ వేతనాలతోపాటు కనీస సౌకర్యాలు కల్పిస్తామన్నారు. డిసెంబర్ 3 తర్వాత కేసీఆర్ ప్రభుత్వం గల్లంతవడం ఖాయమని హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఈటల అన్నారు. 'కేసీఆర్ నన్ను బయటికి వెళ్లగొట్టినప్పుడు నా భార్య ఒక్కటే చెప్పింది. కేసీఆర్‌తో కొట్లాడటానికి అవసరమైతే ఇంటితోసహా అన్నీ అమ్ముకుందాం.. కానీ, కేసీఆర్ విషయంలో మాత్రం రాజీపడకు'అని చెప్పిందన్నారు. అవసరమైతే ఇంటికి రూ.వంద అడుక్కుని హుజూరాబాద్‌తోపాటు గజ్వేల్‌లోనూ గెలిచి వస్తానని చెప్పారు.

### కమల దళం ప్రచార జోరు!

- మరో తొమ్మిది రోజులే మిగిలి ఉండటంతో దూకుడు
- అగ్రనేతలు, కేంద్ర మంత్రులు, సీనియర్ల వరుస పర్యటనలు
- సంఘ్ పరివార్ పక్షాన 'జన జాగరణ'పేరిట కార్యక్రమాలు
- మేనిఫెస్టోలోని అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల ప్రచార పర్వం ముగిసేందుకు తొమ్మిది రోజులే మిగిలి ఉండటంతో ప్రచారాన్ని హోరెత్తించేందుకు బీజేపీ నాయకత్వం సిద్ధమైంది. అగ్రనేతలు, కేంద్ర మంత్రులు, ఇతర సీనియర్లతో రోడ్‌షోలు, బహిరంగ సభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. విజయావకాశాలు ఎక్కువగా ఉన్నచోట మరింత ఫోకస్ చేస్తోంది. ఆయా చోట్ల ప్రచారాన్ని ఉధృతం చేయడం, పార్టీ పోలింగ్ బూత్ కమిటీలతో క్షేత్రస్థాయిలో ఓటర్లను ఆకట్టుకునేలా కార్యక్రమాలు చేపట్టడంపై దృష్టి పెట్టింది. ఇక పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని నిర్ణయించింది. బీసీ సీఎం, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ, ఉజ్వల లబ్ధిదారులకు ఏటా ఉచితంగా నాలుగు గ్యాస్ సిలిండర్లు, ఆడపిల్ల పుడితే సొమ్ము ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి 21 ఏళ్లు వచ్చే నాటికి రూ.2 లక్షల అందజేత, డిగ్రీ, వృత్తివిద్యా కోర్సులు చదివే విద్యార్థినులకు ల్యాప్‌టాప్‌లు అందజేత, స్వయం సహాయ బృందాలకు ఒకశాతం వడ్డీకే రుణాలు వంటి హామీలను వివరించి ప్రజల మద్దతు కూడగట్టాలని భావిస్తోంది.

**అగ్రనేతల పర్యటనలతో..**

శని, ఆదివారాల్లో బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా విస్తృతంగా సభలు, రోడ్‌షోలలో పాల్గొన్నారు. అమిత్‌షా సోమవారం మరోసారి రాష్ట్రానికి రానున్నారు. పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, ఇతర ముఖ్యనేతలు కూడా వరుస పర్యటనలకు రానున్నారు. సోమవారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఎల్లారెడ్డి, కొల్లాపూర్ సభల్లో, మరోచోట రోడ్‌షోలో పాల్గొంటారు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సోమవారం ముషీరాబాద్ రోడ్ షోలో పాల్గొంటారు. మంగళవారం కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ప్రచారం చేస్తారు. ఇక ఈ నెల 24, 25, 26 తేదీల్లో ప్రచారం కోసం యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ రానున్నారు. ఇదే సమయంలో అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ, గోవా సీఎం ప్రమోద్ సావంత్ రోడ్‌షోలు, బహిరంగ సభల్లో పాల్గొంటారు. 25న హుజూరాబాద్ , 26న మహేశ్వరంలో జరిగే సభల్లో కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ పాల్గొంటారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జూబ్లీహిల్స్, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో ప్రచారం చేయనున్నారు. బీజేపీ ఏపీ అధ్యక్షురాలు పురందేశ్వరి మహేశ్వరంలో ప్రచారం చేస్తారు. చివరిగా 26, 27 తేదీల్లో మోదీ బహిరంగ సభలు, రోడ్‌షోలలో పాల్గొననున్నారు.

**సంఘ్‌పరివార్ ప్రచారం!:** మరోవైపు సంఘ్‌పరివార్ పక్షాన 'జన జాగరణ'పేరిట వివిధ నియోజకవర్గాల్లో ప్రచారం ఊపందుకుంటోంది. సంఘ్ శాఖల ఆధ్వర్యంలో పోలింగ్ బూత్‌ల వారీగా వివిధ కార్యక్రమాలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తొలిసారి ఓటర్లు, యువత, నిరుద్యోగులను కలిసి మద్దతు కూడగట్టేలా ప్రణాళికలు రూపొందించారు.

### భర్తను వదిలేసి ప్రియుడితో కాపురం

- తమతో కలిసి ఉండాలని భార్య షరతు..
- మనస్తాపంతో భర్త ఆత్మహత్య



వంశీ

ముదిగొండ: కట్టుకున్న భార్య ఇంకొకరితో వివాహేతర సంబంధం పెట్టుకుని వేరు కాపురం పెట్టడమేకాక.. భర్తనూ తమతోపాటు కలిసి ఉండాలని షరతు విధించింది. దీంతో మనస్తాపానికి గురైన భర్త ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం బాణాపురం గ్రామానికి చెందిన గుండాల వంశీ (29)కి ఐదేళ్ల క్రితం మండలంలోని గోకినేపల్లికి చెందిన యువతితో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు జన్మించాక, సదరు మహిళ ఇంకో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుని వేరుగా ఉంటోంది. పలుమార్లు హెచ్చరించినా ప్రియుడిని విడిచిపెట్టలేనని చెప్పిన ఆమె, భర్తనూ తమతో కలిసి ఉండాలని సూచించింది. దీంతో మనస్తాపానికి గురైన వంశీ, శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన తీసుకున్న సెల్ఫీ వీడియోను వాట్సాప్‌లో పంపించడంతో విషయం ఆదివారం బయటపడింది. మృతుడి తండ్రి గుండాల శివయ్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ముదిగొండ ఎస్ఐ నరేశ్ తెలిపారు.

## క్లుప్తంగా...

### ఇంఫాల్ విమానాశ్రయంలో డ్రోన్ల కలకలం

ఇంఫాల్: గగనతలంలో డ్రోన్లు ఆదివారం మణిపూర్ రాజధాని ఇంఫాల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కలకలం సృష్టించాయి. రెండు గుర్తు తెలియని వస్తువులు మధ్యాహ్నం 2.30 నుంచి నాలుగింటి దాకా రన్‌వే పరిసరాల్లో ఎగురుతూ కన్పించినట్టు అధికారులు తెలిపారు. దాంతో ముందుజాగ్రత్త చర్యగా విమానాశ్రయాన్ని మూసేశారు. విమానాల రాకపోకలను కూడా నిలిపేశారు. రెండు విమానాలను దారి మళ్లించగా అక్కణ్నుంచి బయల్దేరాల్సిన మూడు విమానాలు ఆలస్యమయ్యాయి. మూడు గంటల విరామం అనంతరం సేవలను పునరుద్ధరించారు. తూర్పున మయన్మార్‌తో మణిపూర్ అంతర్జాతీయ సరిహద్దును పంచుకుంటుంది.

### పాక్‌కు సాయం ఆపండి

బైడెన్‌కు అమెరికా కాంగ్రెస్ సభ్యుల విజ్ఞప్తి

ఇస్లామాబాద్: అమెరికా అందిస్తున్న భారీ ఆర్థిక సాయాన్ని మానవ హక్కుల ఉల్లంఘనకు పాకిస్తాన్ వినియోగిస్తోందని యూఎస్ కాంగ్రెస్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. పాక్‌లో స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు జరిగి రాజ్యాంగబద్ధమైన రీతిలో ప్రభుత్వం ఏర్పాటయ్యేదాకా ఆ దేశానికి ఎలాంటి ఆర్థిక సాయమూ అందించొద్దని అధ్యక్షుడు జో బైడెన్‌కు విజ్ఞప్తి చేశారు. ఇలాన్ ఒమర్‌తో పాటు మరో 10 మంది కాంగ్రెస్ సభ్యులు ఈ మేరకు అమెరికా విదేశాంగ మంత్రి అంటోనీ బ్లింకెన్‌కు లేఖ రాశారు. దైవ దూషణ చట్టాన్ని మరింత కఠినతరం చేయడం తదితర చర్యలకు పాక్ పాల్పడుతున్న వైనాన్ని అందులో ప్రస్తావించారు. ''ఇవన్నీ పాక్‌లోని మతపరమైన మైనారిటీలను మరింతగా అణచివేసేందుకు తీసుకుంటున్న చర్యలే. ఎందుకంటే దైవదూషణ బిల్లును పాక్ పార్లమెంటు ఆమోదించిన కొద్ది రోజులకే మతోన్మాద మూకలు చర్చిలను ధ్వంసం చేయడంతో పాటు క్రైస్తవుల ఇళ్లకు నిప్పు పెట్టాయి'' అంటూ వారు ఆందోళన వెలిబుచ్చారు.

### విమాన టికెట్ కంటే ఎక్కువా?

రైలు చార్జీలపై మమత ధ్వజం

కోల్‌కతా: రైళ్లలో డైనమిక్ ప్రైసింగ్‌ను తక్షణం ఉపసంహరించాలని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ఆదివారం డిమాండ్ చేశారు. పండుగలు తదితర రద్దీ సందర్భంగా గత వారం దేశవ్యాప్తంగా పలు రూట్లలో రైలు టికెట్ల ధరలు విమాన టికెట్లను కూడా మించిపోతున్నాయని విమర్శించారు. ఇలాగైతే అత్యవసర పరిస్థితిలో రైల్లో ప్రయాణించాల్సిన వారి గతి ఏమిటని ఆమె ప్రశ్నించారు. డైనమిక్ ప్రైసింగ్‌ను తక్షణం రద్దు చేయడంతో పాటు ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు. మమత గతంలో రైల్వే మంత్రిగా కూడా చేయడం తెలిసిందే. రైలు టికెట్లకు డైనమిక్ ప్రైసింగ్‌ను 2016లో రైల్వే శాఖ ప్రవేశపెట్టింది. ఛత్ పూజ తదితరాల నేపథ్యంలో బిహార్, జార్ఖండ్ రాష్ట్రాల్లోని పలు ముఖ్య నగరాలకు రైలు టికెట్ల ధరలు విమాన టికెట్లను కూడా మించినట్టు వార్తలొచ్చాయి.

### పంజరంలో చిలుకలా ఈసీ: రౌత్

ముంబై: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఎన్నికల సంఘం కూడా పంజరంలో చిలుకలా మారిందని శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ ఆరోపించారు. అన్ని విషయాల్లోనూ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. ''ఉచితంగా అయోధ్య రామ మందిర దర్శనం కల్పిస్తామని ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా పదేపదే చెబుతున్నా ఈసీ పట్టించుకోవడం లేదు. అదే హామీ విపక్షాలు ఇస్తే వెంటనే షోకాజ్ నోటీసులిచ్చేది'' అంటూ పార్టీ పత్రిక సామ్నాకు రాసిన వ్యాసంలో రౌత్ విమర్శించారు. మోదీ హయాంలో భారత క్రికెట్ పూర్తిగా ఆయన స్వరాష్ట్రం గుజరాత్‌కు తరలిపోయిందని ఆరోపించారు. ''గతంలో దేశ క్రికెట్‌కు ముంబై ప్రధాన కేంద్రంగా ఉండేది. ఇప్పుడంతా అహ్మదాబాద్‌మయం! ప్రపంచ కప్ ఫైనల్ కూడా అక్కడే జరుగుతోంది! స్వీయ రాజకీయ లబ్ధి కోసం చివరికి క్రికెట్‌ను కూడా కూడా మోదీ సర్కారు పొలిటికల్ ఈవెంట్‌గా మార్చేసింది'' అని ఎద్దేవా చేశారు.

### లంచం తీసుకున్నట్టు నిరూపిస్తే... రాజకీయాలకు గుడ్‌బై

కర్ణాటక సీఎం సిద్ధరామయ్య

బెంగళూరు: ప్రభుత్వ శాఖల్లో పోస్టింగులు, బదిలీల్లో తన కుమారుడు యతీంద్ర భారీగా లంచాలు తీసుకున్నారన్న జేడీ(ఎస్)చీఫ్ హెచ్‌డీ కుమారస్వామి ఆరోపణలను కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆదివారం తీవ్రంగా ఖండించారు. తాను గానీ, యతీంద్ర గానీ లంచాలు తీసుకున్నట్టు నిరూపిస్తే రాజకీయాల నుంచే శాశ్వతంగా తప్పుకుంటానని ప్రకటించారు. లంచాలు తీసుకున్న చరిత్ర కుమారస్వామిదేనని ఎద్దేవా చేశారు. ఆయన హయాం పొడవునా అలాంటి వ్యవహారాలే జరిగాయని ఆరోపించారు. ఇటీవల సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన సిద్ధరామయ్య-యతీంద్ర ఫోన్ సంభాషణ పోస్టింగులు, బదిలీల్లో లంచాల గురించేనని కుమారస్వామి ఆరోపిస్తుండటం తెలిసిందే. యతీంద్ర సూపర్ సీఎంగా మారారంటూ ఆయన మండిపడ్డారు.

### మధ్యప్రదేశ్‌లో 77.15% పోలింగ్

భోపాల్: మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తుది పోలింగ్ శాతం 77.15 శాతమని కేంద్ర ఎన్నికల సంఘం ఆదివారం పేర్కొంది.2018 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఇది 1.52 శాతం ఎక్కువ. రాష్ట్రంలో 230 అసెంబ్లీ స్థానాలకు శుక్రవారం పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. 2018లో బీజేపీకి 41.02 శాతం ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 40.89 శాతమే వచ్చాయి.



అల్ షిఫా ఆస్పత్రి నుంచి తరలించిన అనంతరం రఫాలో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

## అల్–షిఫా నుంచి 31 మంది శిశువుల తరలింపు

**ఈజిప్టుకు తరలించి, మెరుగైన చికిత్స అందిస్తాం: గాజా ఆరోగ్య శాఖ**

**బందీల విడుదలకు హమాస్‌తో ఖతార్ ప్రతినిధుల చర్చలు**

ఖాన్ యూనిస్: అల్–షిఫా ఆసుపత్రిలోని హృదయ విదారక దృశ్యాలు ప్రపంచాన్ని కదిలించాయి. ఇజ్రాయెల్ నిర్బంధంలో ఉన్న ఆ ఆసుపత్రిలో శిశువుల దీన స్థితిని చూసి ప్రజలు చలించిపోయారు. వారి ప్రాణాలు కాపాడాలని ఇజ్రాయెల్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై ఇజ్రాయెల్ సానుకూలంగా స్పందించింది. శిశువుల తరలింపునకు అంగీకరించింది. నెలలు నిండకుండా పుట్టిన 31 మంది శిశువులను అల్–షిఫా హాస్పిటల్ నుంచి దక్షిణ గాజాలోని మరో ఆసుపత్రికి తరలించారు. వారిని పొరుగు దేశమైన ఈజిప్టుకు చేర్చి, మెరుగైన చికిత్స అందించనున్నట్లు గాజా ఆరోగ్య శాఖ ఆదివారం వెల్లడించింది. ఇంకా చాలామంది రోగులు, క్షతగాత్రులు, సామాన్య జనం ఇంకా అల్–షిఫా ఆసుపత్రిలోనే ఉన్నారు. ఇజ్రాయెల్ సైన్యం వారిని బయటకు వెళ్లనివ్వడం లేదు. ఇక్కడ ప్రాణాధార ఔషధాలు, ఆహారం, నీరు, విద్యుత్ లేకబాధితులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. అత్యవసర చికిత్స అవసరమైన శిశువులను అల్–షిఫా నుంచి అంబులెన్స్‌ల్లో దక్షిణ గాజాలోని రఫా హాస్పిటల్‌కు తరలిస్తున్నామని ప్రపంచ ఆరోగ్య సంస్థ చీఫ్ టెడ్రోస్ చెప్పారు.

**జబాలియా శరణార్థి శిబిరంపై క్షిపణుల వర్షం**

గాజాపై ఇజ్రాయెల్ సైన్యం భూతల, వైమానిక దాడులతో విరుచుకుపడుతోంది. అల్–షిఫా ఆసుపత్రిని పూర్తిగా దిగ్బంధించింది. సాధారణ జనావాసాలతోపాటు పాఠశాలలు, శరణార్థి శిబిరాలపైనా క్షిపణుల వర్షం కురిపిస్తోంది. ఉత్తర గాజాలోని జబాలియా శరణార్థి శిబిరంపై శనివారం అర్ధరాత్రి నుంచి దాడులు కొనసాగించింది. పదుల సంఖ్యలో జనం మరణించినట్లు తెలుస్తోంది. ఉత్తర గాజా నుంచి వెళ్లిపోవాలని ఇజ్రాయెల్ సైన్యం పదేపదే హెచ్చరిస్తోంది. హమాస్ మిలిటెంట్ల స్థావరాలను లక్ష్యంగా చేసుకొని దాడులు కొనసాగిస్తున్నామని, సాధారణ ప్రజలకు నష్టం వాటిల్లకూడదన్నదే తమ ఉద్దేశమని వెల్లడించింది. ఉత్తర గాజాలో ప్రస్తుతం తమ దళాలు చాలా క్రియాశీలకంగా పని చేస్తున్నాయని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంలో గాజాలో ఇప్పటిదాకా 12,000 మందికిపైగా మృతి చెందారు. మరో 2,700 మంది శిథిలాల కింద గల్లంతయ్యారు.

**బందీల విడుదలకు యత్నాలు**

గాజాలో హమాస్ చెరలో దాదాపు 240 మంది బందీలుగా ఉన్నారు. వారిలో ఇప్పటిదాకా నలుగురి బందీలను మిలిటెంట్లు విడుదల చేశారు. మరో ఇద్దరు బందీల మృతదేహాలు ఇటీవల్ అల్–షిఫా ఆసుపత్రి సమీపంలో లభ్యమయ్యాయి. మిగిలిన బందీల విడుదలకు ప్రయత్నాలు ఊపందుకున్నాయి. ఈ విషయంలో ఇజ్రాయెల్, అమెరికాతోపాటు పర్షియన్ గల్ఫ్ దేశమైన ఖతార్ చొరవ తీసుకుంటున్నాయి. ఖతార్ ప్రతినిధులు హమాస్ నేతలతో చర్చలు జరుపుతున్నారు. బందీలను క్షేమంగా విడుదల చేయాలని కోరుతున్నాయి.

### ఉత్తరాఖండ్ సొరంగంలో
## డ్రిల్లింగ్ నిలిపివేత

**అమెరికా యంత్రానికి అడ్డంకులు**

ఉత్తరకాశీ: ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉత్తరకాశీ జిల్లాలోని సిల్క్యారా సొరంగంలో చిక్కుకుపోయిన 41 మంది కార్మికులు ఇంకా బయటకురాలేదు. వారం రోజుల క్రితం సొరంగం కూలిపోవడంతో వారు అందులో చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. కార్మికులు బయటకు రావడానికి వీలుగా ఎస్కేప్ మార్గాన్ని సిద్ధం చేయడానికి తలపెట్టిన డ్రిల్లింగ్ పనులను ఆదివారం నిలిపివేశారు. డ్రిల్లింగ్ యంత్రానికి అడ్డంకులు ఎదురు కావడమే ఇందుకు కారణం. గట్టి రాళ్ల రప్పలు ఎదురవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. సహాయక చర్యలను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆదివారం సమీక్షించారు. బాధితులను క్షేమంగా బయటకు తీసుకురావడానికి భారీ డయామీటర్ స్టీల్ పైపులైన్‌ను సిద్ధం చేస్తున్నట్లు ఆయన చెప్పారు. సొరంగం శిథిలాల గుండా ఈ పైపులైన్‌ను పంపించనున్నట్లు తెలిపారు. సొరంగంలో కార్మికులు ఉన్న చోటుకి చేరుకోవడానికి నిట్టనిలువుగా కంటే అడ్డంగా తవ్వడమే సరైందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అమెరికా యంత్రానికి ఎలాంటి అడ్డంకులు ఎదురు కాకుంటే రెండున్నర రోజుల్లో కార్మికులు ఉన్న చోటుకి చేరుకోవచ్చని వెల్లడించారు. సొరంగంలో కార్మికులు స్వేచ్ఛగా అటూ ఇటూ తిరగగలుగుతున్నారని, వారికి ఆహారం, నీరు, విద్యుత్, ఆక్సిజన్ అందుతున్నాయని, ప్రాణాపాయం లేదని నితిన్ గడ్కరీ స్పష్టంచేశారు.అమెరికా యంత్రంతో అతిత్వరలో డ్రిల్లింగ్ ప్రారంభిస్తామని ప్రభుత్వ అధికారులు చెప్పారు. సొరంగంలో ఉన్న కార్మికులకు మల్టీ విటమిన్ మాత్రలు, ఎండు ఫలాలు తదితరాలు అందిస్తున్నామని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ కార్యదర్శి అనురాగ్ జైన్ ఆదివారం తెలిపారు.



విశ్వసుందరిగా నిలిచిన క్షణంలో పలాసియోస్ హర్షాతిరేకాలు

## విశ్వసుందరి పలాసియోస్

- నికరాగ్వా సుందరికి తొలిసారిగా మిస్ యూనివర్స్ కిరీటం
- ఫస్ట్ రన్నరప్‌గా థాయ్‌లాండ్ భామ ఆంటోనియా పోర్సిల్డ్
- సెకండ్ రన్నరప్‌గా ఆస్ట్రేలియా యువతి మొరాయా విల్సన్
- టాప్–20 జాబితాలో మిస్ ఇండియా శ్వేత శారద

న్యూఢిల్లీ: నికరాగ్వా సుందరి షెన్నిస్ పలాసియోస్ ప్రతిష్టాత్మకమైన మిస్ యూనివర్స్–2023 కిరీటం దక్కించుకుంది. నికరాగ్వా నుంచి ఒకరికి ఈ అంతర్జాతీయ గౌరవం దక్కడం ఇదే మొదటిసారి. 72వ ఎడిషన్ మిస్ యూనివర్స్ పోటీలు శనివారం రాత్రి ఎల్ సాల్వెడార్‌లోని శాన్ సాల్వెడార్‌లో జోస్ అడాల్ఫో పినెడా ఎరేనాలో ఘనంగా జరిగాయి. ఫస్ట్ రన్నరప్‌గా మిస్ థాయ్‌లాండ్ ఆంటోనియో పోర్సిల్డ్, సెకండ్ రన్నరప్‌గా మిస్ ఆస్ట్రేలియా మొరాయా విల్సన్ నిలిచారు. విశ్వ సుందరిగా నిలిచిన న షెన్నిస్ పలాసియోస్‌కు గతేడాది మిస్ యూనివర్స్ అమెరికా సుందరి ఆర్ బోనీ గాబ్రియెల్ కిరీటం అలంకరించారు. శుభాకాంక్షలు తెలియజేశారు. నికరాగ్వాలోని మనాగ్వాకు చెందిన 23 ఏళ్ల పలాసియోస్ మానసిక ఆరోగ్య కార్యకర్తగా బాధితులకు సేవలందిస్తున్నారు. ఆడియో విజువల్ ప్రొడ్యూసర్‌గానూ పని చేస్తున్నారు. ఈసారి మిస్ యూనివర్స్ పోటీల్లో 84 దేశాల నుంచి యువతులు పాల్గొన్నారు. భారత్ నుంచి మిస్ ఇండియా శ్వేత శారద పోటీపడ్డారు. ఆమె టాప్–20 జాబితాలో స్థానం దక్కించుకున్నారు.

## కోట్లకు పడగలెత్తారు

- రాజస్తాన్ అభ్యర్థుల్లో 651 మంది కోటీశ్వరులే
- బీజేపీలో 176 మంది, కాంగ్రెస్ 167 మంది కూడా
- 8 మంది అభ్యర్థులకు రూపాయి కూడా ఆస్తి లేదట
- 326 మంది అభ్యర్థులపై క్రిమినల్ కేసులు

సాక్షి, న్యూఢిల్లీ: రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగిన అభ్యర్థుల్లో ఏకంగా 35 శాతం మంది కోటీశ్వరులే! బరిలో నిలిచిన 1,875 మంది అభ్యర్థుల అఫిడవిట్లను విశ్లేషించి అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్), రాజస్తాన్ ఎలక్షన్ వాచ్ ఈ మేరకు తేల్చాయి. వారి ఆస్తులు, క్రిమినల్ కేసుల వివరాలతో శనివారం నివేదిక విడుదల చేశాయి.

**బీజేపీ, కాంగ్రెస్‌ల్లో కోటీశ్వరులదే హవా**

ఏడీఆర్ నివేదిక ప్రకారం రాజస్తాన్‌లో బరిలో నిలిచిన అభ్యర్థుల్లో 651 (35%) మంది కోటీశ్వరులున్నారు. ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీజేపీ కూడా వారికే ఎక్కువగా టికెట్లిచ్చాయి. మొత్తం 200 అసెంబ్లీ స్థానాకలు గాను బీజేపీ నుంచి 176 మంది, కాంగ్రెస్ నుంచి 167 మంది రూ.కోటికి మించి ఆస్తులు ప్రకటించారు. ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి 29 మంది, బీఎస్పీ నుంచి 36 మంది కూడా కోటీశ్వరులే. చురు కాంగ్రెస్ అభ్యర్థి రఫీక్ మండేలియా రూ.166 కోట్లతో అందర్లోనూ సంపన్నుడిగా నిలిచారు. రూ.123 కోట్లతో నీమ్ కా థానా బీజేపీ అభ్యర్థి ప్రేమ్ సింగ్ బజోర్ రెండో స్థానంలో ఉన్నారు. అయితే 8 అభ్యర్థులు తమకు ఒక్క రూపాయి ఆస్తి కూడా లేదని పేర్కొనడం విశేషం. 922 మంది తమకు అప్పులున్నట్టు వెల్లడించారు. ఇక 326 మంది అభ్యర్థులపై క్రిమినల్ కేసులున్నాయి. బీజేపీ 61 మందికి, కాంగ్రెస్ 47, ఆప్ 18, బీఎస్పీ 12 మంది నేర చరితులకు టికెట్లిచ్చాయి. క్రిమినల్ కేసులున్న ముగ్గురు, అంతకంటే ఎక్కువ మంది బరిలో ఉన్న రెడ్ అలర్ట్ నియోజకవర్గాలు రాష్ట్రంలో 45 ఉన్నాయి. 643 మంది, 34 శాతం మంది అభ్యర్థులు 25–40 ఏళ్ల మధ్య వయస్కులు. 80 ఏళ్ల పై చిలుకు అభ్యర్థులు 8 మంది ఉన్నారు. 183 మంది, అంటే 10 శాతం మంది పోటీలో ఉన్నారు. 137 మంది అభ్యర్థులు కేవలం అక్షరాస్యులు కాగా 11 మంది నిరక్షరాస్యులమని ప్రకటించారు. కోటీశ్వరుల్లో చాలామంది కోట్లలో అప్పు కూడా చూపించారు.

## ఐదేళ్లుగా పరస్పరం రనౌట్‌కు కుట్రలు

- రాజస్తాన్ కాంగ్రెస్ నేతల తీరుపై ప్రధాని నరేంద్ర మోదీ ఎద్దేవా
- అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలే కాంగ్రెస్ సంప్రదాయం
- రాజస్తాన్‌లోని చురు జిల్లాలో మోదీ ఎన్నికల ప్రచారం

జైపూర్: దేశమంతటా ఎక్కడ చూసినా క్రికెట్ ప్రపంచకప్ ముచ్చట్లే. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజస్తాన్‌లో కాంగ్రెస్ పార్టీ తీరును క్రికెట్ టీమ్‌తో పోల్చారు. రాజస్తాన్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఒకరినొకరు రనౌట్ చేసుకొనేందుకు గత ఐదేళ్లుగా కుట్రలు పన్నుతున్నారని చెప్పారు. తద్వారా ఆ పార్టీలో నేతల మధ్య రగులుతున్న అంతర్గత విభేదాలను, సీఎం అశోక్ గహ్లోత్, సీనియర్ నాయకుడు సచిన్ పైలట్ మధ్య ఆధిపత్య పోరును ప్రస్తావించారు. వారు పరుగులు చేయడానికి బదులు, సొంత టీమ్‌లోని ప్రత్యర్థులను పడగొట్టాలని చూశారని చెప్పారు. వారి టీమ్ సరిగ్గా లేనప్పుడు ఇక ప్రజల కోసం ఏం చేస్తారని ప్రశ్నించారు. ఆదివారం రాజస్తాన్‌లోని చురు జిల్లాలోని ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని మండిపడ్డారు. అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలు అనే సంప్రదాయాన్ని కాంగ్రెస్ అభివృద్ధి చేసిందని, దాని వల్ల దేశం భారీగా నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ తీరు వల్ల దేశంలో యువతకు ఎదిగే అవకాశాలు రాలేదని చెప్పారు.

**పేపర్ లీక్ మాఫియాపై సమగ్ర దర్యాప్తు జరిపిస్తాం..**

రాజస్తాన్‌లో బీజేపీకి అధికారం అప్పగిస్తే అవినీతిపరుల భరతం పడతామని, వేగవంతమైన అభివృద్ధికి శ్రీకారం చుడతామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. కాంగ్రెస్‌కు ఎంత దూరంగా ఉంటే రాజస్తాన్‌కు అంత మేలు జరుగుతుందని, భవిష్యత్తుకు భరోసా లభిస్తుందని ప్రజలకు సూచించారు. వెలుతురికి, చీకటికి మధ్య ఉన్న సంబంధం లాంటిదే మంచికి, కాంగ్రెస్‌కు మధ్య కూడా ఉందని అన్నారు. రాష్ట్రంలో జల జీవన్ మిషన్‌లో భారీ కుంభకోణం జరిగిందని ఆరోపించారు. ప్రజలకు తాగునీరు సరఫరా చేయడానికి ఉద్దేశించిన పథకంలోనూ నిధులు కొల్లగొట్టారని దుయ్యబట్టారు. కాంగ్రెస్, అభివృద్ధి అనేవి పరస్పరం శత్రువులని, ఆ శత్రుత్వం ఎప్పటికీ కొనసాగుతుందని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పేపర్ లీక్ మాఫియా యువత భవిష్యత్తును లక్షలాది రూపాయలకు అమ్మేసిందని ధ్వజమెత్తారు. ఎరువుల కుంభకోణంతో రైతులను విచ్చలవిడిగా లూటీ చేసిందని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే పేపర్ లీక్ మాఫియాపై సమగ్ర దర్యాప్తు జరిపిస్తామని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. అక్రమార్కులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని, కఠినంగా శిక్షిస్తామని తేల్చిచెప్పారు.

**2047 నాటికి 'అభివృద్ధి చెందిన భారత్'**

రాజస్తాన్‌లో కాంగ్రెస్ పాలనలో ధరలు భారీగా పెరిగిపోయానని మోదీ గుర్తుచేశారు. హరియాణా, గుజరాత్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలతో పోలిస్తే ఇక్కడ లీటర్ పెట్రోల్ ధర రూ.13 అధికంగా ఉందన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే ధరలను సమీక్షిస్తామని, ప్రజలకు ఊరట కల్పిస్తామని వెల్లడించారు. కొన్నేళ్లలో అన్ని రంగాల్లోనూ భారత్ అద్భుతాలు చేసిందన్నారు. ఎటు చూసినా నూతనోత్సాహం, ఆత్మవిశ్వాసం కనిపిస్తున్నాయని, 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.



### విస్కీ బాటిల్ రూ. 22.5 కోట్లు!

ప్రపంచంలోనే ఖరీదైనదిగా రికార్డు

లండన్: అవున్నిజమే. మెకాలన్ బ్రాండ్‌కు చెందిన ప్రీమియం స్కాచ్ బాటిల్ ఒకటి ఏకంగా రూ.22.5 కోట్లు పలికింది! శనివారం సోత్‌బే వేలంలో ఇది అక్షరాలా అంత మొత్తానికి అమ్ముడైంది! దాంతో ప్రపంచంలోకెల్లా అత్యంత ఖరీదైన విస్కీగా కొత్త రికార్డు సృష్టించింది. దీని ప్రత్యేకతలే ఇంతటి ధరకు కారణమయ్యాయి. ఈ సింగిల్ మాల్ట్ విస్కీ 1926 నాటిది. మెకాలన్ కంపెనీ ఇలాంటి 40 బాటిళ్లను మాత్రమే తయారు చేసింది. వాటిని ఏకంగా 60 ఏళ్ల పాటు డార్క్ ఓక్‌వుడ్ పెట్టెల్లో నిల్వ చేసి ఉంచి 1986లో బయటికి తీశారట. కొన్నింటిని మెకాలన్ తన వీఐపీ కస్టమర్లకు విక్రయించిందట.

### పిల్లలపై లైంగిక వేధింపులు... కామాంధునికి 707 ఏళ్ల శిక్ష

కాలిఫోర్నియా: అమెరికాలో పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ మాథ్యూ జక్‌ర్జెవ్‌స్కీ అనే కామాంధునికి ఏకంగా 707 ఏళ్ల జైలు శిక్ష పడింది. కాలిఫోర్నియాకు చెందిన అతను పిల్లల బాగోగులు చూసుకునే నానీగా పని చేసేవాడు. ఆ క్రమంలో 2014–19 మధ్య 2 నుంచి 12 ఏళ్ల వయసున్న కనీసం 16 మంది పిల్లలను లైంగికంగా వేధించాడు. మరో బాలునికి అశ్లీల చిత్రాలు చూపించాడు. తన కొడుకును మాథ్యూ అభ్యంతకర రీతిలో తాకుతూ ఇబ్బంది పెట్టాడంటూ 2019లో ఒక వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విదేశాలకు పారిపోతుండగా అతన్ని అరెస్టు చేశారు. 17 మంది అమాయకుల బాల్యాన్ని మాథ్యూ ఛిద్రం చేశాడని తీర్పు సందర్భంగా జడ్జి అన్నారు.

### రాజస్తాన్‌లో రోడ్డు ప్రమాదం... ఆరుగురు పోలీసుల దుర్మరణం

చురు: రాజస్తాన్‌లో చురు జిల్లాలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో భద్రతా విధుల నిమిత్తం వెళ్తున్న ఆరుగురు పోలీసు సిబ్బంది ఈ ఘటనలో దుర్మరణం పాలయ్యారు. వారంతా నగౌర్ నుంచి ఎన్నికల ర్యాలీ జరగనున్న ఝుంఝును వెళ్తుండగా తెల్లవారుజామున ప్రమాదం జరిగింది. వారు ప్రయాణిస్తున్న కారు దట్టమైన పొగ మంచు కారణంగా ఎదురుగా వస్తున్న ట్రక్కును ఢీకొంది. దాంతో ఐదుగురు అక్కడికక్కడే మరణించారు. మరొకరు ఆస్పత్రిలో కన్నుమూశారు. తీవ్రంగా గాయపడ్డ మరొకరి పరిస్థితి విషమంగా ఉంది.

### హిందూ మత విశ్వాసమే స్ఫూర్తి: వివేక్ రామస్వామి

వాషింగ్టన్: హిందూ మత విశ్వాసం తనకు అన్ని విషయాల్లోనూ సరైన నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ ఇచ్చిందని అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లిక్ పార్టీ అభ్యర్థిత్వం కోసం పోటీ పడుతున్న భారతీయ అమెరికన్ వివేక్ రామస్వామి చెప్పారు. అధ్యక్ష రేసులో నిలిచేందుకు కూడా ఆ విశ్వాసమే తనకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. ప్రతి జీవిలోనూ దేవుడున్నాడన్నది హిందూ మత మౌలిక విశ్వాసమని 38 ఏళ్ల వివేక్ చెప్పారు.

## మోదీ నినాదం.. అదానీజీ కీ జై

- నిత్యం 24 గంటలూ అదానీ సేవలో తరిస్తున్న ప్రధానమంత్రి
- రాజస్తాన్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ధ్వజం

బుంది/దౌసా: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బడా పారిశ్రామికవేత్త అయిన గౌతమ్ అదానీ సేవలో తరిస్తున్నారని, ఆయన కోసమే పని చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. 'భారత్ మాతా జై' అని చెప్పే మోదీ అదానీ కోసం నిత్యం 24 గంటలూ పరితపిస్తున్నారని ఎద్దేవా చేశారు. 'భారత్ మాతాకీ జై' అనడానికి బదులు 'అదానీజీ కీ జై' అని నినదించాలని మోదీకి హితవు పలికారు. భరతమాత అంటే పేదలు, రైతులు, కార్మికులేనని స్పష్టం చేశారు. ఆదివారం రాజస్తాన్‌లోని బుంది, దౌసా జిల్లాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా రాహుల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. బహిరంగ సభల్లో ప్రసంగించారు. ప్రధాని మోదీ రెండు హిందూస్తాన్‌లను సృష్టించాలని భావిస్తున్నారని, అందులో ఒకటి అదానీ కోసం, మరొకటి పేదల కోసం ఏర్పాటు చేయాలని అనుకుంటున్నారని రాహుల్ ఆరోపించారు. దేశవ్యాప్తంగా కుల గణన ఎందుకు నిర్వహించడం లేదని మోదీని నిలదీశారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే దేశమంతటా కుల గణన ప్రారంభిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. రాజస్తాన్‌లోనూ అధికారంలోకి రాగానే కులగణనకు మొట్టమొదటి ప్రాధాన్యం ఇస్తామన్నారు. కులగణనతోనే భరతమాత విజయం సాధిస్తుందని వివరించారు.



**రోజుకు మూడుసార్లు దుస్తులు మారుస్తారు**

మనదేశంలో బడా పారిశ్రామికవేత్తల్లో ఎవరైనా ఓబీసీలు, దళితులు, గిరిజనులు ఉన్నారా అని రాహుల్ ప్రశ్నించారు. రాజస్తాన్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఆగిపోతాయన్నారు. మోదీ రూ.12,000 కోట్లతో విమానం కొనుక్కున్నారని, రోజుకు మూడు సార్లు దుస్తులు మారుస్తారని, రూ.12 కోట్ల విలువైన కారులో ప్రయాణిస్తుంటారని మోదీపై ధ్వజమెత్తారు. తమ జనాభా ఎంత ఉందో చెప్పాలని ఓబీసీ, దళిత, గిరిజన యువత అడిగితే మాత్రం కులాలు లేవని ప్రధానమంత్రి అంటున్నారని దుయ్యబట్టారు. మోదీ 90 మంది ఐఏఎస్ అధికారులతో పరిపాలన నడిపిస్తున్నారని, వారిలో ఓబీసీలు ముగ్గురే ఉన్నారని వెల్లడించారు. దేశంలో ఓబీసీల జనాభా 50 శాతం ఉందని, ఐఏఎస్‌లు మాత్రం జనాభాకు తగ్గట్టుగా లేరని తెలిపారు.

## యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌తో ముప్పు

- ప్రపంచవ్యాప్తంగా ప్రతిఏటా 50 లక్షల మంది
- 2050 నాటికి మృతుల సంఖ్య కోటికి పెరిగే అవకాశం
- దక్షిణాఫ్రికా, యూకేలో జరిగిన అధ్యయనంలో వెల్లడి

ఆక్స్‌ఫర్డ్(యూకే): కంటికి కనిపించని సూక్ష్మమైన బ్యాక్టీరియా, వైరస్‌లు, పారాసైట్లు, ఫంగస్ వంటివి మనిషి శరీరం లోపల, బయట, చుట్టూ ఉంటాయి. వీటిని మైక్రోబ్స్ అని పిలుస్తుంటారు. మన నిత్య జీవితంలో ఇవన్నీ ఒక భాగమే. కొన్ని రకాల జీవ క్రియలకు మైక్రోబ్స్ అవసరం. జీర్ణకోశ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండడానికి, రోగ నిరోధక వ్యవస్థ సక్రమంగా పని చేయడానికి, ఆహారంలోని పోషకాలను శరీరం శోషించుకోవడానికి బ్యాక్టీరియా, వైరస్‌లు తోడ్పడుతుంటాయి. వ్యవసాయం, పరిశ్రమల్లోనూ వీటి ప్రాధాన్యం ఎక్కువే. అయితే, ఈ మైక్రోబ్స్ కేవలం మేలు చేయడమే కాదు, కొన్ని సందర్భాల్లో కీడు చేస్తుంటాయి. అనారోగ్యం కలిగిస్తుంటాయి. మనుషులతోపాటు జంతువులు, మొక్కలకు హాని కలిగిస్తాయి. అందుకే యాంటీ మైక్రోబియల్ టీకాలను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఇవి మైక్రోబ్స్‌ను అంతం చేయడం లేదా వాటిని వ్యాప్తిని తగ్గించడం చేస్తుంటాయి. కాలానుగుణంగా మైక్రోబ్స్ ఔషధ నిరోధక శక్తిని పెంచుకుంటాయి. అంటే టీకాలను లొంగకుండా తయారవుతాయి. అంతిమంగా 'సూపర్‌బగ్స్'గా మారుతాయి. అప్పుడు టీకాలు, ఔషధాలు ప్రయోగించిన ఫలితం ఉండదు. ఈ పరిణామాన్ని యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్) అంటారు. ఈ ఏఎంఆర్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రతిఏటా 50 లక్షల మంది మరణిస్తున్నారని తాజాగా దక్షిణాఫ్రికా, యూకేలో జరిగిన అధ్యయనంలో వెల్లడయ్యింది. హెచ్ఐవీ/ఎయిడ్స్, మలేరియా సంబంధిత మరణాల కంటే ఇవి చాలా అధికం. ఏఎంఆర్‌తో ఏటా మృత్యువాత పడే వారి సంఖ్య 2050 నాటికి ఏకంగా కోటికి చేరుతుందని సైంటిస్టులు అంచనా వేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే క్యాన్సర్ సంబంధిత మరణాలను కూడా త్వరలో ఏఎంఆర్ మరణాలు అధిగమిస్తాయని అంటున్నారు.

- ప్రపంచవ్యాప్తంగా యాంటీబయోటిక్స్ వాడకం మితిమీరుతోంది.
- 2000 నుంచి 2015 మధ్య ఇది 65 శాతం పెరిగిపోయిందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.
- మొత్తం యాంటీ మైక్రోబియల్స్ 73 శాతం ఔషధాలను ఆహారం కోసం పెంచే జంతువులపైనే ఉపయోగిస్తున్నట్లు తేలింది.
- ఇలాంటి జంతువులను భుజిస్తే మనుషుల్లోనూ మైక్రోబ్స్ బలోపేతం అవుతున్నాయని, ఔషధాలకు లొంగని స్థితికి చేరుకుంటున్నాయని నిపుణులు గుర్తించారు.
- యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అనేది కేవలం కొన్ని దేశాల సమస్య కాదని, ఇది ప్రపంచ సమస్య అని నిపుణులు చెబుతున్నారు.
- దీనిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. యాంటీబయోటిక్స్‌పై ఆధారపడడాన్ని తగ్గించుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వాలు కూడా దీనిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని పేర్కొంటున్నారు.

Interview

మేకల కళ్యాణ్ చక్రవర్తి

రాష్ట్ర సంపదను ప్రజలకు పంపిణీ చేయాలన్నదే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని, ఆ ఆలోచనతో ముందుకెళుతున్నామని అంటున్నారు కాంగ్రెస్ శాసనసభా పక్షం (సీఎల్పీ) నాయకుడు మల్లు భట్టి విక్రమార్క. తెలంగాణ ప్రజలు ఆత్మగౌరవంతో బతికేందుకు బీఆర్ఎస్ ఓడిపోవాల్సిన అవసరం ఉందని, అందుకే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ప్రజలు నిర్ణయించుకున్నారని చెప్పారాయన. మధిర నియోజకవర్గంలోని బోనకల్ మండలం సీతానగరం, పెదబీరవెల్లి, చినబీరవెల్లి, నారాయణపురం, జానకీపురం, రావినూతల గ్రామాల్లో ఆయన ఆదివారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా 'సాక్షి'కి ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్న తీరు, కాంగ్రెస్ పార్టీ ప్రచార వ్యూహం, బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంల వైఖరి, అభివృద్ధి ప్రణాళికలతో పాటు తనకు ముఖ్యమంత్రి పదవి దక్కే అవకాశాలపై ఈ ఇంటర్వ్యూలో ఆయన ఏమన్నారంటే.!



# విధేయతే నా బలం

ప్రజాభిమానమే నా బలగం

పార్టీకి సంస్థాగత వారసుడిని..

నాకు ప్రాధాన్యం ఇవ్వడంలో తప్పేముంటుంది

తెలంగాణకు కేసీఆరే ప్రధాన శత్రువు

బీఆర్ఎస్‌కు ఇక్కడ ఓటేస్తే ఢిల్లీలో బీజేపీకి వేసినట్టే

బీఆర్ఎస్ చెబుతున్నందుకే బీజేపీ మా పార్టీ నాయకులపై ఐటీ దాడులు చేయిస్తోంది

సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క

**ఈ ఎన్నికల్లో మిమ్మల్ని ప్రజలెందుకు గెలిపించాలి?**

రాష్ట్ర సంపదను ప్రజలకు పంపిణీ చేయాలన్నదే కాంగ్రెస్ ఆలోచన. పరిశ్రమల ఏర్పాటు, వ్యవసాయం, సేవా రంగాల అభివృద్ధి ద్వారా సంపదను సృష్టించి దానిని ఎలా పంచుతామో ఇప్పటికే ప్రజలకు చెప్పాం. ఇంటింటికీ మా గ్యారంటీ కార్డులు పంపిణీ చేశాం. ఆత్మగౌరవం, సంపద పంపిణీనే ఈ ఎన్నికల్లో ప్రచారాస్త్రాలు. ప్రజలు మా వాదనను అర్థం చేసుకుంటున్నారు. అందుకే ఈసారి గెలిపించాలనే నిర్ణయానికి వచ్చారు 80కి పైగా స్థానాల్లో విజయం సాధించి ఈసారి అధికారంలోకి వస్తాం.

**బీఆర్ఎస్, బీజేపీల గురించి ఏం చెప్తారు?**

ఆ రెండు పార్టీలు ఒక్కటే. బీఆర్ఎస్‌కు ఇక్కడ ఓటేయడమంటే నేరుగా ఢిల్లీలో బీజేపీకి ఓటేసినట్టే. ప్రజలు బీఆర్ఎస్‌కు ఓటేస్తే.. బీఆర్ఎస్ బీజేపీకి ఓటేస్తుంది. బీఆర్ఎస్–బీజేపీల బంధం గురించి కొత్తగా మేం చెపాల్సింది ఏమీ లేదు. గత పదేళ్ల చరిత్ర చెపుతోంది అదే.

**తెలంగాణకు కాంగ్రెస్సే ప్రధాన శత్రువు అని కేసీఆర్ అంటున్నారు కదా?**

తెలంగాణ ప్రజల ప్రధాన శత్రువు కేసీఆర్. అడుగడుగునా దోపిడీలు, అక్రమాలు చేస్తూ రాష్ట్రంలో ఫ్యూడల్ వ్యవస్థను పునర్నిర్మించేందుకు ఆయన తపనపడుతున్నారు రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కేసీఆర్ పూర్తిగా నిర్వీర్యం చేశారు. బాంచన్ దొర బతుకుల కోసమే కేసీఆర్ ప్రయత్నం.

**ఎంఐఎం మిమ్మల్ని బాగా టార్గెట్ చేస్తున్నట్టుంది?**

బీఆర్ఎస్‌కు ఎంఐఎం మద్దతిస్తే బీఆర్ఎస్ బీజేపీకి సహకరిస్తుంది. బీఆర్ఎస్ టూ బీజేపీ వయా ఎంఐఎం అన్నట్టుగా ఈ మూడు పార్టీలు రాజకీయం చేస్తున్నాయి. నిజమైన లౌకిక వాద పార్టీ కాంగ్రెస్ మాత్రమే. దేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను కాపాడేది మేమే. రాష్ట్రంలోని మైనార్టీలందరూ ఆలోచించాలి. కాంగ్రెస్‌కు మద్దతివ్వడం ద్వారా లౌకికవాద మనుగడకు వారంతా చేయూతనందించాలి.

**మీ పార్టీ నేతలపై ఐటీ దాడుల గురించి ఏమంటారు?**

బీఆర్ఎస్ చెపుతుంటే బీజేపీ మా నాయకులపై ఐటీ దాడులు చేస్తోంది. ఈ రెండు పార్టీలు ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తులు. ప్రతిపక్షాలను లొంగదీసుకుని, బీజేపీ ఇచ్చిన శక్తిని కూడగట్టుకుని రాష్ట్రంలో మనుగడ సాగించేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది.

**బీసీల గురించి రాహుల్‌గాంధీ కూడా పదేపదే మాట్లాడుతున్నారు?**

దొరల తెలంగాణ, ప్రజల తెలంగాణకు మధ్య పోరాటం జరుగుతుందని ఇప్పటికే మా నాయకుడు రాహుల్‌గాంధీ చెపుతున్నారు. రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల సమున్నతి కోసం మేం కట్టుబడి ఉన్నాం. అందుకే బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేస్తామని మేం మేనిఫెస్టోలో చెబితే, బీసీల జనగణన దేశమంతా చేస్తామని రాహుల్ గాంధీ చెబుతున్నారు. నేను పాదయాత్రలో ఉన్నప్పుడే సీఎంకు బీసీ సబ్‌ప్లాన్‌పై లేఖ రాశా. బీసీలకు గౌరవమిచ్చేది కాంగ్రెస్ పార్టీనేనని తెలంగాణ ప్రజలకు కూడా తెలుసు.

**పాదయాత్ర అనుభవాలు ఎన్నికల్లో ఉపయోగపడుతున్నాయా?**

నా పాదయాత్ర ప్రభావం ఈ ఎన్నికల్లో స్పష్టంగా కనిపిస్తోంది. పాదయాత్ర ద్వారా కాంగ్రెస్ పార్టీని ప్రజల మధ్యకు తెచ్చా. నా పాదయాత్ర సందర్భంగానే మంచిర్యాల,జడ్చర్ల, ఖమ్మం లాంటి ప్రాంతాల్లో భారీ బహిరంగసభలు ఏర్పాటు చేసి రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం కాంగ్రెస్సేనని చెప్పడమే కాకుండా మా పార్టీ అధికారంలోకి వస్తుందనే సంకేతాలను ప్రజల్లోకి పంపగలిగాం. పాదయాత్ర సందర్భంగా ప్రజలు వివరించిన సమస్యలకు మా మేనిఫెస్టోలో స్థానం కల్పించాం. వాటికి పరిష్కారం చూపెడతాం.

**కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మీరు సీఎం అవుతారని అనుకుంటున్నారా.?**

నేను కాంగ్రెస్ మనిషిని. పార్టీకి విధేయుడిని. నా విధేయతే నాకు పెద్ద బలం. ఎన్ఎస్‌యూఐ, యూత్‌కాంగ్రెస్ నుంచి వచ్చి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, ప్రచార కమిటీ చైర్మన్‌గా పనిచేశా. అసెంబ్లీలో చీఫ్ విప్, డిప్యూటీ స్పీకర్ హోదాల్లో పాలనానుభవం సంపాదించా. సీఎల్పీ నాయకుడిగా రాష్ట్ర ప్రజలెదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రజల అభిమానం చూరగొన్నా. వారి అభిమానమే నాకు బలగం. పార్టీకి సంస్థాగత వారసుడిని. నాకు ప్రాధాన్యం ఇవ్వడంలో తప్పేముంటుంది. రాష్ట్ర భవిష్యత్‌కు సంబంధించిన పదవి విషయంలో పార్టీ అధిష్టానం కూడా అన్నీ ఆలోచించి నిర్ణయం తీసుకుంటుంది. అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా నాకు శిరోధార్యమే.

**జలగం వెంగళరావు లాంటి హోదా వస్తుందని అందుకే అన్నారా?**

తెలంగాణ రాజకీయాల్లో ఖమ్మం జిల్లాకు ప్రత్యేకత ఉంది. అనేక భావజాలాలు, ఆలోచనలు, పరిణతి చెందిన రాజకీయాలకు ఖమ్మం పెట్టింది పేరు. చాలా చైతన్యవంతమైన జిల్లా ఇది. మా జిల్లాకు చెందిన జలగం వెంగళరావు సీఎల్పీ నాయకుడిగా పనిచేశారు. నేను కూడా సీఎల్పీ నాయకుడిగా చేశా. మరోసారి ప్రజలు ఆశీర్వదిస్తే ఆయన లాంటి హోదా వచ్చే అవకాశం ఉందని నా నియోజకవర్గం, జిల్లా ప్రజలకు చెప్పుకోవాల్సిన బాధ్యత నాపై ఉంటుంది. అందుకే అలా చెప్పా.

**మీ ప్రచార సభల్లో సీఎం.. సీఎం అనే నినాదాలు వినిపిస్తున్నాయి?**

అది వారి మనసులో ఉన్న కోరిక కావొచ్చు. కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రి కావాలంటే ముందు పార్టీ శాసనసభాపక్షం (సీఎల్పీ) నాయకుడిగా ఎన్నికవ్వాలి. ఇప్పటికే నేను సీఎల్పీ నాయకుడిగా ఉన్నాను కాబట్టి నా నియోజకవర్గ ప్రజలు ఆశతో ఉన్నారేమో. అందుకే అలాంటి నినాదాలు మీకు వినిపించి ఉంటాయి. పదవుల సంగతి ఎలా ఉన్నా పార్టీని గెలిపించేందుకు రాష్ట్రంలోని కాంగ్రెస్ నాయకత్వం కలిసికట్టుగా పనిచేస్తోంది.



# మెతుకు సీమలో.. నువ్వా నేనా!

ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి
ముహమ్మద్ ఫసియుద్దీన్

బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ

గజ్వేల్, సిద్దిపేటల్లో బీఆర్ఎస్ జోరు

మిగిలిన ఏడు చోట్లలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే..

దుబ్బాకలో బీజేపీ నుంచి పోటీ

సర్వశక్తులూ ఒడ్డుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

ప్రభుత్వ వ్యతిరేక పవనాలపైనే కాంగ్రెస్ ఆశలు

మళ్లీ సంఘటితమైన కాంగ్రెస్ పార్టీ పాత కేడర్

మెతుకుసీమ ఉమ్మడి మెదక్ జిల్లాలో అత్యధిక శాసనసభ స్థానాల్లో నెగ్గి రాజకీయ ఆధిపత్యం నిలుపుకునేందుకు అధికార బీఆర్ఎస్ చెమటోడ్చుతుండగా, మళ్లీ పూర్వ వైభవాన్ని సంతరించుకోవడానికి కాంగ్రెస్ పార్టీ విశ్వప్రయత్నాలు చేస్తోంది. ముఖ్యమంత్రి కేసీఆర్ సొంతజిల్లా ఉమ్మడి మెదక్‌లో బీఆర్ఎస్, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ హోరాహోరీగా తలపడుతున్నాయి. బీజేపీ రెండు నియోజకవర్గాల్లో గట్టి పోటీ ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆసరా పెన్షన్లు, రైతుబంధు, రైతుబీమా, దళితబంధు, బీసీ బంధు, కళ్యాణలక్ష్మి వంటి ప్రజాకర్షక సంక్షేమ పథకాలే ప్రధాన అండగా బీఆర్ఎస్ భావిస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 10 శాసనసభ నియోజకవర్గాలుండగా, సిద్దిపేట, గజ్వేల్ మినహా మిగిలిన 8 నియోజకవర్గాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు నువ్వానేనా అన్నట్టు తలపడుతున్నాయి. అధికార బీఆర్ఎస్ కార్యకర్తలు సర్వశక్తులూఒడ్డి పార్టీని గట్టెక్కించడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో ఒకప్పుడు బలంగా ఉన్న కాంగ్రెస్ పాత కేడర్ మళ్లీ సంఘటితమై ఆ పార్టీ గెలుపుకోసం పావులు కదుపుతోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రజానాడిని పట్టేందుకు 'సాక్షి' క్షేత్రస్థాయిలో అన్ని నియోజకవర్గాల్లో పర్యటించి అందిస్తున్న ప్రత్యేక గ్రౌండ్ రిపోర్టు.

గ్రౌండ్ రిపోర్ట్
ఉమ్మడి మెదక్

### సిద్దిపేట మెజారిటీపైనే లెక్కలు



హరీశ్‌రావు

సిద్దిపేటలో బీఆర్ఎస్ తరఫున మంత్రి తన్నీరు హరీశ్ రావు, కాంగ్రెస్ తరఫున పూజల హరికృష్ణ పోటీ చేస్తున్నారు. 2004, 2008, 2010 ఉప ఎన్నికలు, 2009, 2014, 2018 సాధారణ ఎన్నికల్లో సిద్దిపేట నుంచి వరుసగా ఆరు పర్యాయాలు గెలుపొందిన హరీశ్‌రావుకు ఈ ఎన్నికలు కూడా నల్లేరు మీద నడక లాంటివేనని తెలుస్తోంది. 2018లో 1.18లక్షల ఓట్ల మెజారిటీతో గెలిచి ఆయన రికార్డు సృష్టించారు. ఆయనకు పెద్దగా పోటీ లేదనే చెప్పాలి.

### సంగారెడ్డి ఆ ఇద్దరి మధ్యే

కాంగ్రెస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే తూర్పు జయప్రకాశ్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మధ్య సంగారెడ్డిలో ద్విముఖ పోటీ నెలకొని ఉంది. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచి బలమైన నాయకుడిగా పేరు పొందడం జగ్గారెడ్డికి కలిసివచ్చే అంశం. ఆయన స్థానికంగా ఉండడం లేదని విమర్శ ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ఆయన ఆలస్యంగా ప్రచారాన్ని ప్రారంభించగా, టీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ రెండు నెలలుగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. 2014లో ఒకసారి ఎమ్మెల్యేగా గెలిచిన చింతా ప్రభాకర్ ప్రస్తుత ఎన్నికల్లో బీఆర్ఎస్ పథకాలు, పార్టీ బలగంపై ఆశలు పెట్టుకున్నారు.

### మెదక్ మెరిసేదెవరో..

మెదక్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్ మధ్య గట్టిపోటీ నెలకొని ఉంది. పద్మాదేవేందర్ రెడ్డి 2004లో రామాయంపేట(2009లో రద్దైంది), 2014, 2018 లో మెదక్ నుంచి గెలుపొందారు. నియోజకవర్గ వ్యవహారాల్లో ఆమె భర్త దేవేందర్‌రెడ్డి జోక్యంపై కొంత ప్రతికూల ప్రచారం ఉంది. బీఆర్ఎస్ పథకాలే ఆమెకు బలం. మల్కాజ్‌గిరి ఎంపీ మైనంపల్లి హన్మంతరావు కుమారుడైన మైనంపల్లి రోహిత్ తొలిసారిగా మెదక్ నుంచి పోటీచేస్తున్నారు. హన్మంతరావు 2009లో టీడీపీ తరఫున ఇక్కడి నుంచి గెలుపొందారు. స్థానికంగా మైనంపల్లి కుటుంబానికి గట్టి పట్టు ఉండడం రోహిత్‌కు కలిసి వచ్చే అంశం.

### జహీరాబాద్ ఎవరికి జై కొట్టేనో..

జహీరాబాద్ ఎస్సీ రిజర్వ్ స్థానంలో సిట్టింగ్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కొన్నింటి మాణిక్‌రావు, కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ మధ్య ద్విముఖ పోటీ నెలకొని ఉంది. మాణిక్‌రావు స్థానికుడిగా మూడోసారి పోటీ చేస్తున్న అభ్యర్థిగా ఓటర్లతో కలియతిరుగుతున్నారు. కాంగ్రెస్ నుంచి నరోత్తమ్ బీఆర్ఎస్‌లో చేరడం ఆయనకు కలిసి వచ్చే అంశమే. ఇక చంద్రశేఖర్ స్థానికుడైనా, ఈ ప్రాంత ప్రజలకు కొత్త అభ్యర్థి. అయితే కాంగ్రెస్ పార్టీకి జహీరాబాద్ కంచుకోటగా పేరుంది. ఇప్పటి వరకు ఇక్కడ 14 సార్లు ఎన్నికలు జరగగా, కాంగ్రెస్ పార్టీ 12 సార్లు గెలుపొందింది. స్థానికంగా పార్టీకి బలమైన కేడర్, ఓటు బ్యాంకు ఉండడం కాంగ్రెస్‌కు కలిసివచ్చే అంశాలు.

### పటాన్‌చెరు పోటాపోటీ

పటాన్‌చెరులో బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి కాటా శ్రీనివాస్‌గౌడ్ మధ్య ప్రధాన పోటీ నెలకొని ఉంది. 2014, 2018లో ఇక్కడి నుంచి గెలిచిన మహిపాల్ రెడ్డి స్థానికంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2018లో ఓడిన శ్రీనివాస్‌గౌడ్ పట్ల సానుభూతి ఉంది. శ్రీనివాస్‌గౌడ్ తండ్రి దర్శన్ గౌడ్ అమీన్‌పూర్ సర్పంచ్‌గా, భార్య అమీన్‌పూర్ ఎంపీటీసీగా పనిచేశారు. కాంగ్రెస్ నుంచి తొలుత టికెట్ పొంది ఆ తర్వాత రద్దు కావడంతో బీఎస్పీ తరఫున అభ్యర్థి బరిలో దిగిన సర్పంచ్ నీలం మధు సైతం గట్టిపోటీనిస్తుండడంతో ఆయన చీల్చే ఓట్లు ఫలితాలను ప్రభావితం చేసే అవకాశాలున్నాయి.



ప్రభాకర్‌రెడ్డి రఘునందన్‌రావు శ్రీనివాస్‌రెడ్డి

### దుబ్బాక ఆ ముగ్గురి మధ్యనే..

దుబ్బాకలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, సిట్టింగ్ ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు మధ్య త్రిముఖ పోటీ నెలకొని ఉంది. ముగ్గురు హోరాహోరీగా తలపడుతున్నారు. కొత్త ప్రభాకర్‌రెడ్డికి ప్రభుత్వ పథకాలు, అధికార పార్టీ బలం వచ్చే అంశాలు. శ్రీనివాస్ రెడ్డి తండ్రి దివంగత ముత్యంరెడ్డి 1989, 1994, 1999లో వరుసగా మూడు పర్యాయాలు టీడీపీ తరఫున దొమ్మాట (2009లో రద్దైంది) నుంచి, 2009లో కాంగ్రెస్ తరఫున దుబ్బాక నుంచి గెలుపొందారు. ఆయన నియోజకవర్గంలో విస్తృతంగా చెక్‌డ్యామ్‌లు నిర్మించడంతో ప్రజల్లో ఇంకా ఆదరణ ఉండడం శ్రీనివాస్‌రెడ్డికి కలిసివచ్చే అంశం. 2020 ఉప ఎన్నికల్లో దుబ్బాక నుంచి 1,079 ఓట్ల స్వల్ప మెజారిటీతో బీజేపీ తరఫున గెలిచిన రఘునందన్ రావు సైతం మరోసారి గెలిచేందుకు గట్టిగా కృషి చేస్తున్నారు. యువతలో బీజేపీ పట్ల ఉన్న ఆదరణ కలిసి వచ్చే అంశం.



కేసీఆర్ ఈటల రాజేందర్

### గజ్వేల్ సీఎం కేసీఆర్‌తో ఈటల ఢీ

గజ్వేల్ నుంచి సీఎం కేసీఆర్, బీజేపీ నుంచి ఈటల రాజేందర్ బరిలో ఉన్నారు. కేసీఆర్ ఆధిక్యతతో ముందంజలో ఉన్నా, ఈటల రాజేందర్ నుంచి కొంత పోటీ ఎదుర్కొంటున్నారు. వరుసగా రెండు పర్యాయాలు సీఎం కావడం, గజ్వేల్‌ను అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడం కేసీఆర్‌కు ఎన్నికల్లో కలిసివచ్చే అంశాలు. గజ్వేల్‌లో ముదిరాజ్ సామాజికవర్గ ఓటర్లు గణనీయంగా ఉండడంతో ఈటల రాజేందర్‌కు కొంత మద్దతు లభిస్తోంది.

### నారాయణఖేడ్ ద్విముఖ పోటీ

నారాయణఖేడ్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే మారెడ్డి భూపాల్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి పటోళ్ల సంజీవరెడ్డి మధ్య గట్టి పోటీ నెలకొని ఉంది. భూపాల్‌రెడ్డి 2016 ఉప ఎన్నిక, 2018 సాధారణ ఎన్నికల్లో ఇక్కడి నుంచి రెండు పర్యాయాలూ 50వేలకు పైచిలుకు ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచార సభ నిర్వహించడం కలిసి వచ్చే అంశం. కాంగ్రెస్ టికెట్ తొలుత మాజీ ఎమ్మెల్యే సురేశ్‌షెట్కార్‌కు కేటాయించగా, ఆయన తప్పుకుని పటోళ్ల సంజీవరెడ్డికి అవకాశం కల్పించారు. సంజీవరెడ్డి తండ్రి పి.కిష్టారెడ్డి ఇక్కడి నుంచి గతంలో నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేయడంతో వారి కుటుంబానికి స్థానికంగా మంచి పట్టు ఉంది. సురేశ్‌షెట్కార్ మద్దతు ఉండడం సంజీవరెడ్డికి కలిసి వచ్చే అంశం.

### అందోల్ ఎవరికి అండనో..



క్రాంతి కిరణ్



రాజనర్సింహ

అందోల్ ఎస్సీ రిజర్వుడ్ స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ మధ్య ద్విముఖ పోటీ నెలకొని ఉంది. దామోదర రాజనర్సింహ 1989, 2004, 2009 ఎన్నికల్లో ఇక్కడి నుంచి గెలిచారు. చంటి క్రాంతి కిరణ్ తొలిసారిగా 2018 ఎన్నికల్లో రాజనర్సింహపై 16వేలపై చిలుకు ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ప్రభుత్వ పథకాలు, పార్టీ బలగంపై క్రాంతి కిరణ్ ఆశపెట్టుకోగా, తన సుదీర్ఘ రాజకీయ అనుభవం, ప్రభుత్వ వ్యతిరేకతపై రాజనర్సింహ ఆశలు పెట్టుకున్నారు. గతంలో వరుసగా రెండు సార్లు ఓడిపోయారనే సానుభూతి ఆయనకు ఉంది.

### నర్సాపూర్ నువ్వానేనా

నర్సాపూర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి, మాజీ మంత్రి వి.సునీతాలక్ష్మారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి మధ్య ద్విముఖ పోటీ నెలకొని ఉంది. సునీతా లక్ష్మారెడ్డి 1999, 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున వరుసగా మూడు పర్యాయాలు ఇక్కడి నుంచి గెలుపొందగా, రాజిరెడ్డి తొలిసారిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీల నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు పెరగడం సునీతారెడ్డికి కలిసొచ్చే అంశం. 20014, 2019లో ఇక్కడి నుంచి గెలుపొందిన సిట్టింగ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే సీహెచ్ మదన్‌రెడ్డికి బీఆర్ఎస్ టికెట్ నిరాకరించినా, ఆయన మాత్రం సునీతారెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గత నాలుగైదు ఏళ్ల నుంచి రాజిరెడ్డి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తుండడం ఆయనకు కలిసివచ్చే అంశం.

### మద్యానికి బానిసగా యువతను మార్చుతున్నారు

ఎన్నికలొస్తే చిన్న వయస్సు పిల్లలను కూడా బాగా తాపించి కరాబ్ చేస్తున్రు. ఫంక్షన్ హాళ్లలో చికెన్ బిర్యానీ వండి పెడ్తున్రు. ఓటర్ల స్థాయిని బట్టి బ్రాండ్ల లిక్కర్ పంచుతున్రు. వాళ్లు బీరు, బిర్యానీ, 500 నోటు ఇవ్వుడు.. పోరగాళ్లు తాగి కింద పడుడు. నాలుగు రోజులు(ఎన్నికలు) పోయాక మద్యానికి డబ్బులు కావాలని ఇంట్లో పెళ్లాలను కొడుతున్నరు. ఆడవాళ్లతోనే ధర్నా చేయించాలనుకుంటున్నాం.

– గొండి మల్లయ్య, సిర్పూరు, హత్నూర

### మున్సిపాలిటీతో ఉపాధి బంద్

అల్లాపూర్‌ను మున్సిపాలిటీలో కలపడంతో 2018 నుంచి ఉపాధి హామీ పథకం కట్ అయ్యింది. మా ఊర్లో 370 కుటుంబాలుంటాయి. ఇంట్లో ఇద్దరు కూలీకి పోతే ఒక్కొక్కరికి రోజుకి రూ.250 కూలీ వచ్చేది. ఇప్పుడు మొత్తం బంద్ అయింది. 2014లో గజ్వేల్ మున్సిపాలిటీ అయితే 2018 వరకు అక్కడ ఉపాధి హామీ పని నడిచింది. మా దగ్గర వెంటనే బంద్ చేశారు.

– మన్నే భాస్కర్ ఎల్లాపూర్, గజ్వేల్

### రైతుబంధుకు కటాఫ్ పెట్టాలి

మా ఊర్లో 20 ఎకరాలున్న వారికి కూడా రైతుబంధు వస్తుంది. మినిమం కటాఫ్ పెట్టాలి. తుమ్మ చెట్లు మొలిచిన భూములకు, ఫారెస్ట్‌లాగా ఉన్న భూములకూ ఇస్తున్నరు. ఐదెకరాలు ఉన్నోడికి అదే ఇస్తున్రు. 200 ఎకరాలున్నోడికి అదే ఇస్తున్రు. వడగండ్లు పడి పోయిన పంట ఖరాబ్ అయింది. ఎకరాకు రూ.10వేలు ఇస్తామన్నరు. ఇప్పటి వరకు ఒక రూపాయి రాలేదు.

–కిష్టయ్య, పైతరా, కొల్చారం

# యాడ్.. మార్చేనా పబ్లిక్ మూడ్!

ఓటర్లను ఆకర్షించేందుకు ప్రకటనల అస్త్రం

ఆకట్టుకునేలా.. ఆలోచింపచేసేలా

అదరగొడుతున్న పొలిటికల్ యాడ్స్

తక్కువ నిడివి వీడియో ప్రకటనలు

నాగోజు సత్యనారాయణ

సూటిగా సుత్తిలేకుండా..గురిపెడితే టార్గెట్ రీచ్ అయ్యేలా..విమర్శనాస్త్రం సంధిస్తే.. వైరిపక్షం విలవిల్లాడేలా ఉంటున్నాయి రాజకీయ పార్టీల లఘు చిత్రాల ప్రకటనలు. పబ్లిక్ మీటింగ్‌లో అగ్రనేతలు దంచి కొట్టే ఉపన్యాసాలు ఓటరును ఎంత మేర ప్రభావితం చేస్తాయో లేదో కానీ, టీవీల్లో ప్రకటనల రూపంలో వస్తున్న పొలిటికల్ యాడ్స్ మాత్రం ప్రజల మూడ్‌ను ప్రభావితం చేస్తున్నాయి. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ అధికార పార్టీని ఇరుకునపెట్టేలా కాంగ్రెస్ పార్టీ ప్రకటనలు ఉంటే.. ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీల్లో నెరవేర్చని అంశాలను టార్గెట్ చేస్తూ బీజేపీ వీడియోలు ఉంటున్నాయి. ఈ తొమ్మిదిన్నరేళ్లలో ఏం మార్పు తెచ్చామన్నది అధికార బీఆర్ఎస్ చెప్పుకొస్తోంది. మొత్తంగా ఎన్నికల బరిలో ఉన్న ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ఓటర్లను ఆలోచింపజేసేలా.. ఆకర్షించేలా పొలిటికల్ యాడ్స్‌తో అదరగొడుతున్నాయి.



ఓటర్‌కు వీలైనంత రీచ్ అయ్యేలా...

పొలిటికల్ యాడ్స్ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్యే ప్రధాన పోటీ ఉంటోందని చెప్పాలి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేస్తామన్న ఆరు గ్యారంటీలపైనా వీడియోలను రూపొందించి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తోంది. అదే సమయంలో బీఆర్ఎస్ సైతం కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన మేలు ఏంటి..? మళ్లీ కేసీఆర్‌నే ఎందుకు సీఎం చేయాలన్నది సూటిగా అర్థమయ్యేలా లఘు చిత్రాలను రూపొందించి సోషల్ మీడియాలో ప్రచారం గుప్పిస్తోంది. ఇందుకోసం రాజకీయ ప్రత్యర్థులను ఠక్కున గుర్తించేలా క్యారెక్టర్లు, వారి హావభావాలను సైతం పలికించేలా ఈ వీడియోల్లో జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

**విమర్శల ఘాటుతో ఫిర్యాదులు**

ఈ పొలిటికల్ యాడ్స్‌లో విమర్శల ఘాటు పెరగడంతో ఆయా పొలిటికల్ పార్టీల నాయకులు ఆ ప్రకటనలు నిలిపివేయించాలని ఎన్నికల సంఘానికి సైతం ఫిర్యాదులు చేశారు. అంతలా పొలిటికల్ యాడ్‌లు వేడి పెంచుతున్నాయి. 'గులాబీ జెండా..తెలంగాణకు అండ' ట్యాగ్‌తో బీఆర్ఎస్ షార్ట్ వీడియోలను చేస్తే..''మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి..''అన్న ట్యాగ్‌లైన్‌ను కాంగ్రెస్ పార్టీ వాడుతోంది. ఇక బీజేపీ ''సాలు దొర..ఇక నీకు సెలవు దొర..''ట్యాగ్‌లైన్‌తో పిట్టల దొర క్యారెక్టర్‌ను పెట్టి ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెడుతూ లఘు వీడియోలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తోంది.

**కంటెంట్ ఒకరిది.. మార్ఫింగ్ మరొకరిది..**

''అప్పుడెట్లా ఉండే తెలంగాణ..ఇప్పుడెట్లుంది తెలంగాణ'' అంటూ అధికార బీఆర్ఎస్ పార్టీ నాయకులు రీల్స్ చేస్తున్న విషయం తెలిసిందే. మంత్రులు మొదలు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చాలా మంది ఈ రీల్ ఫార్ములా ఫాలో అయ్యారు. తీన్మార్ స్టెప్పులతో సదరు నాయకుడి కామెంట్లతో ఉన్న ఈ షార్ట్ వీడియోలు సోషల్ మీడియాలో ఎంతో ఫేమస్ అయ్యాయి. అయితే ఎంతో ప్లానింగ్, కంటెంట్‌తో తయారు చేసిన ఈ షార్ట్ వీడియోలను ఇప్పుడు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ టెక్నిక్స్ వాడి ప్రత్యర్థి పార్టీలు తిప్పికొడుతున్నాయి. బీఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు చేసిన 'అప్పుడెట్లుండే తెలంగాణ.. ఇప్పుడెట్లయింది తెలంగాణ' వీడియోలను ప్రత్యర్థి పార్టీల సోషల్‌మీడియా గ్రూపుల సభ్యులు మార్ఫింగ్ చేస్తూ వాటిని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. ఫేస్‌బుక్, యూట్యూబ్, ట్విట్టర్ (ఎక్స్), ఇన్‌స్టాగ్రామ్ ఇలా అన్ని వేదికల్లోనూ వీడియోలు, రీల్స్.. వాటిపై ప్రత్యర్థుల మార్ఫింగ్‌లు హోరెత్తుతున్నాయి.

జంగ్ తెలంగాణ

# ముస్లింలు ఎటువైపు?

మహమ్మద్ హమీద్ ఖాన్

**బీఆర్ఎస్ వెంట వరుసగా రెండు పర్యాయాలు**

- అంతకుముందు కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా..
- 40 నియోజకవర్గాల్లో కీలకం



అసెంబ్లీ ఎన్నికల్లో ముస్లిం మైనారిటీలు జై కొట్టెదెవరికి..? వరుసగా రెండు పర్యాయాలు బీఆర్ఎస్ వెంట నడిచినన ముస్లిం ఓటర్లు ఈసారి ఎటు వైపు మొగ్గుచూపుతారన్నది ఆసక్తికరంగా మారింది. ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా.. ముస్లిం ఓట్ల ప్రస్తావన కచ్చితంగా ఉంటుంది. తెలంగాణలో కూడా ముస్లిం ఓట్లు కీలకం. మెజారిటీ స్థానాల్లో గెలుపోటములపై ప్రభావితం కనబర్చే మైనారిటీ ఓటర్లపై ప్రధాన రాజకీయపక్షాలు దృష్టి సారించాయి. అధికార బీఆర్ఎస్ 'అభివృద్ధి, సంక్షేమ' మంత్రంతో మరోసారి అధికార పీఠం తమదేనని ధీమా వ్యక్తం చేస్తుండగా, బీఆర్ఎస్ పాలనపై ప్రజా వ్యతిరేకత నేపథ్యంలో ఈసారి అధికారం హస్తగతం ఖాయమన్న ధీమా కాంగ్రెస్‌లో వ్యక్తమవుతోంది. భారతీయ జనతాపార్టీ మాత్రం మైనారిటీ ఓట్లపై పెద్దగా ఆశలేనప్పటికీ కేంద్రంలోని సుస్థిర ప్రభుత్వం చూపి కొన్ని ఓట్లయినా రాబట్టుకోవాలని యత్నిస్తోంది. ఇలా ప్రధాన రాజకీయ పార్టీలు ముస్లిం ఓట్ల కోసం వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి.

**ఈ నియోజకవర్గాల్లో కీలకం**

హైదరాబాద్ పాతబస్తీలోని ఏడు అసెంబ్లీ స్థానాలతోపాటు మరో 33 అసెంబ్లీ నియోజకవర్గాలలో ముస్లిం ఓటర్లు అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించే స్థాయిలో ఉన్నారు. హైదరాబాద్‌లో అత్యధికంగా సుమారు 43 శాతం వరకు, ఆదిలాబాద్, నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లో 34 నుంచి 38 శాతం, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం, వరంగల్‌లో 20 నుంచి 28 శాతం వరకు ముస్లిం ఓటర్లు ఉన్నారు. ఇక ప్రతి నియోజకవర్గంలోనూ కనీసం10 నుంచి 18 శాతం వరకు ముస్లిం ఓటర్లు ఉంటారు.

**బీఆర్ఎస్ అభివృద్ధి మంత్రం**

అధికార బీఆర్ఎస్ ముస్లిం ఓట్లపై గట్టిగానే ఆశలు పెట్టుకుంది. గత రెండు పర్యాయాలు కలిసివచ్చినట్టుగానే ఈసారి కూడా ముస్లిం ఓటర్లు తమవెంటేనని భావిస్తోంది. తొమిదిన్నర ఏళ్లలో మైనారిటీ అభివృద్ధి, సంక్షేమం కోసం రూ. 9,166 కోట్ల ఖర్చు చేసినట్లు పేర్కొంటోంది. 204 మైనారిటీ గురుకులాలు ఏర్పాటు చేసి అందులో 1.31 లక్షల విద్యార్థులకు ఉచిత విద్య, వసతి కల్పన చేపట్టడం తమకు కలిసి వచ్చే అంశంగా అంచనా వేస్తోంది. షాదీ ముబారక్ పథకం కింద 2.68 లక్షల మందికి ఆర్థిక చేయూత, విదేశీ విద్య తదితర పథకాలు కలిసి వస్తాయని భావిస్తోంది. వాస్తవానికి దశాబ్ద కాలంగా ముస్లిం ఓటర్లు బీఆర్ఎస్ వెంట నడుస్తున్నారనే చెప్పాలి. 2014లో తెలంగాణ సెంటిమెంట్, 12శాతం రిజర్వేషన్ హామీలతో బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపిన ముస్లిం వర్గాలు 2018లో మైనారిటీ గురుకులాలు, షాదీ ముబారక్, శాంతి భద్రత తదితర అంశాల ప్రభావంతో బీఆర్ఎస్ వెంటే నడిచాయి. ముస్లింల ఓట్లు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో అత్యధికం బీఆర్ఎస్ గెలుచుకోవడమే ఇందుకు బలం చేకూర్చుతోంది.

**సబ్‌ప్లాన్ డిక్లరేషన్‌తో సహా కాంగ్రెస్ హామీల వెల్లువ**

ఈసారి ఎలాగైనా అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతున్న కాంగ్రెస్ మైనారిటీ ఓటు బ్యాంక్‌పై ఆశలు పెంచుకుంది. ముస్లిం ఓటర్లు కలిసివస్తే అధికారం హస్తగతం కావడం సులువవుతుందన్న ఆకాంక్షతో వారి కోసం ప్రత్యేక మైనారిటీ సబ్ ప్లాన్ డిక్లరేషన్ ప్రకటించింది. మైనారిటీ సంక్షేమ బడ్జెట్‌ను రూ.4,000 కోట్లకు పెంచుతామని హామీ ఇస్తోంది. నిరుద్యోగ మైనారిటీ యువత, మహిళలకు సబ్సిడీ రుణాలను అందిస్తామని, కులగణనతో న్యాయమైన రిజర్వేషన్లు కల్పిస్తామని, విద్యావంతులకు ఆర్థిక చేయూతను అందిస్తామని, మైనారిటీ సంస్థల్లో ఖాళీలను భర్తీ చేస్తామని వాగ్దానాలు గుప్పిస్తోంది. ఈ హామీలతో మైనారిటీ ఓటర్లు తమ వైపు మొగ్గుచూపుతారని కాంగ్రెస్ భావిస్తోంది.

**మజ్లిస్ మామ పల్లవి**

మజ్లిస్ పార్టీ తన మిత్రపక్షమైన అధికార బీఆర్ఎస్‌కు ముస్లిం ఓటర్ల మద్దతును కూడగట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ముస్లిం ప్రాంతాల్లో హలత్-ఏ-హజీరా పేరిట బహిరంగ సభలతో నిర్వహిస్తోంది. కాంగ్రెస్‌వైపు ముస్లిం ఓటర్లు మొగ్గుచూపకుండా కట్టడి చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. బీజేపీతో సమానంగా కాంగ్రెస్‌ను పోల్చుతూ విమర్శనాస్త్రాలు సంధిస్తోంది.. బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలని...సీఎం కేసీఆర్‌ను మామగా సంబోధిస్తూ కొత్త పల్లవి అందుకుంది. స్వయంగా మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ సభల్లో విరివిగా పాల్గొని ప్రసంగిస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఒవైసీ ప్రసంగాలు కొంత వరకు మైనారిటీ ఓటర్లపై ప్రభావం పడే అవకాశాలు లేకపోలేదు.

# మన పార్టీలోకొస్తే పామైనా ఫ్రెండే!

బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ..ఇలా పార్టీ ఏదైనా కావొచ్చు. అభ్యర్థులు ఒక పార్టీ నుంచి మరోపార్టీలోకి జంప్ చేయడం మామూలే. ఏ ఎన్నికల్లోనైనా అంతే..ఈ ఎన్నికల్లోనూ ఇంతే. అయితే. ఓ వ్యక్తి ప్రత్యర్థి పార్టీలో ఉన్నప్పుడు ఆ నేత పాములాంటివాడు. అదే వ్యక్తి పార్టీ మారి మనపార్టీలోకి వచ్చాక..అదే పాము మన ఫ్రెండైపోతాడు.

**మన పార్టీలోంచి ఒకడు అవతలి పార్టీలోకి వెళ్లినప్పుడు ఎడాపెడా చేసే విమర్శలిలా ఉంటాయి.**

1.వాడి కోరల నిండా విషం. పాములాగే బెదిరిస్తూ ఉంటాడు నిత్యం బుస కొడుతూ.

2. పాము కాబట్టే వాడి నడకా, నడతా మెలికలు మెలికలు. స్ట్రెయిట్‌గా ఏనాడైనా నడుస్తాడా వాడు? ముక్కుసూటిగా నిజాయతీగా ఉండలేడు కాబట్టే ఎప్పుడూ ఆ మెలికల నడకలు.

3. డబ్బులెక్కడుండే వాడూ అక్కడే. అచ్చం నిధులకు కాపలా ఉండే పాముల్లాగే!

4. పాములా వాడో కబ్జాకోరు. తన పడగకావరంతో చలిచీమలపై రౌడీయిజం చేసి, బలహీనులైన చీమల పుట్టల్ని కబ్జా చేసే ఆక్రమణదారు వాడు.

ఇంతకాలం మనం పాము అన్నవాడే..పొరబాట్న కొన్ని కారణాలతో మళ్లీ మన పార్టీలోకి వచ్చేస్తాడనుకోండి. అప్పుడు ఇంతకాలం మనం తిట్టినవాణ్ణే మంచివాడంటూ పొగడాల్సి వస్తుంది. 'మరి మీరే అప్పుడలా అన్నారుకదా' అని విలేకరులు అడిగితే వారిచ్చే వివరణలు ఇలా ఉంటాయి.

విలేకరి: మరప్పుడు కోరలనిండా విషం..బుసతో బెదిరింపన్నారు?

నేత : మీకో విషయం తెలుసా? అది బెదిరింపు కాదండి. పిల్లలు రాళ్లతో కొట్టి బాధిస్తున్నప్పుడు 'బుస కొడుతూ ఆత్మరక్షణ చేసుకో..తప్పులేదం'టూ అప్పట్లో ఓ మహాముని..పాముకు ఉద్బోధ చేసిన కథ మీకు తెలియనిదా? ఇక కోరలనిండా విషమంటారా. మనిషికి ఉండదానండీ నిలువెల్లా విషం? పైగా పాముది విషం కాదండి. తన ఆహారాన్ని జీర్ణం చేసుకునేందుకు తోడ్పడే ఎంజైమండీ. అన్నింటినీ అలా అపార్థం చేసుకోకూడదండీ. అన్నం తిని, అరిగించుకోవలి కదండీ పాపం... అదికూడా!

విలేకరి : స్ట్రెయిట్‌గా నడవడూ..వాడిదంతా వంకర నడకా, నడతా అన్నారుగా?

నేత : ఎవరైనా మెలికలెప్పుడు తిరుగుతారో మీకు తెలియనిదా? సిగ్గుతో, బిడియంతోనే కదా మెలికలు తిరిగేదీ!? మనవాడు సిగ్గూ, శెరం, మానం, మర్యాదా..అన్నీ ఉన్నవాడు. తప్పు చెయ్యమని ఎవరైనా అడిగితే, చెయ్యలేక..సిగ్గుతో, బిడియంతో తిరిగేవేసనండీ ఆ మెలికలు!

విలేకరి : డబ్బులెక్కడుంటే పాములా వాడూ అక్కడే అన్నారు?

నేత : మాటమార్చే మనిషిని కాదండీ నేను. ఎక్కడ నిధులున్నప్పటికీ..వాటికి కాపలాగా ఉన్నప్పటికీ... అన్ని వజ్రాలూ, రత్నాలూ, మణిమాణిక్యాలూ కుప్పపోసి ఉన్నప్పటికీ..పాము వాటినేమైనా తింటుందా, తాగుతుందానండీ? ఎవరి డబ్బువారికి చేరాలనే ఉద్దేశంతో కాపలా కాస్తుందది. అలాగే రేపు మనం గెలిచాక కూడా.. అటు ప్రభుత్వ ఖజానాకైనా, ఇటు అతడికి అప్పగించిన బాధ్యతల తాలూకు నిధులకు అంతే నిస్వార్థంగా కాపలా కాసే చెక్యూర్టీ గార్డులాంటి వాడండీ మనవాడు.

విలేకరి : బలహీనుల ఇళ్లూ, స్థలాలు, పుట్టలు ఆక్రమించే కబ్జాకోరన్నారు?

నేత : అన్ని ఫీల్డుల్లోనూ ఉన్నట్టే..కొందరు కబ్జాదారులు మన రాజకీయాల్లోనూ ఉండవచ్చు. కానీ మనవాడు అలాంటివాడు కాదు. మీకీ సంగతి తెల్సా? పాము అనేది డవిరెట్టుగా ఎవరికైనా పట్టుబడేలా నేరుగా పుట్టల్లో ఉండేవాటికంటే..గుట్టుగా తమ బతుకు తాము బతుకుతూ.. ఎవరిజోలికీ వెళ్లకుండా... కొండగుట్టల్లోనా, బండరాళ్ల మధ్యన చీలికల్లోనా బతికేవే ఎక్కువ. మనవాడూ అలాంటి మంచివారిలో ఒకడండీ.

విలేకరి : ఓటరూ..ఓ ఓటరూ. నాడు పామన్న వాడినే నేడు ఫ్రెండంటున్నాడు? మరి నువ్వేమంటావ్?

ఓటరు : అన్నాడా? మన పార్టీవాడయ్యాడా? మన సామెత ప్రకారం చేసేదేముందిక... మెడకు పడ్డ పాము కరవకమానుతుందా? ఫ్రెండయ్యాక ఓటేయక తప్పుతుందా?



**షుగర్ & పెప్పర్**

..:: యాసీన్

# సార్ నుంచి అధ్యక్షా వరకు..

- ఉద్యోగిగా ప్రస్థానం... ఆ తర్వాత ప్రజలకు ప్రాతినిధ్యం
- ఐఏఎస్, ఐపీఎస్ మొదలు నాన్ గెజిటెడ్ ఉద్యోగుల వరకు
- ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా, మండలి చైర్మన్ దాకా..



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగమంటే..ప్రభుత్వ నిర్ణయాలను అమలుపర్చడం, ఉన్నతాధికారి ఆదేశాలను పాటిస్తూ నిర్దేశించిన విధులు నిర్వర్తించడం మాత్రమే. కానీ చట్టసభలో సభ్యుడంటే ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల్లో ముఖ్యపాత్ర పోషించడంతో పాటు ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం వివిధ కార్యక్రమాల రూపకల్పనలో కీలకమైన ప్రతినిధి. ప్రభుత్వం ముందుకు సాగాలంటే పాలకులు, ఉద్యోగులు ముఖ్యులే. కానీ ఈ రెండు రంగాల్లో అనుభవం గడించిన ఘనులు అరుదుగా కనిపిస్తుంటారు. ప్రభుత్వ ఉద్యోగంలో పనిచేసిన అనుభవంతో ప్రజాక్షేత్రంలోకి వచ్చి విజయం సాధించిన వారు రెండుపదులకు పైబడే ఉన్నారు. అలాంటి వారెవరో ఇప్పుడు చూద్దాం.

- ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ కార్యదర్శిగా పనిచేసిన జయప్రకాశ్‌నారాయణ ఆ తర్వాత లోక్‌సత్తా పార్టీని స్థాపించి కూకట్‌పల్లి నుంచి శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు.
- సంక్షేమశాఖలో అధికారిగా పనిచేసిన స్వర్ణకుమారి శాసనసభ్యురాలుగా ఎన్నికయ్యారు. బ్యాంకు అధికారిగా పనిచేసిన అరుణతార ఎమ్మెల్యేగా గెలుపొంది చట్టసభల్లో అడుగుపెట్టారు.
- రెవెన్యూ శాఖలో పనిచేసిన సినీనటుడు బాబుమోహన్ పలుమార్లు ఎమ్మెల్యేగా గెలుపొందడమే కాకుండా రాష్ట్ర మంత్రిగా సేవలందించారు.
- లెక్చరర్‌గా ప్రస్థానం ప్రారంభించిన కడియం శ్రీహరి తెలుగుదేశం పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత ఎమ్మెల్సీగా ఎన్నికై తెలంగాణ రాష్ట్రానికి ఉపముఖ్యమంత్రి కూడా పనిచేశారు.
- ఉపాధ్యాయులుగా పనిచేసిన కోవా లక్ష్మి, ఆత్రం సక్కు, రేగా కాంతారావు శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు.
- రవాణాశాఖలో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన మాణిక్‌రావు జహీరాబాద్ నుంచి 2014లో పోటీ చేసి ఓటమి చెందినప్పటికీ 2018లో రెండోసారి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- ఐపీఎస్ అధికారిగా అత్యున్నత పదవులు చేపట్టిన విజయరామారావు ఖైరతాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా పనిచేశారు.
- మరో ఐపీఎస్ అధికారి పీవీ రంగయ్య కూడా ఎంపీగా గెలుపొంది కేంద్ర మంత్రిగా పనిచేశారు. జడ్జి హోదాలో కొనసాగిన మల్యాల రాజయ్య ఎంపీగా, కేంద్ర మంత్రిగా పనిచేశారు. మరో అధికారి బలరాం నాయక్ సైతం ఎంపీగా ఎన్నికై కేంద్రమంత్రిగా పనిచేశారు.
- ప్రభుత్వ శాఖల్లో వివిధ స్థాయిలో పనిచేసిన పి.రాములు, సంజీవరావు, ఎన్నం శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్యేలుగా గెలుపొందగా, ఐపీఎంలో పనిచేసి పదవీ విరమణ పొందిన తర్వాత ఎమ్మెల్సీగా పోటీ చేసిన స్వామిగౌడ్ గెలుపొంది తెలంగాణ శాసనమండలికి తొలి చైర్మన్‌గా నియమితులయ్యారు.
- పురపాలక శాఖలో మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన వి.శ్రీనివాస్‌గౌడ్ మహబూబ్‌నగర్ నుంచి వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్ర మంత్రిగా కొనసాగుతున్నారు. ఎక్సైజ్ శాఖలో ఉన్నతాధికారిగా పనిచేసిన వెంకటేశ్‌నేత పెద్దపల్లి నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. ప్రొఫెసర్‌గా పనిచేసిన కె.నాగేశ్వర్ ఎమ్మెల్సీగా, సీతారాంనాయక్ ఎంపీగా ఎన్నికయ్యారు.
- జిల్లా పరిషత్ సీఈఓగా పనిచేసి రాజయ్య వరంగల్ ఎంపీ గెలుపొందారు.
- ఎఫ్‌సీఐలో అధికారిగా పనిచేసిన సోమారపు సత్యనారాయణ రామగుండం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- ఇక ప్రభుత్వ ఉద్యోగం నుంచి రాజకీయాల్లోకి వచ్చి ఎన్నికల్లో నిలిచినప్పటికీ విజయం సాధించని వారు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నారు. వీరిలో కొందరు ప్రస్తుతం తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఈ ఎన్నికల్లోనూ పోటీలో ఉన్నారు.

## సన్నిధి

**మంచిమాట**

# అలవాటు

అలవాట్లు మనిషిని పట్టిస్తాయి. అంతే కాదు బంధిస్తాయి, బానిసని కూడా చేస్తాయి. అలవాటుకి ప్రయత్నం అవసరం లేదు. అలవాటు రెండవ స్వభావం అని చెప్పవచ్చు. స్వభావం లాగానే అలవాటుని కూడా అధిగమించటం చాలా కష్టం. అది ఎంతగా వంటపట్టిపోతుందంటే దాన్ని విడిగా గుర్తించటం కూడా కుదరదు. నిజానికి అది పుట్టుకతో వచ్చింది కాదు. తరవాత పెంపొందించుకున్నది.



పెరిగిన భౌగోళిక, ఆర్థిక, సాంఘిక, రాజకీయ, పరిస్థితులు, వాతావరణం, మనుషులు, మత విశ్వాసాలు మొదలైన ఎన్నో అంశాలు ఒక అలవాటు ప్రబలటానికి దోహదం చేస్తాయి. అవే పరిస్థితుల్లో ఉన్న మరొక వ్యక్తికి అది కాక మరొక అలవాటు ఉండవచ్చు. దీనికి వ్యక్తి స్వభావం కారణం అవుతుంది. అంటే, వ్యక్తి సహజ స్వభావం, పరిస్థితుల ప్రభావాల సమాహారంగా అలవాట్లు ఏర్పడుతాయి.

ఆ అలవాటు తెచ్చి పెట్టుకున్నది అని గుర్తించటం ఉండదు. అది సహజ లక్షణం అనే భ్రమలో ఆ వ్యక్తి మాత్రమే కాదు, చుట్టుపక్కల వారు కూడా ఉంటారు. అలవాటు ఎట్లా ఏర్పడిందో గుర్తించటం చాలా కష్టం. దానిని మానుకోటం మాత్రం కష్టం. ముందు అది మంచిది కాదు అని గుర్తించాలి, తరవాత మానాలి అనే సంకల్పం ఉండాలి. ఆ పైన ప్రయత్నం చేయాలి. మొదటిదే చాలా కష్టం. ఎందుకంటే మనిషికి తనని తాను సమర్ధించుకోటం అన్నది సహజంగా ఉంటుంది. అలవాటై పోయింది అనటం అలవాటుగా మారి పోయింది.

ఇంతకీ అలవాటు అంటే? అల+పాటు = అలవాటు. అంటే, సముద్రంలో అల ఎంత సహజంగా పైకి ఎగసి, అంతే వేగంగా ఎటువంటి ప్రయత్నం, శ్రమ లేకుండా పడుతుందో అంత తేలికగా హాయిగా జరిగిపోయేది. దానిని ప్రత్యేకంగా గుర్తించటం కూడా ఉండదు.

అలవాటు అన్నది ఎంత బలంగా ఉంటుందంటే దానిని మానటం చాలా కష్టం. బలవంతంగా మానే వాతావరణం కల్పిస్తే గిజగిజలాడిపోతారు. అందులోనూ దురలవాట్లు అయితే మరీనూ. పిచ్చిగా ప్రవర్తించటం, అవతలి వారికి పిచ్చెక్కేట్టు ప్రవర్తించటం లేదా ఆత్మహత్యలకి పాల్పడటం చూస్తూనే ఉన్నాం. అదే మంచి అలవాటు అయితే ఇబ్బంది పడతారు కాని, ఉన్న పరిస్థితుల్లోనే సద్దుకునే ప్రయత్నం చేస్తారు. కాని, గిజగిజలాడరు. ఉదాహరణకి రోజూ ఒక సమయానికి ధ్యానమో, పూజో చేసుకునే అలవాటు ఉన్నవారు ఎప్పటిలాగా వీలుకాకపోతే ఉన్నంతలో ఎవరికీ ఇబ్బంది కలగకుండా తమ పని పూర్తి చేసుకుంటారు. పుస్తకాలు చదివే అలవాటు ఉన్నవారు ఎక్కడ ఉన్నా, ఎంత మంది మధ్య ఉన్నా, ఇతరులని ఇబ్బంది పెట్టకుండా పుస్తకం పట్టుకుని కూర్చొంటారు.

కొంతమంది త్వరగా దేనినైనా అలవాటు చేసుకుంటారు. వీరి అలవాట్లని మార్చటం అంత కష్టం కాదు. కొత్త అలవాట్లని తేలికగా చేసుకోగలరు కనుక మంచివి అలవాటు చేస్తే సరి! కొంతమందికి ఏది అలవాటు కావటం అన్నదే ఉండదు. వీళ్ళతో ప్రమాదం ఏమంటే మంచివి, పనికి వచ్చే అలవాట్లు కూడా ఉండవు. మనిషి జీవితం చాలావరకు అలవాటుగా సాగుతుంది. కొంతమందిని ఈ విధంగా ఎట్లా బతుకుతున్నావు? అని అడిగితే అలవాటయిపోయింది అంటారు. చిన్నప్పటినుంచి ఏది అలవాటు చేస్తే అదే అలవడుతుంది.

– డా.ఎన్. అనంత లక్ష్మి

> రుచులు కూడా అలవాటు వల్లనే కలుగుతాయట! చిన్నతనం నుండి కారం తినటం అభ్యాసం చేస్తే అదే అలవాటు అవుతుంది. ఎప్పుడు తినని వారికి నోరు మంట పుడుతుంది. ఒక్కొక్క ప్రాంతం వారు ఒక్కొక్క ఆహారాన్నీ ఇష్టపడటానికి కారణం ఇదే. అభిరుచులు కూడా అంతే! సాధారణంగా చేదు ఇష్టం ఉండదు ఎవరికీ. కాని నెమ్మదిగా అలవాటు చేసుకుని వదల లేని స్థితికి వచ్చింది సమాజం. కాఫీ, టీ, శీతల పానీయాలు ఇత్యాదులు. మొదటిసారి గొంతు దిగవు. ఆ తరువాత వదలవు. ధూమపానం, మద్యపానం సంగతి సరే సరి.

**బౌద్ధవాణి**

# చలువ చేసిన శాలువా



కొన్ని ధర్మాలు వినడానికి బాగుంటాయి. ఆచరించడానికి ఇబ్బందులు కొని తెస్తాయి. కొన్ని ధర్మాలు లేదా నీతులు ఎదుటి వారికి చెప్పడానికే బాగుంటాయి. తాము ఆచరించడానికి కటువుగా తోస్తాయి. అన్ని కాలాల్లో, అన్ని అవస్థల్లో అందరూ ఆచరించే ధర్మం కప్పుకునే బట్ట లాంటిది అంటూ బుద్ధుడు చెప్పిన గొప్ప కథ ఇది.

ఆ రోజుల్లో ఎందరో తత్త్వవేత్తలు ఉండేవారు. ఎవరి సిద్ధాంతాల్ని వారు చెప్పేవారు. ప్రచారం చేసుకునేవారు. ఇతర సంప్రదాయానికి చెందిన ఒక గృహస్తు బుద్ధుని దగ్గరకు వచ్చాడు. బుద్ధునితో వాదానికి దిగాడు. అతని వెంట అతని పెంపుడు కోతి కూడా ఉంది. ఒంటి నిండా నల్లని బొచ్చుతో బొద్దుగా, ముద్దుగా ఉంది.

''గృహస్తూ! ఈ కోతి నీ పెంపుడు కోతా?'' అని అడిగాడు బుద్ధుడు.

''అవును, గౌతమా! నా భార్యకు లేక లేక గర్భం వచ్చింది. ఆమె నాకు ఒక మగ కోతి కావాలి!'' అని అడిగింది.

అప్పుడు నేను– ''అంత తొందరెందుకు? నీకు మగబిడ్డ కలిగితే మగ కోతిని, ఆడబిడ్డ కలిగితే ఆడకోతిని తెచ్చి ఇస్తాను. అప్పుడు వారు దానితో ఆడుకుంటారు'' అన్నాను. కానీ, ఆమె మొండికేసింది. మారాం చేసింది. చేసేది లేక ఈ బొచ్చు కోతిని తెచ్చాను'' అన్నాడు.

''దీని బొచ్చు అందంగా ఉంది. మెత్తగానూ ఉంది. దీనిని నీవు శుభ్రంగా కడగగలవా?''

''చక్కగా. పసుపు, పిండి దట్టించి శుభ్రంగా స్నానం చేయించగలను. దీని వంటికి అంటిన మకిలిని వదిలించగలను.'' అన్నాడు గృహస్తు.

''బాగుంది.. అలాగే... మురికి వదిలించాక.. దీని వెంట్రుకలు మరింత మెరవడానికి రంగు వేయగలవా?''

''వేయగలను గౌతమా!''

''వేశాక మరింత అందంగా ఉండటానికి దీని వెంట్రుకలను సాపు చేయడానికి చలువ (ఇస్త్రీ) చేయగలవా?''

''లేదు గౌతమా..! చలువ చేయడాన్ని దీని శరీరం తట్టుకోలేదు''


'ఓ గృహస్థూ! అదే నీ దగ్గర వెంట్రుకలతో నేసిన వస్త్రం (శాలువా) ఉందనుకో. దాన్ని ఉతకగలవు, రంగు వేయగలవు, సాపు చేయగలవు. అన్ని రకాల పరిశుభ్రతలని ఆ వస్త్రం తట్టుకుంటుంది. అలాగే... ఏ ధర్మం అయితే.. పరీక్షలకు నిలబడి రానిస్తుందో... దానికి కాలంతో పని లేదు. అన్ని కాలాలకి వర్తిస్తుంది. అన్ని విమర్శలనూ తట్టుకుని నిలబడుతుంది. నా ధర్మం అలాంటిది'' అని చెప్పాడు.

ఆ గృహస్తు ఇంటికి వెళ్ళాడు. ఆ రాత్రి రకరకాల ప్రబోధాల్ని తరచి తరచి తర్కించుకున్నాడు. మరునాడు బుద్ధుని దగ్గరకు వచ్చి– నమస్కరించి, బుద్ధ అనుయాయిగా మారాడు. జీవితాంతం ధర్మాన్ని పాటించాడు. ప్రచారం చేశాడు.

– డా. బొర్రా గోవర్ధన్

**వాగ్గేయకార వైభవం**


# వీధి దీపం వెలగకపోతే...!!!



'అచ్చమైన దీప సన్నిధిని మరుగిడబడి చెఱచినట్లున్నది...'. అంటున్నాడు త్యాగయ్య ఆ కీర్తనలో. కాంతినివ్వడం ఒక్కటే దీపశిఖ లక్షణం. దీపానికీ, ఈశ్వరుడికీ ఓ లక్షణం ఉంటుంది. వీధి దీపం వెలుగుతుంటే ఆ వెలుగులో అక్కడేమయినా పామున్నా, తేలున్నా తెలుస్తుంది. గుంటలు, రాళ్ళు రప్పా కనబడతాయి... అని చెప్పి 'ఓ దీపమా! నా మార్గమును నిష్కంటకం చేసితివి, నాకు దారి చూపితివి. నీకిదే నా నమస్కారం..' అంటూ ధ్యానశ్లోకాలంటూ ఏమీ ఉండవు దానికి. అయితే మనకు దారి చూపినందుకు దానికేసి గౌరవంగా చూస్తాం. ఓ రోజున ఒక ధూర్తుడు రాయి విసిరి దాన్ని పగలగొట్టాడు. ఇంతమందికి వెలుగిచ్చే దీపం, ఇంతమందికి దారిచూపే దీపం... అది మలిగిపోయేటట్లు చేస్తే ... రాయి విసిరినవాడిపై ఆ దీపమేమీ తిరగబడదు. ఆ వెలుగు ప్రయోజనాన్ని అనుభవిస్తున్న మనం దానిని జాగ్రత్తగా కాపాడుకోవాలి. ''అది లేకపోయినా ఫరవాలేదు. మా బతుకు మేం బతికేస్తాం ...'' అంటే దీపానికి వచ్చిన నష్టమేమీ లేదు... మనకు మాత్రం ఆ చీకటే మిగులుతుంది, దానిలో దేవులాటే ఉంటుంది. భగవంతుడు కూడా అంతే. 'నివాసవృక్షః సాధూనాం ఆపన్నానాం పరాగతిః/ఆర్తానాం సంశ్రయశ్చైవ యశసః చ ఏకభాజనమ్'.. అంటారు కిష్కింధకాండలో. భగవంతుడున్నాడు.. అని నీవు నమ్మి బతకగలిగితే భగవదనుగ్రహం. ఆయనేమిటి ? ఆయనెందుకు?.. అని చెప్పి ఆయనను తిరస్కరిస్తే చీకటి మిగిలేది మనకే, ఆయనకు కాదు. 'అచ్చమైన దీపశిఖ సన్నిధిని మరుగు అడ్డుపడి చెఱచినట్టున్నది...'

ఓ దట్టమైన బట్టలాంటిది అడ్డు వచ్చిందనుకోండి.. అప్పుడు ఆ వెలుతురూ ఉండదు. దాని సహాయంతో చూసే అవకాశమూ ఉండదు. కాబట్టి ఆ దీపశిఖ నాకు కనబడడం లేదు... అంటే ఆ దీప శిఖ మరేదోకాదు, పరబ్రహ్మమే. అది ఒక్కటే వెలుగుతోంది.

''లోకంబులు లోకేశులు లోకస్థులు దెగిన తుదినలోకంబగు పెంజీకటికవ్వల నెవ్వండేకాకృతి వెలుగునతని నే సేవింతున్'' అంటారు పోతన గారు భాగవతంలో...అటువంటి వెలుగు ఇక్కడ వెలుగుతుంది. కానీ ఆ దీపం కనబడకుండా ఒక తెర అడ్డుపడుతున్నది. ఈ తెరను నేను తీయలేను ... అని ఆర్తితో వేడుకుంటున్నాడు త్యాగయ్య. ఇదెలా ఉందంటే...'మత్స్యము ఆకలిగొని గాలముచే మగ్నమైన రీతియున్నది' అని పోలికను చెబుతున్నాడు. చేప దానిదారిన అది పోతూ దారిలో కనిపించిన ఎరచూసి ఆశపడింది. దాన్ని కొరికింది. 'మఛ్లీ జల్ కా రాణీ, ఉస్కా జీవన్ పానీ, హాథ్ లగావ్ తో డర్ జాయేగీ, బాహర్ నికాలేతో మర్ జాయేగీ''.. ఇంకేముంది.. నీళ్ళలోంచి తీసి భూమ్మీద పడేస్తే చచ్చిపోయింది. అంటే తిండా మనుకుని తినబడింది. ఈ మత్సరమను తెరతీయనంతకాలం నా పరిస్థితీ ఇంతే.. దీపం కనిపించదు.. స్వామీ ఆ తెరతీయి.. అంటే. అరిషడ్వర్గాల గురించీ నీ ద్వారా ఒక సందేశం లోకానికి అందాలని అనుకున్నాడేమో, ఆయన ఆ తెరను దీసి దర్శనమిచ్చాడు. ఇదీ సంగీతంవల్ల, పాట పాడడం వల్ల, వినడం వల్ల ప్రయోజనం. అది ఆయనకే కాదు అందరి ఆత్మోద్ధరణకు కారణమయి నిలిచింది. అంత గొప్ప వాగ్గేయకారులు, లోకానికి ఆధ్యాత్మిక భిక్ష పెట్టినవారు, దీపస్తంభాల వంటివారు.. మన మధ్య గడిపిన వారు కావడం మన అదృష్టం.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

# సాక్షి కరీంనగర్

సోమవారం ၊ 20 ၊ నవంబర్ ၊ 2023






## రాజన్న సేవలో కలెక్టర్

వేములవాడ: రాజన్నను కలెక్టర్ పమేలా సత్పతి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అర్చకులు ప్రసాదం అందించారు.



## నృసింహుడి సన్నిధిలో రద్దీ

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివార్లను దర్శించుకున్నారు.

## వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/20.0

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చలి తీవ్రత పెరుగుతుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### ఎన్నికల నిర్వహణలో 'బ్లాగ్' విధులు

కరీంనగర్ అర్బన్: ఎన్నికలు సక్రమంగా నిర్వహించడానికి కేంద్ర ఎన్నికల కమిషన్ బూత్ లెవల్ అవేర్‌నెస్ గ్రూప్స్(బ్లాగ్)ను ప్రతి పోలింగ్ కేంద్రానికి ఏర్పాటు చేసింది. ప్రభుత్వ, సెమీ ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి, స్థానిక ఓటర్లతో పరిచయం ఉండి, ఆ ప్రాంతంలో ఓటు హక్కు కలిగి ఉన్న స్థానిక వ్యక్తులను, రాజకీయ పార్టీలతో ఎటువంటి సంబంధం లేకుండా ఉన్నవారిని అధికారులు బ్లాగ్స్‌లో సభ్యులుగా నియమించారు. ప్రతి బ్లాగ్స్‌లో బీఎల్వో బృంద నాయకుడిగా ఉండగా ఉపాధి హామీ మేట్, ఆశావర్కర్, ఎఎన్‌ఎం, అంగన్‌వాడీ టీచర్, మహిళా సంఘాల బుక్ కీపర్లను సభ్యులుగా నియమించారు.

**బ్లాగ్ బాధ్యతలిలా..**

ఓటర్లకు అవగాహన కల్పించి చైతన్యపర్చడం, ఓటింగ్‌లో పాల్గొనేలా చేయడం. మద్యం, ధన ప్రలోభాలకు లొంగకుండా గోడపత్రికలు, కరపత్రాలను పంపిణీ చేసి ఓటు ప్రాధాన్యతను వివరించడం. ఎన్నికల్లో ఓటు అవశ్యకతపై పోలింగ్ బూత్ స్థాయిలోని పాఠశాలలో ఆటలు, క్విజ్ పోటీలు నిర్వహించడం, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం. గర్భిణులు, బాలింతలు, దివ్యాంగులు, వృద్ధులకు ఓటింగ్ కోసం కల్పిస్తున్న సౌకర్యాలను వివరించడం చేస్తారు.

### పొలిటికల్ అతిథులు

- శుభ, అశుభకార్యాలకు ఆహ్వానం లేకున్నా మంది, మార్బలంతో హాజరు

కరీంనగర్: ప్రస్తుతం రాజకీయాల్లో కొత్త ట్రెండ్ నడుస్తోంది. 'ఓట్ల ప్రచారానికి కాదేదీ అనర్హం' అన్నట్లు ప్రజలకు దగ్గరయ్యేందుకు నాయకులు కొత్త పద్ధతుల్లో ప్రయత్నాలు చేస్తున్నారు. హాలో అన్నా.. నమస్తే.. మనదగ్గర ఇవాళ, రేపు ఏమైనా శుభ, అశుభకార్యాలు ఉన్నాయా? అంటూ కొందరు నాయకుల తమ అనుచరులకు ఫోన్లు చేయడం, వారేమో స్థానికంగా వాకబు చేసి తమ లీడర్లకు చేరవేయడం, తరువాత సదరు కార్యక్రమాల నిర్వాహకులు పిలిచినా.. పిలవకున్నా కొందరు నాయకులు మంది మార్బలంతో వేడుకలకు హాజరై ఫొటోలు దిగడం, సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ఇప్పుడు పొలిటికల్ ట్రెండ్‌గా మారింది. అలా శుభకార్యాలకు వెళ్తున్న లీడర్లు, సంబంధిత కుటుంబాలకు కట్నాలు, కానుకలు, చావులకు, కర్మలకు ఆర్థికసాయం అందిస్తున్నారు. కొసమెరుపు ఏంటంటే చిన్నపాటి పరిచయం ఉన్నా వేడుకలకు హాజరవుతున్న నాయకులు, ప్రజాప్రతినిధులు తమ వెంట భారీ వాహన శ్రేణులతో అనుచరులను తీసుకొని రావడంతో భోజన సౌకర్యాలు అంచనాలు మించి పోవడంతో కనీసం తమ బంధుమిత్రులకు సైతం సరిగ్గా భోజనాలు అందిచలేకపోతున్నామని ఇటీవల పెళ్లిళ్లు చేసిన కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కేంద్ర బలగాల కవాతు



కవాతు చేస్తున్న బలగాలు

శంకరపట్నం: మండలకేంద్రం కేశవపట్నం, కొత్తగట్టు గ్రామాల్లో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర బలగాలతో కలిసి హుజూరాబాద్ డివిజన్ పోలీసులు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఏసీపీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘింస్తే టోల్‌ఫ్రీ నంబరు 1950కు సమాచారం అందించాలని అన్నారు. హుజూరాబాద్ రూరల్ సీఐ సంతోశ్ కుమార్, ఎస్సై లక్ష్మారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# 'ఫైనల్' కర్ఫ్యూ..!

- ఇళ్లకే పరిమితమైన ప్రజలు
- ప్రచారానికి అభ్యర్థుల 'హాఫ్' డే
- సెలవు దినం కలసి రావడంతో కనిపించని ట్రాఫిక్
- అపార్ట్‌మెంట్, రెస్టారెంట్లలో భారీ స్క్రీన్‌ల ఏర్పాటు




ఫైనల్ మ్యాచ్ సందర్భంగా ఆదివారం సాయంత్రం బోసిపోయిన నగరంలోని తెలంగాణ చౌక్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కాదేదీ.. ప్రచారానిక నర్హం అన్నట్లు ఎన్నికల వేళ అందివచ్చిన ప్రతీ అవకాశాన్ని నేతలు సద్వినియోగం చేసుకుంటున్నారు. కొద్దిరోజులుగా దేశమంతా ఒక వైపు క్రికెట్ ఫీవర్‌తో హీటెక్కితే.. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలతో హోరెత్తుతోంది. అయితే టీం ఇండియా వరుస విజయాలతో ప్రపంచకప్ ఫైనల్‌కు చేరుకోవడం, ప్రత్యర్థి ఆసీస్‌తో పోటీ పడుతుండటంతో అందరి చూపు ఒక్కసారిగా మ్యాచ్‌పై పడింది. ఆదివారం ఫైనల్ మ్యాచ్ సందర్భంగా యువత, క్రికెట్ అభిమానులు ఇల్లు వదిలి బయటకు రాలేదు. ఆఖరికి వివిధ పార్టీల కార్యకర్తలు సైతం ఎన్నికల ప్రచారానికి సెలవు ప్రకటించారు. ఆయా పార్టీల అభ్యర్థులు ప్రచారానికి బ్రేక్ వేసి.. యువతను, క్రికెట్ అభిమానులను ఆకట్టుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దీంతో జిల్లావ్యాప్తంగా క్రికెట్ 'ఫైనల్' కర్ఫ్యూ కనిపించింది.



ఓ వివాహవేడుకలో మ్యాచ్ చూస్తున్న దృశ్యం

**హాఫ్ డే ప్రచారం**

క్రికెట్ ప్రియులకు ఫైనల్ మ్యాచ్ ఒకరకంగా పండుగే. ఓటర్లలో, కార్యకర్తల్లో చాలామంది క్రికెట్ చూసేవారు ఉంటారు. దీంతో చాలా చోట్ల నేతలు ఆదివారం తమ ప్రచారాన్ని ఫుల్ డే నుంచి హాఫ్‌డేకు కుదించుకున్నారు. మధ్యాహ్నంలోపే ప్రచారం నిర్వహించి, తదుపరి భవిష్యత్ ప్రచార వ్యూహాలు, నేతలతో మంతనాలకు సమయం కేటాయించారు. కొందరు నేతలు పట్టణప్రాంతాలు కాకుండా క్రికెట్ సందడి ఎక్కువగా ఉండని పల్లెల్లో ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎన్నికల ప్రచారం కొద్దిరోజులుగా ఉరుకులు పరుగులతో సాగుతున్నా.. వివిధ పార్టీల అభ్యర్థులు తమ దినచర్యకు ఆదివారం నాటి మ్యాచ్‌తో కాస్త బ్రేక్ ఇచ్చారు.

**వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక ప్రదర్శనలు**

వివిధ పార్టీల అభ్యర్థులు, నేతలు ప్రచారానికి హాఫ్‌డే ప్రకటించి, యూత్, క్రికెట్ అభిమానులు ఒక్కచోటుకు చేరే అవకాశం ఉంటుందని భావించి మ్యాచ్ చూసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అపార్ట్‌మెంట్లు, చిన్నపాటి రెస్టారెంట్లలో ప్రత్యేక స్క్రీన్స్ ఏర్పాటు చేశారు. వారికి కావాల్సిన సదుపాయాలు కల్పించి, సైలెంట్‌గా తమ పని కానిచ్చేశారు. టీం ఇండియా ఆసీస్‌పై విజయం సాధిస్తే విజయోత్సవ ర్యాలీలతో సంబరాలు చేసేందుకు భారీగా ఏర్పాట్లు చేశారు. స్వీట్లు, టపాసులు పెద్ద ఎత్తున సిద్ధం చేశారు. అయితే అనూహ్యంగా టీం ఇండియా ఓటమి చెందటంతో నేతలు డీలా పడ్డారు. అనుకున్నదొక్కటి అయినదొక్కటి అనుకుంటూ సోమవారం నాటి ప్రచారం గురించి కసరత్తు చేసే పనిలో పడిపోయారు.

# 41 రోజులు.. రూ.115.93 కోట్లు

- ఎన్నికల వేళ.. జోరుగా మద్యం అమ్మకాలు
- షెడ్యూల్ జారీ నుంచి 95,777 మద్యం, 2,52,051 బీర్ల కేస్‌ల అమ్మకాలు
- బెల్ట్‌షాపులు మూతపడడంతో వైన్స్‌ల్లో పెరిగిన గిరాకీ
- లిక్కర్ నిల్వ చేసుకుంటున్న పలువురు రాజకీయ నాయకులు?



అక్టోబర్ 9 నుంచి నవంబర్ 18 వరకు మద్యం అమ్మకాలు.. విలువ (రూ.కోట్లలో)

| స్టేషన్ | లిక్కర్ | బీర్లు | విలువ (రూ.కోట్లలో) |
|---|---|---|---|
| కరీంనగర్ అర్బన్ | 30,584 | 82,841 | 38.35 |
| కరీంనగర్ రూరల్ | 24,646 | 64,878 | 29.16 |
| తిమ్మాపూర్ | 14,627 | 35,905 | 17.43 |
| హుజూరాబాద్ | 10,616 | 34,327 | 13.45 |
| జమ్మికుంట | 15,304 | 34,100 | 17.54 |
| మొత్తం | 95,777 | 2,52,051 | 115.93 |

కరీంనగర్‌క్రైం: జిల్లాలో ఎన్నికల జాతర జరుగుతున్న వేళ.. మద్యం అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. ఎన్నికల్లో భాగమైన వివిధ రాజకీయ పార్టీల విందు, వినోదాలకు మద్యమే పెద్దన్న పాత్ర పోషిస్తుండగా... ఎక్సైజ్‌శాఖకు కాసుల వర్షం కురుస్తోంది. పల్లెల్లో బెల్టుషాపులు మూతపడడం, ఎక్సైజ్, పోలీసుశాఖ అధికారులు పకడ్బందీగా వ్యవహరిస్తుండడంతో వైన్స్‌లకు గిరాకీ పెరిగింది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన అక్టోబర్ 9వ తేదీ నుంచి నవంబర్ 18 వరకు జిల్లావ్యాప్తంగా రూ.115.93 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి.

**రూ.115.93 కోట్ల అమ్మకాలు**

ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి నవంబర్ 18 వరకు జిల్లావ్యాప్తంగా ఐదు ఎక్సైజ్‌స్టేషన్ల పరిధిలో రూ.115.93కోట్ల విలువచేసే 95,777 లిక్కర్ పెట్టెలు, 2,52,051 బీర్ల పెట్టెలు అమ్ముడు అయినట్లు ఎక్సైజ్‌శాఖ గణాంకాల చెబుతున్నాయి. జిల్లావ్యాప్తంగా 94మద్యం దుకాణాలు, 24 బార్లు ఉన్నాయి. ప్రస్తుతం ఎన్నికల సందర్భంగా అక్రమ మద్యం రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం, బెల్ట్‌షాపులను మూసివేయడంతో ఎక్కువశాతం మంది మద్యం దుకాణాల్లోనే కొనుగోలు చేస్తున్నారు. కాగా.. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ గతంలోకన్నా అమ్మకాలు చాలా తక్కువగా అయ్యాయని తెలుస్తోంది. 2022లో ఇదే సమయంలో ప్రస్తుతం కన్నా రూ.58.02 కోట్ల విలువ గల మద్యం అమ్మకాలు ఎక్కువగా జరిగినట్లు తెలుస్తోంది. దీనికి వైన్స్‌ల గడువు ముగుస్తుండడంతో పాటు బెల్ట్‌షాపులు మూసివేయడం, అక్రమ మద్యం రవాణా నియంత్రించడం కారణంగా తెలుస్తోంది.

**పక్క జిల్లాల నుంచి దిగుమతి**

ఎన్నికల వేళ సాయంత్రం అయిందంటే చాలా చోటామోటా నాయకులు వారివారి ప్రాంతాల్లోని యువకులకు, ప్రజలకు మద్యం పార్టీలు ఏర్పాటు చేస్తూ ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. వివిధ రాజకీయ పార్టీల వాళ్లు మద్యం నిల్వచేసేందుకు యత్నిస్తుండగా.. ఎక్సైజ్ అధికారులు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేస్తున్నారు. అక్రమ మద్యం నిలువలు, అమ్మకాలను కట్టడి చేస్తున్నారు. పెద్దఎత్తున్న తనిఖీలు చేస్తుండగా.. కొందరు పెద్ద ఎత్తున్న మద్యం స్టాక్ కొనుగోలు చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు సిద్దిపేట,హన్మకొండ, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల నుంచి మద్యం తెప్పించుకునే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. మద్యంషాపులకు ఈనెల చివరివరకు మాత్రమే గడువు ఉండడంతో కొత్తస్టాక్ తెప్పించకపోవడంతో కావాల్సిన బ్రాండ్ల కోసం పక్కజిల్లాలకు పరుగుపెడుతున్నట్లు సమాచారం.

### అక్రమ రవాణాకు చెక్



ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి ఈసీ ఆదేశాల మేరకు అక్రమ మద్యం రవాణా నియంత్రణకు ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేస్తున్నాం. బెల్ట్‌షాపులు, కిరాణాషాపుల్లో అమ్మకాలపై దృష్టిసారించి మద్యం దొరికితే కేసులు నమోదు చేస్తున్నాం. ఇప్పటికే అక్రమ మద్యం రవాణా, గుడుంబా తయారీ, గంజాయి కేసులు 988 నమోదు చేశాం. నిబంధనల ప్రకారం నిర్ణీతవేళల్లోనే వైన్స్‌ల్లో అమ్మకాలు జరుగుతున్నాయి.

– పి.శ్రీనివాసరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్, కరీంనగర్

### నేడు తిమ్మాపూర్‌లో ప్రజా ఆశీర్వాద సభ

- హాజరు కానున్న సీఎం కేసీఆర్



సభాస్థలిని పరిశీలిస్తున్న వినోద్ కుమార్

తిమ్మాపూర్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం సీఎం కేసీఆర్ మానకొండూర్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్ పంచాయతీ పరిధిలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ప్రజా ఆశీర్వాదసభ నిర్వహించనున్నారు. సభాస్థలిని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు పరిశీలించారు. కాగా.. సభను విజయవంతం చేయడంపై స్థానిక నాయకులు దృష్టిపెట్టారు. నియోజకవర్గంతోపాటు కరీంనగర్ నుంచి భారీగా జన సమీకరణకు పలువురు నేతలకు బాధ్యతలు అప్పగించారు. తిమ్మాపూర్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎల్‌ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు పర్యవేక్షిస్తున్నారు.

# చదువులోనూ రాణించాలి





విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న హైకోర్టు జడ్జి ఈవీ. వేణుగోపాల్

- హైకోర్టు జడ్జి ఈవీ వేణుగోపాల్
- ముగిసిన రాష్ట్రస్థాయి సీఎస్‌ఏ క్రీడాపోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్: విద్యార్థులు క్రీడలతోపాటు చదువులోనూ రాణించాలని హైకోర్టు జడ్జి ఈవీ.వేణుగోపాల్ అన్నారు. జిల్లాకేంద్రంలోని సెయింట్ జాన్స్ ఉన్నత పాఠశాలలో గత మూడు రోజులుగా నిర్వహించిన 18వ తెలంగాణ రాష్ట్రస్థాయి సీఎస్‌ఏ క్రీడా పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. హైకోర్టు జడ్జి ఈవీ.వేణుగోపాల్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య అనేది చేదుగా ఉంటుందని, కానీ అది ఇచ్చే ఫలాలు తీయగా ఉంటాయని, అందుకు తానే ఉదాహరణ అని అన్నారు. కార్యక్రమ అధ్యక్షుడు సీఎస్‌ఏ జనరల్ సిస్టర్ అల్ఫోన్స్ పోతిరెడ్డి మాట్లాడుతూ పోటీలను మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించామని అన్నారు. రాష్ట్రస్థాయిలో 18 జిల్లాల నుంచి 1500 మంది క్రీడాకారులు, అధికారులు హాజరయ్యారని, అన్ని సదుపాయాలు కల్పించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సుపీరియర్ అండ్ కరస్పాండెంట్ సిస్టర్ మార్గరేట్ మేరి, సిస్టర్ జోసెఫ్ మేరి, పోటీల నిర్వహణ కార్యదర్శి సిస్టర్ పిఇన్నాలు, పీఈటీ పై ప్రేమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మానకొండూర్‌లో 'గులాబీ'కి ముల్లు

- పార్టీలు మారిన నేతలతో ఇబ్బందులు
- అసంతృప్త కేడర్‌తో ప్రతికూల పరిణామాలు




సాక్షిప్రతినిధి, కరీంనగర్: మానకొండూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ జోరు నెమ్మదించింది. 2014, 2018లో జరిగిన ఎన్నికల్లో మానకొండూర్ నుంచి అత్యధిక మెజార్టీతో గెలుపొందిన ఆ పార్టీ.. ఈ ఎన్నికల్లో కాస్త గడ్డుకాలం ఎదుర్కొంటోంది. మూడోసారి ఎలాగైనా అధికారం చేపట్టాలని భావిస్తున్న బీఆర్‌ఎస్.. జిల్లాలో మిగిలిన ప్రాంతాల్లో బలంగానే కనిపిస్తున్నా.. ఇక్కడ ఆశించినస్థాయిలో రాణించలేకపోతోంది. మరోవైపు గులాబీ పార్టీ నుంచి పలువురు నేతలు కాంగ్రెస్ వైపు చూడటంతో మెజారిటీ మండలాల్లో కేడర్ బలహీనపడుతోందని క్షేత్రస్థాయిలో కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు.

**గుబులు రేపుతున్న బీజేపీ క్యాడర్**

బీజేపీని అంటిపెట్టుకుని ఉన్న గడ్డం నాగరాజు, దరువు ఎల్లన్న వంటి నేతలు టికెట్ రాకపోవడంతో బీఆర్‌ఎస్‌లో చేరారు. అదే సమయంలో బీఆర్‌ఎస్‌లో ఉన్న ఆరెపల్లి మోహన్‌కు పార్టీ టికెట్ ఇవ్వకపోవడంతో బీజేపీలో చేరి టికెట్ సాధించారు. ఈ పరిణామం కారుకు కలిసి వస్తుందని భావించినా.. ఆరెపల్లి ఇంతకాలం బీఆర్‌ఎస్‌లోనే ఉండటం, స్థానికుడు కావడంతో గులాబీ ఓట్లనే చీలుస్తారని కేడర్ ఆందోళన వ్యక్తం చేస్తోంది.

**నెరవేర్చని హామీలు.. నచ్చని ఎమ్మెల్యే వైఖరి**

పదేళ్ల ప్రభుత్వ వ్యతిరేకతకు తోడు ఎమ్మెల్యే తన పార్టీలోని నాయకుల్లో కొందరికే ప్రాధాన్యమిస్తున్నాడని మిగిలినవారు చిన్నబుచ్చుకుంటున్నారు. ఈ విషయంలో ఆయన వైఖరి నచ్చక చాలామంది సర్పంచులు, ఎంపీటీసీలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీపై అభిమానంతో ఉన్న కొందరు అలాగే ఉండిపోయారు. ఇలాంటి వారంతా మనస్ఫూర్తిగా పనిచేయకపోతే ఎన్నికలపై ఫలితాలపై ప్రతికూల ప్రభావం పడుతుందన్న అనుమానాలు సీనియర్లు వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిణామాలు ఎన్నికల ముందు ఆ పార్టీలోని నేతలు, ప్రజాప్రతినిధులను కలవరపాటుకు గురిచేస్తోంది. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పనిచేయాల్సిన సర్పంచులు, ఎంపీటీసీలు ఇప్పుడు వ్యతిరేకంగా పనిచేస్తే.. అది పార్టీ ఓట్లపరంగా తీవ్ర నష్టం చేకూరుస్తుందని కేడర్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. దీనికితోడు నియోజకవర్గంలో కొన్ని సుదీర్ఘ సమస్యలు పార్టీ నేతలను ఇబ్బంది పెడుతున్నాయి. జాతీయ రహదారి 563 విషయంలో అధికార పార్టీ నేతలకు అధికంగా భూపరిహారం వచ్చిందని, మిగిలిన వారికి తక్కువగా వచ్చిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. పార్టీ ప్రతిష్టాత్మక హామీ అయిన డబుల్ బెడ్రూం పథకం నియోజకవర్గంలో సరిగా అమలు కాకపోవడంపై అర్హులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. దళితబంధు, బీసీబంధు కొందరికే అందడంపైనా పార్టీపై స్థానికంగా వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

# అసెంబ్లీ పోరు.. సాంకేతిక జోరు

- ఎన్నికల్లో ఎన్నెన్ని సాంకేతికతలో..



ఫిర్యాదులు, సలహాల విభాగం




ఈ సువిధ విభాగం



సీ విజిల్



మానిటరింగ్ సెల్




ఓటరు హెల్ప్‌లైన్

కరీంనగర్ అర్బన్: ఎన్నికల సంఘం చేతిరాత నుంచి అంతర్జాలం దాకా వీలైనన్ని అవకాశాలు ఓటరుకు కల్పించింది. శాసనసభ ఎన్నికలు పక్కాగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతోంది. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ సేవలు పొందడంతో పాటు ఫిర్యాదులకు అవకాశమిచ్చింది. నిరక్షరాస్యుల నుంచి అక్షరాస్యుల వరకు వారి ఆలోచనను స్వీకరిస్తూ సమీకృత ఎన్నికల కంట్రోల్ రూమ్‌కు రూపకల్పన చేసింది. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి పత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈ సారి మరిన్ని కొత్త పద్ధతులు, విధానాలు ప్రవేశపెట్టింది.

**ఈవీఎంపై అభ్యర్థి ఫొటో**

గతంలో ఈవీఎంలపై కేవలం పార్టీ చిహ్నం, అభ్యర్థి పేరు ఉండగా.. ఓటర్ల సౌలభ్యం కోసం ఈ సారి స్వల్ప మార్పులు చేసింది. ఈ ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంలపై అభ్యర్థి పేరుతో పాటు పార్టీ చిహ్నం, అభ్యర్థి ఫొటో కూడ ముద్రించనున్నారు. పోస్టల్ బ్యాలెట్‌లపై కూడ అభ్యర్థి ఫొటోను ముద్రించనున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో అభ్యర్థులు, గుర్తులను గుర్తుపట్టేలా అంధుల కోసం బ్రెయిలీ లిపిలో డమ్మీ బ్యాలెట్ పత్రాలు అందుబాటులో ఉంటాయి.

**అభ్యర్థి వివరాలు కావాలా..**

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి గురించి తెలుసుకోవచ్చు. నో యువర్ క్యాండిడేట్(కేవైసీ) పేరిట అభ్యర్థులు నామినేషన్ల సందర్భంగా దాఖలు చేసిన అఫిడవిట్లను ప్రజలకు అందుబాటులో ఉంచేందు కు ఎన్నికల సంఘం https://affidavit. eci. gov.in వెబ్‌సైట్‌ను రూపొందించింది. అభ్యర్థి ఎలాంటివారు, వారికి నేర చరిత్ర ఏమైనా ఉందా? ఏ ఏ ఆస్తులు ఉన్నాయో తెలుసుకోవచ్చు.

**ఆదర్శ యువ కేంద్రాలు**

గతంలో మహిళలు, దివ్యాంగుల కోసం ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ఈ సారి యువ ఓటర్లు అధికంగా ఉన్న నియోజకవరాల్లో యువ ఓటరు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు ఆదర్శ పోలింగ్ కేంద్రాలు సైతం ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలోని అన్ని నియోజవర్గాల్లో 5 ఆదర్శ, 5 మహిళా ఒకటి చొప్పున యూత్, దివ్యాంగుల పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది మొత్తం ఆయా వర్గాలకు చెందిన వారే విధుల్లో ఉంటారు.

**సరికొత్తగా సీ విజిల్**

గతానికి భిన్నంగా సీ విజిల్‌ను ఆధునీకరించారు. ఓటర్లను ప్రభావితం చేసేలా అభ్యర్థులు అక్రమాలకు పాల్పడితే ఎవరైనా ఫిర్యాదు చేసేందుకు 2014లో ప్రవేశపెట్టిన సీ విజిల్ యాప్‌ను ప్రస్తుతం ఆధునికీకరించింది. అక్రమాలపై యాప్‌లో ఫొటో, వీడియో ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులు నేరుగా జిల్లా కలెక్టర్‌కు చేరనున్నాయి. కలెక్టర్ సంబంధిత ప్రాంతంలోని ఎఫ్‌ఎస్‌టీ(ఫ్లయింగ్ స్క్వాడ్) అధికారుల ద్వారా విచారణ చేపట్టి వంద నిమిషాల్లో తగిన చర్యలు తీసుకుంటారు. ఫిర్యాదుదారుడి వివరాలు గోప్యంగా ఉంచడంతో పాటు తీసుకున్న చర్యలను సైతం సంక్షిప్త సందేశం ద్వారా ఫిర్యాదుదారుకు వివరిస్తారు.

**ఓటర్ మే ఐ హెల్ప్ యూ**

గత శాసనసభ ఎన్నికల్లో జిల్లాలోని పట్టణ ప్రాంత నియోజకవర్గాలైన కరీంనగర్, హుజూరాబాద్ ప్రాంతాల్లో తక్కువగా పోలింగ్ నమోదైంది. పోలింగ్ శాతం 75కు మించలేదు. మానకొండూరు, చొప్పదండి నియోజకవర్గాల్లో అధికంగా పోలింగ్ జరిగింది. పోలింగ్‌శాతాన్ని పెంచేందుకు 'మై ఓటర్ హెల్ప్ లైన్' మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టింది. ఈ యాప్ ద్వారా నూతన ఓటు నమోదు చేసుకోవడంతో పాటు ఓటు ఉందో లేదో కూడా తెలుసుకోవచ్చు.

**ఎన్నికల వ్యయ పరిశీలన**

ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చును కట్టడి చేసేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగానే తొలిసారిగా నియోజకవర్గానికో అకౌంటింగ్ బృందాన్ని ఏర్పాటు చేసింది. ట్రెజరీ కార్యాలయ సీనియర్ అధికారి నేతృత్వంలో ఈ బృందాలు పని చేస్తాయి. అభ్యర్థులు చేస్తున్న అన్ని రకాల ఖర్చులను అకౌంటింగ్ బృందాలు పరోక్షంగా పరిశీలించనున్నాయి.

### ముందుగానే పోస్టల్ బ్యాలెట్

ఎన్నికల్లో విధులు నిర్వర్తించే సిబ్బంది, అధికారులు పోస్టల్ బ్యాలెట్లను ఎన్నికల విధులకు హాజరయ్యే ముందు వేసేవారు. ప్రస్తుతం పోలింగ్ ప్రక్రియ ప్రారంభానికి ముందే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించింది. మరో వైపు 80 ఏళ్ల పై బడిన వృద్ధులు, 40శాతం పైగా వైకల్యం ఉన్న దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం సైతం కల్పించింది.

### కేంద్రానికి రాలేరా..

వయోవృద్ధులు, దివ్యాంగుల సౌలభ్యం కోసం ఈ యాప్‌ను రూపొందించారు. పోలింగ్ కేంద్రానికి సొంతంగా రాలేని వారు ఇందులో పేర్లు నమోదు చేసుకోవచ్చు. నమోదు చేసుకున్న వారిని పోలింగ్ కేంద్రానికి తీసుకొచ్చేందుకు అధికారులు రవాణా సదుపాయాన్ని కల్పిస్తారు. వలంటీర్‌ను అందుబాటులో ఉంచుతారు.

## క్లుప్తంగా

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కరీంనగర్‌క్రైం: పురుగులమందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందాడు. కరీంనగర్ వన్‌టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రాయపల్లికి చెందిన తుమ్మనపల్లి చందర్(50)కు అదే ప్రాంతానికి చెందిన రాధతో 30 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. నాలుగేళ్ల క్రితం కుటుంబ కలహాలతో చందర్ కరీంనగర్‌లో ఉన్న తన బంధువు ఇంట్లో ఉండి ఒక ప్రవేట్ ఆసుపత్రిలో సెక్యూరిటీగా పనిచేస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న చందర్ కుమారుడు వచ్చి అతడిని తన గ్రామానికి తీసుకెళ్లగా మళ్లీ కరీంనగర్ వచ్చాడు. ఈక్రమంలో శనివారం చందర్ పురుగుల మందుతాగడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కాగా చందర్ మృతిపై అనుమానం ఉందని మృతుడి భార్య రాధ ఆదివారం కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవికుమార్ తెలిపారు.

**తెర్లుమద్దిలో..**


రాజయ్య(ఫైల్)

**ముస్తాబాద్(సిరిసిల్ల):** అనారోగ్యం భరించలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ముస్తాబాద్ మండలం తెర్లుమద్దికి చెందిన ఎడ్ల రాజయ్య(47) ఈనెల 17న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ముస్తాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. బోదాకాల వ్యాధితో బాధపడుతున్న రాజయ్య కొంతకాలంగా తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. ఆ బాధ భరించలేక పురగుల మందు తాగాడు. కిరాణ దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న రాజయ్య మృతితో భార్య సరోజ, ఇద్దరు కూతుళ్ల రోదనలు మిన్నంటాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ముస్తాబాద్ ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

**అడవి శ్రీరాంపూర్‌లో మహిళ..**


మల్లేశ్వరి (ఫైల్)

**ముత్తారం(మంథని):** తమ పత్తి చేనుకు పురుగుల మందు స్ప్రే చేస్తుండగా అస్వస్థతకు గురైన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన బోగం మల్లేశ్వరి(38), తన భర్త శ్రీనివాస్ ఈనెల 16న పత్తి చేనుకు మందు పిచికారీ చేస్తున్న క్రమంలో అ స్వస్థతకు గురైంది. కరీంనగర్‌లోని ఆస్పత్రికి త రలించగా చికిత్సపొందుతూ మృతిచెందింది. మందు స్ప్రే చేసే సమయంలో మల్లేశ్వరి శ రీరంపై పడటం, వాసన తట్టుకోకపోవడం, ర క్షణ కవచాలు ధరించకపోవడంతోనే అస్వస్థత కు గురై చనిపోయిందని స్థానికులు తెలిపారు. మృతురాలికి కొడుకు, కూతురు ఉన్నారు.

### గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారంలో విఫలం


రాజాగౌడ్

**మెట్‌పల్లిరూరల్(కోరుట్ల):** గల్ఫ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ప్రవాసిమిత్ర లేబర్ యూనియన్ యూఏఈ దుబాయ్ అధ్యక్షుడు బత్తిని రాజాగౌడ్ అన్నారు. గల్ఫ్ కార్మికులకు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం లేనందునే ప్రభుత్వాలు కార్మికుల సమస్యలపై దృష్టి సారించడంలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రవాసీ భారతీయ బీమా యోజన పథకం సహజ మరణానికి కూడా వర్తింపజేయాలని కోరారు. గల్ఫ్ మృతుల కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కార్మికుల సంక్షేమానికి రూ.500 కోట్ల వార్షిక బడ్జెట్ కేటాయించి, ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్ర గల్ఫ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు గల్ఫ్‌లో ఎంతో మంది చనిపోయారని, ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైతే గల్ఫ్ కార్మికుల కష్టాలు తీరుతాయనుకున్నామని కానీ ఎలాంటి మార్పులేదని వాపోయారు.

# పగలు ప్రచారం.. రాత్రి మంతనాలు

- అసెంబ్లీ ఎన్నికల్లో కుల ఓట్లే కీలకం
- వీటిపైనే అన్ని పార్టీల దృష్టి
- గంపగుత్తగా వేసుకునేందుకు ప్రణాళికలు
- సామాజిక వర్గాల వారీగా సమావేశాలు
- కుల పెద్దలను సంప్రదిస్తున్న నేతలు
- ముందస్తు హామీలు.. నజరానాలు
- ఓటర్లను ఆకర్షించేందుకు పడరాని పాట్లు



**కరీంనగర్/పెగడపల్లి:** ఎన్నికల ప్రచారం జోరందుకుంటోంది. గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. తమ అనుచరుల్లోని ముఖ్యులను రంగంలోకి దింపి ఓటర్లను ఆకర్షించేందుకు యత్నిస్తున్నారు. ప్రధానంగా సామాజికవర్గాల వారీగా ఓటర్ల మద్దతు కూడగట్టుకునేందుకు కుస్తీ పడుతున్నారు. కుల పెద్దలను రహస్యంగా సంప్రదిస్తున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఉన్న ఓట్లను సామాజికవర్గాల వారీగా గుర్తించి ఆకట్టుకునేందుకు బృందాలు ఏర్పాటు చేశారు. పగలు ప్రచారం.. రాత్రి మంతనాలు సాగిస్తూ అభ్యర్థులతో పాటు వారి అనుచరులు పడరాని పాట్లు పడతున్నారు.

**కూడికలు.. తీసివేతలు**

అన్ని సామాజికవర్గాల మద్దతు లభిస్తే విజయం సునాయాసమన్న భావనలో అభ్యర్థులున్నారు. ఇప్పటికే ఓటర్ల తుది జాబితాను ఎన్నికల కమిషన్ విడుదల చేసిన నేపథ్యంలో మొత్తం ఓటర్లలో ఏఏ సామాజిక వర్గానికి ఓట్లు ఎక్కువగా ఉన్నాయనే విషయాన్ని ఆరా తీస్తున్నారు. గెలుపోటములు నిర్ధారించే పోలింగ్ బూత్‌లపై ప్రత్యేక దృష్టి సారిస్తూ.. సామాజికవర్గాల వారీగా ఓటర్లను గుర్తించేందుకు ప్రత్యేకంగా ఓ టీం తయారు చేసుకొని తీసివేతలు, కూడికలు మొదలుపెట్టారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఎక్కువ ఓట్లు కలిగి ఉన్న సామాజికవర్గాన్ని గుర్తించి వారి మద్దతును తమవైపు తిప్పుకునే పనిలో పడ్డారు. ప్రతీ నియోజకవర్గంలో 40 నుంచి 45శాతం ఓటర్ల మద్దతును కూడగట్టుకుంటే విజయం తథ్యమనే భావన అభ్యర్థుల్లో నెలకొంది. ఇప్పటికే పలు రాజకీయపక్షాలకు అనుకూలంగా వ్యవహరించే ఓటర్లను మినహాయించి తటస్థంగా ఉన్న ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

**కులపెద్దలతో మంతనాలు**

ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు కులాలు, మతాల వారీగా ఓటర్లను గుర్తించి ఆయా వర్గాలకు చెందిన పెద్దలతో అనుచరగణం సాయంతో మంతనాలు చేస్తున్నారు. ప్రతిరోజు సమయం దొరికినప్పుడల్లా ఫోన్లలో వారిని ఆప్యాయంగా పలుకరించి గెలుపునకు సహకరించాలని కోరుతున్నారు. ఇదే సమయంలో స్థానిక సమస్యలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వారితో ప్రస్తావించి గెలిచిన వెంటనే తొలిప్రాధాన్యమిచ్చి పరిష్కరిస్తామని హామీలిస్తున్నారు. ప్రతి ఎన్నికల్లో కొన్ని సామాజికవర్గాల అభ్యర్థులు గెలుపోటములను శాసిస్తున్నాయి. అలాంటి సామాజికవర్గాన్ని గ్రామాల వారీగా గుర్తించేందుకు అభ్యర్థులు పక్కా ప్రణాళిక రూపొందించుకునే పనిలో నిమగ్నమయ్యారు. తుది ఓటర్ల జాబితాలోని ఓటర్ల శాతానికి అనుగుణంగా సామాజికవర్గాలను ఆకర్షించేందుకు అభ్యర్థులు అంకెల గారడీతో కుస్తీ పడుతూ గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తుతుండడంతో రాజకీయ రణరంగం రసవత్తరంగా మారుతోంది.


**సమయం లేక అభ్యర్థుల అవస్థలు**

అసలే మాఘి పొద్దు. పొద్దంతా తక్కువగా సమయం ఉంటుంది. రాత్రంతా చలి. అందులో ప్రచారానికి సమయం ఉండటం లేదు. సహజంగా ఎన్నికలప్పుడు తప్ప నాయకులు ఎప్పుడు గ్రామాలకు రాలేదంటారు. కానీ ఎన్నికల వేళ కూడా అభ్యర్థులు ఓట్లు అడిగేందుకు వెళ్లలేని పరిస్థితి ఉంది. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు వెళ్లి ఓట్లు అడిగే సమయం లేదు. దీంతో ప్రధాన గ్రామాలపై దృష్టి సారించిన నేతలు పగలు ప్రచారం చేస్తూ రాత్రి వేళ మంతనాలు చేస్తున్నారు.

**కార్యకర్తలపైనే ఆధారం**

ప్రచారానికి సమయం లేకపోవడం, పైగా గ్రామాలు ఎక్కువగా ఉండటంతో ఆయా పార్టీల అభ్యర్థులు కార్యకర్తలపైనే ఆధారపడుతున్నారు. ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకొని అవసరమున్న గ్రామాలకు మాత్రమే వెళ్లి అక్కడి పరిస్థితులను తెలుసుకుని చక్కదిద్దే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధానంగా వలసలు, చేరికలు తదితర వాటిపై నేతలు దృష్టి సారించారు. చివరి రోజుల్లో ర్యాలీ ఏర్పాట్లకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఆయా మండలాల్లో అత్యధిక ఓటర్లున్నా గ్రామాలకు వెళ్లేందుకు ప్రణాళిక రూపొందించుకుంటున్నారు. సమయం లేకపోవడంతో ఎన్నికల ప్రచారం ఒకవంతుగా చూస్తే అభ్యర్థులకు సవాలుగా మారినట్లే.

# రాజన్న మీ దగ్గర ఎట్టున్నదే



**పెగడపల్లి(ధర్మపురి):** పొద్దంతా చేనులో కట్టం చేసి వచ్చిన మల్లన్న పక్క ఊర్లో ఉంటున్న తన సోపతి రాజన్నకు ఫోన్ చేసి ఎలచ్చన్ల గురించి మాట్లాడుతున్న మాటమంతి ఇలా ఉంది.

**మల్లన్న:** ఏం రాజన్న ఎట్లున్నవ్ అంతా మంచిదేనా..?

**రాజన్న:** ఆ మల్లన్న మంచిగున్నానే...నువ్వు ఎట్లున్నవ్..

**మల్లన్న:** ఆ మంచిగనే ఉన్నా..బాగా రోజులైంది నీతో మాట్లాడక. ఎం జేస్తున్నవు ఏందీ?

**రాజన్న:** ఇప్పుడే చేన్లకు పోయి ఇంటికచ్చిన. ఎలచ్చన్లు అచ్చినయ్ కదా. రాత్రికి ఒక నలుగురం కలిసి మంచి చెడూ మాట్లాడుకునుడే ఇంకేముంది.

**మల్లన్న:** ఎలచ్చన్లు ఏంటో రాజన్న..ఎప్పుడూ సూడని సిత్రాలు సూస్తున్నాం. గీ నాయకులు కాళ్లు కడుగుతుంండ్రు. బజ్జీలు జేత్తుండ్రు. ఇంటికొచ్చి ఇస్త్రీ చేస్తుండ్రు, బీడీలాకు కత్తిరిస్తుండ్రు, పొయ్యికాడికచ్చి రొట్టెలు జేత్తుండ్రు. పోరగండ్లకు తానం పోత్తుండ్రు. పచారంలా దప్పులు కొడుతుండ్రు.. అబ్బబ్బ ఎన్నడూ సూడని సిత్రాలు ఎలచ్చన్ల పుణ్యమాని సూస్తున్నాం.

**రాజన్న:** ఔనూ మల్లన్నా.. గీ నాయకులు ఓట్ల కోసం ఏమైన సేసేటట్లు ఉన్నరు. నమ్మబుద్ధవ్వట్లేదు కదా..

**మల్లన్న:** అవు రాజన్న..గెలిసేదాక ఒక్కటే..గెలిపించాక ఇంకొక్కటి వీల్ల తరికా.. సూడనోల్లమా మనం.. సిన్నగున్నప్పటి నుంచి సూస్తున్నవే కదా.

**రాజన్న:** అవు మల్లన్న..గిసుంటి పనులు సేయడంలో నాయకులను మించినోళ్లు లేరు గదా.

**మల్లన్న:** సరే గానీ రాజన్న..మీ దగ్గర ఎట్లున్నదే.. (ఏ పార్టీ హవా నడుస్తున్నది).

**రాజన్న:** ఏం చెప్పస్తలేదు మల్లన్న. అందరూ వస్తుండ్రు, పోతుండ్రు. ఎవ్వల్లస్తరో(గెలుస్తరో) సమజయితలేదు.

**మల్లన్న:** అవునా..(నవ్వుతూ) ఎవరైన రానీ..ఎవరిని నారాజ్ చేయొద్దు మనం. సూద్దాం ఇంకో వారం ఆగితే అంతా కుల్లావుతది గదా.

**రాజన్న:** సరే మల్లన్న. రాత్రి అయింది. బుక్కెడు బువ్వ తిని పడుకుంటా..

**మల్లన్న:** సరే రాజన్న ఉంటా మరి.

# ఈవీఎంలో అభ్యర్థుల కూర్పు ఇలా..

**కరీంనగర్ అర్బన్:** ఎన్నికల క్షేత్రంలో తలబడటమంటే అభ్యర్థికి అన్ని రకాల టెన్షన్ టెన్షన్. సెంటిమెంట్లు, ప్రలోభాలు, కుతంత్రాలు ఇదొక పార్శ్వమైతే ఈవీఎంలో తాను ఎక్కడున్నది ఓటరుకు తెలుపడానికి అనువైన నంబర్, చోటు కోసం అభ్యర్థులు అపసోపాలు పడుతుంటారు. అధికారులు మాత్రం బ్యాలెట్ కూర్పులో ఏ మాత్రం పొరపాటు లేకుండా ఎన్నికల కమిషన్ సూచించిన నియమావళి, మార్గ దర్శకాలను అనుసరించి ఒకటికి రెండు సార్లు చూసి వివరాలు ప్రకటిస్తారు.

అదెలాగంటే..

- తొలుత గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీల అభ్యర్థులను ఎంచుకుంటారు. నామినేషన్ పత్రాల్లో తమ పేరు, ఇంటి పేరు నమోదు చేయడంలో ఒక్కొక్కరిది ఒక్కో పద్ధతి.
- అందుకే నామినేషన్లతో పాటు బ్యాలెట్‌లో అభ్యర్థి పేరు ఎలా ఉండాలని కోరుకుంటారో.. ప్రత్యేకంగా రాసి ఇవ్వాలని సూచిస్తారు. ఇదే బాలెట్లో సదరు అభ్యర్థికి చోటు కేటాయించేందుకు అధికారులకు ఆధారం.
- అభ్యర్థుల ప్రాధాన్య క్రమాన్ని నిర్ధారించేందుకు మొదట జాతీయ పార్టీలకు సంబంధించి అభ్యర్థుల పేర్లను పరిశీలిస్తారు.
- వారిచ్చిన పేరులో మొదటి అక్షరాలను పరిశీలించి, తెలుగు వర్ణమాల(పెద్ద బాలశిక్ష)లోని అక్షరాలు, గుణింతల ఆధారంగా వరుస క్రమాన్ని నిర్ధారిస్తారు.
- జాతీయ పార్టీల అభ్యర్థులను గుర్తించి వారికి వరుస సంబరు కేటాయించిన అనంతరం గుర్తింపు పొందిన రాష్ట్ర పార్టీ అభ్యర్థులను నమోదు చేస్తారు.
- ఒకటి కన్నా ఎక్కువ రాష్ట్ర పార్టీల అభ్యర్థులుంటే వారికిచ్చిన పేరు వివరాలతో తెలుగు వర్ణమాలను అనుసరించి వరుసలో కేటాయిస్తారు.

# పోలింగ్ బూత్‌లో ప్రత్యేక నిబంధనలు

- ఉల్లంఘిస్తే ఓటు వేయకుండా చర్యలు



**జగిత్యాలజోన్:** ఎన్నికల పోలింగ్ రోజున పోలింగ్ బూత్‌కు వచ్చిన ఓటరు గోప్యతను పాటించకుండా ఓటును బహిర్గతం చేయడానికి ప్రయత్నిస్తే ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినట్లుగా అధికారులు భావించి సదరు వ్యక్తి ఓటును వేయడానికి అనుమతించరు. అలాగే గుడ్డివారై ఉండి, ఎన్నికల గుర్తులను గుర్తించలేని పరిస్థితి ఉంటే, సదరు ఓటు వేసే అంధత్వ వ్యక్తితో పాటు ఓ వ్యక్తిని పోలింగ్ బూత్‌లోకి అధికారులు అనుమతిస్తారు. అంధత్వ వ్యక్తికి సహాయంగా వెళ్లే వ్యక్తికి 18 ఏళ్లు నిండి, ఏదేని గుర్తింపు కార్డు తీసుకవస్తేనే పోలింగ్ కేంద్రంలోకి అనుమతిస్తారు. అలాగే ఒక వ్యక్తి ఓటు వేయడానికి వచ్చినప్పుడు అతడి ఓటును అప్పటికే ఎవరైనా వేస్తే, టెండర్ ఓటుగా పరిగణించి, పోలింగ్ అధికారుల వద్ద ఉండే బ్యాలెట్ పేపర్‌లో ఒక పేపర్ ఇస్తే, దానిపై పాత పద్ధతిలో ఓటు వేయవచ్చు. ఎవరైనా ఓటు వేయడానికి వచ్చినప్పుడు బోగస్ ఓటు అని, తక్కువ వయస్సు అని పోలింగ్ ఏజెంట్లు చాలెంజ్ చేస్తే, పోలింగ్ అధికారి ఏజెంట్ నుంచి విషయాలు సేకరిస్తారు. ప్రాథమిక విచారణ జరిపి, ఆరోపణ నిజమైతే సదరు ఓటర్‌ను పోలీస్ సిబ్బందికి అప్పగిస్తారు. ఒక ఓటర్ తాను నచ్చిన పార్టీకి ఓటు వేస్తే, అది వేరే పార్టీకి పడ్డట్లు ఆరోపణలు చేస్తే, అధికారులు టెస్ట్ ఓటుకు అనుమతిస్తారు. అయితే ఆ ఆరోపణ రుజువు కాకుంటే చర్యలు తీసుకుంటామని కూడా సదరు ఓటర్‌ను ముందే హెచ్చరిస్తుంటారు.

# మన ఓటు మనం చూడొచ్చు

- ఏడు సెకన్ల వరకే అవకాశం

**కరీంనగర్‌అర్బన్:** ఎన్నికల సంఘం పారదర్శక ఎన్నికలకు పెద్దపీట వేస్తుండగా జవాబుదారీగా నిలువాలని నిర్ణయించింది. గత ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ వాడితే ఓటరు తాను ఎవరికి ఓటు వేశారో స్పష్టంగా తెలిసేది. ఈవీఎంలు వచ్చాక ఆ వెసులుబాటు పోయింది. అనంతరకాలంలో ఓటరు తాను వేసిన ఓటు సంబంధిత అభ్యర్థికే పడిందా లేదా తెలుసుకునేందుకు ఎన్నికల సంఘం వీవీప్యాట్ (ఓటర్ వెరిఫయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్)ను ప్రవేశపెట్టింది. ఓటరు ఓటు వేయగానే వీవీప్యాట్లో చూసుకోవాలి. ఇది అభ్యర్థి క్రమ సంఖ్య, పేరు, గుర్తును ముద్రిస్తుంది. ఆ పేపరు ఏడు సెకన్లు మాత్రమే కనిపిస్తుంది. తర్వాత దానంతటదే వీవీప్యాట్లోని బాక్స్‌లో పడిపోతుంది. దీన్ని తొలిసారిగా 2013 సెప్టెంబరులో నాగాలాండ్‌లో గల నోక్సెన్ అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రయోగాత్మకంగా అమలు చేశారు. తదుపరి అదే ఏడాది మిజోరం అసెంబ్లీ ఎన్నికల్లో 10 నియోజకవర్గాల్లో వాడారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో ఎనిమిది లోక్‌సభ స్థానాల్లో, 2017 గోవా అసెంబ్లీ ఎన్నికల్లో పూర్తిస్థాయిలో ఉపయోగించారు. ఈ యంత్రాలను సీల్ చేసే పేపర్, స్ట్రిప్ సీల్ తదితరాలను నాసిక్ ప్రింటింగ్ ప్రెస్ మాత్రమే తయారు చేస్తుంది.

# ఆర్టీసీ బస్సులు ఢీ.. 17 మందికి స్వల్పగాయాలు


చికిత్స పొందుతున్న ప్రయాణికులు


ఆర్టీసీ బస్సులు ఢీకొన్న దృశ్యం

**సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి):** సుల్తానాబాద్ బస్టాండ్ వద్ద ఆదివారం రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్న ఘటనలో 17మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలైనాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖని బస్టాండ్ నుంచి కరీంనగర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు సుల్తానాబాద్ బస్టాండ్‌లోకి వెళ్లే క్రమంలో కరీంనగర్ నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న మరో ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో గోదావరిఖని బస్సులో ప్రయాణిస్తున్న 17మందికి స్వల్ప గాయాలు కాగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

# పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్య


సమ్మయ్య (ఫైల్)

**సుల్తానాబాద్ రూరల్:** సుల్తానాబాద్ మండలం చిన్నకల్వలకు చెందిన సమ్మయ్య (50) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సమ్మయ్యకు ఇద్దరు కూతుళ్లు కాగా పెద్ద కూతురి వివాహం జరిపించాడు. ఆర్థిక ఇబ్బందులతో పాటు చిన్న కూతురు పెళ్లి ఎలా జరిపించాలని మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలోనే తాగుడుకు బానిసయ్యాడు. ఆదివారం పురుగుల మందు తాగగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

### మద్యం పట్టివేత


మద్యం సీసాలను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

**హుజూరాబాద్‌రూరల్:** పట్టణ శివారులోని సిర్సపల్లి క్రాస్ రోడ్ వద్ద తనిఖీల్లో భాగంగా ఆదివారం మద్యం సీసాలను పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ దుర్గాభవాని తెలిపారు. సమ్మయ్య అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై మద్యం సీసాలను తరలిస్తుండగా 45 బాటిళ్లు లభ్యమైనట్లు వివరించారు. హెచ్‌సీ ముకుంద రెడ్డి, సంతోష్, కార్తీక్‌కుమార్, రమేశ్ ఉన్నారు.

**కరీంనగర్‌క్రైం:** కరీంనగర్‌లోని కాపువాడలో అక్రమంగా మద్యం నిల్వ చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. కరీంనగర్ వన్‌టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. కాపువాడకు చెందిన కె.శ్రీరాములు నగరంలోని వివిధ వైన్స్‌లలో మద్యం కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయించేందుకు నిల్వ చేశాడు. ఆదివారం సమాచారం అందుకున్న పోలీసులు అతడి నుంచి రూ.2,520 విలువ గల 14 బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# ఇది విన్నారా..!

**కరీంనగర్ అర్బన్:** ఎన్నికల కమిషన్ ఏర్పాటు తదనంతరం జరిగిన పరిణామాలు ఇలా ఉన్నాయి. 25 జనవరి 1950న భారత ఎన్నికల కమిషన్ ఏర్పాటైంది. జిల్లా స్థాయిలో కలెక్టర్ ముఖ్య ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. 25 జనవరి 2011న తొలి జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించగా అప్పటి నుంచి ఏటా నిర్వహిస్తున్నారు. ఎగ్జిట్ పోల్ ఫలితాలను ఎన్నికల సంఘం 2004 నుంచి నిషేధించింది. ఎన్నికల అనంతరం సర్వేలను పోస్ట్ పోల్ సర్వేగా పరిగణిస్తారు.

- ఓటరు గుర్తింపు కార్డులను 1993లో ప్రవేశపెట్టారు. అప్పటి భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ టి.ఎన్. శేషన్ దీనికి శ్రీకారం చుట్టారు. తెలంగాణ రాష్ట్రం మొదటి ఎన్నికల కమిషనర్‌గా వి.నాగిరెడ్డి సేవలందించగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా 2013లో మొదటిసారిగా తిరస్కరించే ఓటు (నోటా) ప్రవేశపెట్టారు.
- ఎన్నికల్లో తొలిసారిగా ఓటింగ్ యంత్రాలను పూర్తి స్థాయిలో వినియోగించిన రాష్ట్రం గోవా. 1999లో ఉపయో గించారు. ఓటింగ్ యంత్రాలలో వీవీప్యాట్‌లను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు 2013లో సూచించింది. నోటా ఆప్షన్ మొదటిసారిగా 2013లో ఢిల్లీ, ఛత్తీస్గఢ్, మధ్యప్రదేశ్, మిజోరాం రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉపయోగించారు.

# రోడ్డున పడ్డ కుటుంబం

- రోడ్డు ప్రమాదంలో కుటుంబ పెద్ద మృతి
- అనాథలైన భార్య, ముగ్గురు పిల్లలు
- ఆదుకోవాలని వేడుకోలు


బాధిత కుటుంబ సభ్యులు

**ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):** ఆ కుటుంబాన్ని విధి వెంటాడింది. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్న వ్యక్తిని రోడ్డు ప్రమాదరూపంలో మృత్యువు వెంటాడింది. కుటుంబ పెద్ద మృతితో భార్య సాజిదా, పదేళ్లలోపు ఉన్న ముగ్గురు చిన్నారులు రోడ్డున పడ్డారు. నేడు ఆ కుటుంబానికి అండగా నిలిచేవారు లేక ఆపన్నహస్తం అందించాలని వేడుకుంటున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన మహమ్మద్ అజీజ్(32) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈనెల 17న మేడ్చల్‌లో తమ సమీప బంధువు ఇంట్లో శుభకార్యం ఉండగా అక్కడికెళ్లి తిరిగి వస్తుండగా వెనక నుంచి లారీ వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అజీజ్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. అప్పటి వరకు ఆటో నడుపుతూ వచ్చిన డబ్బులతో సంతోషంగా ఉంటున్న కుటుంబంలో ప్రమాదం విషాదాన్ని నింపింది. భార్య, ముగ్గురు పిల్లలు రోడ్డున పడ్డారు. కనీసం సొంతిల్లు లేక అద్దె ఇంట్లో ఉంటున్న అజీజ్ కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. చిన్న వయసులోనే భర్తను కోల్పోయిన సాజిదా కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. దాతలు ముందుకొచ్చి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. సాయం అందించాల్సిన వారు ఫోన్‌పే 63094 58382 నంబర్‌కు సాయం చేయాలని సాజిదా కోరుతోంది.



# రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు


గాయపడిన హాకాజ్


ప్రమాదానికి కారణమైన కారు

**జగిత్యాలక్రైం:** జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామ శివారులో ఆదివారం మధ్యాహ్నం జగిత్యాల–ధర్మపురి ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. పొలాస గ్రామానికి చెందిన హాకాజ్, రిషిక్ పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. పాఠశాలలో ప్రత్యేక తరగతులకు హాజరై తిరిగి ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా పొలాస శివారులోని ప్రధాన రోడ్డుపై వీరి బైక్‌ను కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం స్థానికులు 108 ద్వారా జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### యువతి అదృశ్యం

**కరీంనగర్‌క్రైం:** కరీంనగర్‌లోని ఓ ప్రభుత్వ కళాశాల హాస్టల్‌లో ఉంటూ చదువుతున్న విద్యార్థిని అదృశ్యమైంది. వన్‌టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. గోదావరిఖనికి చెందిన యువతి కరీంనగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతోంది. శనివారం కడుపునొప్పితో బాధపడుతున్నట్లు తల్లిదండ్రులకు తెలుపగా.. గోదావరిఖని రావాలని చెప్పారు. సదరు హాస్టల్ వార్డెన్‌తో మాట్లాడి తమ కూతురును ఇంటికి పంపించమని కోరారు. అయితే ఆమె ఇంటికి చేరుకోకపోవడంతో తన స్నేహితులకు ఫోన్ చేశారు. తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో వన్‌టౌన్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# జీవితంపై విరక్తితో వృద్ధుడి బలవన్మరణం

**జగిత్యాలక్రైం:** జగిత్యాల జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్ ప్రాంతానికి చెందిన కొడుదురుపాక వెంకటి అనే వృద్ధుడు జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. వెంకటి భార్య ఐదేళ్ల క్రితం మృతిచెందింది. దీంతో ఒంటరిగా ఉంటున్నాడు. భార్య చనిపోయిందనే బెంగతో పాటు ఒంటరిగా ఉండటంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ మన్మథరావు తెలిపారు.

# ప్రతిపక్షాల మాయమాటలు నమ్మొద్దు



హాజరైన ప్రజలు



మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

- ఎంపీ బండికి విమర్శించే అర్హత లేదు
- పనిచేసే నాయకుడిని గెలిపించండి
- మంత్రి, కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్

కరీంనగర్/కరీంనగర్‌రూరల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉంటూ టికెట్లు ఇప్పిస్తానని పలువురి వద్ద డబ్బులు తీసుకొని అవినీతికి పాల్పడితే బీజేపీ అధిష్టానం అధ్యక్ష పదవి నుంచి తొలగించిందని అలాంటి వ్యక్తికి తనను విమర్శించే అర్హత లేదని కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం నగరంలోని 55, 37, 38వ డివిజన్ మంకమ్మతోట, రాంనగర్ విద్యానగర్‌లలో ప్రచారం నిర్వహించారు. ఎన్నికల వేళ నియోజక వర్గానికి వచ్చే నాయకులను నమ్మి మోసపోవద్దని, నియోజక వర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నా తనను ఆశీర్వదించి మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్ కష్టాలు.. బీజేపీకి ఓటేస్తే మతపరమైన అలజడులు వస్తాయని.. బీఆర్ఎస్‌కు ఓటేస్తే సంక్షేమ పథకాలు అమలవుతాయని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక పదేళ్లల్లోనే అభివృద్ధి అద్భుతంగా కొనసాగుతుందని, పచ్చని తెలంగాణలో చిచ్చు పెట్టాలని సమైక్యవాదులు కుట్రలు పన్నుతున్నారని అన్నారు. అభివృద్ధి చెందుతున్న తెలంగాణలో ఆంధ్ర, ఢిల్లీ పార్టీల పెత్తనం ఏంటి అని ప్రశ్నించారు. మన పిల్లల భవిష్యత్ బాగుండాలంటే రానున్న ఎన్నికల్లో మన ఇంటి పార్టీ బీఆర్ఎస్‌కు ఓటేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ భూకబ్జా దారులకు టికెట్లు అమ్ముకుందని, 32 కేసులు ఉన్న వ్యక్తికి, భూ కబ్జాదారుడికి టికెట్ కేటాయించిన కాంగ్రెస్ నిజస్వరూపాన్ని ప్రజలు గ్రహించాలని కోరారు. కరీంనగర్ ఎంపీగా గెలిచిన బండి సంజయ్‌కుమార్ కరీంనగర్‌కు ఎన్ని నిధులు తెచ్చాడో., ఏం అభివృద్ధి చేశాడో చెప్పాలని ప్రశ్నించారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఘోరంగా ఓటమిపాలై అపోలో ఆస్పత్రిలో గుండె నొప్పి నాటకంతో సానుభూతితో ఎంపీగా గెలిచాడని.. నాలుగున్నర సంవత్సరాల్లో ఒక్కసారి కూడా కరీంనగర్ అభివృద్ధి గురించి ఆలోచించలేదని విమర్శించారు. అవినీతి సొమ్ముతో రానున్న ఎన్నికల్లో ఒక్కో ఓటుకు 20 వేలతో పాటు ఐఫోన్‌లు పంచిపెట్టి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నాడని, ఆయన ఇచ్చే డబ్బులు ,ఐఫోన్లు తీసుకొని అభివృద్ధి చేస్తున్న కారు గుర్తుకు ఓటెయ్యాలని కోరారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అద్భుత ప్రగతి సాధించిందని అన్నారు. తొమ్మిదేళ్ల కింద తెలంగాణ ఎలా ఉండేది ఇప్పుడెలా అభివృద్ధి చెందిందో చూడాలన్నారు. తెలంగాణను 33 జిల్లాలు చేసి జిల్లాకు మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసి 500 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేశామని అన్నారు. మేయర్ సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపరాణి హరిశంకర్, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### తెలంగాణను మోసగించిన కాంగ్రెస్ ,బీజేపీలు

తెలంగాణను కాంగ్రెస్, బీజేపీలు మోసం చేశాయని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఆదివారం కరీంనగర్ మండలం నగునూరులో మాట్లాడుతూ రెండుసార్లు ఓడిపోయిన బండి సంజయ్ ఇప్పుడు అవినీతి సొమ్ముతో ఓటుకు రూ.20వేలు, సెల్‌ఫోన్లు ఇచ్చేందుకు వస్తున్నాడని అన్నారు. సంజయ్ ఇచ్చిన డబ్బులు తీసుకుని కారు గుర్తుకు ఓటేయాల్సిందిగా కోరారు. కేసీఆర్ చేతుల్లోనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని అన్నారు. రౌడీషీటర్, భూకబ్జాదారుడికి కాంగ్రెస్ పార్టీ టికెట్ అమ్ముకుందని విమర్శించారు. ఎంపీపీ టి.లక్ష్మయ్య, సర్పంచ్ ఉప్పుల శ్రీధర్, ఉప సర్పంచ్ దామోదర్‌రెడ్డి, ఎంపీటీసీలు శ్రీనివాస్, వినయ్, కరీంనగర్ సింగిల్‌విండో చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, డైరెక్టర్ మహేందర్, నేక్‌పాషా, హన్మంతరావు, రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

### సీఎం కేసీఆర్ పరిపాలనతోనే రాష్ట్రాభివృద్ధి

భావితరాల బిడ్డలకు బంగారు భవిష్యత్ లభించాలంటే మరోసారి సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని మేయర్ సునీల్ రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం 33వ డివిజన్ భగత్‌నగర్‌లో ఇంటింటా ప్రచారం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ మహిళలు, వృద్ధులు, యువకులను ఓట్లు వేయాలని కోరారు. 50 ఏళ్ల ఆంధ్రా కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం ఎట్లా ఉండేదని.. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక కేసీఆర్ నాయకత్వంలో ఎట్లా మారిందని ఓటర్లకు వివరించారు. అభివృద్ధి చేసిన పార్టీలు ఏవీ.. అభివృద్ధి చేసే నాయకులెవరనేది ప్రజలు ఆలోచన చేయాలన్నారు. గంగుల కమలాకర్‌ను మరోసారి ఆశీర్వదిస్తే మిగిలిన పెండింగ్ పనులు పూర్తి చేసి నగరాన్ని ఇంకా గొప్పగా మార్చుతామన్నారు. మేయర్ వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గంగుల, పురమళ్ల.. నయీం బ్రదర్స్



బండి సంజయ్‌ను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు



మాట్లాడుతున్న ఎంపీ, బీజేపీ అభ్యర్థి బండి సంజయ్

- బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు భూకబ్జాదారులు
- అవినీతికి పాల్పడడమే వాళ్ల పని
- ఎంపీ, కరీంనగర్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్

కరీంనగర్‌టౌన్/కొత్తపల్లి: 'కరీంనగర్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులిద్దరూ భూకబ్జాదారులు.. నయీం బ్రదర్స్. కనపడిన భూములను కబ్జా చేయడమే వీళ్లపని..' అంటూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. ఆదివారం రాత్రి నగరంలోని కమాన్ చౌరస్తాలో ప్రచారం నిర్వహించారు. బండి సంజయ్ రాకతో మహిళలు, యువకులు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, తానేనాడు భూకబ్జాలు చేయలేదని, అవినీతికి పాల్పడలేదన్నారు. ప్రజల కోసమే పోరాడిన చరిత్ర తనదన్నారు. గంగుల కమలాకర్ గెలిచే అవకాశం లేదని సర్వేలు తేల్చడంతో తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేందుకు మార్ఫింగ్ చేసి దొంగ వీడియో, ఆడియోలు సృష్టించి ప్రజలను గందరగోళంలో పడేసే పెద్ద కుట్రకు తెరదీశారని తెలిపారు. కరీంనగర్ ప్రజలంతా విజ్ఞతతో ఆలోచించి ఓటేయాలని పిలుపునిచ్చారు. గంగుల మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేశారని, ఎవరికైనా ఇండ్లు ఇచ్చారా అని ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వం తెలంగాణకు 2.4 లక్షల ఇండ్లు మంజూరు చేస్తే కేసీఆర్, గంగుల ఆ నిధులన్నీ దారి మళ్లించారే తప్ప పేదలకు ఒక్క ఇల్లు ఇవ్వలేదన్నారు. ఎంపీగా ఉంటూ బండి సంజయ్ కరీంనగర్‌కు ఏం చేశాడని గంగుల అంటున్నారని తానే ఏం చేశానో తెల్వదా అని అన్నారు. స్మార్ట్ సిటీ నిధులు, తీగలగుట్టపల్లి ఆర్వోబీ నిర్మాణానికి నిధులు, కరీంనగర్–వరంగల్, కరీంనగర్–జగిత్యాల రోడ్లు, జిల్లా ఆసుపత్రి అభివృద్ధికి నిధులు తీసుకొచ్చానని.. కానీ తానే అభివృద్ధి చేశానంటూ గంగుల చెప్పడం సిగ్గు చేటన్నారు. గంగుల అవినీతిపరుడివి కాబట్టే కేసీఆర్ ఆయనను కరీంనగర్‌కే పరిమితం చేశారని, బీ ఫాం ఇవ్వకుండా సతాయించడంతో చివరకు దారుస్సలాంపోయి ఓవైసీ కాళ్లు పట్టుకుని టిక్కెట్ తెచ్చుకున్నాడని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మీకు అండగా ఉంటా...

'నేనేంటో కరీంనగర్ ప్రజలందరికీ తెలుసు. నేను ఏ రోజే యే వ్యాపారస్తుడి వద్ద పైసలు వసూలు చేయలే. ఏ ఒక్క ఉద్యోగిని ఇబ్బంది పెట్టలే. గంగుల కమలాకర్ లెక్క ఎవరి కుటుంబాలను నాశనం చేయలేదు. పిలిస్తే పలికేటోడిని. మీ బాధలు తెలిసినోడిని. పువ్వు గుర్తుకు ఓటేసి గెలిపిస్తే మీకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటా' అని బండి సంజయ్‌కుమార్ అన్నారు. ప్రచారంలో భాగంగా ఆదివారం కరీంనగర్‌లోని రైతు మార్కెట్ సమీపంలో నిర్వహించిన క్లాత్ మర్చంట్ అసోసియేషన్ ఉద్యోగుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. భవిష్యత్తులో ప్రజల తరపున కొట్లాడేందుకు ఏ పార్టీ కార్యకర్త కూడా ముందుకు రారనే విషయాన్ని గుర్తుంచుకుని పువ్వు గుర్తుపై ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అసోసియేషన్ నాయకులు భోగ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### రేషన్ కార్డులు ఎందుకివ్వలే..?

అవినీతి పరులెవ్వరో తేల్చుకుందాం.. దమ్ముంటే రా.. అంటూ మంత్రి గంగుల కమలాకర్‌కు కరీంనగర్ బీజేపీ అభ్యర్థి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ సవాల్ విసిరారు. ఆదివారం కరీంనగర్ నియోజకవర్గంలోని బావుపేట, చింతకుంటలో ప్రచారం నిర్వహించిన సంజయ్‌కు ప్రజలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బండి మాట్లాడుతూ, ఈ సారి గెలిస్తే రేషన్ కార్డులిస్తానని బూటకపు మాటలు చెప్పే కమలాకర్, సివిల్ సప్లయి మంత్రిగా ఉండి ఎందుకివ్వలేదని అన్నారు. బీసీ మంత్రిగా ఉండి ఎంతమందికి బీసీబంధు ఇచ్చావు, 15 ఏళ్లుగా నియోజకవర్గానికి ఏం చేశావని ప్రశ్నించారు. ప్రజల కోసం పోరాడితే కేసీఆర్ ప్రభుత్వం తనపై 74 కేసులు పెట్టిందని, అయినా భయపడకుండా మీకోసం ఎంతటి పోరాటాలకైనా సిద్ధమని చెప్పారు. కరీంనగర్‌లో రౌడీలు, గుండాల భయం లేదని, ఉన్నదొక్కటే అధికార పార్టీ మాఫియా అని, రాష్ట్రంలో ఎక్కడికెళ్లినా కరీంనగర్ పేరు చెబితే ఛీ కొడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులిద్దరూ భూ కబ్జాల కోసం పోటీ పడుతుంటే తాను ప్రజల కోసం పోరాటాలు చేస్తున్నానని సంజయ్ తెలిపారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే గంగుల ఏకఛత్రాధిపత్యాన్ని బద్దలు కొట్టి గ్రానైట్ యూనియన్ ఎన్నికలు జరిపించి తీరుతానని స్పష్టం చేశారు. ప్రజలంతా బీజేపీకి మద్దతు తెలిపి తనకు భారీ ఆధిక్యాన్ని ఇవ్వాలని కోరారు.

### మా తొలి ఓటు సంజయ్‌కే

నగరంలోని కమాన్‌చౌరస్తాలో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో మా తొలి ఓటు బండి సంజయ్‌కే అంటూ యువ ఓటర్లు ప్లకార్డులు ప్రదర్శించారు. బండి సంజయ్‌కు మద్దతు పలికారు.

## క్లుప్తంగా

### ఇందిరాగాంధీకి నివాళి




నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆదివారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన ధీర వనిత ఇందిరాగాంధీ అని కొనియాడారు. ప్రధానిగా గరీబీ హటావో నినాదంతో పేదరిక నిర్మూలనకు కృషిచేశారని గుర్తు చేశారు. బ్యాంక్‌ల జాతీయకరణ, రాజభరణాల రద్దు లాంటి కీలక నిర్ణయాలు తీసుకొని ఉక్కు మహిళగా పిలవబడ్డారన్నారు. ఇందిరాగాంధీ ఆశయాలు కొనసాగించేందుకు ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాత శ్రీనివాస్, సునంద, సిరాజుహుస్సేన్, సిరికొండ శివప్రసాద్, రాచకట్ల దినకర్, కరీం, ఉపేందర్, రాజ్‌కుమార్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# చీటీలు పంచుతూ.. అవగాహన పెంచుతూ

- పోల్ చీటీలతో ఓటర్లను చైతన్య పరుస్తున్న బీఎల్‌వోలు
- పోలింగ్‌శాతం పెంచేలా చర్యలు



ఫకీర్‌పేటలో ఓటర్లకు పోల్‌చీటీలు అందజేస్తున్న బీఎల్‌వో నీల

కరీంనగర్‌రూరల్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ తేదీ సమీపిస్తుండటంతో అధికారులు పోల్ చీటీల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఈ ఎన్నికల్లో బీఎల్‌వోలు పోల్‌చీటీలతో పాటు ఓటుపై చైతన్యం కలిగించేందుకు ఓటర్లకు కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని అవగాహన కల్పిస్తున్నారు. చీటీలతో పాటు కుటుంబానికి ఒక ఓటరు గైడ్‌ను అందిస్తున్నారు.

### పోల్‌చీటీల పంపిణీ ప్రారంభం

కరీంనగర్ నియోజకవర్గం పరిధిలో 390 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక బీఎల్‌వో ఉన్నారు. మొత్తం ఓటర్లు 3,55,054 ఉండగా పురుషులు 1,77,893, మహిళలు 1,77,117 మంది ఉన్నారు. కరీంనగర్‌రూరల్, కొత్తపల్లిమండలాలతో పాటు కార్పొరేషన్ పరిధిలోని ఓటర్లందరికీ పోల్‌చీటీలను శనివారం నుంచి బీఎల్‌వోలు పంపిణీ చేస్తున్నారు. ఓటరుకు పోల్‌చీటీలతో పాటు ఎన్నికల సంఘం ఓటు ప్రాముఖ్యం, దేశభవిష్యత్‌ను మార్చే శక్తి ఓటుకు మాత్రమే ఉందని ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే సందేశంతో సీ విజిల్ యాప్, 1950 టోల్ ఫ్రీనంబరు తదితర వివరాలతో ప్రచురించిన ఓటరు గైడ్‌ను అందిస్తున్నారు. నాలుగైదు రోజుల్లో ఓటర్లందరికీ పోల్‌చీటీలు పంపిణీ పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు.




ఓటర్లకు అందజేస్తున్న ఓటరు గైడ్

### పోల్‌చీటీపై పోలింగ్‌కేంద్రం రూట్‌మ్యాప్

గతంలో జరిగిన ఎన్నికల్లో తమ ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో తెలియక ఓటర్లు ఆందోళనకు గురయ్యారు. ప్రస్తుతం ఈ సమస్యను పరిష్కరించేందుకు ఎన్నికల సంఘం కొత్తగా పోల్‌చీటీ వెనుక భాగంలో పోలింగ్ కేంద్రం రూట్‌మ్యాప్ రూపొందించారు. నియోజకవర్గం, పోలింగ్ కేంద్రం, బీఎల్‌వో సెల్‌ఫోన్‌నంబర్ ముద్రించారు.

### 25వరకు పోల్‌చీటీల పంపిణీ పూర్తి

ఓటర్లందరికీ ఈనెల 25వ తేదీ వరకు పోల్‌చీటీలను పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాం. ఓటర్లకు అవగాహన కల్పించేందుకు బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చాం. ఓటింగ్ శాతం పెంచేందుకు బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి పోల్‌చీటీలను పంపిణీ చేయడంతో పాటు కుటుంబానికి గైడ్‌ను అందిస్తున్నారు.

– నవీన్, సహాయ ఎన్నికల అధికారి, కరీంనగర్ నియోజకవర్గం

## చిత్ర కథ
### ఎలక్షన్ స్కూల్




కరీంనగర్ మండలం తాహెర్‌కొండాపూర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం కేవలం ఎన్నికల నిర్వహణకు మాత్రమే ఉపయోగపడుతోంది. విద్యార్థులందరూ ప్రైవేట్ పాఠశాలలకు పోవడంతో పదేళ్ల క్రితం ఈ పాఠశాలను అధికారులు మూసివేశారు. 2019లో కొత్త గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయగా నాలుగేళ్లపాటు పంచాయతీ కార్యాలయంగా వినియోగించారు. గతేడాది పంచాయతీ భవనం కొత్తది నిర్మించడంతో నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికల్లో పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసి 95 నంబరు కేటాయించారు.

– కరీంనగర్‌రూరల్

# మెడికవర్‌లో గుండె శస్త్రచికిత్స




మాట్లాడుతున్న డాక్టర్ సదాశివ్ బి తమగొండ

కరీంనగర్‌టౌన్: నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో అత్యంత అరుదైన గుండె శస్త్రచికిత్స చేసి మహిళ ప్రాణాలు కాపాడినట్లు ఆసుపత్రి కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ సదాశివ్ బి తమగొండ తెలిపారు. ఆదివారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్లకు చెందిన 57 ఏళ్ల సిరిగిరి లక్ష్మీ చాతినొప్పి, ఆయాసం, ఊపిరి పీల్చుకోలేని పరిస్థితుల్లో అక్టోబర్ 28న ఆసుపత్రికి వచ్చిందన్నారు. ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించగా, గుండెకు అనుసంధానంగా ఉండే ఎరోటిక్ వాల్వు పుట్టుకతోనే సన్నగా ఉండడంతో పాటు ఆ వాల్వు పూర్తిగా మూసుకుపోయి ఉందని తెలిపారు. దీంతో గుండెకు రక్తం సరఫరా నిలిచిపోయి ప్రాణాపాయ స్థితికి చేరిందని అన్నారు. ఈ పరిస్థితిలో అరోటిక్ రూట్ ఎన్‌లార్జ్‌మెంట్ (ఏఆర్ఈ) పద్ధతిలో వాల్వును వెడల్పు చేసి స్టంట్ వేసినట్లు తెలిపారు. ఈ పద్ధతి దేశంలోనే అత్యంత అరుదుగా జరిగే శస్త్రచికిత్స అన్నారు. సుమారు నాలుగు గంటల పాటు జరిగిన ఈ శస్త్రచికిత్సతో లక్ష్మీ ఆరోగ్యం సాధారణ పరిస్థితికి చేరిందన్నారు. పేషెంట్ లక్ష్మీ మాట్లాడుతూ తన ప్రాణాలు కాపాడిన మెడికవర్ వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, కార్డియాక్ అనెస్తెటిస్ట్ డాక్టర్ ప్రత్యూష, కార్డియాలజిస్టు డాక్టర్ రామనాథన్, వైభవి, అశ్వర్, సాయిచరణ్, కరుణాకర్, హరిబాబు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# సింధూ, నిఖత్ స్ఫూర్తి.. క్రీడలపై ఆసక్తి

- క్రీడారంగంపై బాలికల మక్కువ
- పోటీలకు పెద్ద సంఖ్యలో హాజరవుతున్న వైనం
- తాము సైతం పతకాలు సాధిస్తామంటున్న క్రీడాకారిణులు



ఖోఖో లో తలపడుతున్న క్రీడాకారిణులు

కరీంనగర్‌స్పోర్ట్స్: పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదు.. లక్ష్య సిద్ధితో చేస్తే దేనినైనా సాధించవచ్చు అన్న నానుడి అందరికీ తెలిసిందే. ఇటీవల కాలంలో క్రీడా రంగంలో ఒలింపిక్స్, ఏషియన్ గేమ్స్, వరల్డ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా రాణించడమే కాకుండా పతకాలను సైతం సాధిస్తున్నారు. షట్లర్‌లో సైనా నెహ్వాల్, పీవీ సింధూ, బాక్సర్‌లో నిఖత్ జరీన్, క్రికెట్‌లో మిథాలీరాజ్, రెజ్లింగ్‌లో సాక్షి మాలిక్ లాంటి మన తెలంగాణ క్రీడారత్నాలను స్ఫూర్తిగా తీసుకున్న బాలికలు తాము సైతం క్రీడల్లో అంటూ క్రీడారంగం వైపు ఆసక్తిని కనబరుస్తుండడం విశేషం. కరీంనగర్‌లోని సెయింట్ జాన్ పాఠశాలలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి సీఎస్ఏ క్రీడా పోటీలకు పెద్ద సంఖ్యలో బాలికలు హాజరు కావడమే ఇందుకు నిదర్శనం. సుమారు 1800 మంది బాలబాలికలు హాజరు కాగా బాలికలు రెట్టింపు ఉత్సాహంతో పోటాపోటీగా పాల్గొంటున్న తీరు అందరినీ ఆకట్టుకుంటోంది. పీవీ సింధూ, నిఖత్ జరీన్‌ల స్ఫూర్తితో తాము కూడా క్రీడల్లో రాణించి దేశానికి పతకాలు సాధించి పెట్టి జాతీయ పతాకాన్ని సగౌరవంగా ఎగురవేస్తామంటున్న పలువురు క్రీడాకారిణుల అభిప్రాయాలు వారి మాటల్లోనే..

### చెస్‌లో గ్రాండ్ మాస్టర్ కావాలని కోరిక



చెస్‌లో గ్రాండ్ మాస్టర్ కావాలనేది నా కోరిక. అందుకోసం కోచింగ్ కూడా తీసుకుంటున్న. గతనెల కరీంనగర్‌లో జరిగిన ఆల్ ఇండియా ఫీడే చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్న. మంచి ప్రతిభ కనబర్చ. అండర్11లో ఆరోస్థానంలో నిలిచా. కోనేరు హంపి, హారికలా గొప్ప క్రీడాకారిణిగా తయారు కావాలని ఉంది.

– కీర్తి చైతన్య, కరీంనగర్

### పెద్ద క్రీడాకారిణిగా పేరుతెచ్చుకుంటా..



కబడ్డీలో పెద్ద క్రీడాకారిణిగా ఎదిగి భారత జట్టు క్రీడాకారిణిగా పేరు తెచ్చుకోవాలని ఉంది. ప్రస్తుతం మా జట్టుకు నేను నాయకత్వం వహిస్తున్న. కాంపిటీషన్ చాలా ఉంది. విజయం సాధిస్తామన్న నమ్మకం కూడా ఉంది. అనూప్‌కుమార్, రాహుల్ చౌదరిలా గొప్ప కబడ్డీ ప్లేయర్ కావాలని ఉంది.

– డి చందన, రెడ్డిపాలెం

### భారత్ జట్టులో చోటు సంపాదించడమే లక్ష్యం



ఖోఖో క్రీడలో ఇండియన్ వుమెన్ టీంకు ఆడాలని ఉంది. ఇంటర్‌లో అండర్ 19 ఎస్జీఎఫ్‌లో, డిగ్రీలో యూనివర్సిటీ క్రీడల్లో టాప్ ప్లేయర్‌గా నిలిచి భారత జట్టులో చోటు సంపాదించడమే లక్ష్యం. కర్ణాటక రాష్ట్రం ఖోఖో క్రీడకు కంచుకోట..ఆ కోటలో నేను కూడా ఉండాలనుకుంటున్న. – గ్లోరీ, బెంగళూర్

### నిఖత్ జరీన్ స్ఫూర్తితో..



బాస్కెట్‌బాల్ క్రీడలో నేను బాగా ఆడుతా. మా జట్టుకు కూడా నేనే కెప్టెన్. రెండు మ్యాచ్‌లు కూడా గెలిచాం. ఇండియన్ బాస్కెట్‌బాల్ వుమెన్ టీంలో చోటు సంపాదించుకోవాలనేది ఆశయం. నిఖత్ జరీన్ స్ఫూర్తితో గొప్ప క్రీడాకారిణిగా భారత దేశానికి పతకం సాధించాలని ఉంది. హార్డ్ వర్క్ చేసి నా లక్ష్యం వైపు దృష్టి పెడుతా. – సాదియా, బోధన్

## పవర్‌కట్ ప్రాంతాలు




కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతున్నందున సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11కేవీ సంతోష్‌నగర్ ఫీడర్ పరిధిలోని కొత్త లేబర్ అడ్డా, సెయింట్ జాన్స్ స్కూల్, శివ థియేటర్, భాగ్యనగర్, జ్యోతినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

### పీసీసీ కో ఆర్డినేటర్‌గా రహమత్

కరీంనగర్‌కార్పొరేషన్: కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల ఏఐసీసీ అదనపు పరిశీలకులకు పీసీసీ సమన్వయకర్తగా నగరానికి చెందిన రహమత్ హుస్సేన్ నియమితులయ్యారు. ఈమేరకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

### పద్మశాలీ యువజన సంఘం కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గసభ్యులను అభినందిస్తున్న నాయకులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చామనపల్లిలో ఆదివారం పద్మశాలీ యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బూర్ల అవినాష్, ప్రధాన కార్యదర్శిగా దీకొండ మహేశ్, ఉపాధ్యక్షులుగా దాసరి మహేశ్, మిట్టపల్లి బాలరాజు, సంయుక్త కార్యదర్శులుగా బూర్ల రాజు, దూడం హరికృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శులుగా జంజిరాల సతీశ్, దాసరి సంజీవ్, కోశాధికారిగా దీకొండ సంపత్, కార్యవర్గ సభ్యులుగా బూర్ల శ్రీకాంత్, వాసాల శ్రీనివాస్, దూడం మురళీ, గుండేటి సాయి ప్రణవ్, దూడం అజయ్ ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గసభ్యులు మునిగంటి కుమార్ అభినందించారు.


నల్లగొండలో...


ముదిగొండలో...


వేములవాడలో...

# ఆట చూస్తూ.. అక్షింతలు వేస్తూ..

**పెళ్లి వేడుకల్లో క్రికెట్ వీక్షణానికి తెరలు**

ఒకవైపు వందల సంఖ్యలో వివాహాలు, మరోవైపు ప్రపంచకప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం జరగడంతో అతిథుల కోసం ఎక్కడికక్కడ భారీ తెరలు ఏర్పాటు చేశారు. దీంతో వివాహాలకు హాజరైన వారు.. అటు వధూవరులను ఆశీర్వదించి.. ఇటు మ్యాచ్‌ను తిలకించారు. వేములవాడ, ముదిగొండ, నల్లగొండ ప్రాంతాల్లో జరిగిన వివిధ వివాహ వేడుకల్లో వరల్డ్‌కప్ క్రికెట్ మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు చేశారు.

వేములవాడ/ముదిగొండ/నల్లగొండ



## ప్రచారం మాని.. ప్రసారాలు

ఆస్ట్రేలియా – భారత్ మధ్య ఆదివారం జరిగిన క్రికెట్ ప్రపంచ కప్ పోటీ రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారానికీ తీవ్ర అంతరాయం కలిగించింది. ప్రధాన పార్టీల అభ్యర్థులు, వారి అనుచరులు, పార్టీ శ్రేణులే కాదు.. స్వతంత్రులు సైతం ఆదివారం మధ్యాహ్నం వరకే ప్రచారం చేశారు. ఆ తర్వాత క్రికెట్ మ్యాచ్ తిలకించడంలో నిమగ్నమయ్యారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

## రెండో విడత ఎంబీఏ ప్రవేశాలకు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): ఓయూ క్యాంపస్ కాలేజీలో ఎంబీఏ కోర్సుల్లో మిగిలిన సీట్లకు రెండో విడత ప్రవేశాలకు.. ఉద్యోగులు (ప్రభుత్వ, ప్రైవేటు) దరఖాస్తు చేసుకోవాలని పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ పాండురంగారెడ్డి ఆదివారం తెలిపారు. ఎంబీఏ ఈవెనింగ్ (2 ఏళ్ల టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ జనరల్ (2 ఏళ్ల ఈవెనింగ్) కోర్సుల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు ఈనెల 22న ఉదయం 11 గంటలకు పీజీ అడ్మిషన్స్ కార్యాలయంలో ఎంట్రన్స్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు 9885622266 ఫోన్‌నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

# పగటి పూటా ఓ కునుకేయండి



**మధ్యాహ్నం వేళ 15 నుంచి 30 నిమిషాల నిద్రతో ఆరోగ్యానికి ఎంతో మేలు**

- వృద్ధాప్య ఛాయలు ఏడేళ్ల వరకు తగ్గింపు
- లండన్ వర్సిటీ, ఉరుగ్వే వర్సిటీ పరిశోధనల్లో వెల్లడి
- నిద్ర లేమితో అల్జీమర్స్, చిత్త వైకల్యం వచ్చే ప్రమాదం
- అధిక నిద్రతోనూ అనారోగ్య సమస్యలు

సాక్షి, అమరావతి: చక్కటి నిద్ర దివ్యౌషధంగా పని చేస్తుంది. అందులోనూ పగటిపూట తీసే చిన్నపాటి కునుకు మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. రోజూ మధ్యాహ్నం 15–30 నిమిషాలు రెప్పవాల్చితే చిత్తవైకల్య ప్రమాదం తగ్గడంతో పాటు వృద్ధాప్య ఛాయలు త్వరగా దరిచేరవని తాజా అధ్యయనంలో వెల్లడైంది. సాధారణ వ్యక్తులతో పోలిస్తే పగటిపూట నిద్రించే వారిలో 2.6–7 సంవత్సరాల వరకు వృద్ధాప్యం నెమ్మదిస్తుంది. యూనివర్సిటీ కాలేజ్ లండన్, ఉరుగ్వేలోని యూనివర్సిటీ ఆఫ్ రిపబ్లిక్ పరిశోధకులు క్రమం తప్పకుండా పగటిపూట నిద్రపోవడం వల్ల మెదడు కుచించుకుపోయే ప్రమాదాన్ని తగ్గిస్తుందని.. చురుకుదనాన్ని ప్రేరేపిస్తుందని తేల్చారు. ఫలితంగా జ్ఞాన సామర్థ్యం, జ్ఞాపక శక్తి పెరుగుతాయని గుర్తించారు. అయితే.. పగటిపూట 90 నిమిషాల కంటే ఎక్కువసేపు నిద్రపోవడం ఆరోగ్యానికి చేటని సూచిస్తున్నారు.

### సంపూర్ణ ఆరోగ్యానికి 7 గంటల నిద్ర

సంపూర్ణ ఆరోగ్యానికి సుమారు 7 గంటల మంచి నిద్రను శాస్త్రవేత్తలు, వైద్య నిపుణులు ప్రతిపాదిస్తున్నారు. ఇందుకు విరుద్ధంగా భారత్‌లోని పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రపంచంలో నిద్ర లేమితో బాధపడుతున్న దేశాల్లో భారత్ రెండో స్థానంలో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. నిద్ర లేకపోవడం వల్ల కలిగే సమస్య కేవలం అలసట ఒక్కటే కాదని.. తీవ్ర దీర్ఘకాలిక అనారోగ్యానికి దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు. రాత్రిపూట కలతలేని నిద్రతో అలసట, తలనొప్పి, మూడ్ స్వింగ్స్ నియంత్రణలో ఉండి మానసిక ఉత్సాహంతో పని చేస్తారని చెబుతున్నారు. అయితే.. తక్కువ నిద్రపోయే వారిలో అల్జీమర్స్ వచ్చే అవకాశం 40 శాతం ఎక్కువని అధ్యయనం వెల్లడించింది.

### అతి నిద్ర ప్రమాదకరం

తక్కువ నిద్రతోనే కాదు.. అతి నిద్రతోనూ ఆరోగ్యానికి ముప్పు పొంచి ఉందని పరిశోధకులు చెబుతున్నారు. రోజంతా అదే పనిగా నిద్రపోతే అధిక రక్తపోటు, స్ట్రోక్‌కు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తేల్చారు. అతి నిద్ర అంతర్లీన నిద్ర రుగ్మతకు సంకేతమని భావిస్తున్నారు. ఈ రుగ్మతతో ఒత్తిడి, బరువును నియంత్రించే హార్మోన్లపై ప్రభావం చూపుతుందని తేల్చారు. ఫలితంగా చిన్న వయసులోనే ఊబకాయం, బీపీ, టైప్–2 డయాబెటిస్, గుండె జబ్బులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### స్క్రీనింగ్ సమయంతోనే ముప్పు

స్క్రీనింగ్ సమయం నిద్రలేమి స్థాయిని పెంచుతుందని అధ్యయనం చెబుతోంది. నిద్రలేమితో బాధపడే వారిలో దాదాపు 54 మంది డిజిటల్, సోషల్ మీడియాను విరివిగా వినియోగిస్తున్నట్టు గుర్తించింది. దాదాపు 87 శాతం మంది భారతీయులు పడుకునే ముందు తమ ఫోన్లను ఉపయోగిస్తుండటంతో తీవ్రమైన నిద్ర సమస్యకు దారితీస్తుందని పేర్కొంది. ఫలితంగా 56 శాతం మంది పురుషులతో పోలిస్తే 67 శాతం మంది మహిళలు పని సమయంలో నిద్రపోతున్నారని వెల్లడించింది. వీలైనంత వరకు మధ్యాహ్నం 2 గంటల లోపు కెఫిన్ ఉండే పదార్థాలను తగ్గించాలని.. మద్యం తాగి నిద్రపోవడం/నిద్రపోయే మూడు గంటల ముందు మద్యం తీసుకోవడం కూడా ఆరోగ్యానికి చేటని సూచిస్తున్నారు. ముఖ్యంగా నిద్రవేళకు దగ్గర సమయంలో వ్యాయామం చేయడం కూడా నిద్రలేమికి కారణంగా భావిస్తున్నారు.

## మీరు మా హృదయాలను గెలుచుకున్నారు

- టీమిండియాపై 'ఎక్స్'లో పోస్టు చేసిన ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి



సాక్షి, అమరావతి: ఫైనల్ ఫలితం నిరాశపరిచినా.. ఈ విడత వన్డే ప్రపంచ కప్‌లో భారత్ క్రీడాకారులు దేశానికి కప్ సాధించి పెట్టేందుకు మిగతా అన్ని మ్యాచ్‌లో వారు కనబరిచిన ఆట తీరు ప్రజల హృదయాలను గెలుచుకుందని ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనియాడారు. ట్విట్టర్ (ఎక్స్) ద్వారా సీఎం స్పందిస్తూ.. '2023 క్రికెట్ ప్రపంచ కప్‌లో అద్భుతమైన ప్రయాణం చేసినందుకు భారత క్రికెట్ జట్టులోని క్రీడాయోధులకు నా ప్రశంసలు. ఫైనల్ మ్యాచ్ మనకు అనుకూలంగా జరగనప్పటికీ.. ఈ ప్రయాణంలో వారి స్ఫూర్తి, క్రీడా స్ఫూర్తి, టోర్నీ మొత్తంగా వివిధ సందర్భాల్లో జట్టు సభ్యులు కనబరిచిన అద్భుతమైన ఆట తీరు యావత్ దేశానికి ఎంతో స్ఫూర్తినిచ్చాయి. టీమ్ ఇండియా! మీరు మా హృదయాలను గెలుచుకున్నారు' అంటూ ట్వీట్ చేశారు.

## బీఎస్పీ అభ్యర్థి జానయ్యపై దాడికి యత్నం

- అడ్డొచ్చిన అనుచరుడికి గాయాలు.. భూ వివాదాలే కారణం
- ఆత్మకూర్–ఎస్ మండలం గట్టికల్ గ్రామంలో ఉద్రిక్తత


జానయ్య చొక్కాపై రక్తపు మరకలు


గాయపడిన జానయ్య అనుచరుడు

ఆత్మకూర్ –ఎస్(సూర్యాపేట): సూర్యాపేట నియోజకవర్గం నుంచి బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వట్టె జానయ్య యాదవ్‌పై ఓ వ్యక్తి తన ఇద్దరు కుమారులతో కలిసి దాడికి యత్నించాడు. ఈ ఘటన ఆత్మకూర్(ఎస్) మండలం గట్టికల్ గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా.. గ్రామానికి చెందిన సామ తిరుమల్‌రెడ్డికి అదే ఊళ్లోని బండగొర్ల వెంకన్నకు కొంతకాలంగా భూ వివాదాలు ఉన్నాయి. గతంలో వెంకన్నకు మద్దతుగా నిలిచిన జానయ్య ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రాత్రి గట్టికల్ గ్రామానికి వచ్చారు. జానయ్య ప్రసంగిస్తుండగా తిరుమల్‌రెడ్డి వచ్చి దుర్భాషలాడుతూ నీ వల్ల నా భార్యాపిల్లలు ఇబ్బందులు పడ్డారంటూ ఆగ్రహంతో ఊగిపోయాడు. ప్రసంగానికి అడ్డుతగిలాడు. జానయ్య అనుచరులు, గ్రామస్తులు తిరుమల్‌రెడ్డిని ఆపే ప్రయత్నంలో ఆయన కిందపడిపోయాడు. దీంతో తీవ్ర ఆవేశంతో తిరుమల్‌రెడ్డి తన ఇంట్లోకి వెళ్లి గొడ్డలి తీసుకువచ్చాడు. ఆయన కుమారులు రాజశేఖర్‌రెడ్డి, అఖిల్‌రెడ్డి సైతం కర్రలతో వచ్చి వీరంగం సృష్టించారు. జానయ్యపై కర్రతో దాడి చేయబోగా ఆయన అనుచరుడు చింత రమేష్ అడ్డురావడంతో రమేష్‌కు గాయాలయ్యాయి. జానయ్య అనుచరులు వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా అక్కడి నుంచి పరారయ్యారు. కాగా

తనపై దాడికి ప్రయత్నించిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ జానయ్య తన అనుచరులతో కలిసి రోడ్డుపై బైఠాయించారు. తిరుమల్‌రెడ్డి అతడి ఇద్దరు కుమారులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

# కలప తరలుతోంది..

- జన్నారం డివిజన్‌లో పెరిగిన స్మగ్లింగ్
- కొరవడిన అటవీ అధికారుల నిఘా

అన్నా ఈ మధ్యలో రాత్రి వరకు వాహనాల సప్పుడు వస్తుంది. ఒక్కసారి రాత్రి లేచిమూస్తే ఎడ్లబండిలో 8 మూళ్ల తుంటాను వేసుకుని పోతున్నారు. వారిని ఆపినవారు, పట్టుకున్నవారు లేరు. కొన్నిరోజులుగా బంద్ అయిన కలప తరలింపు మళ్లీ మొదలైందని కవ్వాల్‌లో ఇద్దరు చర్చించుకున్న తీరిది.

అన్నా పదిహేను రోజుల కింద మందపల్లిలో ఒక ఇంట్లో టేకు తుంటలు తీసుకుపోయినట్లు తెల్వగానే ఫారెస్టోళ్లు అక్కడికి వెళ్లి చూసి వట్టిగనె వచ్చిండ్రు. ఈ విషయాన్ని పెద్దసార్లకు తెలుపగానే అదే ఇంట్లో నుంచి 8 దుంగలు పట్టుకచ్చింండ్రు. గిట్ల ఉంటదా అన్న, గిట్లయితే జంగల్ ఎక్కడ ఆగుతది. మందపల్లిలో ఇద్దరు మాట్లాడుకున్న తీరిది.


ఇందన్‌పల్లి రేంజ్‌లో పట్టుకున్న కలప (ఫైల్)


ఓ గ్రామంలో కోసేందుకు సిద్ధంగా దుంగ (ఫైల్)

జన్నారం: దట్టమైన అడవులు, అత్యధిక టేకువనం, వన్యప్రాణుల పరుగులు, పక్షుల కిలకిలలకు చిరునామా కవ్వాల్ టైగర్‌జోన్. దట్టమైన అడవులు పులులకు ఆవాసాలుగా ఉండటంతో కవ్వాల్ అభయారణ్యాన్ని 2012లో టైగర్‌జోన్‌గా ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి అధికారుల ప్రత్యేక నిఘా ఏర్పాటుతో కలప తరలిపోకుండా, వన్యప్రాణుల వేట తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నారు. గత కొన్నేళ్లుగా తగ్గిన కలప స్మగ్లింగ్ ఇటీవల మళ్లీ పెరిగినట్లు పలు సంఘటనల ద్వారా తెలుస్తోంది.

**ఇస్లాంపూర్ నుంచి కవ్వాల్ మీదుగా..**

ఇస్లాంపూర్ నుంచి కవ్వాల్ మీదుగా కలపను ఇతర ప్రాంతాలకు వెళ్తోంది. గత నాలుగు నెలల క్రితం ఇస్లాంపూర్‌కు చెందిన గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా కలప తరలిస్తుండగా కవ్వాల్‌లో అటవీ అధికారులు పట్టుకుని ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. అదేవిధంగా వారానికే మరో ట్రాక్టర్ ద్వారా కలప తరలిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. ఈ సంఘటనలను పరిశీలిస్తే స్మగ్లింగ్ పెరిగినట్లు తెలుస్తోంది.

**అధికారి బదిలీతో తగ్గిన నిఘా..**

జన్నారం అటవీ డివిజన్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన సిరిపురం మాధవరావు తనదైన శైలిలో వ్యవహరించి డివిజన్‌లో స్మగ్లింగ్‌ను నిరోధించారు. నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై వేటు వేశారు. స్మగ్లింగ్‌కు పాల్పడేవారిని బైండోవర్ చేశారు. రాత్రి పెట్రోలింగ్, నాకాబందీ, గ్రామాల్లో దాడులు నిర్వహించడం, డాగ్‌స్క్వాడ్‌తో కలపను పట్టుకోవడం లాంటి చర్యలు తీసుకున్నారు. దీంతో గత మూడేళ్లుగా కలప స్మగ్లింగ్ జన్నారం డివిజన్‌లో తగ్గింది. స్మగ్లర్లు కొందరు సిబ్బంది ఆయన బదిలీ ఎప్పుడు అవుతాడో అని చూశారు. నాలుగున్నరేళ్లు పనిచేసిన ఆయన గత సెప్టెంబర్‌లో బదిలీ అయ్యాడు. కాచుకుని కూర్చున్న స్మగ్లర్లు రెచ్చిపోతున్నట్లు తెలుస్తోంది.

**వాహనాల ద్వారా తరలింపు..**

జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని కవ్వాల్, చింతగూడ, బొమ్మెన, తపాలాపూర్, రేండ్లగూడ, తదితర ప్రాంతాలను ఎంచుకుని కలప ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల రేండ్లగూడలో ఒక ఇంట్లో ఆరు టేకుదుంగలు పట్టుబడినట్లు ఆలస్యంగా తెలిసింది. ఇస్లాంపూర్, కవ్వాల్ గ్రామాలకు చెందిన కొందరు రాత్రి వాహనాల ద్వారా సైజులుగా చేసి కలప తరలిస్తున్నట్లు పలువురు చెబుతున్నారు. అర్ధరాత్రి నుంచి తెల్లారి మూడు గంటల వరకు వాహనాల ద్వారా కలప తరలిపోతున్నట్లు గ్రామానికి చెందిన పలువురు 'సాక్షి'కి తెలిపారు. అదేవిధంగా బొమ్మెన, తపాలాపూర్, మహ్మదబాద్ గ్రామాలకు చెందిన పలువురు చింతగూడ గోదావరి గుండా కలపను దాటిస్తున్నట్లు తెలిసింది. అధికారులు స్పందించి నిఘా పెట్టకపోతే రానున్న రోజుల్లో కలప స్మగ్లింగ్ పెరిగే అవకాశాలున్నాయి. ఈ విషయంపై రేంజ్ అధికారి హఫీజొద్దీన్‌ను సంప్రదించగా చెక్‌పోస్టుల వద్ద, పెట్రోలింగ్ ద్వారా నిఘా పెట్టామని, కలప తరలిపోతున్నట్లు తెలిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. రేండ్లగూడ విషయంపై పూర్తి వివరాలు తెలుసుకుంటానని తెలిపారు.

## అమ్మవారి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

భైంసా: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరావు ఆదివారం దర్శించుకున్నారు. కుటుంబీకులతో బాసరకు వచ్చిన ఆయన్ను ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. ఆలయంలో ఆయన పూజలు చేశారు. అనంతరం అర్చకులు శాలువాతో సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.


పూజలు చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరావు





## సల్లగా చూడు అంజన్న..

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయ స్వామివారి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల భక్తులు, అయ్యప్ప స్వాములు స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈవో వెంకటేశ్, అధికారులు సునీల్, లక్ష్మీరాజం తదితరులున్నారు.

## కొండగట్టులో అధికారుల పూజలు


కొండగట్టు ఆలయంలో అధికారులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయ స్వామివారిని ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎన్నికల పరిశీలకులు ఐఏఎస్ డా.జగదీశ్ సోంకార్, ఐఆర్ఎస్ మణిగంధ స్వామి, ఐపీఎస్ వీనిత సాహు దర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం చేయించి శాలు వాతో సత్కరించారు. ఆలయ ఈవో వెంకటేష్, మల్యాల ఎస్‌ఐ అశోక్, ఎమ్మార్వో రవికాంత్, ఆర్‌ఐ తిరుపతి, ఏఎస్‌ఐ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

## రాజన్న సన్నిధిలో సినీనటుడు సుమన్


రాజన్న ప్రసాదం అందిస్తున్న అర్చకులు

వేములవాడ: రాజన్నసిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజన్నను ఆదివారం సినీనటుడు సుమన్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆశీర్వదించి, రాజన్న ప్రసాదం అందించారు.

## రాజన్నకు కార్తీకపూజలు







వేములవాడ: కార్తీకమాసం ఆరంభంకావడం, ఆదివారం కావడంతో రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. కోడెమొక్కులు చెల్లించి, స్వామి వారిని దర్శించుకున్నారు. మహిళా భక్తులు ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగించారు.

## గోదారమ్మకు హారతి


హారతి ఇస్తున్న వేద పండితులు

ధర్మపురి: కార్తీక మాసం సందర్భంగా ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన గంగాహారతి కార్యక్రమం ఆదివారం ఆరో రోజుకు చేరింది. ముందుగా ఆలయం నుంచి గోదావరికి మేళతాళాలతో తరలివెళ్లారు. ప్రత్యేక పూజలు నిర్వహించి గోదావరిలో దీపాలు వదిలారు. కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, సిబ్బంది తదితరులున్నారు.

ఫలితం మాకు అనుకూలంగా రాలేదు. ఇలా జరగకుండా ఉండాల్సింది. ఈ రోజు మేం బాగా ఆడలేదనే విషయం తెలుసు. అయితే నా జట్టును చూసి గర్విస్తున్నా. నిజాయితీగా చెప్పాలంటే మరో 20-30 పరుగులు చేస్తే బాగుండేది. కోహ్లి, రాహుల్ ఆడుతున్నప్పుడు 270-280 వరకు స్కోరును ఆశించాం. అయితే ఆపై వరుసగా వికెట్లు కోల్పోయాం. 240 పరుగుల తర్వాత ఆరంభంలో వికెట్లు తీయడం కీలకం. అది కూడా చేశాం. కానీ హెడ్, లబుషేన్ చాలా బాగా ఆడారు. వారు మా నుంచి మ్యాచ్‌ను లాగేసుకున్నారు. లైట్ల వెలుగులో పిచ్ బ్యాటింగ్‌కు తేలికగా మారింది. ఇలా జరుగుతుందని మాకూ తెలుసు. అయితే దీనిని సాకుగా చెప్పదల్చుకోలేదు. మేం బ్యాటింగ్ బాగా చేయలేదు. భారీ భాగస్వామ్యంతో జట్టును గెలిపించిన ఆసీస్ ద్వయానిదే ఈ విజయం. -రోహిత్ శర్మ, భారత కెప్టెన్

మా అత్యుత్తమ ప్రదర్శనను ఫైనల్ కోసం దాచి ఉంచినట్లుంది. కీలక మ్యాచ్‌లలో ఆడే సత్తా ఉన్నవారంతా సరైన సమయంలో స్పందించారు. ఇలాంటి ఛేదన సులువని మేం భావించాం. మా బౌలింగ్ చాలా బాగా సాగింది. పిచ్‌కు అనుగుణంగా వ్యూహాలు మార్చుకున్నాం. జట్టులో ఎక్కువ వయస్సున్నవాళ్లు ఉన్నా అంతా రాణించారు. 300 లోపు కట్టడి చేద్దామనుకుంటే 240కే ఆపగలిగాం. ఛేదనలో నా గుండె దడ కూడా పెరిగింది. కానీ హెడ్, లబుషేన్ కలిసి గెలిపించారు. చేయి విరిగిన తర్వాత కూడా హెడ్‌పై మేం నమ్మకం ఉంచి జట్టుతో కొనసాగించడం పని చేసింది. ఆటపై విపరీత అభిమానం చూపించే భారత గడ్డపై మ్యాచ్ ఆడటమే ఒక మంచి జ్ఞాపకం. అలాంటిది మేం ఇక్కడ ప్రపంచకప్ గెలుచుకోవడం అద్భుతమైన అనుభూతి. ఈ క్షణాన్ని చిరస్మరణీయంగా మార్చుకుంటాం. -ప్యాట్ కమిన్స్, ఆస్ట్రేలియా కెప్టెన్



నిశ్శబ్దం...నిశ్శబ్దం...నిశ్శబ్దం...నిశ్శబ్దం ఎంత భయంకరంగా ఉంటుందో! లక్ష మందికి పైగా మన జనాలు ఉన్న మైదానంలో కూడా నిశ్శబ్దం ఆవరిస్తే ఆ పరిస్థితి ఎలా ఉంటుందనేది అక్కడ కనిపించింది... లక్ష మందిని నిశ్శబ్దంగా ఉంచగలిగితే అంతకు మించిన ఆనందం ఏముంటుంది అంటూ మ్యాచ్‌కు ముందు పరిహాసించిన కమిన్స్ దానిని నిజం చేసి చూపించాడు... ఆ నిశ్శబ్దం ఒక్కసారి కాదు స్టేడియంలో మళ్లీ మళ్లీ కనిపించింది... దూసుకుపోతున్న రోహిత్ అవుటైన క్షణాన... 97 బంతుల పాటు కనీసం ఫోర్ కూడా కనిపించని వేళ... కోహ్లిని అవుట్ చేసి కమిన్స్ సింహనాదం చేసినప్పుడు... ఆ తర్వాత ట్రవిస్ హెడ్, లబుషేన్ వికెట్ల వద్ద పాతుకుపోయి అసలు ఏమాత్రం అవకాశం ఇవ్వనప్పుడూ అదే నిశ్శబ్దం కనిపించింది. మైదానంలోనే కాదు... దేశంలోని కోట్లాది మంది అభిమానుల ఆశలు, అంచనాలు కూడా తప్పగా మరోసారి గుండెకోతను మిగుల్చుతూ భారత ప్రపంచకప్ సమరం ఓటమితో ముగిసింది.

రోహిత్, కోహ్లి ముఖాల్లో ఎలాంటి భావాలు కనిపించడం లేదు... కేఎల్ రాహుల్ మోకాళ్లపై కూర్చుండిపోయాడు... సిరాజ్‌కు కన్నీళ్లు ఆగడం లేదు... బుమ్రాలో నాలుగేళ్ల తర్వాతా మళ్లీ అదే బాధ... ప్రపంచకప్ గెలుచుకోవాలని కలగన్న మిగతా ఆటగాళ్ల కళ్ల ముందూ ఒక్కసారిగా శూన్యం ఆవరించింది... ఎన్ని అద్భుత ప్రదర్శనలు... ఎంత గొప్ప ఆట... తిరుగులేని బ్యాటింగ్, పదునైన బౌలింగ్‌తో వరుసగా 10 విజయాలు... ఓటమన్నదే లేకుండా సాగిన ప్రయాణం చివరి మెట్టుపై నిరాశను మిగిల్చింది. లీగ్ దశలో టీమిండియా ఆటతీరు చూస్తే కప్ ఈసారి మనదే అనిపించగా... అసలు పోరాటంలో మాత్రం అనూహ్యంగా అడుగులు తడబడ్డాయి... భారతావని క్రికెట్ అభిమానులంతా టీమిండియా విజయం కోసం చేసిన పూజలు, మొక్కులు పని చేయక మరోసారి విషాదమే మిగిలింది. పదేళ్లుగా ఒక్క ఐసీసీ టైటిల్‌లేని టీమిండియా బాధ మరికొంత కాలం అందరినీ వెంటాడక తప్పదు.

టాస్ గెలిచిన ఆస్ట్రేలియా ఫీల్డింగ్ ఎంచుకుంది... తీవ్ర ఒత్తిడి ఉండే ఫైనల్లో ముందుగా బ్యాటింగ్ చేయడం మంచి అవకాశమే అనిపించింది... రోహిత్ దూకుడైన ఆరంభం చూస్తే భారీ స్కోరు ఖాయం అన్నట్లుగా అతని బ్యాటింగ్ ధాటి చూపించింది. కానీ ఆ తర్వాత ఒక్కసారిగా సీన్ మారిపోయింది... ఫైనల్ మ్యాచ్ ఒత్తిడి కనిపించింది... తొలి 10 ఓవర్లలో 80 పరుగులు చేసిన జట్టు తర్వాతి పదేసి ఓవర్లలో 35, 37, 45, 43 పరుగులే...చివరకు 240 వద్దే ఆట ముగిసింది. అయినా సరే...ఇంగ్లండ్‌తో 229 పరుగులను కాపాడుకోలేదా? సెమీస్‌లో దక్షిణాఫ్రికాపై 213 పరుగులు సాధించేందుకు ఆసీస్ తీవ్రంగా ఇబ్బంది పడలేదా? ఇప్పుడూ సాధ్యమే అనే ఆశ... ఆసీస్ 47/3 వద్ద ఆ నమ్మకం పెరిగింది... కానీ హెడ్‌ను తీయలేక, లబుషేన్‌ను అడ్డుకోలేక ఆ విశ్వాసం ఓవర్లు సాగుతున్నకొద్దీ కరుగుతూ వచ్చింది... చివరకు ఏమి చేయలేని స్థితిలో భారత్ ఓటమికి సిద్ధమైంది... 2003 ప్రపంచకప్ ఫైనల్‌కు ప్రతీకారంలా కాకుండా రీప్లేలా 2023 వరల్డ్ కప్ సినిమా ముగిసింది.

# గుండె 'పదకొండు' ముక్కలు!

## ప్రపంచకప్ ఫైనల్లో భారత్ పరాజయం

## ఆరోసారి విశ్వ విజేతగా ఆస్ట్రేలియా

- 6 వికెట్ల తేడాతో ఓడిన టీమిండియా
- రోహిత్ బృందం బ్యాటింగ్ వైఫల్యం
- అద్భుత సెంచరీతో ఆసీస్‌ను గెలిపించిన హెడ్
- భారత్‌ను కట్టడి చేసిన ఆసీస్ బౌలర్లు





నిరాశావదనంతో భారత కెప్టెన్ రోహిత్ శర్మ, కోహ్లి, గిల్, శ్రేయస్ అయ్యర్

అహ్మదాబాద్: అద్భుత ప్రదర్శనతో అదరగొట్టిన ఆస్ట్రేలియా ఆరోసారి వన్డే క్రికెట్‌లో జగజ్జేతగా నిలిచింది. టోర్నీ ఆరంభ దశలో తడబడి ఆ తర్వాత కోలుకున్న ఆ జట్టు చివరి వరకు అదే పట్టుదలను కనబర్చి వరల్డ్‌కప్‌ను సొంతం చేసుకుంది. లీగ్ దశలో అజేయంగా నిలవడంతో పాటు వరుసగా 10 విజయాలతో ఊపు మీద కనిపించిన భారత్ అసలు పోరులో తలవంచింది. ఆదివారం నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఫైనల్లో ఆస్ట్రేలియా 6 వికెట్ల తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 240 పరుగులకే ఆలౌటైంది. కేఎల్ రాహుల్ (107 బంతుల్లో 66; 1 ఫోర్), విరాట్ కోహ్లి (63 బంతుల్లో 54; 4 ఫోర్లు), రోహిత్ శర్మ (31 బంతుల్లో 47; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. అనంతరం ఆస్ట్రేలియా 43 ఓవర్లలో 4 వికెట్లకు 241 పరుగులు సాధించి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్' ట్రవిస్ హెడ్ (120 బంతుల్లో 137; 15 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు సెంచరీతో చెలరేగగా, మార్నస్ లబుషేన్ (110 బంతుల్లో 58 నాటౌట్; 4 ఫోర్లు) అండగా నిలిచాడు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 35.5 ఓవర్లలో 192 పరుగులు జోడించారు. గతంలో ఆస్ట్రేలియా 1987, 1999, 2003, 2007, 2015లలో కూడా వన్డే ప్రపంచకప్ చాంపియన్‌గా నిలిచింది. వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో భారత్ ఓడిపోవడం ఇది రెండోసారి. 2003 ప్రపంచకప్ ఫైనల్లోనూ ఆస్ట్రేలియా చేతిలోనే భారత్ ఓడిపోయింది.

ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌కు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా డిప్యూటీ ప్రధానమంత్రి రిచర్డ్ మార్లెస్ విన్నర్స్ ట్రోఫీని అందజేశారు. విజేతగా నిలిచిన ఆస్ట్రేలియా జట్టుకు 40 లక్షల డాలర్లు (రూ. 33 కోట్ల 32 లక్షలు), రన్నరప్ భారత జట్టుకు 20 లక్షల డాలర్లు (రూ. 16 కోట్ల 66 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

### రాహుల్ అర్ధ సెంచరీ...

రోహిత్ ఎప్పటిలాగే తనదైన శైలిలో దూకుడుగా ఆటను ప్రారంభించాడు. మరో ఎండ్‌లో గిల్ (7 బంతుల్లో 4) విఫలమైనా రోహిత్ జోరుతో స్కోరు దూసుకుపోయింది. స్టార్క్ ఓవర్లో వరుసగా మూడు ఫోర్లతో కోహ్లి కూడా ధాటిని చూపాడు. 9 ఓవర్లలో భారత్ స్కోరు 66/1. అయితే మ్యాక్స్‌వెల్ వేసిన తర్వాతి ఓవర్లో వరుసగా సిక్స్, ఫోర్ కొట్టిన రోహిత్ మరో భారీ షాట్‌కు ప్రయత్నించగా, హెడ్ పట్టిన అద్భుత క్యాచ్‌కు వెనుదిరిగాడు. తర్వాతి ఓవర్లోనే శ్రేయస్ అయ్యర్ (3 బంతుల్లో 4; 1 ఫోర్) కూడా అవుటయ్యాడు. ఇక్కడి నుంచి భారత్ పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఆసీస్ బౌలర్లు మన బ్యాటర్లను పూర్తిగా కట్టిపడేశారు. మెరుగైన ఫీల్డింగ్ కూడా ఆ జట్టు అదనపు బలంగా మారింది. కోహ్లి కొంత మెరుగ్గా ఆడినా... రాహుల్ తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. ఒకదశలో వరుసగా 26.1 ఓవర్ల పాటు (97 బంతులు) ఒక్క ఫోర్ కూడా రాలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు! 56 బంతుల్లో కోహ్లి అర్ధసెంచరీ పూర్తయింది. ఆ వెంటనే కమిన్స్ వేసిన బంతిని వికెట్లపైకి ఆడుకొని కోహ్లి నిష్క్రమించాడు. కోహ్లి, రాహుల్ నాలుగో వికెట్‌కు 67 పరుగులు జోడించారు. తడబాటును కొనసాగిస్తూ 86 బంతుల్లో రాహుల్ హాఫ్ సెంచరీకి చేరగా, బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు వచ్చిన రవీంద్ర జడేజా (22 బంతుల్లో 9) ప్రభావం చూపలేకపోయాడు. ఆపై వరుసగా వికెట్లు తీసిన ఆసీస్ చివరి వరకు ఒత్తిడిని కొనసాగించడంలో సఫలమైంది. 41వ ఓవర్లో స్కోరు 200 పరుగులకు చేరగా, సూర్యకుమార్ యాదవ్ (28 బంతుల్లో 18; 1 ఫోర్) కూడా ఆఖర్లో ఏమీ చేయలేకపోయాడు.



ట్రవిస్ హెడ్

### భారీ భాగస్వామ్యం...

లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా తడబడింది. షమీ వేసిన ఇన్నింగ్స్ రెండో ఓవర్ తొలి బంతికే వార్నర్ (3 బంతుల్లో 7; 1 ఫోర్) వెనుదిరగ్గా, బుమ్రా బౌలింగ్‌లో మిచెల్ మార్ష్ (15 బంతుల్లో 15; 1 ఫోర్, 1 సిక్స్) పెవిలియన్ చేరాడు. స్టీవ్ స్మిత్ (9 బంతుల్లో 4; 1 ఫోర్)ను కూడా బుమ్రా వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో ఆసీస్ స్కోరు 47/3... ఇక్కడే భారత బృందంలో చిన్న ఆశ. మరో వికెట్ తీస్తే ప్రత్యర్థిని ఒత్తిడిలో పడేయొచ్చనే వ్యూహం. కానీ హెడ్, లబుషేన్ ఆ అవకాశం ఇవ్వలేదు. హెడ్ తన దూకుడును ఎక్కడా తగ్గించకుండా చెలరేగిపోగా, లబుషేన్ చక్కటి డిఫెన్స్‌తో బలంగా నిలబడ్డాడు. వీరిద్దరి జోడీని విడదీయడానికి భారత్ ఎన్ని ప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది. పిచ్ జీవం కోల్పోయి బ్యాటింగ్‌కు బాగా అనుకూలంగా మారిపోవడంతో పాటు మన బౌలర్లలో కూడా పదును లోపించింది. దీనిని ఆసీస్ ఇద్దరు బ్యాటర్లూ సమర్థంగా వాడుకున్నారు. ఎక్కడా కనీస అవకాశం కూడా ఇవ్వకుండా వీరిద్దరు లక్ష్యం దిశగా జట్టును నడిపించారు. 95 బంతుల్లోనే హెడ్ శతకం పూర్తి చేసుకోగా, 99 బంతుల్లో లబుషేన్ హాఫ్ సెంచరీ పూర్తయింది. విజయానికి మరో 2 పరుగుల దూరంలో హెడ్ అవుటైనా... మ్యాక్స్‌వెల్ (2 నాటౌట్) లాంఛనం పూర్తి చేశాడు. దాంతో ఆసీస్ శిబిరంలో భారీ సంబరాలు మొదలయ్యాయి.

### స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) హెడ్ (బి) మ్యాక్స్‌వెల్ 47; గిల్ (సి) జంపా (బి) స్టార్క్ 4; కోహ్లి (బి) కమిన్స్ 54; అయ్యర్ (సి) ఇన్‌గ్లిస్ (బి) కమిన్స్ 4; రాహుల్ (సి) ఇన్‌గ్లిస్ (బి) స్టార్క్ 66; జడేజా (సి) ఇన్‌గ్లిస్ (బి) హాజల్‌వుడ్ 9; సూర్యకుమార్ (సి) ఇన్‌గ్లిస్ (బి) హాజల్‌వుడ్ 18; షమీ (సి) ఇన్‌గ్లిస్ (బి) స్టార్క్ 6; బుమ్రా (ఎల్బీ) (బి) జంపా 1; కుల్దీప్ (రనౌట్) 10; సిరాజ్ (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 12; మొత్తం (50 ఓవర్లలో ఆలౌట్) 240. వికెట్ల పతనం: 1-30, 2-76, 3-81, 4-148, 5-178, 6-203, 7-211, 8-214, 9-226, 10-240. బౌలింగ్: స్టార్క్ 10-0-55-3, హాజల్‌వుడ్ 10-0-60-2, మ్యాక్స్‌వెల్ 6-0-35-1, కమిన్స్ 10-0-34-2, జంపా 10-0-44-1, మార్ష్ 2-0-5-0, హెడ్ 2-0-4-0.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: వార్నర్ (సి) కోహ్లి (బి) షమీ 7; హెడ్ (సి) గిల్ (బి) సిరాజ్ 137; మార్ష్ (సి) రాహుల్ (బి) బుమ్రా 15; స్మిత్ (ఎల్బీ) (బి) బుమ్రా 4; లబుషేన్ (నాటౌట్) 58; మ్యాక్స్‌వెల్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 18; మొత్తం (43 ఓవర్లలో 4 వికెట్లకు) 241. వికెట్ల పతనం: 1-16, 2-41, 3-47, 4-239. బౌలింగ్: బుమ్రా 9-2-43-2, షమీ 7-1-47-1, జడేజా 10-0-43-0, కుల్దీప్ 10-0-56-0, సిరాజ్ 7-0-45-1.

## ఆస్ట్రేలియాకు మాత్రమే సాధ్యం..!

'2015 కంటే ఈ విజయమే గొప్పది, ఎందుకంటే ఇది భారత గడ్డపై వచ్చింది'... హాజల్‌వుడ్ వ్యాఖ్య ఇది. ఇదే ఈ విజయం విలువేమిటో చెబుతోంది. టోర్నీ ఆరంభంలో 2 మ్యాచ్‌లలో ఓడిన తర్వాత పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా అట్టడుగున ఉంది. ఫలితం మాత్రమే కాదు ప్రదర్శన కూడా చెత్తగా ఉంది. రెండు మ్యాచ్‌లలో జట్టు 199, 177 పరుగులే చేయగలిగింది. దాంతో అందరూ ఆసీస్‌ని తేలిగ్గా తీసుకున్నారు. కానీ తర్వాతి మ్యాచ్ నుంచి మొదలు పెడితే సెమీస్ వరకు వరుసగా ఎనిమిదో విజయాలతో ఆ జట్టు దూసుకుపోయింది. న్యూజిలాండ్‌తో, సెమీస్‌లో దక్షిణాఫ్రికాతో అతి కష్టమ్మీద గెలవడంతో ఫైనల్ కూడా భారతే ఫేవరెట్‌గా కనిపించింది. కానీ పట్టుదల, చివరి వరకు ఓటమిని అంగీకరించని తర్వాత ఉన్న కంగారూ బృందం ఎప్పటిలాగే ఐసీసీ టోర్నీలో అసలు సమరంలో సత్తా చాటింది. ప్రధాన పోటీల్లో ఒత్తిడికి తలవంచని తమ బలాన్ని మళ్లీ చూపించింది. ప్రపంచ కప్‌కు ముందు హెడ్ చేతికి గాయమైంది. అతని స్థానంలో మరో ఆటగాడిని ఎంచుకునే అవకాశం ఉన్నా ఆసీస్ ఆ పని చేయక 14 మందితోనే జట్టును కొనసాగించింది. ఇప్పుడు అతను సెమీస్, ఫైనల్లో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచిన అరుదైన ఆటగాళ్ల జాబితాలో నిలిచాడు. టోర్నీకి ప్రకటించిన టీమ్‌లో లబుషేన్‌కు చోటు దక్కలేదు. స్పిన్నర్ అగర్ గాయపడగా... అతని స్థానంలో మరో స్పిన్నర్‌ను ఎంచుకోకుండా లబుషేన్‌ను తీసుకుంది. జట్టు కుప్పకూలిపోకుండా మిడిలార్డర్‌లో ఇన్నింగ్స్‌ను చక్కదిద్దేందుకు సరైన వాడని ఆసీస్ భావించింది. ఫైనల్లో అతను అదే చేసి చూపించాడు. వార్నర్, మ్యాక్స్‌వెల్ ఐపీఎల్ అనుభవం ఇక్కడా బాగా పని చేయగా, మార్ష్ కూడా రెండు కీలక శతకాలు బాదాడు. ముఖ్యంగా అఫ్గానిస్తాన్‌పై 91/7తో ఓటమికి చేరువైన దశలో మ్యాక్స్‌వెల్ చేసిన డబుల్ సెంచరీ నభూతో నభవిష్యత్. స్టార్క్, హాజల్‌వుడ్ చెరో 16 వికెట్లతో జట్టుకు చుక్కానిలా నిలవగా, లెగ్‌స్పిన్నర్ జంపా 23 వికెట్లతో సత్తా చాటాడు. అన్నింటికి మించి పేసర్‌గా, కెప్టెన్ కమిన్స్ ముద్ర ప్రత్యేకం. బౌలింగ్‌లో 15 వికెట్లు పడగొట్టడంతో పాటు వ్యూహాలపరంగా అతను చూపించిన సాహసం, తెగువ కమిన్స్‌ను ప్రత్యేకంగా నిలిపాయి. ఫైనల్లో తన 10 ఓవర్లలో ఒక్క బౌండరీ కూడా ఇవ్వకుండా భారత్‌ను కట్టి పడేయగలిగాడు. 2023లో డబ్ల్యూటీసీ, యాషెస్, వరల్డ్ కప్ కోసం సన్నద్ధమయ్యేందుకు ఐపీఎల్‌కు దూరంగా ఉంటున్నానని ప్రకటించిన కమిన్స్... ఈ మూడింటిలోనూ అద్భుత విజయాలతో ఆసీస్ గొప్ప నాయకుల్లో ఒకడిగా తన స్థానాన్ని లిఖించుకున్నాడు.

-సాక్షి క్రీడా విభాగం



**765** ఈ ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా భారత స్టార్ విరాట్ కోహ్లి నిలిచాడు. కోహ్లి 11 మ్యాచ్‌లు ఆడి 3 సెంచరీలు, 6 అర్ధ సెంచరీలతో కలిపి మొత్తం 765 పరుగులు సాధించాడు.

**24** ఈ ప్రపంచకప్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా భారత పేసర్ మొహమ్మద్ షమీ నిలిచాడు. షమీ 7 మ్యాచ్‌లు ఆడి మొత్తం 24 వికెట్లు పడగొట్టాడు. షమీ మొత్తం 48.5 ఓవర్లు వేసి 257 పరుగులు ఇచ్చాడు.

**428** మొత్తం ప్రపంచకప్ టోర్నీలలో అత్యధిక టీమ్ స్కోరు ఈ ప్రపంచ కప్‌లోనే నమోదైంది. శ్రీలంకతో న్యూఢిల్లీలో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 5 వికెట్లకు 428 పరుగులు సాధించింది.

**771** ధర్మశాలలో ఆస్ట్రేలియా (388 ఆలౌట్; 49.2 ఓవర్లలో), న్యూజిలాండ్ (50 ఓవర్లలో 383/9) జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మొత్తం 771 పరుగులు వచ్చాయి. ప్రపంచకప్ టోర్నీల చరిత్రలో ఇదే అత్యధికం.

**201** ఈ ప్రపంచకప్‌లో అత్యధిక వ్యక్తిగత నమోదు చేసిన బ్యాటర్‌గా ఆస్ట్రేలియా క్రికెటర్ మ్యాక్స్‌వెల్ నిలిచాడు. అఫ్గానిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో మ్యాక్స్‌వెల్ (128 బంతుల్లో 201 నాటౌట్; 21 ఫోర్లు, 10 సిక్స్‌లు) అజేయ డబుల్ సెంచరీ సాధించాడు.

**7/57** ఈ ప్రపంచకప్‌లో అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేసిన బౌలర్‌గా భారత పేసర్ మొహమ్మద్ షమీ నిలిచాడు. న్యూజిలాండ్‌తో ముంబైలో జరిగిన సెమీఫైనల్లో షమీ 57 పరుగులిచ్చి 7 వికెట్లు తీశాడు.

**3** ఈ ప్రపంచకప్‌లో ఒకే ఇన్నింగ్స్‌లో 400 అంతకంటే ఎక్కువ స్కోర్లు మూడు సార్లు నమోదయ్యాయి. శ్రీలంకపై దక్షిణాఫ్రికా (428/5), నెదర్లాండ్స్‌పై భారత్ (410/4), పాకిస్తాన్‌పై న్యూజిలాండ్ (401/6) సాధించాయి.

**4** ఈ ప్రపంచకప్‌లో అత్యధిక సెంచరీలు చేసిన ప్లేయర్‌గా దక్షిణాఫ్రికా ప్లేయర్ క్వింటన్ డికాక్ నిలిచాడు. డికాక్ 10 మ్యాచ్‌లు ఆడి 4 సెంచరీలతో కలిపి 594 పరుగులు చేశాడు. విరాట్ కోహ్లి, రచిన్ రవీంద్ర (న్యూజిలాండ్) 3 సెంచరీల చొప్పున సాధించారు. డరైల్ మిచెల్ (న్యూజిలాండ్), డేవిడ్ వార్నర్ (ఆస్ట్రేలియా), శ్రేయస్ అయ్యర్ (భారత్), డసెన్ (దక్షిణాఫ్రికా), మిచెల్ మార్ష్ (ఆస్ట్రేలియా), మ్యాక్స్‌వెల్ (ఆస్ట్రేలియా), ట్రవిస్ హెడ్ (ఆస్ట్రేలియా) 2 సెంచరీల చొప్పున చేశారు.

**597** ఒకే ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు చేసిన కెప్టెన్‌గా భారత సారథి రోహిత్ శర్మ గుర్తింపు పొందాడు. రోహిత్ 11 మ్యాచ్‌లు ఆడి ఒక సెంచరీ, 3 అర్ధ సెంచరీలతో కలిపి 597 పరుగులు సాధించాడు. కేన్ విలియమ్సన్ (2019లో 578 పరుగులు) పేరిట ఉన్న రికార్డును రోహిత్ బద్దలు కొట్టాడు.

**7** వన్డే వరల్డ్‌కప్ ఫైనల్లో సెంచరీ సాధించిన ఏడో క్రికెటర్‌గా ట్రవిస్ హెడ్ (ఆస్ట్రేలియా) నిలిచాడు. గతంలో క్లయివ్ లాయిడ్ (వెస్టిండీస్ 102; 1975లో వెస్టిండీస్‌పై), వివ్ రిచర్డ్స్ (వెస్టిండీస్ 138 నాటౌట్; 1979లో ఇంగ్లండ్‌పై), అరవింద డిసిల్వా (శ్రీలంక 107 నాటౌట్; 1996లో ఆస్ట్రేలియాపై), రికీ పాంటింగ్ (ఆస్ట్రేలియా 140 నాటౌట్; 2003లో భారత్‌పై), ఆడమ్ గిల్‌క్రిస్ట్ (ఆస్ట్రేలియా 149; 2007లో శ్రీలంకపై), జయవర్ధనే (శ్రీలంక 103; 2011లో భారత్‌పై) ఈ జాబితాలో ఉన్నారు.

**3** వన్డే వరల్డ్‌కప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్' అవార్డు గెల్చుకున్న మూడో భారతీయ క్రికెటర్‌గా విరాట్ కోహ్లి గుర్తింపు పొందాడు. గతంలో సచిన్ టెండూల్కర్ (2003లో), యువరాజ్ సింగ్ (2011లో) ఈ ఘనత సాధించారు.



## అభిమాని కలకలం

అహ్మదాబాద్: రెండు అగ్రశ్రేణి జట్ల మధ్య లక్ష పైచిలుకు అభిమానులున్న స్టేడియంలో ఫైనల్ మ్యాచ్ జరుగుతోంది. 6000 మందికి పైగా సాయుధ బలగాలు పహారా కాస్తున్నాయి. ఇంతటి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన కూడా... ఆస్ట్రేలియాకు చెందిన పాలస్తీనా సానుభూతివరుడు ఇన్ని అంచెలను దాటుకొని కోహ్లిని కలవడం, కౌగిలించుకోవడం కలకలం సృష్టించింది. ఇది భద్రత డొల్లతనాన్ని బయట పెట్టింది. వెంటనే అప్రతమత్తమైన భద్రత దళాలు వేన్ జాన్సన్ అనే ఆస్ట్రేలియన్‌ను నిర్బంధించాయి. అతన్ని చాంద్ ఖేడా పోలీస్ స్టేషన్‌కు తరలించి తదుపరి విచారణ చేపట్టింది. ప్రస్తుతం పాలస్తీనాలో హమాస్, ఇజ్రాయెల్‌ల మధ్య భీకర దాడులు జరుగుతున్న సంగతి తెలిసిందే!

## అబ్బుర పరిచిన వాయుసేన విన్యాసాలు



అహ్మదాబాద్: అనుకున్నట్లుగానే చక్కని ప్రణాళికతో, స్వల్పకాల రిహార్సల్స్‌తో భారత వైమానిక దళానికి చెందిన సూర్యకిరణ్ ఏరోబాటిక్ టీమ్ చేసిన ఏయిర్ షో లక్షమందికి పైగా ప్రేక్షకుల్ని కన్నార్పకుండా చేసింది. తొమ్మిది హాక్ ఎంకే-132 ఎయిర్‌క్రాఫ్టలతో కూడా బృందం నరేంద్ర మోదీ స్టేడియంపై చరిత్ర సృష్టించింది. లక్షా 32 వేల మంది జేజేలతో విన్యాసాలను ఆస్వాదించారు. సూర్యకిరణ్ టీమ్ వైమానిక విన్యాసాలు కొత్త కాకపోయినా... ఓ క్రికెట్ స్టేడియంపై ఎయిర్‌షో చేయడమే కొత్త. గతంలో క్రికెట్ అనే కాదు... ఏ ఆటకు అంతెందుకు భారత్ ఆతిథ్యమిచ్చిన కామన్వెల్త్ గేమ్స్ (2010)లోనూ ఇలాంటి విన్యాసాలు చేయలేదు. తద్వారా ఈ ప్రపంచకప్‌కు ఎయిర్ షో కొత్త శోభ తెచ్చినట్లయింది.

## కోహ్లి... నీకో బహుమతి: సచిన్



అహ్మదాబాద్: భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ వన్డేల్లో తన 49 సెంచరీల రికార్డును చెరిపేసిన కింగ్ కోహ్లికి అమూల్యమైన బహుమతిని బహూకరించాడు. 24 ఏళ్ల కెరీర్‌లో తన 10 నంబర్ జెర్సీ అంతర్జాతీయ క్రికెట్‌లో లిఖించిన చరిత్ర అందరికీ తెలిసిందే. ఫైనల్‌కు ముందు సచిన్ స్వయంగా చేసిన ఆటోగ్రాఫ్ జెర్సీని కోహ్లికి అందజేశాడు. ఈ జెర్సీని సచిన్ 2012లో జరిగిన ఆసియా కప్‌లో పాకిస్తాన్‌తో జరిగిన ఆఖరి వన్డే సందర్భంగా ధరించాడు. 'ఈ ప్రత్యేక సందర్భంలో ప్రత్యేక అనుభూతినిచ్చే గిఫ్ట్‌ను సచిన్... విరాట్‌కు అందజేశాడు' అని బీసీసీఐ సచిన్, కోహ్లిల ఫోటోతో పోస్ట్ చేసింది. న్యూజిలాండ్‌తో జరిగిన సెమీస్ మ్యాచ్‌లో విరాట్ కోహ్లి 50వ సెంచరీతో సచిన్ రికార్డు (49)ను బద్దలు కొట్టాడు.



# అద్భుతం నుంచి ఆవేదన వరకు...

## ప్రపంచకప్‌లో భారత్‌కు మరోసారి నిరాశ • తుది మెట్టుపై తడబాటు

మళ్లీ అదే బాధ... మరోసారి అదే వేదన... చేరువై దూరమైన వ్యథ! తమ అద్భుత ఆటతో అంచనాలను పెంచి విశ్వ విజేతగా నిలిచేందుకు అన్ని అర్హతలు ఉన్న జట్టుగా కనిపించిన భారత్ విషాదంగా మెగా టోర్నీని ముగించింది. 2003లో ఆసీస్ చేతిలో ఓడిన బాధ నాటి తరానికి మాత్రమే గుర్తుంటుంది... కానీ నాలుగేళ్ల క్రితం 2019 సెమీఫైనల్లో మన ఓటమి ఇంకా అభిమానుల మదిలో తాజాగానే ఉంది. ఇప్పుడు స్వదేశంలో దానిని సరిదిద్దుకునే అవకాశం లభించింది. తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై మన ఆధిపత్యం చూస్తే భారత జట్టుపై అంచనాలు పెరిగాయి... ప్రపంచకప్‌నకు ఆరు నెలల ముందు నుంచి జట్టు కూర్పుపై ప్రణాళికలు, ప్రదర్శన, ఒక్కో ఆటగాడి వ్యక్తిగత ప్రదర్శనలు, వారికి అప్పగించిన వేర్వేరు బాధ్యతలు అద్భుతంగా పని చేశాయి. కోచ్‌గా రాహుల్ ద్రవిడ్, రోహిత్ కెప్టెన్సీ మధ్య గొప్ప సమన్వయం మెరుగైన వ్యూహాలకు బాట వేసింది. ఈ నాలుగేళ్ల కాలంలో 66 వన్డేల్లో కలిపి భారత్ 50 మంది ఆటగాళ్లను ఆడించింది. ఏ ఇతర జట్టూ ఇంత మందికి అవకాశం కల్పించలేదు. ముఖ్యంగా ప్రతీ స్థానం కోసం సరిగ్గా సరిపోయే ఆటగాళ్లను గుర్తించే ప్రయత్నం ఇందులో జరిగింది. ఆయా ఆటగాళ్ల ప్రదర్శన తర్వాత ఈ సంఖ్యను సగానికి తగ్గించి 24 మందితో ఒక జాబితా తయారైంది. ఇందులో నుంచే వరల్డ్‌కప్ కప్ టీమ్ ఉంటుందనే విషయంపై స్పష్టత వచ్చింది. వరల్డ్‌కప్‌నకు ఆరు నెలల ముందునుంచి చూస్తే 2023 మార్చి 1 నుంచి అక్టోబర్ 4 మధ్య భారత్ 15 వన్డేలు ఆడితే ఈ 24 నుంచే జట్లను ఎంపిక చేశారు. అనంతరం 15 మందితో వరల్డ్ కప్ టీమ్ ఎంపికైంది. వరుస అద్భుత విజయాలు వీరితోనే సాధ్యమయ్యాయి.

'మేం జట్టుగా గెలుస్తాం...జట్టుగా ఓడతాం'... ప్రపంచకప్ మొత్తం భారత డ్రెస్సింగ్ రూమ్‌లో ఈ నినాదం గట్టిగా మార్మోగింది. సెమీస్ వరకు ఒక్కసారి కూడా ఓటమిని దరి చేరనీయకుండా విజయంపై విజయంపై సాధిస్తూనే టీమిండియా తమ స్థాయిని ప్రదర్శించింది. ఎదురులేని ఆటతో వరుసగా 10 మ్యాచ్‌లను సొంతం చేసుకొని అంచనాలను ఆకాశానికి పెంచింది. 1983 వరల్డ్‌కప్ అనగానే జింబాబ్వేపై కపిల్ దేవ్ 175 నాటౌట్, ఫైనల్లో కపిల్ పట్టిన రిచర్డ్స్ క్యాచ్‌లాంటివి ప్రత్యేకంగా కనపడతాయి. 2011లో యువరాజ్ సింగ్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో పాటు ధోని కొట్టిన విన్నింగ్ సిక్సరే అందరి మనసుల్లో ముద్రించుకుపోయింది. ఈ రెండు మెగా టోర్నీల్లోనూ ఇతర ఆటగాళ్లూ తమ వంతు పాత్ర పోషించినా... టీమ్ గేమ్‌లో గెలవాలంటే అందరి భాగస్వామ్యం తప్పనిసరి అని ఎన్ని మాటలు చెప్పుకున్నా కొన్ని వ్యక్తిగత ప్రదర్శనలే హైలైట్ అయి అవే ప్రపంచకప్‌ను గెలిపించాయనే భావన కలిగిస్తాయి. కానీ ఈ టోర్నీలో మాత్రం భారత ఆటగాళ్లందరూ హీరోలే. ఒకరు ఎక్కువా కాదు, ఒకరు తక్కువా కాదు. మైదానంలోకి దిగిన ప్రతీ ఒక్కరు తమదైన ఆటతో జట్టును గెలిపించారు... జట్టు కోసం గెలుపు అవకాశాలు సృష్టించారు. జట్టుకు విజయం అందించేందుకు ఒకటో నంబర్ ఆటగాడినుంచి పదకొండో నంబర్ ప్లేయర్ వరకు ఒకరితో మరొకరు పోటీ పడ్డారు. వ్యక్తిగతంగా చూస్తే ప్రతీ పోరులో ఒకరు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలుస్తారు. కానీ భారత జట్టుకు సంబంధించి ప్రతీ మ్యాచ్‌లో అందరూ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌లే. ఒక బ్యాటర్ నెమ్మదించినట్లు కనిపిస్తే మరొకరు చెలరేగిపోయారు. ఒక బౌలర్ కాస్త తడబడినట్లు అనిపిస్తే నేనున్నానంటూ మరో బౌలర్ వచ్చి లెక్క సరిచేశారు. పవర్‌ప్లేలో పవర్ అంతా చూపిస్తే, మధ్య ఓవర్లలో మరొకరు ఇన్నింగ్స్ నడిపించారు. చివర్లో చెలరేగే బాధ్యత ఇంకొకరిది. భారత గడ్డపై పేసర్లు ఇంతగా ప్రభావం చూపించగలరని ఎవరైనా అనుకున్నారా! మన త్రయం దానిని చేసి చూపించింది. ఒక్కో బంతిని ఆడేందుకు బ్యాటర్లు పడిన తిప్పలు చూస్తే దాని పదునేమిటో తెలుస్తుంది. ఇక స్పిన్ ద్వయం ప్రత్యర్థులను పూర్తిగా కట్టి పడేసింది. ఒకరు కాదు ఇద్దరు కాదు... ఐదుగురూ వికెట్లు తీయగల సమర్థులైన బౌలర్లు ఉన్న టీమిండియాను చూసి ఎన్నాళ్లయింది?

అంకెలపరంగా చూస్తే ప్రతీ ఒక్కరి పాత్ర జట్టును గెలిపించింది. 11 ఇన్నింగ్స్‌లలో 3 సెంచరీలు, 6 అర్ధసెంచరీలతో 765 పరుగులు చేసిన కోహ్లి తన విలువేంటో చూపించాడు. ముందుగా క్రీజ్‌లో కుదురుకొని తర్వాత ధాటిగా ఆడే తన శైలిని మార్చుకొని ఆరంభంలో చెలరేగి విజయానికి పునాది వేసే వ్యూహంతోనే ఆడిన కెప్టెన్ రోహిత్ కూడా 597 పరుగులు చేశాడు. శ్రేయస్ (530), రాహుల్ (452), శుబ్‌మన్ గిల్ (354) కూడా కీలక పరుగులు సాధించారు. ఇక బౌలింగ్‌లో 7 మ్యాచ్‌లలోనే కేవలం 10.70 సగటుతో 24 వికెట్లు తీసి మొహమ్మద్ షమీ టోర్నీని ఒక ఊపు ఊపాడు. బుమ్రా 20 వికెట్లతో తన సత్తాను చాటగా... జడేజా (16), కుల్దీప్ (15), సిరాజ్ (14) బౌలింగ్ దళం బలాన్ని చూపించారు.

కానీ... కానీ... ఫైనల్ పోరులో మాత్రం ఈ గణాంకాలన్నీ పనికి రాలేదు. సెమీస్ వరకు స్వేచ్ఛగా ఆడినా... వరల్డ్ కప్ ఫైనల్ ఆడుతున్న ఒత్తిడి సహజంగానే వారిలో కనిపించింది. అందుకే అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ ఏదీ కలిసి రాలేదు. గిల్, శ్రేయస్ జోరు చూపించలేకపోగా, రాహుల్ పూర్తిగా తడబడ్డాడు. ఫైనల్‌లాంటి కీలక పోరులో రోహిత్ తన దూకుడు కాస్త నియంత్రించుకొని ఉంటే బాగుండేదని అనిపించినా... అతనూ విఫలమయ్యే ప్రమాదమూ ఉండేది. కోహ్లి ఒక్కడే తన స్థాయికి తగ్గ ఆటను చూపించగలిగినా అది సరిపోలేదు. జడేజా, సూర్య ఇలాంటి సమయంలో ఆదుకోలేకపోయారు. అయితే బౌలింగ్ దళం కాస్త ఆశలు కలిగించింది. ఆరంభంలో మూడు వికెట్లు తీయడం కూడా నమ్మకం పెంచింది. అయితే 240 పరుగుల స్కోరు మరీ చిన్నదైపోయింది. పది విజయాల ప్రదర్శన తర్వాత ఇలాంటి ఆట ఓటమి వైపు నిలిపింది.

అయినా సరే... భారత్ ప్రదర్శనను తక్కువ చేయలేం. లీగ్ దశలో తొమ్మిది వేర్వేరు ప్రత్యర్థులతో, వేర్వేరు వేదికలపై సాగించిన ఆధిపత్యం అసాధారణం. ఆటగాళ్ల శ్రమ, అంకితభావం అన్నింటిలో కనిపించాయి. ఈ టీమ్ చాంపియన్‌గా నిలిచేందుకే పుట్టింది అని అనిపించింది. అయితే ఏదైనా తప్పు జరగాలని రాసి పెట్టి ఉంటే అది ఎలాగూ జరుగుతుంది. కానీ కీలక సమయంలోనే అది జరుగుతుంది. ఈ టోర్నీలో మనం ఒక్క మ్యాచ్ అయినా ఓడాలని రాసి పెట్టి ఉన్నట్లుంది. ఆ మ్యాచ్ కాస్తా ఫైనల్ మ్యాచ్ కావడమే విషాదం!

–సాక్షి క్రీడా విభాగం

# సినిమా

## చలో మైసూర్



● రామ్‌చరణ్

హీరో రామ్‌చరణ్ కొన్ని రోజులు మైసూర్‌కు మకాం మార్చనున్నారట. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా తెరకెక్కుతున్న పొలిటికల్ యాక్షన్ ఫిల్మ్ 'గేమ్‌చేంజర్'. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా నెక్స్ట్ షెడ్యూల్ చిత్రీకరణ మైసూర్‌లో జరిగేలా చిత్రయూనిట్ ప్లాన్ చేసిందని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ నెల చివర్లో జరగనున్న ఈ షెడ్యూల్‌లో రామ్ చరణ్‌పై కీలక సన్నివేశాలను చిత్రీకరించేలా శంకర్ ప్లాన్ చేశారట. అంజలి, ఎస్‌జే సూర్య, శ్రీకాంత్, నవీన్‌చంద్ర కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న 'గేమ్‌చేంజర్' వచ్చే ఏడాది విడుదల కానుంది.

## అలాంటి వ్యక్తితో నటించకపోవడం సంతోషం

– త్రిష



తమిళ నటుడు మన్సూర్ అలీఖాన్ వివాదాస్పద వ్యాఖ్యలతో మరోసారి వార్తల్లోకెక్కాడు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ–''నేను గతంలో చాలా సినిమాల్లో హీరోయిన్లతో బెడ్ సీన్లలో నటించా. 'లియో' సినిమాలో అవకాశం వచ్చినప్పుడు త్రిషతో బెడ్‌రూమ్ సీన్ ఉంటుందని అనుకున్నాను. అయితే అలాంటి సన్నివేశం లేకపోవడం బాధపడ్డాను. కశ్మీర్ షెడ్యూల్ అయిపోయే వరకు త్రిషను చూసే అవకాశం కూడా చిత్ర యూనిట్ ఇవ్వలేదు'' అంటూ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు దేశమంతటా చర్చనీయాంశంగా మారాయి. ఈ వార్తలు త్రిష వద్దకు చేరడంతో సోషల్ మీడియా వేదికగా ఆమె స్పందించారు. ''మన్సూర్ అలీఖాన్ నా గురించి అసహ్యంగా మాట్లాడిన వీడియో నా దృష్టికి వచ్చింది.. దీన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నా. ఇలాంటి వ్యక్తులతో నటించకపోవడం సంతోషంగా ఉంది. భవిష్యత్తులోనూ ఆయనతో, అలాంటి వారితో నటించకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటా. ఇలాంటి వారి వల్లే మానవాళికి చెడ్డపేరు వస్తోంది'' అన్నారు. అయితే తన వ్యాఖ్యలపై తీవ్ర దుమారం రేగడంతో మన్సూర్ అలీ ఖాన్ స్పందిస్తూ–''త్రిష అంటే నాకు చాలా గౌరవం ఉంది. నేను సరదాగా మాట్లాడిన వ్యాఖ్యలపై ఇలాంటి దుమారం రేగుతుందనుకోలేదు.. నా మాటలను ఎవరూ సీరియస్‌గా తీసుకోవద్దు'' అన్నారు.

## దుబాయ్‌లో యానిమల్



● రణబీర్ కపూర్, బాబీ డియోల్

రణబీర్ కపూర్, రష్మిక మందన్న జంటగా నటించిన చిత్రం 'యానిమల్'. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించిన ఈ సినిమాలో బాబీ డియోల్, అనిల్ కపూర్ కీలక పాత్రల్లో నటించారు. గుల్షన్ కుమార్, టి.సిరీస్ సమర్పణలో భద్రకాళి పిక్చర్స్, సినీ 1 స్టూడియోస్‌పై భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా, కృషణ్ కుమార్, మురాద్ ఖేతాని నిర్మించారు. ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళ భాషల్లో డిసెంబరు 1న విడుదలవుతోంది. ఈ సినిమాలోని 'అర్జన్ వైలీ..' అనే పాటను దుబాయ్‌లోని ఐకానిక్ గ్లోబల్ విలేజ్‌లో అభిమానుల మధ్య ఘనంగా విడుదల చేశారు మేకర్స్. ఈ వేడుకలో రణబీర్ కపూర్, బాబీ డియోల్ పాల్గొన్నారు. వేదికపై 'అర్జన్ వైలీ...' పాటకు స్టార్ కాస్ట్‌తో పాటు అభిమానులు చేసిన డ్యాన్స్ వైరల్‌గా మారింది.

## మూడు ముళ్లు... ఏడడుగులు

సీనియర్ నటి రాధ కుమార్తె, 'రంగం' ఫేమ్ హీరోయిన్ కార్తీక వివాహం ఆదివారం వైభవంగా జరిగింది. రోహిత్ మేనన్‌తో కార్తీక ఏడడుగులు వేశారు. తిరువనంతపురంలోని కవడియార్ ఉదయ ప్యాలెస్ కన్వెన్షన్ సెంటర్‌లో కేరళ సంప్రదాయ పద్ధతిలో వీరి పెళ్లి జరిగింది. ఈ వివాహానికి ఇరు కుటుంబసభ్యులు, సన్నిహితులతోపాటు హీరో చిరంజీవి–సురేఖ దంపతులు, నటీనటులు రాధిక, సుహాసిని, రేవతి, భాగ్యరాజ్ తదితరులు హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు. కాగా నాగచైతన్య హీరోగా రూపొందిన 'జోష్'(2009) సినిమాతో కార్తీక తెలుగులో హీరోయిన్‌గా అడుగుపెట్టారు. ఆ తర్వాత పలు తెలుగు, మలయాళం, తమిళ చిత్రాల్లో నటించి, తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 2015 తర్వాత ఆమె సినిమాలకు దూరంగా ఉంటూ వ్యాపార రంగంలో బిజీ అయ్యారు.



● రోహిత్ మేనన్, కార్తీక

## ప్రయోగాత్మక సినిమాలు చేయాలనుంది

– హ్రితిక



వీజే సన్నీ, హ్రితికా శ్రీనివాస్ జంటగా సంజయ్ శేరి దర్శకత్వం వహించిన చిత్రం 'సౌండ్ పార్టీ'. జయ శంకర్ సమర్పణలో రవి పొలిశెట్టి, మహేంద్ర గజేంద్ర, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా హ్రితికా శ్రీనివాస్ మాట్లాడుతూ–''నటి ఆమని గారు మా మేనత్త. దీంతో చిన్నప్పటి నుంచే నాకు సినిమాలపై ఆసక్తి ఉండేది. బాలనటిగా కొన్ని సినిమాల్లో నటించాను. అమాయకులైన తండ్రీ కొడుకులు ఈజీ మనీ కోసం ఏం చేస్తారు? అనేది 'సౌండ్ పార్టీ' కథ. ఇందులో నేను సిరి పాత్రలో నటించాను. కామెడీతో పాటు కంటెంట్ ఉన్న ఫిల్మ్ ఇది. తెలుగులో సాయిపల్లవిగారంటే ఇష్టం. ఆమెలాంటి పాత్రలు చేయాలని ఉంది. హీరోల్లో నానీగారు అంటే ఇష్టం. భవిష్యత్తులో ప్రయోగాత్మక సినిమాల్లో నటించాలని ఉంది'' అన్నారు.

## భయపెట్టే పిండం!



● ఖుషీ రవి, శ్రీరామ్

శ్రీరామ్, ఖుషీ రవి జంటగా సాయికిరణ్ దైదా దర్శకత్వం వహించిన హారర్ ఫిల్మ్ 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' అనేది ఉప శీర్షిక. ఆరోహి దైదా సమర్పణలో యశ్వంత్ దగ్గుమాటి నిర్మించారు. ఈ సినిమాను డిసెంబరు 15న విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ''ప్రేక్షకులను భయపెట్టడమే లక్ష్యంగా ఈ సినిమా తీశాం. స్క్రీన్ ప్లే హైలైట్‌గా ఉంటుంది. డిసెంబరు 7న ప్రీ రిలీజ్ వేడుక నిర్వహిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈశ్వరీ రావు, అవసరాల శ్రీనివాస్, రవివర్మ కీలక పాత్రలు పోషించిన ఈ సినిమాకు కృష్ణ సౌరభ్ సూరంపల్లి సంగీతం అందించారు.

## డేట్ ఫిక్స్



● సుధీర్

'సుడిగాలి' సుధీర్, డాలీషా జంటగా అరుణ్ విక్కిరాల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కాలింగ్ సహస్ర'. వెంకటేశ్వర్లు కాటూరి, విజేష్ తయల్, చిరంజీవి పమిడి నిర్మించారు. ఈ సినిమాను డిసెంబరు 1న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ వెల్లడించింది. ''సుధీర్‌ను సరికొత్త కోణంలో చూపించేలా ఈ సినిమాలో ఆయన పాత్ర ఉంటుంది'' అని మేకర్స్ పేర్కొన్నారు.

## హత్యా? ఆత్మహత్యా?



● స్పందన పల్లి

స్పందన పల్లి, యుగ్ రామ్, వంశీ కోటు ప్రధానపాత్రల్లో నటించిన ఇంటరాగేటివ్ ఫిల్మ్ 'ది ట్రయల్'. రామ్ గన్ని దర్శకత్వంలో స్మృతి సాగి, శ్రీనివాస నాయుడు కిల్లాడ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను హీరో శ్రీ విష్ణు విడుదల చేసి, మాట్లాడుతూ–''ది ట్రయల్' ట్రైలర్ చాలా ఆసక్తిగా ఉంది. రామ్ ఈ సినిమా కథను బాగా డీల్ చేశారనిపిస్తోంది. ఈ సినిమా విజయం సాధించాలి'' అన్నారు. ''కథ రీత్యా సబ్‌ఇన్‌స్పెక్టర్ రూప, ఆమె భర్త అజయ్ ఓ అపార్ట్‌మెంట్ టెర్రస్‌పై తొలి వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకుంటుంటారు. అజయ్ కాలుజారి ఆ బిల్డింగ్‌పై నుంచి పడి చనిపోతాడు. తన భర్తను రూపే చంపిదనే అనుమానం తెరపైకి వస్తుంది. అయితే తన భర్తది ఆత్మహత్య అని రూప చెబుతుంది. అసలు.. అజయ్‌ది హత్యా? ఆత్మహత్యా? అనేది ఈ సినిమా ప్రధాన కథాంశం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

## కుటుంబమంతా చూడాల్సిన చిత్రం


– సుమన్



● రామచంద్రరావు, సుమన్, తేజ్

''మాధవే మధుసూదన' సినిమాని రామచంద్ర రావుగారు చాలా స్పష్టతతో తీశారు. ప్రతి సన్నివేశంలో ఆయన అనుభవం నాకు కనిపించింది. కుటుంబమంతా కలిసి థియేటర్స్‌లో చూడాల్సిన చిత్రం ఇది'' అని నటుడు సుమన్ అన్నారు. తేజ్ బొమ్మదేవర, రిషికి లోక్రే జంటగా నటించిన చిత్రం 'మాధవే మధుసూదన'. బొమ్మదేవర శ్రీదేవి సమర్పణలో బొమ్మదేవర రామచంద్ర రావు స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ మూవీ ఈ నెల 24 విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో బొమ్మదేవర రామచంద్రరావు మాట్లాడుతూ – ''సినిమా ఇండస్ట్రీలో నాకు 45 ఏళ్ల అనుభవం ఉంది.. నేనే డైరెక్టర్, ప్రొడ్యూసర్‌గా మా అబ్బాయి తేజ్‌ని హీరోగా పెట్టి సినిమా చేశా. ఫ్యామిలీ అంతా కలిసి చూసేలా ఈ చిత్రం ఉంటుంది'' అన్నారు. ''మాధవే మధుసూదన'తో ఒక మంచి ప్రయత్నం చేశాం'' అని తేజ్ బొమ్మదేవర అన్నారు.

## వైద్యో నారాయణో హరి..



● చైతన్యకృష్ణ

చైతన్యకృష్ణ హీరో పరిచయమవుతున్న ఎమోషనల్ థ్రిల్లర్ 'బ్రీత్'. 'వైద్యో నారాయణో హరి' అనేది ట్యాగ్ లైన్. వంశీకృష్ణ ఆకెళ్ల దర్శకత్వంలో నందమూరి జయకృష్ణ నిర్మించారు. ఈ సినిమాను డిసెంబరు 2న విడుదల చేస్తున్నట్లు చిత్రయూనిట్ వెల్లడించింది. వైదిక సెంజలియా హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాకు మార్క్ కె.రాబిన్ సంగీతం అందించారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. 